కులమతాలు గీచుకొన్న గీతల జొచ్చి
పంజరాన గట్టువడను నేను
నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు
తిరుగులేదు విశ్వనరుడ నేను

- గుఱ్ఱం జాషువా

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
ఆంధ్రప్రదేశ్

తెలుగుబాట
తెలుగు వాచకం
8

# తెలుగుబాట

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



Class
8

L8K6Y8

తెలుగు వాచకం

సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

सत्यमेव जयते

## భారత రాజ్యాంగ పీఠిక

భారతదేశ ప్రజలమైన మేము,
భారతదేశమును
సర్వసత్తాక,సార్వభౌమ,సామ్యవాద
లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యముగా
నెలకొల్పుటకు, పౌరులందరికీ
సామాజిక, ఆర్థిక, రాజకీయ
న్యాయాన్ని
భావము, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధనలతో కూడిన స్వేచ్ఛ,
స్వాతంత్ర్యాలను
అంతస్తులోను, అవకాశములోను
సమానత్వమును చేకూర్చుటకు,
అందరిలో
వ్యక్తి గౌరవాన్ని, దేశ సమగ్రతను
తప్పక తీసుకొచ్చే
సౌభ్రాత్రతను పెంపొందించుటకు
సత్యనిష్ఠాపూర్వకంగా తీర్మానించుకుని
1949వ సంవత్సరం నవంబరు 26 వ తేదీన
రాజ్యాంగ పరిషత్ లో ఆమోదింపబడి చట్టబద్ధం
చేసుకొని మాకు మేము సమర్పించుకుంటున్నాము.

## భారత రాజ్యాంగం - పౌర విధులు

1. రాజ్యాంగమునకు బద్ధుడై వుండుట, దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకమును,జాతీయ గీతమును గౌరవించుట;
2. జాతీయ స్వాతంత్ర్య పోరాటమునకు స్ఫూర్తినిచ్చిన ఉన్నతాదర్శములను మనస్సుయందు ఉంచుకొని వాటిని అనుసరించుట;
3. భారత సార్వభౌమత్వం, ఐక్యత, అఖండతను సమర్థించుట మరియు సంరక్షించుట.
4. దేశమును రక్షించుట మరియు కోరినపుడు జాతికి సేవ చేయుట;
5. భారత ప్రజల మధ్య మత, భాష, ప్రాంతీయ, వర్గ వైవిధ్యములను అధిగమించి, సామరస్యమును, సోదర భావమును పెంపొందించుట, స్త్రీల గౌరవం తగ్గించు ఆచారములను విడనాడుట;
6. మన ఉమ్మడి సంస్కృతినీ, సుసంపన్న సంప్రదాయాలను గౌరవించి రక్షించుట;
7. అడవులు, సరస్సులు, నదులు, అడవి జంతువులతో సహా ప్రాకృతిక పరిసరాలను కాపాడి అభివృద్ధి చేయుట మరియు సమస్త జీవుల యెడల కరుణార్ద్రత కలిగి వుండుట.
8. శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణ తత్వాన్ని పెంపొందించుకొనటం;
9. ప్రజల ఆస్తిని సంరక్షించుట, హింసను విడనాడుట;
10. ప్రయత్నాలు, సాధనల ఉన్నతస్థాయిలను నిరంతరం అందుకొనునట్లుగా వైయక్తిక, సమిష్టి కార్య రంగాలన్నింటిలో శ్రేష్ఠత కోసం, కృషి చేయుట ప్రాథమిక కర్తవ్యమై వుండవలెను.
11. ఆరు నుండి పద్నాలుగు సంవత్సరముల వయస్సు కలిగిన బాలునికి లేదా బాలికకు తల్లి తండ్రి లేదా సంరక్షకునిగావున్న వ్యక్తి తనబిడ్డ లేదా సందర్భానుసారము తన సంరక్షితునికి విద్యార్జనకు అవకాశములు కల్పించవలెను.

(అధికరణం 51 A)

## విద్యాహక్కు చట్టం

6 నుండి 14 సంవత్సరముల పిల్లలందరికి ఉచిత నిర్భంద ఎలిమెంటరీ విద్యనందించడానికి ఉద్దేశించబడినవి. ఇది ఏప్రిల్ 1, 2010 నుండి అమల్లోకి వచ్చింది.

**చట్టంలోని ముఖ్యాంశాలు:**

- పిల్లలందరికి అందుబాటులో పాఠశాలలను ఏర్పాటుచేయాలి.
- పాఠశాలలకు మౌలిక వసతులను కల్పించాలి.
- పిల్లలందరిని వయస్సుకు తగిన తరగతిలో చేర్పించాలి.
- వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చిన తర్వాత తోటి వారితో సమానంగా ఉండటానికి ప్రత్యేకశిక్షణ ఇప్పించాలి.
- ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు సాధారణ పిల్లలతోపాటు విద్యకొనసాగించడానికి తగువసతులు ఏర్పాట్లు చేయాలి.
- బడిలో చేర్చుకోడానికి ఎలాంటి పరీక్షలు నిర్వహించరాదు. ఎటువంటి రుసుము, చార్జీలు వసూలు చేయరాదు.
- బడిలో చేరిన పిల్లల పేరు తీసివేయడం, అదే తరగతిలో కొనసాగించడం చేయరాదు.
- పిల్లల్ని శారీరకంగా, మానసికంగా హింసించరాదు.
- వయస్సు నిర్ధారణ పత్రం, ఇతర ధృవీకరణ పత్రాలు లేవనే కారణం చేత పిల్లలకు బడిలో ప్రవేశాన్ని నిరాకరించరాదు.
- తగిన అర్హతలున్న వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలి.
- పిల్లలు నిర్దేశించిన సామర్థ్యాలు సాధించేలా బోధనాభ్యసనం, మూల్యాంకనం ఉండాలి.
- ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పిల్లలకు ఎలాంటి బోర్డు పరీక్షలు నిర్వహించరాదు.
- పద్నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికినీ, ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పాఠశాలలో పిల్లలు కొనసాగవచ్చును.
- బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏ విధమైన వివక్షతకు గురికాకుండా చూడాలి.
- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా, విద్యార్థులను భయం, ఆందోళనకు గురిచేయని రీతిలో వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే పాఠ్యప్రణాళిక రూపొందించాలి.

# తెలుగు బాట - 8

## తెలుగు వాచకం

## ఎనిమిదో తరగతి (ప్రథమ భాష)


**పాఠ్యపుస్తకాభివృద్ధి, ప్రచురణ సమితి**

**శ్రీ ప్రవీణ్ ప్రకాష్** I.A.S
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్య,
ఆంధ్రప్రదేశ్

**శ్రీ ఎస్. సురేష్ కుమార్** I.A.S
కమీషనర్, పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్

**శ్రీ బి. శ్రీనివాసరావు** I.A.S
స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్

**శ్రీ కె. రవీంద్రనాథ్ రెడ్డి,** M.A., B.Ed.,
సంచాలకులు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం,
ఆంధ్రప్రదేశ్

**డా॥ బి. ప్రతాప్ రెడ్డి** M.A., B.Ed., Ph.D
సంచాలకులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్



**సంపాదకులు**

**ఆచార్య డా. డి. చంద్రశేఖర రెడ్డి**
విశ్రాంత ప్రధానాచార్యులు,
ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్యకళాశాల,
హైదరాబాదు.

**ఆచార్య షేక్ మస్తాన్**
విశ్రాంత ఆచార్యులు,
ఆలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం,
అధికార భాషా సంఘం సభ్యులు, ఆంధ్రప్రదేశ్.

**శ్రీమతి వాడ్రేవు వీరలక్ష్మిదేవి**
విశ్రాంత అధ్యాపకురాలు,
పి.వి.ఆర్ ట్రస్ట్ డిగ్రీ కళాశాల,
కాకినాడ - ఆంధ్రప్రదేశ్.

**డా॥ దండెబోయిన పార్వతీదేవి**
ఉపన్యాసకురాలు,
కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల,
కర్నూలు - ఆంధ్రప్రదేశ్.

**ఆచార్య డా॥ గుమ్మా సాంబశివరావు**
విశ్రాంత ఉప ప్రధాన ఆచార్యులు,
ఆంధ్ర లయోలా కళాశాల,
విజయవాడ - ఆంధ్రప్రదేశ్.

**ఆచార్య కొండపల్లి సుదర్శన రాజు**
విశ్రాంత ఆచార్యులు,
తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం,
విశాఖపట్టణం - ఆంధ్రప్రదేశ్.

**పరిష్కర్తలు**

**మెరుగుమిల్లి వెంకటేశ్వరరావు**
విశ్రాంత తెలుగు పండితులు, విశాఖపట్టణం జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

**ఎ.హెచ్. రామచంద్రాచార్యులు**
విశ్రాంత తెలుగు పండితులు, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.

**డా॥ టి.వి.యస్. రమేష్**
పాఠశాల సహాయకులు, జి.ప.ఉ.పా, ఆదెమ్మ సత్రం, నెల్లూరు.

**డా॥ గుడిపాటి నారాయణ**
విశ్రాంత బాధ్య ప్రధానాచార్యులు రాయచోటి,
వైయస్ఆర్ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**సమన్వయకర్తలు**

**డా॥ జి. కేశవరెడ్డి**
ఆచార్యులు,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

**వంగీపురం స్వర్ణలత**
అధ్యాపకురాలు,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

© Government of Andhra Pradesh, Amaravati

*First Published 2022*
*New Impression - 2023, 2024*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copyright holder of this book is the Commissioner of School Education, Amaravati, Andhra Pradesh.

This book has been printed on 70 G.S.M. SS Maplitho

Title Page 220 G.S.M. White Art Card

**సమగ్ర శిక్షా, పాఠశాల విద్యాశాఖ,**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ**

Printed in India
at the A.P. Govt. Text Book Press
Amaravati
Andhra Pradesh

## వందే మాతరం

– బంకించంద్ర ఛటర్జీ

వందే మాతరం వందే మాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందే మాతరం
శుభ్రజ్యోత్స్నాపులకిత యామినీం
పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందే మాతరం.

## మా తెలుగు తల్లి

*- శంకరంబాడి సుందరాచారి*

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండే దాక
రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం – నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

# జాతీయ గీతం

*- రవీంద్రనాథ్ ఠాగూర్*

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగా!
వింధ్య, హిమాచల, యమునా, గంగా!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాఁగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

# ప్రతిజ్ఞ

*- పైడిమర్రి వెంకటసుబ్బారావు*

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## విషయ సమన్వయకర్త

**డా॥ షేక్. బాబూజి** Ph.D తెలుగు, Ph.D సంస్కృతం
ఆచార్యులు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

## సహాయ సమన్వయకర్తలు

**డా॥ వి. శారదా దేవి**
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

**అరవ సత్య వేంకట ప్రభాకర్**
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

## పాఠ్యపుస్తక రూపకర్తలు

**తలారి రామాంజనేయులు** జి.ప.ఉ.పాఠశాల ఆత్మకూరు, అనంతపురం

**డా. గంగుల నాగరాజు,** ఎపి.మోడల్ స్కూల్, కోసిగి, కర్నూలు

**డా. విప్పర్తి ఎన్.వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి,** జి.ప.ఉ.పాఠశాల. శనివారపుపేట, ప॥గోదావరి

**గోవర్ధనం వేంకట రంగనాథ్,** జి.ప.ఉ.పాఠశాల. బిక్కవోలు, తూ॥గోదావరి

**కంచర్ల వెంకట రమణగౌడ్,** జి.ప.ఉ.పాఠశాల. జొహరాపురం, ఆస్పరి, కర్నూలు

**పోలినేని చంద్రయ్య,** జి.ప.ఉ.పాఠశాల. తాళ్ళూరు, ప్రకాశం

**చాగంటి వెంకటరమణ,** జి.ప.ఉ.పాఠశాల. వాడ్రపల్లి, విశాఖపట్నం

**సిహెచ్.వి.ఆర్.యస్ బ్రహ్మయ్య,** జి.ప.ఉ.పాఠశాల. పెనుమాక, గుంటూరు

**డా. మాలెపట్టు పురుషోత్తమాచారి,** జి.ప.ఉ.పాఠశాల. నగరి, చిత్తూరు

**కొండసాని రమణయ్య,** జి.ప.ఉ.పాఠశాల. రెడ్డివారిపల్లి, కడప

**పిట్టా శిరీష కుమారి,** జి.ప.ఉ.పాఠశాల. గాడాల, తూ॥గోదావరి

**డా. చుక్కా నాగభూషణం,** ఎ.పి.యస్.డబ్ల్యూ.ఆర్.యస్. అడవి తక్కెళ్ళపాడు, గుంటూరు

**డా.యస్.బి.టి.యస్.దేవి,** కె.జి.బి.వి.పాఠశాల. చీడికాడ, విశాఖపట్నం

**సలాది భాగ్యలక్ష్మి,** యం.జె.పి.ఎ.పి.బి.సి.డబ్ల్యూ,ఆర్,యస్, నరసాపురం, ప॥గోదావరి

**డా. తాండవ శ్రీలక్ష్మి,** జి.ప.ఉ.పాఠశాల. ప్రొద్దుటూరు, కృష్ణాజిల్లా

**దాసరి మునెయ్య,** జి.ప.ఉ.పాఠశాల. నారాయణవనం, చిత్తూరు

**కొంపల్లి లీలా కుమార్,** జి.ప.ఉ.పాఠశాల. పంగిడి గూడెం, ప॥గోదావరి

**ముప్వల రాంబాబు,** జి.ప.ఉ.పాఠశాల. సీతానగర్, విశాఖపట్నం

**బగ్గాం మన్మథరావు,** యం.పి.యు.పి.పాఠశాల, పాతబగ్గాం, విజయనగరం

**సిహెచ్. పెద లక్ష్మయ్య,** యం.జె.పి.ఎ.పి.బి.సి.డబ్ల్యూ,ఆర్,యస్, ఆర్.యస్.కోట, నెల్లూరు

**కుప్పిలి వెంకట రాజారావు,** జి.ప.ఉ.పాఠశాల. సత్యవరం, శ్రీకాకుళం

## చిత్రకారులు

**తాడి కాళిదాసు,**
డ్రాయింగ్ టీచర్, జి.ప.ఉ.పా, వేపగుంట, విశాఖపట్నం

**కె.వి.సాంబశివరావు**
డ్రాయింగ్ టీచర్, ప్ర.బా.ఉ. పాఠశాల, గుంటూరు

**మండలి లక్ష్మణబాబు**
డ్రాయింగ్ టీచర్, జి.ప.ఉ.పాఠశాల, కృష్ణాజిల్లా.

**మానుకొండ రాజేంద్రబాబు**
ఎల్.ఎఫ్.ఎల్.ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పాఠశాల, బొండాడ, ప.గో జిల్లా.

## సాంకేతిక సమన్వయకర్త

**డా॥ సి.హెచ్.వి.ఎస్.రమేష్ కుమార్**
అధ్యాపకులు
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

## కవర్ పేజి & లేఅవుట్ డిజైనింగ్

**స్టాక్ఎసార్ట్‌మెంట్** బాపట్ల

## సాంకేతిక సహకారం

**మోటూరి మంగరాణి**
ఎన్.ఎస్.ఎమ్.సి.ప్రా పాఠశాల, రాజమండ్రి

**దండే పాల్**
ఎస్.సి.ఇ.ఆర్.టి, ఆంధ్రప్రదేశ్

## ఉపాధ్యాయులకు సూచనలు

- ★ 8వ తరగతి నూతన పాఠ్యపుస్తకం తెలుగు భాషను అత్యంత సమర్థవంతంగా నేర్పడానికి ఉపకరించేలా రూపొందించారు. కింది సూచనలు పాటిస్తూ పాఠ్యబోధన జరపాలి. పిల్లల సమగ్ర భాషాభివృద్ధికి తోడ్పడాలి.
- ★ ప్రారంభ పరీక్ష విద్యాసంవత్సరం ప్రారంభంలోనే నిర్వహించాలి. పిల్లల స్థాయిని అంచనా వేయాలి.
- ★ పాఠ్యపుస్తకంలో ఉన్న సంసిద్ధతా పాఠం ఆధారంగా, అలాగే అభ్యసన సామగ్రి ద్వారా పిల్లలకు చదవడం, రాయడం విషయమై తగిన శిక్షణను ఇవ్వాలి. తెలుగు బోధనకు వారానికి ఆరు కాలాంశాలు చొప్పున మొత్తం 220 కాలాంశాలు ఉంటాయి. అందులో బోధనాభ్యసన ప్రక్రియలకు 180 కాలాంశాలు ఉపయోగించుకోవచ్చు.
- ★ ప్రతి పాఠం ఆలోచించండి చెప్పండి శీర్షికతో మొదలై ఈ పాఠంలో నేర్చుకున్నవి అనే కృత్యంతో ముగుస్తుంది. కాబట్టి ఆయా బోధన సోపానాల ప్రాముఖ్యతను బట్టి పాఠ్య బోధన జరగాలి.
- ★ పాఠాల స్వభావాన్ని బట్టి బోధనవ్యూహాలను ఎంపిక చేసుకోవాలి. పిల్లలకు ప్రశ్నించే అవకాశం కల్పిస్తూ, అందరినీ భాగస్వాములను చేయడం ప్రధానం కావాలి.
- ★ ఇందుకోసం ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా బోధించాలి. ప్రతిపాఠానికి కింది విధంగా పాఠ్యప్రణాళిక రాయాలి. 1. పాఠంపేరు 2. అవసరమైన కాలాంశముల సంఖ్య 3. సాధించాల్సిన సామర్థ్యాలు 4. కాలాంశములు విభజన (పీరియడ్ల విభజన)

| కాలాంశ సంఖ్య | బోధనాంశం | అభ్యసన ఫలితాలు | బోధనావ్యూహం | సామగ్రి / వివరాలు |
|---|---|---|---|---|
| | | | | |

- ★ పాఠంలోని విషయాన్ని అర్థం అయ్యేలా బోధించడానికి పాఠ్యాంశ నిడివి బట్టి 3లేదా 4 కాలాంశములు కేటాయించుకోవాలి. సామర్థ్యాల వారీగా ఇచ్చిన అభ్యాసాలను పిల్లలతో చేయించడానికి ఎక్కువ కాలాంశములు కేటాయించాలి.
- ★ పాఠాన్ని బోధిస్తున్నప్పుడు సందర్భానుసారంగా నైతిక విలువలు, మానవీయ విలువలు, సంస్కృతి సంప్రదాయాలు, జాతీయత, కళలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చర్చింపచేయాలి. పిల్లల్లో మంచి పరివర్తన కోసం కృషిచేయాలి. వారిని దేశాభివృద్ధికి దోహదపడేలా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి.
- ★ పాఠ్యపుస్తకంలో రాయడానికి అవకాశం ఉన్నచోట అక్కడే రాయించాలి. అవకాశం లేని చోట నోటు పుస్తకాలలో రాయించాలి. కృత్యాలు నిర్వహించాలి. భాషాంశాల్లోని పదజాలం, వ్యాకరణాంశాలను పిల్లలకు అవగాహన కల్పిస్తూ, వ్యక్తిగత, జట్టు కృత్యాలు ద్వారా చేయించి, భాష మీద పట్టుసాధించేలా చేయాలి.

**I. అవగాహన - ప్రతిస్పందన (వినడం-మాట్లాడడం, చదవడం-రాయడం)**

- ★ ఈ అభ్యాసాలను, ప్రశ్నలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- ★ జట్లలో చర్చింపజేసి, తర్వాత వ్యక్తిగతంగా చేసేటట్లు చూడాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస)**

- ★ ప్రశ్నలను తరగతిగదిలో చర్చింపజేసి, సమాధానాలు రాబట్టాలి.
- ★ దోషాలను సవరించి, వ్యక్తిగతంగా రాసేటట్లు ప్రోత్సహించాలి.

R6V4B8

**III. భాషాంశాలు (పదజాలం - వ్యాకరణాంశాలు)**

★ పదజాలంపై చర్చించి, పిల్లలతో వ్యక్తిగతంగా, జట్లతో చేయించాలి. భాషాక్రీడను విద్యార్థులచే చేయించాలి. వ్యాకరణాంశాల్ని ఉదాహరణల ద్వారా బోధిస్తూ, పిల్లలకు అర్థమయ్యేలా చూడాలి. తరువాత కృత్యాలను వ్యక్తిగతంగా చేయించాలి.

★ 8 ప్రాజెక్టు పనులు ఇవ్వడం జరిగింది. విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా నిర్మాణాత్మక మూల్యాంకనాలకు 4 ప్రాజెక్టు పనులు మాత్రమే చేయించాలి. వీటిని ఎలా చేయాలో అవగాహన పరిచి, జట్టు లేదా వ్యక్తిగత కృత్యాలుగా చేయించాలి.

# విద్యార్థులకు సూచనలు

పిల్లలూ! .....

తెలుగు పాఠ్యపుస్తకం వివిధ ప్రక్రియలతో, వివిధ ఇతివృత్తాలతో ఆకర్షణీయమైన పాఠ్యాంశ చిత్రాలతో మీకు అందించడం జరిగింది. భాషను సమర్థవంతంగా నేర్చుకోవడానికి, ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తీకరించడానికి ఈ పాఠ్యపుస్తకం దోహదపడుతుంది. అందుకు మీరు చేయవలసింది పాఠ్యపుస్తకాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడమే. అదెలాగో చూద్దాం.

Z4B8U7

★ ప్రతి పాఠం 'ఆలోచించండి మాట్లాడండి' అనే శీర్షికతో ప్రారంభమవుతుంది. దీనిలో వివిధ అంశాలుంటాయి. వాటిని చదవడం, చర్చించడం, ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం చేయాలి.

★ పాఠ్యాంశాల ఉద్దేశాలను, నేపథ్యాలను ఉపాధ్యాయులు వివరించేటప్పుడు వాటి గురించి చర్చించండి. వాటి గురించి మరిన్ని విషయాలు తెలుసుకోండి.

★ కవిని పరిచయం గురించి ఉపాధ్యాయులు చెప్పినపుడు ఆ కవి గురించి మరిన్ని విషయాలు తెలుసుకోండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలను గుర్తించి, వాటికి అర్థాలను 'అ' కారాది పట్టిక ద్వారా, నిఘంటువుల ద్వారా తెలుసుకోండి. అప్పటికీ తెలియకపోతే ఉపాధ్యాయుల సహాయంతో తెలుసుకోండి.

★ పాఠ్య చిత్రాల గురించి మాట్లాడండి. మీ ఆలోచనలతో పాఠ్యభాగ సారాంశాన్ని ఊహించి చెప్పండి.

★ మీ ఉపాధ్యాయులు పాఠం బోధించేటప్పుడు శ్రద్ధగా వినండి. అర్థంగాని విషయాలపై చర్చించి, సందేహాలను నివృత్తి చేసుకోండి. అర్థంకాని ప్రతి విషయాన్ని అడిగి తెలుసుకోండి.

★ పాఠం చివర 'ఇవి చేయండి' అనే పేరుతో సామర్థ్యాల వారీగా అభ్యాసాలు ఉన్నాయి. వాటిని ఉపాధ్యాయులతో, జట్లలో చర్చించి, వ్యక్తిగతంగా సమాధానాలు రాయాలి. దీని వలన భాషలో నిర్దేశించిన సామర్థ్యాలను, వాటి లక్ష్యాలను సాధించ గలుగుతారు. కావున ఈ అభ్యాసాలలోని ప్రశ్నలకు సమాధానాల కోసం గైడ్లు, స్టడీ మెటీరియల్‌ను వాడరాదు.ఇవి నిషిద్ధం.

★ చదివిన విషయాన్ని మరింత అర్థం చేసుకొని, వ్యక్తీకరించడానికి 'అవగాహన–ప్రతిస్పందన' కింద అపరిచిత గద్యాలు,పద్యాలు కవితలు, గేయాలు, వాటి కింద వివిధ ప్రశ్నల స్వరూపాలు ఇవ్వడం జరిగింది. వాటిని బాగా చదివి,వాటికి సమాధానాలు వ్యక్తిగతంగా రాయాలి. దీనివల్ల చదవడం,వ్యక్తీకరించే నైపుణ్యం సాధించగలుగుతారు. దీని ద్వారా భాషాభివృద్ధి జరుగుతుంది.

★ వ్యక్తీకరణ – సృజనాత్మకత లోని అభ్యాసాలను సొంతంగా రాయాలి. దీనిని తరగతి గదిలో చర్చించాలి. తరువాత మీ నోటు పుస్తకాలలో రాయాలి.

★ భాషాంశాల్లోని పదజాలం, వ్యాకరణాంశాల అవగాహన కోసం అభ్యాసాల్లో చాలా ఉదాహరణలు ఇవ్వడం జరిగింది. వాటి ద్వారా ఆయా అంశాలను అర్థం చేసుకొని, వాటికి సొంత వాక్యాలు రాయండి. సూత్రాలు నిర్మించండి. భాషలో అవసరమైన చోట వాటిని వినియోగించండి.

★ ప్రాజెక్టు పనులను ఎలా చేయాలో ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకొని, వాటిని మీ మిత్రులతో కలిసి చేయండి. ప్రాజెక్టు పనిని చేసిన విధానాన్ని, దాని వలన గ్రహించిన విషయాలను గురించి నివేదిక రాసి, తరగతి గదిలో ప్రదర్శించాలి.

★ పాఠం చివర **ఈ పాఠంలో నేర్చుకున్నవి** అంశాలు మీరు సొంతంగా రాయాలి, స్వీయమూల్యాంకనం చేసుకోవాలి.

★ ఉపవాచక పాఠాలు మీరే సొంతంగా చదవాలి. వాటి గురించి చర్చించాలి.

★ సాహిత్య ప్రక్రియలైన లేఖలు, వ్యాసాలు, కరపత్రాలు, ప్రకటనలు, గేయాలు, కవితలు రాయగలగాలి. పాఠ్యాంశాల్లోని సన్నివేశాలకు సంభాషణలు రాయాలి. నాటకీకరణ చేయాలి. ఏకపాత్రాభినయం చేయాలి.

★ పాఠాంత పద్యం, మేటి పద్యాలు, పాఠాంత అంశం అర్థవంతంగా చదివి అవగాహన చేసుకొని నేర్చుకోవాలి.

★ ఈ పాఠాంత అంశం కింద ఉన్న వివిధ ప్రక్రియలను రాగయుక్తంగా పాడండి. లయబద్ధంగా చదవండి.

# సెమిస్టర్ - 1

## విషయసూచిక


| క్ర.సం. | పాఠం | ప్రక్రియ | ఇతివృత్తం | కవి / రచయిత | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 1. | సంసిద్ధతా కార్యక్రమం ఆంధ్రవైభవం | గేయం | రాష్ట్రకీర్తి | కొండేపూడి లక్ష్మీనారాయణ | జూన్ | 1 |
| 2. | సంసిద్ధతా కార్యక్రమం మాతృభూమి | కథానిక | దేశభక్తి, కుటుంబ విలువలు | పవని నిర్మల ప్రభావతి | జులై | 16 |
| 3. | శతకసౌరభం | శతకం | నైతిక విలువలు | శతక కవులు | ఆగస్ట్ | 28 |
| 4. | నా యాత్ర | యాత్రా రచన | జాతీయసమైక్యత/ దర్శనీయ స్థలాలు | బులుసు వేంకట రమణయ్య | సెప్టెంబర్ | 43 |
| 5. | సందేశం | ఖండకావ్యం | కష్టజీవుల శ్రమ | గుఱ్ఱం జాషువ | అక్టోబర్ | 55 |
| 6. | పయనం | మాండలిక కథ | సామాజిక స్పృహ | సింగమనేని నారాయణ | నవంబర్ | 65 |
| 7. | చైతన్యమూర్తులు **(ఉపవాచకం)** | వ్యాసం | స్ఫూర్తి / సేవ | రచయితల బృందం | | 79 |
| | 1. పోతులూరి వీరబ్రహ్మం | | | | జులై | |
| | 2. నేదునూరి గంగాధరం | | | | ఆగస్టు | |
| | 3. వడ్డాది పాపయ్య | | | | సెప్టెంబర్ | |
| | 4. ఫాతిమా షేక్ | | | | సెప్టెంబర్ | |
| | 5. రాగతిపండరి | | | | అక్టోబర్ | |
| | 6. తాడినాగమ్మ | | | | నవంబర్ | |


**సంస్కృతం కాంపొజిట్ కోర్సుగా చదివేవారు ఉపవాచకం మినహా అన్ని పాఠ్యాంశాలు చదవాలి.**

*** పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.**

**ప్రతిపాఠం వెనుక మేటిపద్యం శీర్షికలో ఇచ్చిన పద్యాలను విద్యార్థులు కంఠస్థం చేయాలి. అవి పరీక్షించబడవు.**

## ఈ పాఠ్య పుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన అభ్యసన ఫలితాలు

### I. అవగాహన - ప్రతిస్పందన (వినడం మాట్లాడటం - చదవడం, రాయడం)

★ విని చదివి తెలుసుకున్న రచనలు, సంఘటనల వంటి అంశాలపైన అవగాహనతో అభిప్రాయాలు వ్యక్తీకరించగలగడం.

★ ఉపన్యాసాలు, వార్తలు విని అర్థం చేసుకోగలగడం, ప్రతిస్పందించగలగడం.

★ విభిన్న భాషలు, కట్టుబాట్లు, ఆచారవ్యవహారాలకు సంబంధించిన వ్యత్యాసాలను గురించి మాట్లాడగలగడం, ఆసక్తిని, అభిరుచిని పెంచుకోగలగడం.

★ పద్యం, వచనం, గేయం మొదలైన సాహితీప్రక్రియలను శైలీభేదంతో అవగాహనతో చదవడం

★ వ్యాసరూప అంశాలను, లేఖలను చదివి అర్థంచేసుకోగలగడం.

★ చదివిన అంశాల్లోని కీలకాంశాలు గుర్తించడం, రాయడం, శీర్షికలు సూచించడం, విశ్లేషించడం, అభిప్రాయాలు చెప్పగలగడం.

### II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (స్వీయరచన - సృజనాత్మకత - ప్రశంస)

★ తాము అర్థం చేసుకున్న విషయాలను, తెలిసిన విషయాలను స్పష్టంగా లిఖిత రూపంలో రాయగలగడం.

★ పాఠాలనుండి సూచిత అంశాలకు సారాంశాలు, భావాలు రాయగలగడం.

★ విరామచిహ్నాలను పాటిస్తూ, సరైన పదజాలాన్ని ఉపయోగిస్తూ దోషరహితంగా రాయగలగడం.

★ తాను చదివిన, విన్న, అనుభవంలో ఉన్న, చూసిన అంశాలను వర్ణించి చెప్పగలగాలి.

★ వివిధ భాషా ప్రక్రియలను మార్చగలగడం, సంభాషణలు, నాటకీకరణం చేయగలగడం.

★ ఆత్మకథ, దినచర్య వంటి వివిధ వ్యవహారరూపాలు రాయగలగడం.

★ భాషా ప్రయోగాలలోని సూక్ష్మాంశాలను, భాషానిర్మాణాలను, శైలిని గమనిస్తూ వాటిని ప్రశంసించడం.

★ తరగతిలోని బాలురు, బాలికలు, ప్రత్యేకావసరాల పిల్లలు అందరు సమానమని గుర్తించి, వారు చేసిన మంచి పనులను ప్రశంసించగలగడం.

### III. భాషాంశాలు (పదజాలం - వ్యాకరణాంశాలు)

★ నిఘంటువును ఉపయోగిస్తూ అర్థాలు, పర్యాయపదాలు వంటివి స్వీయ అధ్యయనం చేయడం

★ ప్రకృతి వికృతులు, జాతీయాలు, సామెతలు గుర్తించడం. అవగాహన చేసుకొని, కొత్త పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించడం. సొంతంగా భాషాక్రీడలు తయారుచేయడం.

★ వ్యాకరణాంశాలపట్ల అవగాహన పెంచుకోవడం. (అక్షరమాల - విభాగాలు, భాషాభాగాలు, పారిభాషిక పదవిజ్ఞానం, విభక్తులు, సంధులు, సమాసాలు, వాక్యభేదాలు)

★ వ్యాకరణ నియమాలను స్పష్టంగా గుర్తించగలగడం. సందర్భానుసారంగా వ్యాకరణ దోషాలు లేకుండా రాయడం.

# 1

# ఆంధ్రవైభవం

N9A7F5

## చదవండి - ఆలోచించి చెప్పండి

తెలుగుదనము వంటి తీయదనము లేదు
తెనుగు కవులవంటి ఘనులు లేరు
తెనుగు తల్లి సాధుజన కల్పవల్లిరా
లలితసుగుణజాల ! తెలుగుబాల !  - కరుణశ్రీ



ప్రశ్నలు :

1. పై పద్యం దేని గురించి చెబుతోంది ?
2. సాధుజన కల్పవల్లి ఎవరు ?
3. కవి తెలుగుదనాన్ని దేనితో పోల్చాడు?

### ఉద్దేశం

ఆంధ్ర సంస్కృతిని, సంప్రదాయాలను, ఆంధ్రప్రాంతాన్ని ఏలిన పాలకుల కీర్తిని, ఆంధ్రకవుల ఘనతను అర్థం చేసుకొని అభినందించేలా చేయడం ఈ పాఠం ఉద్దేశం.

### కవి పరిచయం



(1918 - 1986)

## కొండేపూడి లక్ష్మీ నారాయణ

ఆధునిక కవులలో పేరొందిన శ్రీ కొండేపూడి లక్ష్మీనారాయణ పశ్చిమ గోదావరి జిల్లాలోని **బొండాడ** గ్రామంలో జన్మించారు. వీరు స్మృతులు- గేయాలు, పాడరా ఓ తెలుగు వాడా! అనే గేయ సంపుటాలను రచించారు. ప్రస్తుత పాఠ్యభాగం **పాడరా ఓ తెలుగు వాడా!** అనే గేయ సంపుటి నుండి స్వీకరించబడింది.

# ఆంధ్రవైభవం




పు॥ పాడరా ఓ తెలుగువాడా! పాడరా ఓ కలిమి రేడా!
పాడరా మన తెలుగు తేజపు భవ్య చరితల దివ్యగీతము ॥ పా ॥

చ॥ యుగయుగమ్ములనుండి బంగరు గంగనిచ్చెడు గౌతమీ నది,
కోహినూరును కురులసందున ముడిచి కులికిన కృష్ణవేణి,
హొయలుగా రతనాల సీమన ఓలలాడిన తుంగభద్రా
సొగసు గూర్చెను తెలుగు తల్లికి, సుఖము గూర్చును తెలుగు వారికి ॥ పా ॥ 1



చ॥ పాడుచును మన తెలుగు జోదుల ప్రతిభ చాటిన వీరగాథలు,
ఆడుచును మన తెలుగుజెండా పరువునిలిపిన మేలి ఘటనలు,
పాడి పంటలు పొంగి పొరలుచు దండిగా మన దేశముండగ,
సాగిపోదము తెలుగు చరితను వెలుగు జాడలవేగ మనమిక ॥ పా ॥ 2



చ॥ కదనరంగము నందు మెరసిన కాకతీయుల ఖడ్గతేజము,
వదరు శత్రువు నెదిరి పోరిన వనిత రుద్రమ యుద్ధపటిమ,
కొదమసింగము పగిది నురికిన బాలచంద్రుని బాహుదర్పము,
పొంగజేయద మేనిరక్తం? ఉప్పొంగ జేయద నీదు హృదయము ॥ పా ॥ 3



చ॥ తెలుగు పలుకులు తేనె లొలికెను తిక్కనార్యుని కవితలోనా,
రాలు కరిగే త్యాగరాయని రాగసుధలో మునిగె తెనుగూ,
సొంపుగూర్చెను తెలుగు తల్లికి హంపి నగరపు శిల్ప సంపద,
భరతనాట్యపు భంగిమల్లో పల్లవించెను తెలుగు పరువము ॥ పా ॥ 4



చ॥ తెలుగుజాతికి నూత్న సంస్కృతి తీర్చిదిద్దిన కందుకూరి,
తెనుగుభాషను ప్రజల భాషగ చేయ పోరిన గిడుగు పిడుగూ,
దేశమంటే మనుజులేనని చాటిజెప్పిన అప్పారాయడు,
తెనుగుతల్లీ నోము పంటగ తేజరిల్లిన దివ్య తారలు ॥ పా ॥ 5



చ॥ కలవు గనులు,నదులు జలములు, పసిడి పంటలు, వెల్లివిరియు,
సిరియు సంపద, వెల్లివిరిసెడి స్వర్గతుల్యము చేసికుందము,
ఆరుకోటుల తెలుగు బిడ్డల ముక్తకంఠము లొక్కపెట్టున,
జయము జయమని తెలుగుతల్లికి విజయగీతిక లాలపించగ ॥ పా ॥ 6

**ప్రక్రియ - గేయం**

గానం ప్రధానం కాబట్టి గేయానికి ఏ భాషా సాహిత్యంలోనయినా గొప్ప స్థానం ఉంటుంది. గేయం మాత్రా ఛందస్సుతో లయబద్ధంగా పాడటానికి వీలుగా ఉంటుంది. ఇందులో శబ్ద సౌందర్యం ఉట్టి పడుతుంది.

## భావాలు

ఓ తెలుగువాడా! ఓ స్నేహితుడా! ఆంధ్రప్రదేశ్ ఘనత గురించి పాటపాడరా!

1. గౌతమీ (గోదావరి) నది తరతరాల నుండి పవిత్ర జలాలతో ప్రవహిస్తోంది. కృష్ణానది అందంగా కోహినూరు వజ్రాన్ని తన కురులలో నిలుపుకొంది. తుంగభద్రానది తన ప్రవాహ శోభచే రాయలసీమను రత్నాల సీమగా మార్చింది. ఇవన్నీ తెలుగు తల్లికి అందాన్ని తెచ్చాయి. తెలుగు వారికి సుఖాన్నిచ్చాయి.

2. తెలుగు యోధుల ప్రతిభను చెప్పే వీరగాథలను పాడుకొంటూ సాగిపోదాం. తెలుగుజెండా గౌరవం నిలిపిన గొప్ప సంఘటనలను ప్రదర్శించుకుంటూ కొనసాగుదాం. మన దేశం నిండా పాడిపంటలు పొంగిపొరలుతూ ఉండగా, తెలుగు చరిత్రను గానం చేస్తూ ముందుకు సాగిపోదాం.

3. కాకతీయుల కత్తుల కాంతులు యుద్ధంలో మెరిసిన తీరు నీ రక్తాన్ని పొంగేలా చేయదా? రాణి రుద్రమదేవి యుద్ధనైపుణ్యం, ఆమె తన శత్రువుల పొగరు అణచడం వంటివి రక్తాన్ని పొంగేలా చేయవా? కొదమ సింహంలా విజృంభించిన బాలచంద్రుని భుజగర్వం నీ రక్తాన్ని పొంగేలా చేయదా? ఈ సంఘటనలు నీ హృదయాన్ని ఉప్పొంగేలా చేయలేదా?

4. తిక్కన కవిత్వంలో తెలుగుదనము తేనెలొలికింది. తెలుగులో త్యాగయ్య కృతులలో రాళ్ళు కరిగించగల సంగీతం ఉంది. హంపిలో ఉన్న శిల్పసంపద తెలుగు తల్లికి సొగసును కూర్చింది. తెలుగు పరువం భరత నాట్యపు ముద్రలలో ఇనుమడించింది.

5. తెలుగుజాతికి వెలుగుబాటలు తీర్చిదిద్దిన కందుకూరి గురించి పాడుకుందాం. ప్రజల భాష కొరకు ఊపిరులూదిన గిడుగు వేంకట రామమూర్తి గూర్చి గానం చేద్దాం. 'దేశమంటే మట్టికాదు. దేశమంటే మనుషులేనని' చాటిచెప్పిన గురజాడ వంటి తెలుగుతల్లి ముద్దుబిడ్డల గురించి కొనియాడదాం.

6. ఆంధ్ర రాష్ట్రం గనులతో, నదులతో, నీళ్ళతో, పసిడిపంటలు, సిరిసంపదలు, సహజవనరులతో అలరారుతోంది. దీనిని స్వర్గంతో సమానంగా మార్చుకొందాం. ఆరుకోట్ల ప్రజల ఆంధ్రరాష్ట్రం గొప్పతనాన్ని కలిసికట్టుగా తెలుగు తల్లికి జయము జయమని విజయగీతాన్ని పాడుకొందాం.

ఇవి చేయండి

E3Q6E6

## అవగాహన - ప్రతిస్పందన

అ) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. గేయాన్ని రాగయుక్తంగా పాడండి.
2. గేయం ద్వారా కవి ఏయే విషయాలను చెప్పారో మీ మాటల్లో చెప్పండి?
3. గేయంలో కింది పదాలను గుర్తించి సున్నా చుట్టండి.

మన    రతనాల    పంటలు    చరిత    వదరు    తారలు    సంపద    జయము    విజయం

ఆ) గేయం చదివి పట్టికలో సూచించిన విధంగా పదాలు రాయండి.

| క్ర.సం | మూడక్షరాల పదాలు | ఐదక్షరాల పదాలు | ద్విత్వాక్షర పదాలు | సంయుక్తాక్షర పదాలు |
|---|---|---|---|---|
| 1. | | | | |
| 2. | | | | |
| 3. | | | | |
| 4. | | | | |

ఇ) గేయం ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| నదుల పేర్లు | వ్యక్తుల పేర్లు | వస్తువుల పేర్లు | ప్రాస పదాలు |
|---|---|---|---|
| కృష్ణానది | | | |
| | | | |
| | | | |
| | | | |

ఈ) కింది ప్రాసపదాల ఆధారంగా మరికొన్ని ప్రాసపదాలు రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| పంట | వంట | గం.......... | జం.......... | .............. | .............. |
| జలము | బలము | క.......... | పొ.......... | .............. | .............. |
| తెలుగు | వెలుగు | మె.......... | క.......... | .............. | .............. |
| గిడుగు | పిడుగు | గొ.......... | తొ.......... | .............. | .............. |

**ఉ) గేయంలోని కింది వ్యక్తులు తెలుగు జాతికి చేసిన సేవను ఒక వాక్యంలో రాయండి.**

1. కందుకూరి వీరేశలింగం : ...................................................
2. గిడుగు రామమూర్తి : ...................................................
3. గురజాడ అప్పారావు : ...................................................
4. త్యాగరాజు : ...................................................

**ఊ) కింది వాక్యాలు చదవండి. భావాలకు సరిపోయే పంక్తులను గేయంలో గుర్తించి రాయండి.**

1. తిక్కన కవిత్వంలో తెలుగు భాష తేనెలొలికింది.

.......................................................................................................................................

2. పాడిపంటలు సమృద్ధిగా లభిస్తాయి.

.......................................................................................................................................

3. గురజాడ దేశమంటే మనుషులని చాటి చెప్పాడు.

.......................................................................................................................................

4. గోదావరి తరతరాల నుండి మధురజలాన్ని ఇస్తోంది.

.......................................................................................................................................

**ఋ) కింది పేరాను చదివి ఇచ్చిన పట్టికను పూరించండి.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బంగారు భూములను సస్యశ్యామలం చేసే గోదావరి, కృష్ణా, తుంగభద్ర, వంశధార, నాగావళి, పెన్నా, చిత్రావతి మొదలైన నదులు ఆంధ్రరాష్ట్రానికి జీవనాడులు. విశాలమైన తూర్పు కనుమలు ఆంధ్రరాష్ట్రానికి హరితహారాలై నిలిచాయి. అరకు లోయ, బెలూం గుహలు, హార్సిలీ హిల్స్, పాపికొండలు, లంబసింగి, విశాఖ తీరం, వంజంగి మేఘాల కొండ మన విహార కేంద్రాలుగ విరాజిల్లుతున్నాయి. అడవి బాపిరాజు, దామెర్ల రామారావు, బాపు, వడ్డాది పాపయ్య, మొదలైన వారు తమ కుంచెతో చిత్రకళకు జీవం పోశారు. ఆర్థిక, రాజకీయ, సాంఘిక మొదలైన రంగాలలో అభివృద్ధిని సాధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన దేశంలోనే ఉన్నత స్థానాన్ని అధిరోహించింది.

| క్ర.సం | నదులు | పర్యాటక స్థలాలు | చిత్రకారులు |
|---|---|---|---|
| 1. | ...................... | ................................ | .................................... |
| 2. | ...................... | ................................ | .................................... |
| 3. | ...................... | ................................ | .................................... |
| 4. | ...................... | ................................ | .................................... |

**ఋ) కింది పేరాను చదివి, ప్రశ్నలు తయారు చేయండి.**

మనిషిని సంస్కరించే ప్రక్రియ సాహిత్యం. సంస్కారం పొందిన మనిషిని ఆనందపరచే కళ సంగీతం. ఆంధ్రరాష్ట్ర సంస్కృతి వికాసంలో సంగీత సాహిత్యాలు రెండూ మానవాళికి అద్భుతమైన వారసత్వాన్ని అందించాయి. నన్నయాదుల వంటి కవులు లేకుండా తెలుగు సాహిత్యాన్ని ఊహించలేం. అన్నమాచార్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు లేకుండా మన సంగీత సంస్కృతిని స్మరించలేం. సాహిత్యం మనోమయ, విజ్ఞానమయ కోశాలను మేల్కొలిపితే, సంగీతం ప్రాణమయ, ఆనందమయ కోశాలను చైతన్యవంతం చేస్తుంది.

**ప్రశ్నలు:**

1. ..............................................................................................

2. ..............................................................................................

3. ..............................................................................................

4. ..............................................................................................

**ఎ) కింది కవితను చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

గోదావరి కృష్ణమ్మలు
గొప్పింట తోబుట్టువులు !
ఆంధ్రావని శోభిల్లెడు
అన్నపూర్ణ విశాలాక్షులు !
పుట్టుచోటు మెట్టుచోటు
పుణ్యభూమి, గణ్యభూమి



సింగారము కొలువగా
బంగారము పండునులే !
సంస్కృతి ఇట వాకగట్టి
సాగినదిక వాహినిగా
నటియించెను మోహినిగా !



– కందుకూరి రామభద్రరావు

**ప్రశ్నలు :**

1. కవితలో ఉన్న నదులు పేర్లు రాయండి ?

..........................................................................................

2. తోడబుట్టినవాళ్ళు అని అర్థాన్నిచ్చే పదం ఏది ?

..........................................................................................

3. పంటలను కవి దేనితో పోల్చాడు ?

..........................................................................................

4. వాహిని అంటే అర్థం ఏమిటి ?

..........................................................................................

**ఏ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. 'ఆంధ్రవైభవం' గేయ ఉద్దేశాన్ని రాయండి.
2. కవి తెలుగు వైభవాన్ని గురించి ఎలా పాడుకోమని చెప్పారు.
3. గేయ ప్రక్రియా లక్షణాలను రాయండి?
4. మన రాష్ట్రాభివృద్ధికి నదులు ఎలా తోడ్పడుతున్నాయి?



## వ్యక్తీకరణ – సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. 'ఆంధ్రవైభవం' కవిని గురించి రాయండి?
2. ఆంధ్రరాష్ట్రం పాడిపంటలకు నిలయమని ఎలా చెప్పగలవు?
3. వీరగాథను విన్నప్పుడు నా రక్తం ఉప్పొంగుతుందని' అనడంలో కవి ఉద్దేశం ఏమిటో తెలపండి.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో జవాబులు రాయండి.**

1. 'ఆంధ్రవైభవం' గేయ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. 'తెలుగుతల్లి' కీర్తిని కవి ఎలా వర్ణించాడో గేయం ద్వారా తెలుసుకున్నారు కదా! మీ గ్రామాన్ని లేదా మీ ప్రాంతాన్ని వర్ణిస్తూ కవిత రాయండి.

ఉదా: ఇదే ఇదే మా ఊరు ఇదే పల్లెటూరు,
ఏటి చెంత మా ఊరు పాడిపంటల తేరు,
అందరు మెచ్చు మా అందముగ పారే ఏరు,
ముచ్చటైన మా ఊరు ...............................

3. రాష్ట్ర అభివృద్ధికి కృషిచేసిన మహనీయులను ప్రశంసిస్తూ వ్యాసం రాయండి.

## భాషాంశాలు

### పదజాలం

★ ఉదా 1. వర్షము – వాన, సంవత్సరం, ఉదా 2. ధర – భూమి, వెల

పై ఉదాహరణలో వర్షము అనే పదానికి వాన, సంవత్సరం అనే అర్థాలు ఉన్నాయి. అలాగే ధర అనే పదానికి భూమి, వెల అనే అర్థాలు ఉన్నాయి. ఈవిధంగా **ఒక పదానికి గల వేరువేరు అర్థాలను ఆ పదం యొక్క నానార్థాలు** అంటారు.

**అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సరియైన నానార్థాలను గుర్తించండి.**

అ) రైతు కలకాలం కష్టపడతాడు. [ ]
1) సమయం, నలుపు 2) అంకురం, రాత్రి 3) దక్షత, తమస్సు

ఆ) తూర్పు దిక్కున హిందూ మహాసముద్రం ఉంది. [ ]
1) ఒద్దిక, తోడు. 2) రుధిరం, ధర 3) దిశ, శరణం.

ఇ) భారతదేశంలో వ్యవసాయం ప్రధాన వృత్తి. [ ]
1) ప్రయత్నం, కృత్రిమం 2) కృషి, ప్రయత్నం 3) పరిశ్రమ, ఫలితం

**ఆ) కింది పదాలు, వాటి నానార్థాలు ఉన్నాయి. సరిగా జతపరచి రాయండి.**

| | | |
|---|---|---|
| 1. సీమ | ( ) | అ. క్షీరం, ధర్మం, న్యాయం |
| 2. ఆడు | ( ) | ఆ. విధం, ఆచూకి, దారి |
| 3. పాడి | ( ) | ఈ. దేశము, ప్రదేశము, రాజ్యము |
| 4. జాడ | ( ) | ఉ. నర్తించు, చలించు, పలుకు |

★ కదనము : యుద్ధము, పోరాటము

పై ఉదాహరణలో కదనము, యుద్ధము, పోరాటము అనే మూడు పదాల యొక్క అర్థం ఒక్కటే! ఈ విధంగా **"ఒక పదం యొక్క అర్థానికి సమానమైన అర్థాన్ని ఇచ్చే పదాలన్నీ ఆ పదానికి పర్యాయ పదాలే"**

**ఇ) కింది పేరా చదివి, ఇచ్చిన పదాలకు పర్యాయ పదాలను గుర్తించండి.**

సాంబయ్య ఒక హాలికుడు. ఆ కృషీవలుని ఇల్లాలు అన్నపూర్ణ. ఈ సంవత్సరం అనావృష్టి చేత క్షామం ఏర్పడింది. ఆ దుర్భిక్షం వల్ల ఆహారానికి కొఱత వచ్చింది. కాని, మరుసటి ఏడాది కురిసిన వర్షాలకు ధరణి పులకించింది. అవనిపై ఉన్న అన్ని జీవరాశులకు ఆహారం, నీరు లభించింది. దానికి సాంబయ్య, ఆయన అర్ధాంగి ఎంతో మురిసిపోయారు. అప్పుడు సాంబయ్య గృహం ఆనందానికి నిలయమైంది. సంతోషాల సదనమైంది.

ఉదా : రైతు = హాలికుడు, కృషీవలుడు

1. భూమి = ................................ 2. మోదం = ....................................

3. కరువు = ................................ 4. ఇల్లు = .......................................

★ **ఉదా : సంతోషము – సంతసము**

పై ఉదాహరణలో **సంతోషము** అన్న పదం తెలుగు ప్రత్యయం చేరి తెలుగులోకి వచ్చిన సంస్కృత పదం. తెలుగు ప్రథమా విభక్తి ప్రత్యయమైన **'ము'** చేరి ఉంది. ఇలా సంస్కృత, ప్రాకృత భాషల నుండి తెలుగులోకి వచ్చిన సంస్కృత, ప్రాకృత భాషా పదాలను **ప్రకృతులు** అంటారు. వీటినే **తత్సమాలు** అని కూడా అంటారు.

సంతోషము అనే మాట తెలుగులో సంతసముగా మారింది. మూల పదంలోని అక్షరాలు తెలుగు భాషా స్వభావానికి అనుగుణంగా మారాయి. ఇటువంటి మార్పు పొందిన పదాలను **వికృతులు** అంటారు. వీటినే **తద్భవాలు** అని కూడా అంటారు.

**ఈ) కింది వాక్యాలలోని గీత గీసిన వికృతి పదాలకు ప్రకృతి పదాలను రాయండి.**

1) ఆకాశంలో హరివిల్లును చూసి పిల్లలు <u>అచ్చెరువ</u>ొందారు. 1. ..............................

2) ఈ సంవత్సరం మా <u>పొంత</u>లో వర్షాలు బాగా కురిశాయి. 2. ..............................

3) పిల్లలకు పోషకాలతో కూడిన <u>ఓగిరం</u> ఇవ్వాలి. 3. ..............................

**ఉ) కింది వాక్యాలలో ప్రకృతి, వికృతులను గుర్తించి రాయండి.**

ఉదా: – బంగారం విలువైనది. నేడు బంగారం వెల పెరిగి పోయింది.

1. అడవికి రాజు సింహం. శత్రువులకు సింగము బాలచంద్రుడు.
2. ఆంధ్రరాష్ట్ర భాష తెలుగు. ఇది దేశ బాసలలో మేటిది.
3. సేవా హృదయం కలిగిన వారి ఎదలో భగవంతుడు నెలవై ఉంటాడు.
4. పాఠకులకు కవితలంటే ఇష్టం. కైతలు ఆనందాన్నిస్తాయి.
5. ఇది కథల పుస్తకం. ఈ పొత్తమును తప్పక చదవండి.

| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| ఉదా: | భృంగారం | బంగారం |
| 1 | | |
| 2 | | |

| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| 3 | | |
| 4 | | |
| 5 | | |



## భాషాక్రీడ

**అ) కింది అర్థాలను పరిశీలించండి. వీటి ఆధారంగా గేయంలో సంబంధిత పదాలను గుర్తించి రాయండి.**

ఉదా : గొప్పదనం గురించి చెప్పే పాట = దివ్యగీతము

1. ప్రకాశించు = .............................
2. కత్తుల కాంతి = .............................
3. యువ సింహం= .............................
4. భుజగర్వం = .............................
5. అందమునిచ్చెను = .............................
6. తెలియచేసెను = .............................
7. కలిసికట్టు = .............................
8. స్వర్గసమానం = .............................
9. ప్రవహించు = .............................
10. యుద్ధంలో నేర్పు = .........................



## వ్యాకరణాంశాలు

**1. అత్వసంధి:**

తొందరెందుకు = తొందర + ఎందుకు ⟶ ర(ర్ + అ) + ఎ ⟶ ర్ + ఎ = రె

పై ఉదాహరణలో పూర్వపదం చివర అత్తు (హ్రస్వ అకారం) ఉండగా, దానికి పరపదం మొదట 'ఎ' అనే అచ్చు కలిసి సంధి జరిగింది. ఈ విధంగా హ్రస్వ అకారానికి ఏదైనా అచ్చు పరమైతే జరిగే సంధిని **అత్వ సంధి** అంటారు.

**2. ఇత్వసంధి:**

ఏమంటివి = ఏమి + అంటివి ⟶ మి (మ్ + ఇ) + అం ⟶ మ్ + అం = మం

పై ఉదాహరణలో పూర్వపదం చివర ఇత్తు (హ్రస్వ ఇకారం) ఉండగా దానికి పరపదం మొదట 'అ' అనే అచ్చుతో కలిసి సంధి జరిగింది. ఈ విధంగా ఏమి మొదలైన పదాల చివర హ్రస్వ ఇకారానికి ఏదైనా అచ్చు పరమైతే **ఇత్వ సంధి** ఏర్పడుతుంది.

**3. ఉత్వసంధి:**

ఓలలాడిన = ఓలలు + ఆడిన ⟶ లు(ల్ + ఉ) + ఆ ⟶ ల్ + ఆ = లా

ఈ ఉదాహరణలో పూర్వపదం చివర ఉత్తు (హ్రస్వ ఉకారం) ఉండగా దానికి పరపదం మొదట 'ఆ' అను అచ్చు పరమయ్యింది. కనుక సంధి జరిగింది. ఈ విధంగా హ్రస్వ ఉకారానికి ఏదైనా అచ్చు పరమైతే **ఉత్వసంధి** జరుగుతుంది.

హ్రస్వఅకారం (అ) + ఏదైనా అచ్చుపరమైతే = అత్వసంధి
హ్రస్వ ఇకారం (ఇ) + ఏదైనా అచ్చుపరమైతే = ఇత్వసంధి
హ్రస్వ ఉకారం (ఉ) + ఏదైనా అచ్చుపరమైతే = ఉత్వసంధి

**అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాన్ని విడదీసి సంధి పేరు రాయండి.**

1. గంగనిచ్చెడు గోదావరి ఆంధ్రరాష్ట్రంలో ప్రవహిస్తోంది.

ఉ.దా:- గంగనిచ్చెడు = గంగను + ఇచ్చెడు (ఉత్వసంధి)

2. తాబేలు జింకతో మనమిక్కడ ఉండటం మంచిది కాదన్నది.

అ) ........................... = ........................ + ..........................................

ఆ) ........................... = ........................ + ..........................................

3. దేశమంటే మట్టికాదు, దేశమంటే మనుషులని గుర్తించాలి.

అ) ........................... = ........................ + ..........................................

ఆ) ........................... = ........................ + ..........................................

**ఆ) కింది పదాలను కలిపి రాసి, సంధులపేర్లు రాయండి.**

1. పుట్టిన + ఇల్లు = ............................. , ......................................
2. ఏమి + అయ్యె = ............................. , ......................................
3. మేము + అందరం = ............................. , ......................................
4. గ్రామము + అంటే = ............................. , ......................................

**ద్విగు సమాసం - ద్వంద్వ సమాసం.**

సమాసంలో అన్ని పదాలకు సమ ప్రాధాన్యం కలిగినది **ద్వంద్వ సమాసం**. పూర్వ పదం సంఖ్యావాచకం, ఉత్తర పదం నామవాచకం అయితే **ద్విగు సమాసం**. అని కింది తరగతులలో తెలుసుకున్నారు కదా!

**ఇ) కింది పట్టికను అర్థవంతంగా పూరించి, సమాసపదాల స్వరూపాన్ని అర్థంచేసుకోండి.**

| క్ర.సం | సమాసపదం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|---|
| 1. | పాడిపంటలు | | |
| 2. | | నాలుగు అను సంఖ్యగల వేదాలు | |
| 3. | సిరి సంపదలు | | |
| 4. | ఆరుకోట్లు | | ద్విగు సమాసం |

**ఈ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి**

1. తల్లిదండ్రులు మనకు ప్రత్యక్ష దైవాలు.

.......................................... =..................................... , ...........................

2. ఆంధ్రరాష్ట్ర కీర్తి నలుదిక్కులా వ్యాపించాలి.

.......................................... =..................................... , ...........................

3. మనమంతా జాతి మత భేదాలు లేకుండా అన్నదమ్ములలాగా మెలగాలి.

.......................................... =..................................... , ...........................

4. అష్టదిక్పాలకులలో ఇంద్రుడొకడు.

.......................................... =..................................... , ...........................

**ఉ) విభక్తి ప్రత్యయాలను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

| క్ర.సం | ప్రత్యయాలు | విభక్తులు |
|---|---|---|
| 1. | డు, ము, వు, లు | ప్రథమా విభక్తి |
| 2. | నిన్, నున్, లన్, కూర్చి, గురించి | ద్వితీయా విభక్తి |
| 3. | చేతన్, చేన్, తోడన్, తోన్ | తృతీయా విభక్తి |
| 4. | కొఱకున్, కై | చతుర్థీ విభక్తి |
| 5. | వలనన్, కంటెన్, పట్టి | పంచమీ విభక్తి |
| 6. | కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ | షష్ఠీ విభక్తి |
| 7. | అందున్, నన్ | సప్తమీ విభక్తి |
| 8. | ఓ, ఓయి, ఓరి, ఓసి | సంబోధన ప్రథమా విభక్తి |

ఉదా:- పాము వలన భయం.

1.............................................................................................

2.............................................................................................

3.............................................................................................

4.............................................................................................

5.............................................................................................

6.............................................................................................

7.............................................................................................

ఋ) కిందివాక్యాలలో గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తికి చెందినవో రాయండి.

ఉదా. మన సంఘసంస్కర్తల గురించి తెలుసుకోవాలి. – ద్వితీయా విభక్తి

1. తెలుగు భాష గొప్పతనాన్ని తెలిపే రచనలు చదవాలి. – .....................................

2. వరదలతో ఆ నగరం మునిగిపోయింది. – .....................................

3. ధర్మం కొఱకు మనందరం పాటుపడాలి. – .....................................

4. ఓయి ! రమ్మన్న రావేమి? – .....................................

## పాఠాంత పద్యం



సుధలఁ జల్లి దెసల మధుర యాత్రలు చేసి
దినదినాభివృద్ధి దీప్తి నిండి
క్రొమ్మె ఱుంగు దాల్చి క్రొంగ్రొత్త సొగసుల
తళుకు జిమ్ము భాష తెలుగు భాష

**– తిరుమల శ్రీనివాసాచార్యులు**

**భావం :** తెలుగుభాష అమృత జల్లులు జల్లి అన్ని దిక్కులా వ్యాపించి, మధుర యాత్రలు చేసి, దినదినము అభివృద్ధితో తేజస్సు నిండి, కొత్త మెఱుగులు పొంది, కొంగొత్త అందాల కాంతులు చిందుతున్న భాష.

సూక్తి – సాహిత్యం జాతి యొక్క సంస్కృతిని ప్రతిబింబింప జేయాలి – విశ్వనాథ సత్యనారాయణ



## ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం .............................................................

2. నేను గ్రహించిన విలువ .............................................................

3. సృజనాత్మక రచన .............................................................

4. భాషాంశాలు .............................................................

**తెలుగుభాషా దినోత్సవం :**

ఆగస్టు 29వ తేదీని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకొంటాం.

**ఉపాధ్యాయుల సూచనలు :**

1. ఆంధ్రకవుల గొప్పదనమును, రచనలను గూర్చి చెప్పండి.
2. ఆంధ్రరాష్ట్ర విశిష్టతను తెలిపే రచనలు చదివించండి.



**మేటి పద్యాలు**

*తేనియ ఘనీభవించి, ముత్తెముల వంటి*
*పలుకులైన విధాన సుస్వాదు సుఖ క*
*లధ్వనుల్ మృదూచ్చారణ లలిత మధన*
*పాకముల చిక్కబడి తెన్గు పల్కులయ్యె !* – రాయప్రోలు

——*****——

*జనని సంస్కృతంబు సకల భాషలకును*
*దేశ భాషలందు తెలుగు లెస్స*
*జగతి తల్లి కంటె సౌభాగ్య సంపద*
*మెచ్చుటాడు బిడ్డ మేలుగాదె !* – శ్రీనాథుడు


**పద్యాత్మక పొడుపు కథలు**

*రాతిపేరేగాని మెత్తగా ఉంటుంది*
*దంత కర్ర పేరె దంచలేదు*
*చక్కిలమ్ములాగు చచ్చిపడుంటుంది*
*రైలు బండిలాగ ప్రాకుతుంది* *(రోకలిబండ)*

——*****——

*కనులు మూడు గలవు – కాదు త్రినేత్రుండు*
*పక్షిగాడు చెట్టుపైన నుండు*
*జలము దాల్చియుండు నిలమేఘుడును గాడు*
*దీని భావమేమి ? తిరుమలేశ ?* *(టెంకాయ)*

## తెలుగు భాషోద్ధారకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్



**కడలి అంచులు దాటి కదిలింది 'తెలుగు' – ఎదల లోతులు మీటి ఎగిసింది 'తెలుగు'**

**ఏ భాష చెణుకైన ఏ యాస చినుకైన – తనలోన కలుపుకుని తరలింది 'తెలుగు'**

**ఒదిగొదిగి పోతున్న ఒరవళ్లలో సాగి – హుమ్మంటు వేమనగ ఉరిమింది 'తెలుగు'.**

ఇంతటి కమ్మనైన తెలుగు భాష ఆదికవి నన్నయ్య కాలం నుండి పరవళ్ళు తొక్కింది. అప్పటినుండి 18వ శతాబ్ది దాక కళకళలాడింది. కాని తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని ఆదరించే వారు లేక 19వ శతాబ్దంలో తెలుగు భాష కళావిహీనమై, కనుమరుగవుతూ వచ్చింది. అటువంటి సమయంలో తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని పునరుజ్జీవింప చేసిన తెలుగు భాషాభిమాని సి.పి.బ్రౌన్. విదేశీయుడైనప్పటికి శిథిలమవుతున్న మన భాషకు జవసత్వాలు ఊది, తేజోకాంతులతో వెలిగిపోయేలా చేసిన **ఆంధ్ర భాషోద్ధారకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్.** ఆంగ్ల పాలనలో తెలుగువారికి ఉపకారం చేసిన ప్రముఖులలో సర్ థామస్ మన్రో, కల్నల్ కాలిన్ మెకంజీ, సర్ ఆర్థర్ కాటన్‌లతో పాటు సి.పి.బ్రౌన్ ముఖ్యులు. సి.పి.బ్రౌన్ తెలుగు సంస్కృతిని, సాహిత్య చరిత్రను పునర్నిర్మించడానికి పండితులను ఆహ్వానించి, తన బంగళాలో ఒక సాహిత్య పర్ణశాలను ఏర్పరచి, 'వాగ్దేవి'ని నిండు ముత్తైదువులా అలంకరించాడు.

బ్రౌన్ ఉద్యోగరీత్యా తెలుగు నేర్చుకోవడం అవసరమై వెలగపూడి కోదండరామ పంతులు వద్ద తెలుగు నేర్చుకొన్నాడు. పదహారు నెలల కాలంలో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. తెలుగు ఘనతను గుర్తించాడు. తెలుగు సాహిత్యంలోని మాధుర్యాన్ని, విలువల్ని, చారిత్రక అంశాలను భావితరాలకు అందించడానికి తాళపత్ర గ్రంథాలకు ముద్రణ భాగ్యం కలిగించాలనుకున్నాడు. అందుకోసం అముద్రిత కావ్యాలను ముద్రించడానికి తన సొంత డబ్బుతోనే పండితులను నియమించాడు. వారిచేత తాళపత్ర గ్రంథాలలో ఉన్న కావ్యాలను పరిశీలించి, పరిశోధింప జేసి శుద్ధ ప్రతులను తయారుచేయించాడు. ఆయన చూపిన చొరవతోనే **వేమన శతక పద్యాలు, వసు చరిత్ర, పల్నాటి వీరచరిత్ర, మను చరిత్ర, కళాపూర్ణోదయం, కైఫియత్తులు, బైబిల్ కథలు** మొదలైన గ్రంథాలెన్నో ప్రచురితమయ్యాయి. వేమన పద్యాలను ఆంగ్లంలోనికి అనువదించాడు. ఆయన కృషితో తెలుగు సాహిత్య శోభ ఖండాంతరాలకు వ్యాపించింది.

తెలుగు – ఆంగ్లం, ఆంగ్లం – తెలుగు నిఘంటువులు తెలుగు భాషకు ఆయన అందించిన వజ్రాయుధాలు. ఆ నిఘంటువులు తెలుగు భాషను నేర్చుకోవడానికి, పదాల అర్థాలు తెలుసుకోవడానికి, నేటికీ ప్రామాణికమై వెలుగొందుతున్నాయి. తెలుగు ప్రజల భాష నుండి వచ్చే చాటువులు, సామెతలు, కథలు, వ్యాకరణ గ్రంథాలను సేకరించి, వాటిని క్రమపద్ధతిలో రాయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చాడు. సామాన్యులు సైతం తెలుగు భాషను అవలీలగా నేర్చుకోవడానికి వీలుగా జ్ఞాన దీపమై నిలిచాడు. తన జీవితాన్నంతా తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సాహిత్యాన్ని గ్రంథస్థం చేయడానికి ఆయన చేసిన కృషి తెలుగు భాష, తెలుగుజాతి ఉన్నంత వరకు చిరస్మరణీయంగానే ఉంటుంది. ఆయన మధురస్మృతులు తెలుగు వారి గుండెల్లో చెరగని ముద్రను వేస్తూనే ఉంటాయి.

దేశభాషలందు తెలుగులెస్స.

2

# మాతృభూమి

N4U6L5

## చదవండి - ఆలోచించి చెప్పండి



**వసుధ:-** తాతయ్యా! పొద్దున్నే ఎక్కడికి వెళుతున్నావు ?

**తాతయ్య :-** ఈ రోజు జనవరి 15 జాతీయ సైనికుల దినోత్సవం కదా! ఆ వేడుకల్లో పాల్గొనడానికి వెళ్తున్నానమ్మా !

**వసుధ:-** తాతయ్యా! ఎందుకు జాతీయ సైనికుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం?

**తాతయ్య:-** మన దేశాన్ని, ప్రజల్ని కాపాడడానికి ఎందరో సైనికులు తమ జీవితాలను, ప్రాణాలను త్యాగం చేశారు. వారిని స్మరించుకోవడానికి, అభినందించడానికి, సేవలను గుర్తు చేసుకోవడానికి ఈ జాతీయ సైనికుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారమ్మా.

**వసుధ:-** సైనికులు అలాంటి త్యాగాలు ఎందుకు చేస్తారు తాతా ?

**తాతయ్య:-** కన్న తల్లి, ఉన్న ఊరు స్వర్గం కంటే గొప్పవి. సైనికులు మాతృభూమి కోసం, ప్రకృతి వైపరీత్యాల నుండి ప్రజల ప్రాణాలను కాపాడడం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించడానికి వెనుకాడరు. మనం కూడా వారి అడుగుజాడల్లో నడవాలి.

**వసుధ:-** అయితే తాతయ్యా! నేను కూడా వస్తాను. వెళ్దాం పదండి.

**ప్రశ్నలు :**

1. పై సంభాషణ ఎవరెవరి మధ్య జరిగింది ?
2. జాతీయ సైనికుల దినోత్సవం ఎప్పుడు? ఎందుకు జరుపుకుంటారు ?
3. మనం సైనికులు చూపిన బాటలో నడవాలి అంటారు. ఎందుకు?

### ఉద్దేశం

విద్యార్థులు దేశరక్షణకు అహర్నిశలు పాటుపడే సైనికుల సేవలను గుర్తించాలని, తద్వారా స్ఫూర్తిని పొంది దేశసేవకు పూనుకోవాలని ఈ పాఠం ఉద్దేశం.

### రచయిత్రి పరిచయం



1933 -2015

### పవని నిర్మల ప్రభావతి

పవని నిర్మల ప్రభావతి గారు ప్రకాశం జిల్లా ఒంగోలులో జన్మించారు. వెంకట నరసింహారావు, సరస్వతమ్మ వీరి తల్లిదండ్రులు. భర్త పేరు శ్రీధర రావు. ఈమె చదివింది పదో తరగతే అయినా చేయి తిరిగిన రచయిత్రి. అనాథ, ఎదలో ముల్లు, స్త్రీ, నాగరికత నవ్వుతోంది మొదలైన ఏడు సుప్రసిద్ధ కథా సంపుటాలు. ఉదయ కిరణాలు, శాపగ్రస్తులు, రాలిన పూలు మొదలైన 17 నవలలు ఈమె కలం నుండి జాలువారాయి. ప్రస్తుత పాఠం **కథానిలయం** నుండి గ్రహించబడింది.

## మాతృభూమి

"ఏమిట్రా నువ్వంటున్నది సుధీర్" అంది పద్మజ కంగారుగా. తలెత్తి చూశాడు సుధీర్. తనకోసం బల్లమీద పెట్టిన టిఫిన్ ప్లేటును దగ్గరగా జరుపుకుంటూ నింపాదిగా అన్నాడు సుధీర్. "రేపు కలెక్టరాఫీసు దగ్గర సైన్యంలో చేరదల్చుకున్న యువకుల్ని ఎంపిక చేసుకుంటారటమ్మా! నేనూ సైన్యంలో చేరుతాను". క్షణకాలం కొడుకువైపు అయోమయంగా చూస్తూ, "నీకేమైనా మతిపోయిందా సుధీర్? అలాంటి కర్మ నీకేం పట్టింది. ఒక్కగానొక్క కొడుకువి మనకున్న వ్యాపారం, ఆస్తులు చూసుకుంటూ మా కళ్ళముందే ఉండవచ్చు కదా!" అంది తల్లి.

సుధీర్ ఆశ్చర్యంగా తల్లివైపు చూశాడు."అది కర్మా.. అమ్మా!? దేశాన్ని కాపాడుతూ, దేశప్రజల్ని రక్షించే ఉద్యోగమమ్మా అది కర్మ ఎలా అవుతుంది? ఎన్నో మహిళామండళ్లు స్థాపించావు. వారిని ఉత్తేజపరుస్తూ ఎన్నో ఉపన్యాసాలిస్తావు. పెద్దచదువు చదువుకున్న నువ్వేనా ఇలా మాట్లాడేది?" అంటూ చిరుకోపంతో తల్లిని ప్రశ్నించాడు. "ఏమిటమ్మా పలకవు. నా పేరెందుకు సుధీర్ అని పెట్టావు?" అని అరుస్తున్న కొడుకుని చూస్తూ, చిరునవ్వు నవ్వింది పద్మజ.

"ఇప్పుడు తమాషాలు కాదమ్మ రేపు పట్నం వెళ్ళి సైన్యంలో చేరుతాను. తాటిచెట్టు మల్లే ఇంత పొడుగు పెరిగాను. నా కండలు చూడు ఎలా ఉన్నాయో? తప్పక ఎన్నికవుతాను." సుధీర్ ప్లేట్లో చెయ్యి కడుక్కుంటూ దృఢంగా అన్నాడు. పద్మజ తెల్లబోయింది. కొడుకు చాలా పట్టుదలగానే వున్నాడన్న విషయం ఆమెకు బోధపడింది. సుధీర్‌కి దగ్గరగా కూర్చుని మెల్లగా అందామె, "చూడు నాన్న ! నువ్వొక్కడివే మాకున్నది. నువ్వు మమ్మల్ని వదిలి వెళ్ళిపోతే, మేమేం కావాలి?" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది. సుధీర్ అమ్మమాటలకు కలవరపడ్డాడు. "అదేమిటమ్మా! అలా మాట్లాడితే మరి దేశం?" అన్నాడు. ఆమె కన్నీళ్లు తుడుచుకుంటూ "దేశం ఏమీ కాదు. దాని కోసం ఉన్నారులే చాలా మంది. నా మాట విను. బిడ్డగా నిన్నే విషయంలోను నొప్పించలేదు. ఈ విషయంలో నన్నూ, మీ నాన్నగారినీ నొప్పించకు" అంటూ ఆమె వంటగదిలోకి వెళ్ళిపోయింది. సుధీర్ సోఫాలో కూర్చొని మౌనంగా ఆలోచిస్తున్నాడు.

అంతలో తండ్రి రాజారావు బయటి పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. పద్మజ జరిగిన విషయాన్ని చెప్పింది. కొడుకు దగ్గరకు వెళ్లి "నీకిదేం పాడుబుద్ధిరా? ఏదో బి.ఏ పూర్తయింది కదా! వ్యాపారం చేస్తావని మేం సంబరపడుతూ ఉంటే" అని గర్జిస్తూ అన్నాడు. "వ్యాపారం చేయడం నాకిష్టం లేదు నాన్న. 'ఏదైనా ఉద్యోగం చేయాలనే ఉద్దేశంతోనే సైన్యంలో చేరాలనుకున్నాను." అని నసుగుతూ అన్నాడు. "అందుకని సైన్యంలో చేరి చస్తావా? అన్నాడు తండ్రి. "చేరిన వాళ్ళంతా చావరు నాన్నా"! "చాల్లేవోయ్ అతితెలివి. నీకు ఉద్యోగం కావాలి కదా ! సరే రేపు నాతో పాటు రా, తెలిసిన వారి దగ్గర ఏ గుమాస్తా ఉద్యోగమైనా ఇప్పిస్తాను" అంటూ సుధీర్‌కు మరోమాటకు అవకాశం ఇవ్వకుండా బయటకి వెళ్ళిపోయాడు రాజారావు.

"ఛీ..!ఈనాటి సమాజంలో కొంతమందికి దేశభక్తి, ధైర్యం, సాహసం లేవు, సమాజాభివృద్ధి కాంక్ష లేదు. మనిషికి స్వార్థపు బ్రతుకులు తప్ప" అని పెద్దగా గొణుగుతున్న కొడుకు వైపు వాత్సల్యంతో చూసింది పద్మజ. ఇదీ పద్మజ, రాజారావుల కుటుంబ పరిస్థితి. ఆదర్శభావాల్ని, దేశభక్తిని అణచివేసిన పరిస్థితి.

అదే ఊరిలో చంద్రమ్మ, రోశయ్య కుటుంబం ఉంది. వారికి ఐదుగురు సంతానం. వారి పెద్ద కొడుకు వీర. వీర వాళ్ళమ్మతో మాట్లాడుతూ, "నేను రేపు సైన్యంలో చేరిపోతానమ్మా! మంచి జీతాలిస్తారట" అని ఉత్సాహంగా చెప్పాడు. చంద్రమ్మ కళ్లలో ఎంతో వెలుగు 'నిజమేనట్రా' అంది. "నిజంగానే! అమ్మా ఇప్పుడే అధికారి దగ్గరకు పోయి మాట్లాడొచ్చాను కూడా" ఆ వివరాలన్నీ చెప్పాడు. "రేపు చాలా మందిని సైన్యంలోకి తీసుకుంటారట. నేను ఎన్నికవుతానన్నాడు అధికారి. సైన్యంలో చేరితే జీతం వస్తుంది ఇక్కడికి పంపిస్తాను. ఇంటిల్లిపాదీ తినొచ్చు. నాన్నగారికి ఆసరా లభిస్తుంది. వీటన్నిటికంటే మనదేశానికి సేవచేసే అవకాశం వస్తుంది కదమ్మా!" సంతోషంతో వీర ఈ మాటలన్నీ చెబుతుంటే చంద్రమ్మ మనస్సు ఆనందంలో మునిగిపోయింది. చంద్రమ్మకు చుట్టూర చిమ్మిన చీకటి తొలిగి పోయినట్లయింది. భర్తరెక్కల కష్టం తొలిగిపోతుందని భావించింది. పిల్లలకు చదువులు చెప్పించవచ్చు అనుకున్నది. అంతలోనే గుండెలు పిండేసే ఆలోచన ఆమె ఎదలో ముల్లులా కదలాడింది. "సైన్యంలో చేరితే... యుద్ధం వస్తే" తల్లిప్రేమ కళ్ళముందు కదలాడగా మెల్లిగా అంది. అది విని వీర పక్కున నవ్వాడు.


"యుద్ధంలోగాక ఇక్కడ మాత్రం చావకూడదా ఏమిటమ్మా ! పస్తులుండి బాధపడటం కంటే ఉన్న నాలుగు రోజులు హాయిగా బతకడం మేలు కదా? దేశం కోసం చావడం కంటే గొప్పేముంది. అలాంటి మంచి చావుని కోరుకోవాలే తప్ప, దాని గురించి భయపడకూడదమ్మా" అంటూ బయటకు వెళ్ళిపోయాడు వీర. ఈ మాటలు విన్న రోశయ్య మీసం మెలేస్తూ గర్వంగా నవ్వాడు. "ఆడు నా కొడుకే చంద్రీ గుండె ధైర్యం చూసావా అది నాది. అచ్చరలచ్చులు చేసే మాటలన్నాడు నా బిడ్డ. వీళ్ళు కాకపోతే మరెవ్వరు దేశానికి సేవ చేస్తారు. యువకులు దేశం కోసం, ప్రజలకోసం పాటుపడాలి. మన వీర కూడా అలాంటి మంచి పనే చేస్తాడు. కాబట్టి వీరను మెచ్చు కోవాల్సిందే"అన్నాడు. ఆ సమయాన చంద్రమ్మకు ఆనందం, దుఃఖం రెండూ కలిగాయి. ఇలా వీరతోపాటు ఎంతోమంది యువకులు సైన్యంలో చేరారు. చేరుతున్నారు.

పదేళ్ళు గిర్రున తిరిగాయి. సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. సుధీర్ వ్యాపారవేత్తగ కొనసాగుతున్నాడు. కాని దేశానికి సేవ చేయలేకపోయాననే బాధ అలానే మిగిలి పోయింది. ఆనాటి మంకుపట్టు వదిలి సుధీర్ ఇలా హాయిగా ఉన్నందుకు పద్మజ,రాజారావు లిద్దరు ఆనందించని క్షణం లేదు.



వీర సైన్యంలో చక్కగా పనిచేస్తూ ఎదిగిపోయాడు. హిందీ, ఉర్దు, ఇంగ్లీషు, బెంగాలీ, కన్నడం, తమిళం వంటి ఏడెనిమిది భాషల్లో అనర్గళంగ మాట్లాడుతున్నాడు. ఇంటికి వచ్చిన ప్రతిసారి తమ్ముళ్ళకు చెల్లెళ్ళకుస్వెటర్లు, మంచి బట్టలు, వాచీలు,తల్లిదండ్రులకు బట్టలు, కప్పుకొనే రగ్గులు తెస్తున్నాడు.

వాళ్ళు అతను పంపిన డబ్బుతోనే ఇల్లు కట్టుకున్నారు. ఈసారి వీర సెలవులకు వచ్చాడు. వీర వచ్చిన ప్రతిసారి వారింట్లో పండుగే. తమ కుటుంబ స్థితిని తలచుకొని వీరతో పాటు తల్లిదండ్రులు కూడా సంతోషపడ్డారు. వీర ఆ రాత్రి ఆరుబయట మంచంమీద పడుకుని ఆకాశం వైపు చూస్తున్నాడు. ఆ సమయంలో వీర మనసులో "నా వాళ్లంతా హాయిగా ఉన్నారు. వాళ్ళకి అన్ని సౌకర్యాలు ఉండేలా చేయగలిగాను. నా కుటుంబ ఋణాన్ని ఈ విధంగా తీర్చుకుంటున్నాను. ఇది నాకు ఎంత సంతృప్తిగా ఉందో" అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు. ఈసారి వీర వచ్చిన మూడు రోజులకే హై కమాండ్ నుండి టెలిగ్రామ్ వచ్చింది. యుద్ధం ప్రారంభం కాబోతుంది వెంటనే రావలసిందని. దిగాలు పడిన చంద్రమ్మకు వీర ధైర్యం చెప్పాడు. తండ్రికి కళ్ళతోనే వీడ్కోలు చెప్పాడు. నవ్వుతూ రైలు ఎక్కాడు. మరితిరిగి రాలేదు.




శ్రద్ధాంజలి సభ వీర స్వగ్రామంలో పెట్టారు. ఆ సభలో పాల్గొనడానికి సుధీర్, రాజారావు వచ్చారు. ముఖ్యఅతిథిగ పద్మజ వచ్చింది. వీర గురించి సభాధ్యక్షులు చెబుతున్న మాటలు ఆమె హృదయాన్ని పిండివేస్తున్నాయి.

సభలో పద్మజ మాట్లాడే వంతు వచ్చింది. ఆమె మాట్లాడుతూ "వీర అదే వీరారావు మన గడ్డ మీద పుట్టిన బిడ్డ." దేశాన్ని రక్షించే కార్యక్రమంలో అమరుడవుతాడని మనమెవ్వరూ ఊహించలేదు. ఈ సంఘటనకు నా గుండె పగిలిపోతోంది. మరి తల్లి చంద్రమ్మ ఎలా భరిస్తుందో? ఆమె వీరమాత. ఆమె జిజియాబాయ్ వంటిది. ఆ తల్లి కన్న ఈ బిడ్డ మన జిల్లాకే కాదు,రాష్ట్రానికే మణిపూస. వీర తల్లిదండ్రులను వేదికపైకి పిలిచి వారిని ఓదారుస్తూ వారిలో ధైర్యాన్ని నింపారు. వారికి ఆర్థిక సహాయం చేసి, వారిని అభినందించారు. సభకు వచ్చిన ప్రతిఒక్కరు వీర త్యాగాన్ని కొనియాడారు.

ఆ రోజు రాత్రికి చంద్రమ్మ, రోశయ్యలు మంచం మీద కూర్చొని కుమారుని తలుచుకొని బాధపడ్డారు. రోశయ్య భార్యను ఓదారుస్తున్నాడు. చంద్రమ్మ వెక్కివెక్కి ఏడుస్తూ ఆ పెద్దోళ్ల మాటలు నాకు అర్థం కాలేదు. గానీ.. 'నా బిడ్డ బతికిన నాలుగు రోజులు మన ఋణం తీర్చుకోవడమే కాదు, దేశసేవలో మరణించి జనుల గుండెల్లో నిలిచిపోయాడు. నాకు చాలా సంతోషమేస్తోంది. అంత కంటే గొప్ప ఇంకేముంది.' అని అంది.

తల్లిదండ్రులందరూ తమ పిల్లలు వాళ్ళకళ్లెదుటే వుండాలనుకుంటే ఎలా? ఈ దేశాన్ని రక్షించేవారు ఎవరు? సేవచేసే వారెవరు? మనిషి బ్రతకడానికి తిండి, బట్ట, గాలి, నీరు ఎలా అవసరమో దేశసేవ కూడా అలా ప్రతివారికీ




ఊపిరిగా నిలవాలి. మనం మన రెండో అబ్బాయిని కూడా సైన్యంలో చేరుద్దాం. దేశరక్షణలో భాగస్వామిని చేద్దామంటూ గుండెల్లోని బరువును దింపుకుంది, గోడమీద వెలిగిపోతున్న 'వీర' ఫోటోను చూస్తూ నిద్రలోకి జారుకున్నది.

**ప్రక్రియ - కథానిక**

కథ, కథానిక ఈనాడు పర్యాయ పదాలుగా వాడుతున్నారు. కథానిక వ్యక్తి జీవితంలో ఒక ముఖ్య సన్నివేశాన్ని, సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రిస్తుంది. క్లుప్తత దీని లక్ష్యం. చెప్పదలుచుకున్న విషయం పాఠకుల హృదయానికి హత్తుకునేలా చేస్తుంది. పాత్రలు, నేపథ్యం, కథనం, జీవిత వాస్తవికత చిత్రణ కథానిక ప్రక్రియలో ముఖ్య భాగాలు.

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

J1C3A5

**అ) కింద ప్రశ్నలకు సమాధానాలివ్వండి.**

1. పాఠంలో మీకు నచ్చిన సన్నివేశం గురించి మాట్లాడండి.
2. పాఠంలో పాత్రల స్వభావాన్ని గురించి చెప్పండి.
3. పాఠం చదవండి. కింది మాటలు ఎవరు? ఎవరితో? ఎందుకన్నారో రాయండి.
   1. ఆ తల్లి కన్న బిడ్డ రాష్ట్రానికి మణిపూస
   2. చదువుకున్న యువకులు చైతన్యంతో దేశం కోసం పాటుపడాలి.

**ఆ) కింది పద్యం చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

దేశము మట్టిగాదనుచు దేశమటన్న మనుష్యులన్న సం
దేశమునిచ్చిపోయిన మనీషి! మహాశయుఁడప్పరాయునా
దేశము త్యాగ మూర్తుల పవిత్ర మహాశయముల్ ఫలించుచో
దేశము మట్టిగానపుడు దేశమనంగ మనుష్యులే సుమీ!


ఎస్.టి. జ్ఞానానంద కవి

**ప్రశ్నలు**

1. పద్యంలో ఎటువంటి సందేశం ఉంది?

జ. ..............................................................................................

2. త్యాగమూర్తుల ఆశయమేమిటి?

జ. ..............................................................................................


3. దేశమనగానేమి?

జ. ..............................................................................................

4. ఈ పద్యం రాసిన కవి ఎవరు?

జ. ..............................................................................................

### ఇ) కింది పేరా చదవండి నాలుగు ప్రశ్నలు తయారు చేయండి



భారతదేశ సైన్యాధికారిగా, భారతసాయుధ దళాల మొదటి "చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్"గా పనిచేసిన సైనిక వీరుడు బిపిన్ రావత్. ఈయన పూర్తిపేరు లక్ష్మణ్ సింగ్ రావత్. ఇతను 1958 మార్చి 16వ తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పౌరి జిల్లాలో జన్మించారు. రావత్ భార్య మధులిక రావత్. ఈయన సిమ్లాలోని సెయింట్ ఎడ్వర్డ్ పాఠశాల,కటక్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చదువు పూర్తి చేశారు. సైన్యంలో ప్రవేశించిన రావత్ సెకండ్ లెఫ్టినెంట్ హోదా నుంచి జనరల్ (సిడిఎస్) హోదా వరకు ఎదిగారు. సైన్యాధిపతి హోదాలో పనిచేస్తున్నప్పుడు దేశ రక్షణ కోసం అనేక సంస్కరణలు చేపట్టారు.సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కఠిన విధానాలను ప్రవేశపెట్టారు. ఈయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం **పరమ విశిష్టసేవా పతకం, ఉత్తమ యుద్ధసేవా పతకం** మొదలైన వాటితోపాటు 2021 సంవత్సరంలో **పద్మవిభూషణ్** పురస్కారాన్ని ఇచ్చింది.రావత్ 2021వ సంవత్సరం డిసెంబర్ 8వ తేదీన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.

**ప్రశ్నలు**

1. ______________________________

2. ______________________________

3. ______________________________

4. ______________________________

**ఈ) కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.**

1. 'మాతృభూమి' పాఠ్యభాగ రచయిత్రి గురించి రాయండి.
2. కథానిక ప్రక్రియా లక్షణాలను గురించి రాయండి.
3. 'వీర' తన తల్లితో సైన్యంలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఏం చెప్పాడో రాయండి.
4. పద్మజ సభలో 'వీర' గురించి మాట్లాడిన విషయాలను గురించి రాయండి.



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. సుధీర్ సైన్యంలో చేరక పోవడానికి కారణమేమిటి?
2. రాజారావు, రోశయ్యలలో ఎవరి వ్యక్తిత్వం గొప్పది? ఎందుకు?
3. యుద్ధాల వల్ల లాభమా? నష్టమా? కారణాలను రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో సమాధానాలను రాయండి**

1. 'వీర' కుటుంబానికి, దేశానికి చేసిన సేవలను గురించి రాయండి.
2. సుధీర్,పద్మజ లేదా వీర, చంద్రమ్మల మధ్య జరిగిన చర్చను సంభాషణ రూపంలో రాయండి.
4. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గురించి ప్రశంసిస్తూ రాయండి.



## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాల్లో గీతగీసిన పదాల అర్థాన్ని రాయండి, ఆ పదాలను సొంత వాక్యాల్లో ఉపయోగించి,రాయండి.**

1. కార్గిల్ యుద్ధంలో ఎంతోమంది సైనికులు అమరులయ్యారు.

..........................................................................................

2. తల్లిదండ్రుల వాత్సల్యం గొప్పది.

..........................................................................................

3. సెలవులు పూర్తి చేసుకొని తిరిగి వెళుతున్న వీరకి మిత్రులు వీడ్కోలు పలికారు.

..........................................................................................

4. పదేళ్ళు గిర్రున తిరిగాయి.

..........................................................................................

**ఆ) కింది గీత గీసిన పదాలకు నానార్థాలు రాయండి.**

1. తల్లిదండ్రులను గౌరవించాలి.

జ. ______________________________

2. ఒక ఆశ తీరగానే మరో ఆశ పుడుతుంది.

జ. ______________________________

3. కరోన సమయంలో ప్రజలు చావు అంచులకు వెళ్ళొచ్చారు.

జ. ______________________________

4. 'వీర' పేరు మారుమోగింది.

జ. ______________________________

**ఇ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు పర్యాయ పదాలను రాయండి.**

1. జీతంతో కూడిన సెలవును మంజూరు చేశారు. జ. ____________
2. దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు. జ. ____________
3. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులందరు మరణించారు. జ. ____________
4. దశరథుని కుమారులు రామలక్ష్మణులు. జ. ____________

**ఈ) కింది పదాలకు ప్రకృతి పదాలు రాయండి.**

1) నిదుర 2) పత్తనం 3) అమ్మ 4) కొమరుడు

| ప్రకృతి | వికృతి |
|---|---|
| 1 | |
| 2 | |

| ప్రకృతి | వికృతి |
|---|---|
| 3 | |
| 4 | |

## భాషాక్రీడ

**అ) కింది పదాలలో రెండు పదాలున్నాయి. వీటిలో ఒక పదానికి అర్థం ఇవ్వబడింది. పాఠం చదివి, ఇచ్చిన ఆ అర్థం ఆధారంగా రెండవ పదాన్ని గుర్తించి, రెండు పదాలు కలిపి రాయండి.**

**ఉదా : ఉప (ఉంచుట) = ఉపన్యాసం న్యాసం అనగా ఉంచుట అని అర్థం**

1) కొన (వ్యవసాయం) = ..............................................................

2) మణి (వెన్నులో ఉంటుంది) = ..............................................................

3) తల్లి (నాన్నలు) = ..............................................................

4) వ్యాపార (తెలిసిన వాడు) = ..............................................................

5) తొలగి (వెళ్తుంది) = ..............................................................

6) సమాజ (పెరుగుట, వృద్ధిచెందుట)= ..............................................................

## వ్యాకరణాంశాలు

**అ) కింద గీత గీసిన సంధి పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

**ఉదా॥** **పల్లెకు, పట్టణానికి మధ్యస్థంగా ఉన్న గ్రామమది.**

**జ. గ్రామము + అది = ఉత్వ సంధి**

1. వారికి సమాజాభివృద్ధి కాంక్ష లేదు. =________+________=________
2. అతడు అమరుడవుతాడని మనమెవ్వరు ఊహించలేదు. =________+________=________
3. ఆయన నన్ను క్షమించండని సభాముఖంగా కోరాడు. =________+________=________
4. ఏమిటమ్మా పలకవు. =________+________=________

**ఆ) కింది సమాస పదాలను పరిశీలించండి.**

గొప్ప పుస్తకం - గొప్పదైన పుస్తకం

ఎర్ర కలువ - ఎర్రనైన కలువ

తెల్ల పావురం - తెల్లదైన పావురం

పై ఉదాహరణలలో గొప్ప, ఎర్ర, తెల్ల అనేవి విశేషణాలు. పుస్తకం, కలువ, పావురం అన్నవి నామవాచకాలు. ఈ విధంగా నామవాచక, విశేషణాల కలయికతో ఏర్పడే సమాసం **"కర్మధారయ సమాసం"**.

**ఇ) కింది వాక్యాలలోని కర్మధారయ సమాసాలను గుర్తించి నామవాచకం, విశేషణాలను రాయండి.**

1. విద్య మనకు ఉన్నతవ్యక్తిత్వాన్ని ఇస్తుంది. =______________=________
2. ఒక్క చిరునవ్వు ఎన్నో సమస్యలకు పరిష్కారం. =______________=________

3. వివేకానందుడు ఆదర్శభావాలు గల వ్యక్తి. =____________________=__________

4. దానమివ్వాలంటే దానగుణము ఉండాలి. =____________________=__________

### ఉపమాలంకారం

**కింది వాక్యాన్ని పరిశీలించండి.**

జ్ఞానం దీపం వలె జీవితానికి వెలుగునిస్తుంది.

పై వాక్యంలో జ్ఞానాన్ని దీపంతో పోల్చారు. ఇక్కడ జ్ఞానం పోల్చబడే వస్తువు. కనుక జ్ఞానం **ఉపమేయం** అవుతుంది. పోలికకు తెచ్చుకున్నది దీపం కనుక దీపం **ఉపమానం** అవుతుంది.

| | |
|---|---|
| ఉపమేయం | పోల్చబడేది |
| ఉపమానం | పోలికకు తెచ్చుకున్నది |

**కింది వాక్యాల్లోని ఉపమేయ, ఉపమానాలను గుర్తించి, రాయండి.**

1) చినుకులు ముత్యాల్లా రాలుతున్నాయి.

2) నీ మాటలు అమృతం వలె సంతోషాన్నిస్తున్నాయి.

పోల్చబడేది ఉపమేయమని, పోలికకు తెచ్చుకున్నది ఉపమానం అని తెలుసుకున్నారు !

**క్రింది వాక్యాన్ని పరిశీలించండి.**

ఉదా॥ ఆమె ఆలోచనలు ఎదలో ముల్లువలె కదలాడాయి

ఉపమేయం = ఆలోచనలు (పోల్చబడే పదం)

ఉపమానం = ముల్లు (పోలిక కొరకు ఉన్న పదం)

ఉపమావాచకం = వలె (ఉపమేయ, ఉపమానాల అనుసంధాన కర్త)

సమానధర్మం = కదలాడాయి (ఉపమేయ, ఉపమానాలలో ఉండే సమానధర్మం)

పై ఉదాహరణలో ఉపమేయమైన ఆలోచనలను, ఉపమానమైన ముల్లుతో పోల్చిచెప్పడం జరిగింది. వలె అను ఉపమావాచకం ఉపమేయానికి, ఉపమానానికి, అనుసంధాన కర్తగా ఉంది. ఉపమేయ ఉపమానాలలో కదలాడడం అనే సమానధర్మం ఉంది. ఈవిధంగా **ఉపమేయ ఉపమానాలకు మనోహరమైన సాదృశ్యమును** (పోలికను) చెప్పినట్లయితే ఉపమాలంకారం అవుతుంది.



### ప్రాజెక్టు పని

1. దేశం కోసం త్యాగం చేసిన సైనికుల వివరాలను సేకరించి ప్రదర్శించండి.

## పాఠాంత పద్యం

ప్రాణిలోకంబు సంసారపతిత యగుట
వసుధ పై గిట్టి పుట్టనివాడు గలఁ డె
వాని జన్మంబు సఫల మెవ్వాని వలన
వంశమధికోన్నతి వహించి వన్నె కెక్కు — ఏనుగు లక్ష్మణకవి

తాత్పర్యం : ప్రాణులన్నీ సంసారబంధనాలలో చిక్కుకొని ఉంటాయి. భూమి మీద పుట్టి చనిపోని వాడుండడు. ఎవని వలన వంశము మిక్కిలి గొప్పదనమును పొంది ప్రసిద్ధికెక్కునో వారి జన్మ సార్థకమవుతుంది.

సూక్తి– తీసుకోవడం కాదు ఇవ్వడం నేర్చుకో. పెత్తనం కాదు సేవ అలవరచుకో – రామకృష్ణ పరమహంస

## ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..........................................................................
2. నేను గ్రహించిన విలువ ..........................................................................
3. సృజనాత్మక రచన ..........................................................................
4. భాషాంశాలు ..........................................................................

**జాతీయ సైనిక దినోత్సవం**

జనవరి 15వ తేదీని సైనికుల త్యాగాలను స్మరిస్తూ సైనిక దినోత్సవాన్ని నిర్వహించుకొంటాం.

**ఉపాధ్యాయుల సూచనలు :**

1. దేశసేవకు సైనికులను ముందుకు నడిపించిన వీరమాతల గూర్చి చెప్పండి.
2. దేశరక్షణ వ్యవస్థ గూర్చి విద్యార్థులకు వివరించండి.
3. అమరవీరుల దినోత్సవంలో పాల్గొనండి.

## మేటి పద్యాలు

*పరమదయాకర శుభకర*
*నరవరనుత గరుడగమన నగధరపరమ*
*మురహర భవహర మాధవ*
*ధరధరనుత ధవళనయన దశరథతనయా॥*

ఈ పద్యంలో అన్నీ తలకట్లే ఉన్నాయి గమనించండి.

అమృత నిష్యంది పల్లకీ ప్లోదమునకు
రాగిణీ దివ్య సమ్మోద రాగమునకు
తేనె తేటల నవకంపు సోనలకును
సాటియగును మా తెలుగు భాషామతల్లి – సురవరం

అందముల చిందు తీరు తీయములు గల్గి
ముద్దు గులికెడు నుడికారములును గల్గి
లలిత జాతీయములు గల్గి యలరుచుండు
తేట తేనియ యూట మా తెనుగు మాట
తేట వెన్నెల వెలుగులు తెలుగు నుడులు

– నాళం కృష్ణారావు

## పాఠాంత అంశము

## అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం

ఎంత కాలం సాగాలీ ఆగడాలు. నీడను దేవతగా పూజించే అరమరిక లేని జాతిపై ఇంతటి రాక్షసకాండా?



ఎవడిచ్చాడు దొరలకీ హక్కు! తనగడ్డకాని గడ్డపై అడుగుపెట్టి, దౌర్జన్యానికి దిగిన ఈ దొరతనాన్నిక దగ్ధం చేసి తీరకపోతే మన్యానికి మనుగడలేదు. నిత్యం చచ్చేకన్నా, వీరునిగా పోరాడి చావడం యుక్తం. బ్రిటిషు నిరంకుశులపై తిరుగుబాటు, పరపీడన ప్రభుత్వంపై విప్లవం ప్రతిమానవుడి జన్మహక్కు! ఈ సీతారామరాజు ఒక్కడే కాదు. మన్యం వీరుల కొనఊపిరున్నంత వరకూ, సీమదొరల శబ్దం భరతఖండంలోనే వినిపించ వీలులేదు. సింహాలు విహరించే సీమలో నక్కలకు స్థానముండరాదు. పులినైనా పిలిచి చంపగల మన్యజాతే తలచుకుంటే, ఈ దొరలకు త్రుటిలో గతులూమతులూ లేకుండా చేయగలదు.

ఏకపాత్ర – మహనీయుని జీవితంలో జరిగిన పతాక సన్నివేశము, సంభాషణ, పాత్రోచితంగా ఒక్కరే అభినయించడం ఏకపాత్రాభినయం.

మూడు నెలల బిడ్డను కట్టుకొని, స్వాతంత్ర్య పోరాటం సల్పిన ఝాన్సీలక్ష్మియే మనకు విప్లవస్ఫూర్తి, "నరుడు తలచుకుంటే నల్లరాళ్ళు బద్దలౌతాయి". పదండి వీరులారా! విజయం మనదే... మల్లూ, గంటాం, పడాలూ! అశేష మన్య శూరులారా! కరిపై లంఘించే కొదమసింగములారా! కదలండి. కదనానికి.

3

# శతకసౌరభం

G3R6EZ

## చదవండి - ఆలోచించి చెప్పండి




శ్రుతి సుభగంబైయును స
న్మతినిచ్చును, నీతిఁబెంచు, మాన్యత గూర్చున్
శతకము బాపు తమమ్ములఁ
శతపత్ర సుహితునివోలె సతతము నేస్తం !

ప్రశ్నలు :

1) పై పద్యంలో దేని గురించి ప్రస్తావన ఉంది ?
2) శతకము అంటే ఏమిటి ?
3) మీకు వచ్చిన శతక పద్యాలు చెప్పండి ?

**ఉద్దేశం**

విద్యార్థులలో లౌకిక జ్ఞానాన్ని, జీవన నైపుణ్యాలను, నైతిక విలువలను పెంపొందించడం వారిని ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం ఈ పాఠ్యాంశ ప్రధాన ఉద్దేశం.

| క్ర.సం | కవి పేరు | కాలము | శతకము |
|---|---|---|---|
| 1. | గరికిపాటి మల్లావధాని | 19వ శతాబ్దం | విద్యార్థి శతకం |
| 2. | మారద వెంకయ్య | 17వ శతాబ్దం | భాస్కర శతకం |
| 3. | పక్కి అప్పల నరసయ్య | 16వ శతాబ్దం | కుమార శతకం |
| 4. | పెరుమాళ్ళ మునెప్ప | 20వ శతాబ్దం | విద్యా శతకం |
| 5. | కంచర్ల గోపన్న | 17వ శతాబ్దం | దాశరథి శతకం |
| 6. | మాచిరాజు శివరామరాజు | 20వ శతాబ్దం | మణులమూట శతకం |
| 7. | బమ్మెర పోతనామాత్యుడు | 15వ శతాబ్దం | నారాయణ శతకం |
| 8. | గుండ్లపల్లి నర్సమ్మ | 20వ శతాబ్దం | వరదరాజ శతకం |
| 9. | కొండూరు వీర రాఘవాచార్యులు | 20వ శతాబ్దం | మిత్రసాహస్రి శతకం |

# శతక సౌరభం



*1. కం. జననీ జనకులు నినుఁగని
పెనిచిన దేవతలటంచు పెనుపగు భక్తిం
గనుఁగొని యనిశము వారిం
దనుపుటయే నీకు సౌఖ్యదము విద్యార్థీ!

(విద్యార్థి శతకం)



* 2. ఉ. దానముఁ జేయనేరని యధార్మికు సంపదలుండి యుండినన్
దానె పలాయనంబగుట తథ్యము, బూరుగు మ్రానుఁ గాచినన్
దాని ఫలంబులూరక వృథాపడిపోవవె యెండి గాలిచేఁ
గానలలోన నేమిటికిఁగాక, యభోజ్యములౌట భాస్కరా!

(భాస్కర శతకం)



*3. కం. పిన్నల పెద్దల యెడ గడు
మన్ననచే మెలగు సుజన మార్గంబులనీ
వెన్ను కొని తిరుగుచుండిన
నన్ని యెడల నెన్న బడదువన్న కుమారా!

(కుమార శతకం)




* 4. తే.గీ. గంటకాలము గడిచిన గతమనంద్రు
గతము గతమె కానది యెట్లు కలిసిరాదు
గంటకాలము వృథగాగ గడపకీవు
విద్యనేర్చుకో బ్రతుకంత వెలిగిపోవు

(విద్యా శతకం)



* 5. చ. కనకవిశాలచేల! భవకానన శాతకుఠారధార! స
జ్జన పరిపాలశీల! దివిజస్తుత సద్గుణ కాండ! కాండసం
జనిత పరాక్రమ క్రమ విశారద! శారదకందకుంద చం
దన ఘనసార సారయశ! దాశరథీ! కరుణాపయోనిధీ!

(దాశరథి శతకం)

*6. ఆ.వె. నిండువిస్తరాకు నిశ్చలంబుగనుండు
ఏమిలేని విస్తరెగిరిపడును
వినయియగు వివేకి, విఱ్ఱవీగు జడుండు
మాచిరాజుమాట మణులమూట



**(మణులమూట శతకం)**

* 7. మ. సతతాచారము సూనృతంబు కృపయున్ సత్యంబునున్ శీలమున్
నతిశాంతత్వము చిత్తశుద్ధికరము న్నధ్యాత్మయున్ ధ్యానమున్
ధృతియున్ ధర్మము సర్వజీవహితమున్ దూరంబుఁ గాకుండ స
మ్మతికిం జేరువ మీ నివాస సుఖమున్ మానాథ! నారాయణా!



(నారాయణ శతకం)

8. సీ. ఒరులపై శత్రుత్వముంచకుండినఁ జాలు
నుపవాసములు నిత్యముండినట్లు
పరుల మనసునొవ్వఁ బల్కకుండినఁ జాలుఁ
జతురత వేదముల్ చదివినట్లు
ఇతరుల సొమ్మాశ్రయించకుండినఁ జాలు
నోపికతో ధర్మమొసగినట్లు
వారు వీరని యెంచి పర్వకుండినచాలు
దివ్యతీర్థములకుఁ దిరిగినట్లు
తే.గీ. చాడిమాటల నొకరిపై సాహసమునఁ
బెట్టకుండినఁ జాల్ గుడుల్ కట్టినట్లె
పుడమి శ్రీవల్లివేడు సత్పురనివాస
వనిత నరసాంబఁ బ్రోవుమా! వరదరాజ!



(వరదరాజ శతకం)

* 9. ఆ.వె. మధురభాషితములు మాణిక్యములవోలె
శ్రుతినలంకరించి మతివసించు
మంజులములుగాని మాటలు నిలువవు
విశ్వహితచరిత్ర వినరమిత్ర!.



(మిత్రసాహస్రి)

**ప్రక్రియ – శతకం**

శతకమనగా నూరు పద్యాల రచన. సాధారణంగా శతకాలలో నూరు నుండి నూట ఎనిమిది పద్యాలు ఉంటాయి. శతకంలోని పద్యాలు ముక్తకాలు. అనగా ఏ పద్యానికదే స్వతంత్ర భావం కలిగి ఉంటుంది. శతకంలో ప్రతి పద్యానికి చివరలో ఒక పదం మొదలుకొని రెండు పాదాలవరకు మకుటంగా ఉంటుంది.

భావాలు :-

1. విద్యార్థీ! నీకు జన్మనిచ్చి, పెంచిన తల్లిదండ్రులే దేవతలు. వీరిని మిక్కిలి భక్తితో ఎల్లప్పుడు సేవించాలి. ఇలా చేయడం వలన నీకు సర్వసుఖాలు లభిస్తాయి.

2. ఓ భాస్కరా ! బూరుగుచెట్ల కాయలు తినుటకు పనికిరాక ఎండిపోయి గాలి వలన రాలి వృథాగా అడవిలో పడిపోతాయి. అట్లే దానము చేయని మనుష్యుని సంపద ఎవ్వరికీ ఉపయోగపడక నశించి పోతుంది.

3. కుమార ! చిన్నవారితో, పెద్దవారితో మర్యాదతో ప్రవర్తించిన యెడల మంచివాడని పిలువ బడుదువు. మంచి పద్ధతులలో ప్రవర్తించిన లోకమునందు ప్రఖ్యాతిని పొందగలవు. అందరూ నిన్ను కీర్తించెదరు.

4. కాలం గడిచిపోతే దానిని గతం అంటారు. గడిచిన కాలం తిరిగిరాదు. కాలం విలువైంది. వృథా చేయరాదు. కాలానుగుణంగా విలువైన విద్యను నేర్చుకోవాలి. అప్పుడే జీవితం పరిపూర్ణమౌతుంది.

5. దయకు సముద్రుడవైన రామా! బంగారంతో నేసిన విశాలమైన వస్త్రాలను ధరించావు. పదునైన గొడ్డలి అంచుతో సంసారమనే అడవిని నాశనంచేసి, సజ్జనులను రక్షించావు. దేవతలు స్తుతించే గుణాలను కలిగి, అగ్నివంటి శౌర్య పరాక్రమాలతో నిండి శరత్తులోని మేఘమాలికవలె అలరినావు. నీవు మంచి మల్లెలవలె,గంధంవలె పరిమళాన్ని కల్గి, పచ్చకర్పూరం వంటి కీర్తితో మెరుస్తున్నావు.

6. వడ్డించిన విస్తరి నిండుగా, నిశ్చలంగా ఉంటుంది. వడ్డించని విస్తరాకు గాలికి ఎగిరిపోతుంది. అలాగే వివేకి వినయంతో ఒప్పారుతాడు. అవివేకి మిడిమిడి జ్ఞానంతో పతనం అవుతాడు. పెద్దల మాటలను మణుల మూటలుగా భావించి, జీవించాలి.

7. లక్ష్మీపతివైన నారాయణా! ఎల్లప్పుడు సదాచారాన్ని పాటించడం, సత్యాన్ని పలకడం, భూతదయ కలిగి ఉండడం, చక్కని నడవడిక, వినయం, శాంతం, చిత్తశుద్ధినిచ్చే ఆత్మజ్ఞానం, ధ్యానం, ధైర్యం, ధర్మాచరణం, సర్వజీవులకు మేలు చేయడం మొదలైన సద్గుణాలను వదలకుండా ఉండే ప్రజ్ఞావంతునికి నీ సన్నిధి లభిస్తుంది.

8. వల్లివేడులో వెలసి నరులను రక్షించే నరసాంబ సమేతుడవైన వరదరాజా! ఇతరులపై పగలేని జీవితాన్ని గడిపితే, అది నిత్య ఉపవాస ఫలితమిస్తుంది. పరుల మనస్సుకు బాధ కలగకుండ మాట్లాడితే, వేదాలు చదివిన సుకృతం లభిస్తుంది. పరుల ధనానికి ఆశపడకుండా ఉంటే దానధర్మాలు చేసినట్లవుతుంది. పొరుగువారిని తూలనాడని పరిస్థితే ఉంటే, పవిత్రతీర్థాలను చూసిన ఫలం కలుగుతుంది. పరులపై నిందవేయకుండా బ్రతికితే గుళ్ళు నిర్మించిన పుణ్యం వస్తుంది. కావున మానవులు బ్రతికినంత కాలం ఈర్ష్య, అసూయలను విడిచి మనుగడ సాగించాలని భావం.

9. లోక క్షేమం కోరే మిత్రమా! మంచి మాటలు మధురమైనవి. అవి మాణిక్యాలవంటివి. చెవులకింపుగా ఉండే మాటలు మనస్సులో శాశ్వతంగా ఉంటాయి. కాని చెడుమాటలు నిలువక నశించిపోతాయి.

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

M8H2A9

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి, రాయండి.**

1. పాఠంలోని పద్యాలను రాగ, భావయుక్తంగా పాడండి.
2. పాఠంలో మీకు నచ్చిన పద్యాలు ఏవి? అవి ఎందుకు నచ్చాయో చెప్పండి.
3. కింది పద్యానికి ఇచ్చిన ప్రతిపదార్థాన్ని చదవండి. అర్థం చేసుకోండి.

చ. కనకవిశాలచేల! భవకానన శాతకుఠారధార! స
జ్జన పరిపాలశీల దివిజస్తుత! సద్గుణ కాండ! కాండసం
జనిత పరాక్రమ క్రమ విశారద! శారదకందకుంద చం
దన ఘనసార సారయశ! దాశరథీ! కరుణాపయోనిధీ!.

ప్రతిపదార్థం.

| | | |
|---|---|---|
| దాశరథీ! | = | దశరథుని కుమారుడవైన ఓ రామా!. |
| కరుణా | = | దయకు |
| పయోనిధీ | = | సముద్రము వంటి వాడా! |
| కనక | = | బంగారం |
| విశాలచేల | = | పెద్ద నేసిన వస్త్రం కట్టినవాడా! |
| భవకానన | = | సంసారమనే అడవిపాలిట |
| శాత | = | పదునైన |
| కుఠారధార | = | గొడ్డలి అంచువంటి వాడా! |
| సత్ + జన | = | మంచివారిని |
| పరిపాల | = | రక్షించుట అనే |
| శీల! | = | గుణము కలవాడా! |
| దివిజ | = | దేవతలచేత |
| స్తుత | = | స్తుతించబడిన వాడా! |
| సద్గుణ | = | చక్కని గుణముల యొక్క |
| కాండ | = | సముదాయం గల |
| కాండ సంజనిత | = | నీటియందు పుట్టిన అగ్నివలె |

| | | |
|---|---|---|
| పరాక్రమ | = | శౌర్య పరాక్రమముల యందు |
| క్రమ | = | సరియైన |
| విశారద! | = | నేర్పు గలవాడా! |
| శారద | = | శరత్కాల |
| కంద | = | మేఘం వలె |
| కుంద | = | మొల్లల వలె |
| చందన | = | మంచిగంధం వలె |
| ఘనసార | = | కర్పూరం వలె |
| సార యశ! | = | శ్రేష్ఠమైన కీర్తి గలవాడ!. |

♦ ప్రతిపదార్థం అవగాహనకోసమే

**ఆ) కింది గేయం చదవండి. గేయ భావం రాయండి.**

మనోస్థితులన్నింటికి మనసే మూలం
మనసే ముఖ్యం, అంతా మనసుమయం
కలుషితమైన మనసుతో
పలికిన మాటలు, చేసిన చేతలు ఫలితంగా
దుఃఖం, ఎద్దుగిట్టలను అనుసరించే
బండిచక్రంలా, వెంట తరుమును



**డి.చంద్రశేఖర్ – బుద్ధధర్మ సారం**

భావం : ..........................................................................................

..........................................................................................

..........................................................................................

**ఇ) కింది గద్యం చదివి, ప్రశ్నలు తయారు చేయండి.**

తెలుగు కవయిత్రులలో నందిపాటి శేషమాంబ ఒకరు. ఆమె కర్నూలు జిల్లాలోని కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామంలో జన్మించారు. రంగమ్మ, రామస్వామి ఆమె తల్లిదండ్రులు. ఆమెకు రంగయ్యతో బాల్య వివాహం జరిగింది. ఆమె తొమ్మిది సంవత్సరాల ప్రాయంలోనే భర్తను కోల్పోయి బాలవితంతువైనది. నందిపాటి రామనాటకము, ప్రహ్లాదచరిత్ర నాటకము, శ్రీ తులసీమాహాత్మ్య నాటకము, శ్రీ కాళీయ మర్దన నాటకము, ద్విపద, యక్షగాన, కోమలపదాలు వంటి రచనలు సృజించారు. ఆమె 1943వ సంవత్సరంలో నందిపాడులో స్వర్గస్థురాలయ్యారు. వీరి సాహితీ సేవలు ఆంధ్ర వాఙ్మయసూచికలో పేర్కొనబడినాయి.

**ప్రశ్నలు.**

1. ________________________________________

2. ____________________

3. ____________________

4. ____________________

**ఈ) పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. 'శతక ప్రక్రియా' లక్షణాలను గురించి రాయండి.
2. తల్లిదండ్రులకు సేవ చేయడం వల్ల కలిగే ఫలితాలు ఏవి ?
3. మానవుని సద్గుణాలేవి ?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. కాలం విలువైనదని ఎలా చెప్పగలవు?
2. దాతల లక్షణాలను రాయండి.
3. నరసమ్మ తెలిపిన లోకనీతిని వివరించండి?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. నైతిక విలువలు వ్యక్తికి ఎలా తోడ్పడతాయో సొంతమాటల్లో రాయండి.
2. పాఠంలో దానగుణం తెలిపే పద్యం ఉంది కదా! మీ ఊళ్ళో ఉన్న దాతల గురించి వివరించండి.
3. మీరు చదివిన శతకపద్యం ఆధారంగా మధురంగా మాట్లాడడం యొక్క ప్రాధాన్యతను సమర్థిస్తూ రాయండి?



## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పట్టిక ఆధారంగా వాక్యాలలోని పదాల అర్థాలను గుర్తించండి. వాటితో సొంతవాక్యం రాయండి.**

| | | |
|---|---|---|
| సమయం | తల్లిదండ్రులు | తల |
| బంగారం | చేతులు | ఇష్టం |
| మంచిమాట | అవివేకి | మేలు |

1. జననీజనకులకు కరములెత్తి నమస్కరించాలి.

జననీజనకులు : ______________________

కరములు : ______________________

2. కాలము కనకము కంటే విలువయినది.

కాలము : ______________________

కనకము : ______________________

3. గురువులు చెప్పే సూనృతము పిల్లల హితము కొరకని భావించాలి.

సూనృతము : ______________________

హితము : ______________________

**ఆ) కింద ఇచ్చిన పదాలకు సరైన నానార్థాలను గుర్తించి, రాయండి.**

| పదం | నానార్థాలు |
|---|---|
| 1. జనని | అ) చూచు, ప్రసవించు, తెలియు |
| 2. కను | ఆ) పుణ్యం, యాగం, న్యాయం |
| 3. మతి | ఇ) నింద, ఖండము, మాట |
| 4. పలుకు | ఈ) బుద్ధి, తలపు, ఇచ్ఛ |
| 5. ధర్మం | ఉ) తల్లి, కోరింద, దయ |

ఉదా:- జనని: తల్లి, కోరింద, దయ.

1. ________ = ________, ________ 2. ________ = ________, ________

3. ________ = ________, ________ 4. ________ = ________, ________

**ఇ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు పర్యాయ పదాలను రాయండి.**

1. గుణవంతుడు కష్టానికి <u>పలాయనం</u> చెందడు.

జ. ________________ = ________________, ________________

2. జనం మంచి <u>కార్యం</u> చేయాలి.

జ. ________________ = ________________, ________________

3. మనస్విని గానం <u>వీనులవిందు</u> చేస్తోంది.

జ. ________________ = ________________, ________________

4. విద్య వలన జీవితం <u>వెలుగు</u>తుంది.

జ. ______________________ = ______________________, ______________________

**ఈ) కింది వాక్యాలలోని ప్రకృతి వికృతులను గుర్తించి రాయండి.**

1.రాజు తన కార్యాన్ని సమర్థంగా చేసి, ఆ కర్జానికే వన్నె తెచ్చాడు.

2. పిల్లలు కథను చదివి, ఆ కతలోని సారాంశాన్ని గ్రహించారు.

3. శ్రీని సద్వినియోగపరచాలి. సిరిని దుర్వినియోగపరచరాదు.

4. అందరూ మాతృభాషను చదవాలి. మన బాస యాసలతో ఉంది.

5. భోజనం ఆకలిని తీరుస్తుంది. బోనమును ఎప్పుడు వృథా చేయరాదు.

| ప్రకృతి | వికృతి |
|---|---|
| కార్యం | కర్జం |
| .............. | .................. |
| .............. | .................. |
| .............. | .................. |
| .............. | .................. |



## భాషాక్రీడ

**అ) రెండవ పెట్టెలో ఇచ్చిన అర్థాలను పరిశీలించండి. ఆ అర్థానికి సరిపోయే పదాన్ని మొదటి పెట్టెలో గుర్తించి వాటికి క్రమసంఖ్యలు వెయ్యండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| శరం | గిరి | హాసం | వాసము | కనుగొను |
| 6 | 7 | 8 | 9 | 10 |
| రణము | తీర్థం | చిత్తము | సతతం | చాడిమాటలు |

| | | | | |
|---|---|---|---|---|
| యుద్ధము | బాణము | దూలము | పుణ్యక్షేత్రం | నిందలు |
| కొండ | మనస్సు | నవ్వు | ఎల్లప్పుడు | వెతకడం |



## వ్యాకరణాంశాలు

**సవర్ణదీర్ఘ సంధి:** అ,ఇ,ఉ,ఋ లకు సవర్ణాచ్చులు పరమైతే క్రమంగా వాటి దీర్ఘాలు ఏకాదేశమగును.

**గుణ సంధి:** అకారానికి ఇ, ఉ, ఋ లు పరమైతే వరుసగా ఏ,ఓ,అర్‌లు ఏకాదేశంగా వచ్చి గుణసంధి జరుగుతుంది అని కింది తరగతులలో తెలుసుకున్నారు కదా!

**అ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

1. విద్యార్థి ______________ ______________
2. సూర్యోదయం ______________ ______________
3. గజేంద్రుడు ______________ ______________
4. మహర్షి ______________ ______________

**ఆ) కింది పదాలను కలిపి, సంధి పేరు రాయండి.**

1. ఫలంబులు + ఊరక = ______________ = ______________
2. చరణ + అభివాదం = ______________ = ______________
3. కట్టిన + అట్లే = ______________ = ______________

**ఇ) షష్ఠీతత్పురుష సమాసం : కు, యొక్క అనే విభక్తి ప్రత్యయములను ఉపయోగించి కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాయండి.**

1. విశ్వహితం ____________________________
2. సత్పురుషనివాసం ____________________________
3. పరోపకారం ____________________________
4. గురుచరణములు ____________________________

**ఈ) కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి సమాస నామం రాయండి.**

1. జననీజనకులు = ______________ = ______________
2. ఘనసారం = ______________ = ______________
3. చిత్తశుద్ధి = ______________ = ______________

## ఛందస్సు

పద్య లక్షణాలను తెలియచేసే శాస్త్రమే ఛందస్సు. గణాలకు గురులఘువులు ఆధారం. ఒక మాత్రా కాలంలో ఉచ్చరించే అక్షరాలను లఘువులని, రెండు మాత్రల కాలంలో పలుకబడే అక్షరాలను గురువులని అంటారు. మాత్ర అనగా ఒక చిటికె వేసినంత కాలం.

లఘువు గుర్తు - I, గురువు గుర్తు - U

లఘువు గురువులను గుర్తించే విధానాన్ని పరిశీలిద్దాం.

### 1. లఘువులను గుర్తించే విధానం - లఘువుకు గుర్తు - I

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1. హ్రస్వాచ్చులు | I<br>అ | I<br>ఇ | I<br>ఉ | I<br>ఋ | I<br>ఎ | I<br>ఒ |
| 2. హ్రస్వాచ్చులతో కూడిన హల్లులు | I<br>క | I<br>చి | I<br>గు | I<br>బృ | I<br>వె | I<br>రొ |
| 3. దీర్ఘాలు కాని ద్విత్వాక్షరాలు | I<br>క్క | I<br>గ్గి | I<br>చ్చు | I<br>ట్ట | I<br>త్తె | I<br>బ్బొ |
| 4. దీర్ఘాలు కాని సంయుక్తాక్షరాలు | I<br>క్ర | I<br>స్యి | I<br>ర్తు | I<br>శ్మ | I<br>ద్వె | I<br>త్యొ |
| 5. తేల్చి పలుకబడే రేఫతో కూడిన అక్షరాల ముందు అక్షరాలు | I<br>అద్రుచు | | I | | I<br>విద్రుచు | |

### 2. గురువులను గుర్తించు విధానం - గురువుకు గుర్తు - U

| | |
|---|---|
| దీర్ఘాలు | U ఆ, U ఈ, U ఊ, U ౠ, U ఏ, U ఐ, U ఓ, U ఔ |
| దీర్ఘాచ్చులు కలిగిన హల్లులు | U కాదు, U గీతం, U రూకలు, పి U తౄణం, U జేబు, U ఖైదు, U డోలు, U కౌలు |
| ద్విత్వాక్షరానికి ముందున్న అక్షరాలు | U అమ్మ, U చిల్లర, U మబ్బు, U కత్తెర |
| సంయుక్తాక్షరానికి ముందున్న అక్షరాలు | U పద్యము, U భక్తి, U కల్పన |
| సంశ్లేషాక్షరానికి ముందున్న అక్షరాలు | U ఉష్ట్రం, U వస్త్రము, U మర్త్యము |
| పూర్ణ బిందువు కలిగిన అక్షరాలు | U ఛందస్సు, U లక్షణం, U చెప్పడం |
| పొల్లు హల్లుతో కూడిన అక్షరాలు | రా U జేష్, కొరకు U న్, ఋత్వి U క్ |
| విసర్గ కలిగిన అక్షరాలు | U దు:ఖం, అం U త:పురం, న U మ: |

### 3. కింది అక్షరాలకు లఘువు, గురువులను గుర్తించండి.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1. అ | 2. ఇ | 3. చీ | 4. తృ | 5. క: | 6. ట్ట | 7. నిన్ |
| 8. యే | 9. శు | 10. బ | 11. కై | 12. ష్ఠ | 13. తం | 14. త్న్ను |

**గణం–ఏర్పడే విధానం**

'అక్షరాలు గురువులు–లఘువులుగా గుర్తించబడతాయి' అని తెలుసుకున్నాం. ఇలా ఏర్పడిన 'గురువులు లఘువులు' కలిస్తే గణాలు అని పిలువ బడతాయి. గురులఘువుల సమూహమే గణం. ఒక్క గురువూ గణం కావచ్చు. ఒక్క లఘువూ గణం కావచ్చు, అనేక గురులఘువులు కలిగినది గణం కావచ్చు.

స్వరూపాన్ని బట్టి ఏర్పడే గణాలు నాలుగు రకాలుగా ఉన్నాయి. అవి :

1) ఒక అక్షర గణాలు 2) రెండు అక్షరాల గణాలు 3) మూడు అక్షరాల గణాలు 4) నాలుగు అక్షరాల గణాలు

**1. ఒక అక్షర గణాలు:–**

నిర్వచనం:– "ఒకే అక్షరం గణంగా ఏర్పడటాన్ని ఏకాక్షరగణం అంటారు".ఇవి రెండు.

| గణ విభాగం | లక్షణం | చిహ్నం | గణం పేరు | ఉదాహరణలు | |
|---|---|---|---|---|---|
| ఏకాక్షర గణాలు | 1. ఏక లఘువు | I | "ల"గణం | I<br>అ | I<br>క |
| | 2. ఏక గురువు | U | "గ"గణం | U<br>కం | U<br>మః |

**2. రెండక్షర గణాలు:–** రెండేసి అక్షరాలతో ఏర్పడే గణాలను రెండక్షర గణాలు అంటారు. ఇవి నాలుగు.

| **గణ విభాగం** | **లక్షణం** | **చిహ్నం** | **గణం పేరు** | **రెండవ పేరు** | **ఉదాహరణలు** | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1. లఘువు+గురువు | I U | "లగ"ము | "వ"గణం | IU<br>నదీ | IU<br>సదా | IU<br>బలం | IU<br>ఫలం |
| | 2. గురువు+లఘువు | U I | "గల"ము | "హ"గణం | U I<br>మంచి | U I<br>బుద్ధి | U I<br>నవ్వు | U I<br>గోడ |
| | 3. లఘువు+లఘువు | I I | "లల"ము | "లా" | I I<br>సుధ | I I<br>రుచి | I I<br>వల | I I<br>విడు |
| | 4. గురువు+గురువు | U U | "గగ"ము | "గా" | U U<br>రోజూ | U U<br>చేసే | U U<br>మంచే | U U<br>పుణ్యం |

3. మూడక్షర గణాలు:– మూడేసి అక్షరాలతో ఏర్పడే గణాలను మూడక్షర గణాలు అంటారు. ఇవి ఎనిమిది.

| గణ విభాగం | లక్షణం | చిహ్నం | గణం పేరు | ఉదాహరణలు | | | |
|---|---|---|---|---|---|---|---|
| మూడక్షరాల గణాలు ఎనిమిది | ఆది గురువు | U I I | "భ"గణం | U I I బంధము | U I I బాధ్యత | U I I వర్ధిని | U I I సిద్ధము |
| | మధ్య గురువు | I U I | "జ"గణం | I U I సమీప | I U I సమాన | I U I సుధామ | I U I సుమారు |
| | అంత్య గురువు | I I U | "స"గణం | I I U అమరం | I I U సుమతీ | I I U కనకం | I I U కవచం |
| | ఆది లఘువు | I U U | "య"గణం | I U U అరణ్యం | I U U సమీరం | I U U సముద్రం | I U U జనాభా |
| | మధ్య లఘువు | U I U | "ర"గణం | U I U సామజం | U I U మండపం | U I U కుందనం | U I U సారసం |
| | అంత్య లఘువు | U U I | "త"గణం | U U I కళ్యాణి | U U I మందార | U U I హిందోళ | U U I చామంతి |
| | మూడు లఘువులు | I I I | "న"గణం | I I I అణిమ | I I I మహిమ | I I I గరిమ | I I I లఘిమ |
| | మూడు గురువులు | U U U | "మ"గణం | U U U సంబంధం | U U U బంధుత్వం | U U U సౌకర్యం | U U U సౌందర్యం |

♦ 1. **భ, జ, స,** లు గురువు యొక్క స్థానం ఆధారంగా కూర్చబడ్డాయి. 2. **"మ"** గణం అన్నీ గురువులు.

♦ 3. **య, ర, త,** లు లఘువు యొక్క స్థానం ఆధారంగా కూర్చబడ్డాయి. 4. **"న"** గణం అన్నీ లఘువులు.

అ) కింది పదాలకు లఘువు గురువులను గుర్తించండి.

1. జనకుడు 2. జననీ 3. దేవత 4. కాలము 5. కరము

6. విస్తర 7. అక్కర 8. బంగారం 9. శూరులు 10. భాస్కరా

ఆ) కింది పద్య పాదాలకు గురు, లఘువులను గుర్తించండి.

1. దానము జేయనేరని యధార్మికు సంపదలుండి యుండినన్.

2. సురుచిర భూషణంబు లివి శూరులకున్ సిరి లేనియప్పుడున్

## ప్రాజెక్టు పని

ఏవైన రెండు శతకాలలోని ఐదు పద్యాలను సేకరించి వాటికి భావాలను రాసి ప్రదర్శించండి.

## పాఠాంత పద్యం

కారణము లేని కలహంబుఁ, గరుణలేమి
పరవధూ పరధన వాంఛ, బంధుసాధు
జనములం దసహిష్ణుత్వ, మనఁగ జగతిఁ
బ్రకృతిసిద్ధంబు లివి దుష్ట, నికరమునకు

**భావం** : కారణము లేకయే తగవులాడుట, దయలేకుండుట, పరస్త్రీల యందును, పరధనముల యందును కోరిక, బంధువుల యందును, సజ్జనుల యందును ఓర్వలేకుండుట అనునవి దుష్టుని సహజ గుణములు.

**– ఏనుగు లక్ష్మణకవి**

**సూక్తి : అపజయాలు వాస్తవాలను వెల్లడి చేస్తాయి. విజయాలు వాటిని దాచి ఉంచుతాయి – హెర్యారెన్**

## ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..........................................................................
2. నేను గ్రహించిన విలువ ..........................................................................
3. సృజనాత్మక రచన ..........................................................................
4. భాషాంశాలు ..........................................................................

**అక్టోబర్ 22వ తేదీని ప్రపంచ విలువల దినోత్సవంగా జరుపుకొంటాం.**

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1) ఆధునిక శతకాలను చదివించండి.

2) తెలుగు పద్యాల తియ్యదనమును విద్యార్థులకు వివరించండి.

3) విద్యార్థులకు శతకపద్యలక్షణాలను వివరించి, పద్యాలను రాసేలా ప్రోత్సహించండి.

## మేటి పద్యాలు

*జిలిబిలి పలుకుల బలు ము*
*ద్దులు గులికెడు తెలుగు బాసతో సరియగునే*
*తెలిసియు దెలియక వీనుల*
*నల యించెడు వెట్టిమొట్టియఱమెఱబాసల్ !*

– వేటూరి ప్రభాకరశాస్త్రి

కవులకంటె తుహిన కర్పూర నిభకీర్తి
తెచ్చిరెవరు నీకు తెలుగు తల్లి ?
సాహితీ తరంగ సంగీత రసధుని
దేశ భాషలందు తెలుగు లెస్స !   – నందూరి రామకృష్ణమాచార్యులు

*****

జలసేవన గళ గళ ల
వ్యాళముల పెళపెళ్ళ భోక్త ! భళభళ లెబలా
వశిపట బెళబెళ లందెల
ఝుళఝుళ లేకీభవించె ! జనము భుజింపన్   – చిలకమర్తి

## పాఠాంత అంశము

## పేరడీ

అరయన్ శంతను పుత్రుపై విదురుపై అక్రూరుపై, కుబ్జపై
నరుపై, ద్రౌపదిపై కుచేలునిపయిన్ నందవ్రజశ్రేణిపై
పరగన్ కల్గు భవత్ కృపారసము నాపై కొంతరానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాను, జగదీశా ! కృష్ణ ! భక్త ప్రియా !



వడపై ఆవడపై పకోడిపయి హల్వా కోవపై కారపున్
పొడిపై, చట్నిలపై రవిడ్డిలిపయిన్ బోండాపయిన్ జాంగిరీ
సుడిపై పారు భవత్కృపారసము ఇచ్చోకొంతరానిమ్ము నే,
నుడుకున్ కాఫిని, ఒక్కగుక్కకొనవే ! ఓ కుంభలంబోదరా.


పేరడీ అనగా అనుకరణ. ఒక పద్యాన్ని గాని, పాటను గాని వ్యంగ్యంగా అనుకరించి సృజనాత్మకంగా చేసిన రచన పేరడీ. తెలుగు పద్యాలకు పేరడీ రచనలు కోకొల్లలు. ప్రసిద్ధమైన కవితకు అదేరూపముతో చమత్కార జనకంగా చెప్పే మరొక కవితే పేరడీ.

4

# నా యాత్ర

Q7M9G8

## చదవండి - ఆలోచించి చెప్పండి



మేము వారణాసిని సందర్శించుకున్న తరువాత బుద్ధగయకు చేరుకున్నాం. బుద్ధగయలో యువరాజు సిద్ధార్థుడు తన ఇరవైతొమ్మిదవ ఏట జ్ఞానోదయం పొంది గౌతమబుద్ధుడుగా అవతరించాడు. ప్రపంచానికి అహింస, శాంతి, ప్రేమ అనే సందేశాలను అందించాడు. క్రమేపీ ఈ సందేశం సమస్త ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. బోధిగయలో చాలా ఆలయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని విదేశీయులు నిర్మించినవి. మా యాత్రలో కొన్ని ఆలయాలను దర్శించాం.

– దేవులపల్లి కృష్ణమూర్తి (మా యాత్ర)

ప్రశ్నలు :

1. బుద్ధుడు ప్రపంచానికి ఏం బోధించాడు ?
2. సిద్ధార్థుడు గౌతమబుద్ధునిగా ఎలా మారాడు ?
3. మీరు ఎక్కడికైనా యాత్రకు వెళ్ళారా?

### ఉద్దేశం

దేశంలో ప్రాచీన కట్టడాలను, వివిధ నిర్మాణాలను, పలు సంస్కృతులు సంప్రదాయాలను, జీవన విధానాలను, భౌగోళిక వ్యత్యాసాలను గురించి తెలియపరుస్తూ చారిత్రక కట్టడాలను రక్షించుకోవలసిన ఆవశ్యకతను తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

### రచయిత పరిచయం




1907 – 1989

### బులుసు వేంకట రమణయ్య

బులుసు వేంకట రమణయ్యగారు విజయనగరం జిల్లాలోని రామతీర్థంలో జన్మించారు. **రావ్** అన్న కలం పేరుతో అప్పటి ముచ్చటలు, గజపతి రాజుల సాహిత్య పోషణ, గజపతుల నాటి గాథలు, దీపకళికలు, పదహారు రాత్రులు (కథా సంకలనం) రచించారు. **చిన్నయసూరి బాలవ్యాకరణానికి** టీక రాశారు. 1958సం॥లో 'నాఉత్తరదేశ యాత్ర' అనే పేరుతో యాత్రా రచన చేశారు. వీరు రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. **ప్రస్తుత పాఠం 'నా ఉత్తర భారతదేశ యాత్ర'** నుండి స్వీకరించబడింది.

# నా యాత్ర




సెప్టెంబరు 17వ తేది సోమవారం పగలు పదకొండు గంటలకల్లా మేము మద్రాసుసెంట్రల్ రైల్వేస్టేషను చేరుకున్నాం. నేను గ్రాండ్ ట్రంకు ఎక్స్‌ప్రెస్‌కు కట్టబడిన మా పెట్టెను వెతుక్కుంటూ వెళ్లాను. అది ఇంజనుకు పక్కనే ఉన్నది. అప్పటికే మా మిత్రులు చాలామంది వచ్చి రైలులో ప్రవేశించారు. నేను వాళ్ళతో జతకట్టాను. పన్నెండు గంటలకు మా రైలు బయలు దేరింది. ఇది ముఖ్యస్థలాల్లో తప్ప తక్కినచోట్ల ఆగదు. మద్రాసు తర్వాత గూడూరులోనే ఆగింది. మద్రాసు గూడూరు మధ్య సరుగుడు తోటలూ, ఎన్నూరు దగ్గరి ఉప్పుమళ్లు, చిన్నచిన్న నదులూ తప్ప విశేషమైన దృశ్యాలు మాకు కనిపించలేదు.

గూడూరు తర్వాత మా రైలు నెల్లూరు స్టేషన్లో ఆగింది. అది పెద్దపట్టణం. ఆ పరిసరాలు పాడిపంటలకు నిలయాలు. ఈ పట్టణం పెన్నానదికి దక్షిణంగా ఉంది. నదిపక్కనే శ్రీ రంగనాథ దేవాలయం కనిపించింది. రైలు ఇంకెక్కడా ఆగకుండ రాత్రి ఎనిమిది గంటలకు కృష్ణానది దాటి, బెజవాడకు చేరుకుంది. ప్లాట్‌ఫారం పొడవును బట్టి యింత పెద్దస్టేషన్ దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేదనిపించింది.

విజయవాడలో మారైలు గంటసేపు ఆగింది. రైలుకదిలే లోపు మేము భోజనాలు చేసి పడకలు వేసుకున్నాం. బెంచీలు విశాలంగా మెత్తలతో ఉన్నాయి. ఒక్కొక్క హాలులో పైన రెండు, క్రింద రెండు నాలుగేసి బల్లలుండడంవల్ల, అందరూ సర్దుకోవడం వల్ల శ్రమలేకపోయింది. నిద్రలోకి జారుకున్నాము రాత్రి రైలుబండి డోర్నకల్లు, వరంగల్ స్టేషన్లను దాటుతూ, చిట్టడవులను వెనక్కినెట్టేస్తూ గోదావరి నది సవ్వడులు వినేస్తూ ఉదయం 9 గంటలకు 'వార్ధా'జంక్షన్‌కు చేరింది.

'వార్ధా' ప్రసిద్ధమైన స్థలం. దీనికి సమీపంలోనే గాంధీమహాత్ముడు ఏర్పచిన ఆదర్శ నగరం "సేవాగ్రామ్" ఉంది. నూతనపద్ధతిలో విద్యాభ్యాసం చేయించే "వార్ధా విద్యాపథకం" ఇక్కడే మొదలైంది. మూలాధారవిద్య నేర్పే ఉపాధ్యాయులిక్కడనే తర్ఫీదుపొందుతారట. ఇవన్నీ చూసాం. తర్వాత భారతదేశ స్వాతంత్ర్యపోరాటంలో ముందడుగు వేసి, వీరులకు మార్గం చూపిన ధీరనారీమణి లక్ష్మీబాయి ఏలిన ఝాన్సీ పట్టణాన్ని దాటుతూ, మధ్యధరా పర్వతశ్రేణులను తాకుతూ నర్మదాతపతీ నదులను దాటుతూ, తెల్లవారుజామున 4.30 గంటలకు మేము ఆగ్రా చేరుకున్నాం.

మేము కాలకృత్యాలు తీర్చుకొని, కాఫీఫలహారాలు తీసుకొని, చారిత్రక ప్రదేశమైన ఆగ్రా పట్టణాన్ని, ఫతేపూర్ సిక్రీని చూసి, అదే రోజు సాయంత్రం 5.00 గంటలకు ప్రపంచ ఏడుఅద్భుతాల్లో ఒకటైన తాజ్‌మహల్ ను చూడడానికి అత్యుత్సాహంతో మా బృందమంతా అక్కడికి చేరుకున్నాం. ఇది యమునానదీతీరంలో ఉంది. దీనిని షాజహాను

చక్రవర్తి తన భార్య ముంతాజ్ బేగం స్మృతిచిహ్నంగా నిర్మించాడు. ఈ సుందరమందిరం పూర్తిగా పాలరాతితోనే కట్టబడింది. ఇది ఎత్తైన, చాలా విశాలంగా ఉన్న తిన్నెపై ఉంది. తిన్నె కూడా పాలరాతి నిర్మాణమే. ఆ తిన్నెకు నాలుగుమూలల మహోన్నతములైన పాలరాతి స్తంభాలున్నాయి. వీటి మధ్య తాజ్‌మహలుంది. మేము నాలుగు వైపులా చెదిరి, ఎవరికి తోచిన చోట వారు కూర్చున్నాము. మహలుకు తూర్పున నేను మరోయిద్దరు మిత్రులతో కూర్చున్నాను. అప్పటికి పున్నమి వెన్నెల మహలు పైకి బాగా వ్యాపించింది. ఒక్కొక్క కోణం నుంచి మీది వైపు చూస్తే రంగురంగుల రత్నాలు పొదిగిన కాంతులు కన్నుల మిరుమిట్లుకొల్పుతూ ఉంది.

ఆగ్రా నుంచి ప్రయాణం కొనసాగించి, ముప్పైమూడుమైళ్ల దూరంలో ఉన్న మధురానగరికి చేరుకున్నాం. మధురా నగరం భాగవత పురాణాన్ని బట్టి ఉగ్రసేనుని రాజధాని అనీ, కొన్నివేల ఏండ్ల కిందట ఇది కట్టబడిందనీ తెలుస్తుంది. పురాణాల సంగతి అలా ఉంచినా, ఈ మధుర మిక్కిలి ప్రాచీనమైన పట్టణమని చెప్పవచ్చు. ఆగ్రాలో ఉన్నట్లు మధురలో బస్సుల సౌకర్యం అంతగా లేదు. మేం బస్సు ఎక్కి తిన్నగా యమునా నది చేరుకున్నాం. నది నిండుగా పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తుంది. ఆ దృశ్యం ఒకవైపు భయాన్ని, మరోవైపు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మేం స్నానం చెయ్యడానికి నదిలోకి దిగగానే కాళ్ళకు పెద్దపెద్ద తాబేళ్ళు తగిలాయి. అవి ఏం చేస్తాయోనని భయపడ్డాం. కానీ అవి మాకు ఇబ్బంది కలిగించలేదు. స్నానం ముగించుకుని, మేము శ్రీకృష్ణుడు విహరించిన బృందావనానికి వెళ్లాం. అక్కడ అందమైన ప్రదేశాలను, దేవాలయాలను చూశాం. తదుపరి బిర్లా మహాశయుడు కట్టించిన గీతా మందిరాన్ని చూశాం. ఇది చూడడానికి ముగ్ధమనోహరంగా ఉంది. అక్కడి నుండి మా ప్రయాణం కొనసాగించి అనేక ప్రాంతాలను దాటుకుంటూ మనదేశ రాజధాని మరియు చారిత్రక నగరమైన ఢిల్లీ చేరుకున్నాం.



ఢిల్లీ నగరంలో ముందుగా కుతుబ్ మినార్‌ను చూశాం. ఇది అతి ప్రాచీనమైనది. దీనిని 13వ శతాబ్దంలోని రెండవ భాగంలో కుతుబుద్దీన్ నిర్మించినట్లు తెలుస్తోంది. ఇందు ఐదు అంతస్తులు కలవు. స్తంభం అడుగు నుంచి పైకి వెళ్లడానికి 379 మెట్లు వున్నాయి. ఆ స్తంభం ఎక్కేవారి కోసం గాలివెలుతురు వచ్చే విధంగా గూళ్లవంటి కిటికీల ఏర్పాటు కలదు. ఆ స్తంభాన్ని చూస్తేనే చాలా మందికి ఆశ్చర్యంతో పాటు భయం కలుగుతుంది. మేము ఈ స్తంభం చివరి వరకు చేరుకుని సూర్యకాంతి వెలుగులలో మెరిసే ఢిల్లీ నగరాన్ని, దానికి రక్షణకోట వలె భ్రమింపచేసే పచ్చని చెట్లతో కూడిన హరితహారాన్ని చూస్తుంటే కన్నులపండుగగా ఉంది. ఆ తర్వాత మేము ఎర్రకోట వద్దకు వచ్చాం. అది చరిత్రప్రసిద్ధమైన దుర్గం. ఎర్రరాళ్లతో కట్టడంవల్ల దానికాపేరు వచ్చింది. అది పటిష్ఠంగా కట్టబడింది కనుక నేటికీ చెక్కుచెదరక, స్వాతంత్ర్య వేడుకలకు వేదికగా నిల్చింది. ఢిల్లీ నగరానికి మకుటాయమానంగా విరాజిల్లుతోంది. ఆ తర్వాత పార్లమెంటు, రాష్ట్రపతి భవనాలు చూసి, రాజ్‌ఘాట్ లోని మహాత్మా గాంధీ సమాధికి చేరుకున్నాం. అది యమునా నది తీరానికి సమీపంలో ఉంది. అది పవిత్రయాత్రాస్థలంగా పేరుగాంచింది. భారతదేశానికి వచ్చిన విదేశీయులు తప్పక ఇక్కడికి వచ్చి, సమాధిపై పూలమాలలు వేసి, నమస్కరించి వెళుతుంటారు. మేము అక్కడికి వెళ్ళి పుష్పాంజలి ఘటించాం.

మహాత్మాగాంధీ సమాధితోపాటు అశోకస్తంభాన్ని చూశాం. ఈ అశోకస్తంభం ఒక భవనం మీద ప్రతిష్ఠితమై ఉంది. దాని మీద బౌద్ధధర్మాలు చెక్కి వున్నాయి. అక్కడినుండి మరిన్ని ప్రాంతాలు చూసుకుంటూ హిమాలయ

పర్వతశ్రేణుల్లో ఉన్న హరిద్వార్ చేరుకున్నాం. ఇక్కడ మంచుతో కప్పబడిన హిమాలయ పర్వతాలు మూడువరుసలుగా ఉన్నాయి. ముందు వరుసలో ఉన్న వాటిని శివాలిక్ పర్వతాలంటారు. రెండవ వరుసలో ప్రపంచంలోనే మిక్కిలి ఎత్తైన ఎవరెస్టు శిఖరం ఉంది. హరిద్వార్ శివాలిక్ పర్వాతాలకు పక్కనే ఉంది. ఈ పర్వత శ్రేణుల కారణంగా ఇక్కడ వర్షాలు తరచుగా పడుతూ వుంటాయి. మేము స్టేషన్ చేరుతున్నప్పుడు మాకు స్వాగతం పలికినట్లుగా వర్షం కురిసింది. అందువల్ల మేము స్టేషన్లోనే కొంతసేపు ఆగవలసివచ్చింది. అక్కడి నుండి నేరుగా గంగాస్నానఘట్టం చేరుకున్నాం. అది చాలా విచిత్రంగా ఉంది. ఆ నదిలో విశాలమైన తిన్నెలు ఉన్నాయి. అవి చేరుకోవడానికి చిన్నవంతెన ఉంది. అక్కడ నదికి వడి ఎక్కువ. నీటిలో చెయ్యి పెడితే, మంచు ముట్టుకున్నట్లే ఉంటుంది. లోతునకు దిగడానికి వీలులేదు. మూడు,నాలుగు మెట్లవరకూ దిగి స్నానం చెయ్యవచ్చు. మొదటిసారి మునగడమే కొంత కష్టం, తర్వాత చలి ఉండదు. గంగలో స్నానం ఒక విధమైన సంతృప్తినిస్తుంది. అక్కడ గంగానది కొన్ని భవనాలను ఒరసుకుంటూ పారుతుంది. ఆ భవనాలు మాత్రం చెక్కుచెదరకుండా వుండడం ఆశ్చర్యకరం. అక్కడ స్నానం చేసి, గంగాపూజ గావించి, భోజనం చేసి, విశ్రాంతి తీసుకున్నాం. తర్వాత ఎదురుగా కొండమీద వెలసిన దాక్షిణాత్యుడు, మానసాదేవి దేవాలయాలను దర్శించుకోవడానికి పయనమయ్యాం. ఆరుమైళ్ళ దూరం రైలు రోడ్డు ప్రక్కనే నడిచి పోగా ఒక సొరంగం వచ్చింది. దాని పక్కనుంచే కొండమీదికి చిన్నదారి ఉంది. మెట్లులేవు, గులకరాళ్ళు ఎక్కువ. అడుగులు వేస్తే జారుతున్నాయి. నిటారుగా ఎక్కవలసి ఉన్నది. కొండలెక్కే అలవాటు మాకు అంతగా లేనందు వల్ల చాలా శ్రమపడుతూ కొండమీదికి చేరుకున్నాం. అక్కడి ఆలయాలను దర్శించుకున్నాం. ఆ కొండచివరి నుంచి చూస్తూ ఉంటే గంగానది అనేక శాఖలుగా విడివడి ప్రవహించే దృశ్యం వర్ణనాతీతం.

అక్కడ నుండి మా యాత్ర త్రివేణీ పునీతమైన ప్రయాగను దాటి వారణాసిని చేరుకోబోతుండగా, మధ్యలో ఒక స్టేషన్లో ఆగిన మా బండిలోకి సంగీత కళాభిజ్ఞులు కొందరు జనాన్ని తోసుకుంటూ లోపలికి ప్రవేశించారు. తమగొంతు విప్పి గాన మాధుర్యాన్ని వినిపించసాగారు. వారిలో ఒక మహిళామణి కూడా ఉంది. ఆమెది కోకిలకంఠం. ఆమె పాట వినడానికి మేము కూర్చున్న పెట్టె దగ్గర జనం మూగారు. అందువల్ల కిటికిలోనుంచి వచ్చే కాస్త గాలిరాకుండా ఆటంకం కలిగించినా మా మనసు ఆనంద డోలికలలో తేలియాడింది. సరిగ్గా మేము సాయంత్రం ఐదు గంటలకు సారనాథ్ చేరుకున్నాం. సారనాథ్ బౌద్ధ క్షేత్రాల్లో ముఖ్యమైంది. క్రీస్తుపూర్వం ఆరవశతాబ్దంలో బుద్ధదేవుడు తన అయిదుగురు శిష్యులకు ధర్మోపదేశం చేసిన చోటు, అశోకుని కాలం నుంచి యిది గొప్ప బౌద్ధక్షేత్రంగా పేరుపడింది. ఈ చోటు సద్ధర్మచక్ర పరివర్తన విహారంగా ఆ కాలంలో వ్యవహరింప బడిందట. శాంతి, ధర్మాలకు గుర్తుగా అశోకుడు నిలిపిన స్తంభం అడుగు భాగం మాత్రం కనబడుతున్నది. దాని మీది భాగం సింహాలతోనూ, ధర్మచక్రంతోనూ గుర్తింపబడి ఉన్నది.అదే నేటి భారతదేశ చిహ్నం. ఆ మీది భాగం అక్కడి మ్యూజియంలో ఉంది. మ్యూజియంలో చాలా బుద్ధుని విగ్రహాలు, రాతిఛత్రాలూ మొదలైనవి ఉన్నాయి.

తరువాత మా యాత్రా ప్రయాణంలో కడు ప్రాచీనమైన గయ చేరుకున్నాం. బుద్ధగయ బౌద్ధులకు పవిత్ర క్షేత్రం. ఇక్కడ పెద్దబుద్ధదేవాలయం ఉంది. దీనికి వెనుక భాగంలో ఒక రావిచెట్టు ఉంది. బుద్ధుడు జ్ఞానోదయం పొందిన స్థలం అది. గౌతమబుద్ధుని కాలంలో ఉండిన బోధివృక్షం కూలిపోగా, సింహళద్వీపం నుంచి ఒక వృక్షశాఖను తెచ్చి పెంచారట. అదే మహావృక్షమై నేటికీ ఉన్నది. అక్కడ నుంచి మా ప్రయాణం కలకత్తా మీదుగా సాగుతూ విశాఖపట్నం చేరుకున్నాం. అక్కడ హార్బర్, షిప్‌యార్డ్, సుందర దృశ్యాలు చూసి, జనతా ఎక్స్‌ప్రెస్‌లో బెజవాడ మీదుగా ప్రయాణం చేసి, 1956 అక్టోబర్ 7వ తేదీన మద్రాస్ చేరుకోవడంతో మా ఉత్తరదేశ యాత్ర ముగిసింది.

**ప్రక్రియ – యాత్రా రచన**

యాత్రకు సంబంధించిన రచనను యాత్రారచన అంటారు. ప్రముఖ వ్యక్తులు స్వదేశంలో కానీ, విదేశంలో కాని విశిష్టత కలిగిన ప్రదేశాలను దర్శించినప్పుడు ఆ విశేషాలను, పొందిన అనుభూతిని, అనుభవాలను వివరిస్తూ వర్ణనాత్మకంగా చేసే రచన యాత్రా రచన. ఇవి విజ్ఞానయాత్రలు, విహారయాత్రలు, ఆధ్యాత్మికయాత్రలు అని పలురకాలు.

## ఇవి చేయండి

V8D9X1

### అవగాహన – ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి, రాయండి.**

1. ఈ పాఠంలో రచయిత ఏ యే ప్రదేశాల గురించి చెప్పారు?
2. మీ ప్రాంతంలో ఉన్న ఏదైనా దర్శనీయ స్థలం గురించి మాట్లాడండి.
3. పరవళ్ళు తొక్కడం అంటే ఏమిటి? ఈ పాఠంలో రచయిత దేనిని ఏ సందర్భంలో ఉపయోగించారో రాయండి.
4. పాఠం చదవండి. కింది పట్టణాల ప్రత్యేకతలను గురించి రాయండి.

అ) నెల్లూరు ఆ) ఆగ్రా ఇ) మధురానగరం ఈ) సారనాథ్ ఉ) ఢిల్లీ

**ఆ) కింది పేరాను చదివి నాలుగు ప్రశ్నలు తయారు చేయండి.**



నేను కాశీ యాత్ర బోవలెనని 1830 సంవత్సరం మే నెల 18వ తేది కుజవారము రాత్రి 9 గంటలకు చెన్నపట్టణము విడిచి పెడితిని. మార్గమందు తిరుపతి, అహోబిలము, పుష్పగిరి పుణ్యక్షేత్రములను సందర్శించి జూన్ 13వతేది ఆత్మకూరుకు చేరినాను. ఆత్మకూరు దూరము నుంచి చూచుటకు గొప్ప యూరు. అది పేట స్థలము అక్కడ ప్రతి ఆదివారమున్నూ సంత కలదు. సంతలో సకల పదార్థములు దొరుకునని ప్రసిద్ధి కలిగి యున్నది. అక్కడకి శ్రీశైలము నాలుగామడలని చెప్పుచున్నారు. ఆ నాలుగామడల దూరములోని నడుమ రాధాపురము, కృష్ణాపురము, వెంకటాపురము, సిద్ధాపురము,ఇంకా అనేక చిన్నచిన్న గ్రామములున్నవి. ఇవి బహుచిన్నవి. ఇచ్చట చెంచువాండ్లు, ఇతరులున్నూకలసి జీవిస్తున్నారు. వీటన్నింటిని చూసుకుంటూ శ్రీశైలము చేరుకుంటిమి.

ఏనుగుల వీరాస్వామి – కాశీయాత్రా చరిత్ర

ప్రశ్నలు :

1. ______________________________

2. ______________________________

3. ______________________________

4. ______________________________

**ఇ) కింది పేరా చదివి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించి రాయండి.**



స్వస్తిశ్రీ క్రోధన సంవత్సర శ్రావణ మాసంలో మాకు శ్రీముక్త్యాల సంస్థానాన్నుంచి తంతిద్వారా ఆహ్వానం వచ్చింది. మా పాఠశాల ఉపాధ్యాయుడు పోలంకి గంగాధర శాస్త్రిని తోడుగా తీసుకుని నేను ప్రయాణం చేశాను. బోనగళ్ళు స్టేషన్‌నుండి రైల్లో ప్రయాణం చేశాక త్రోవలో ఏదోఒక ఏరు తటస్థించింది. ఆ ఏరు వర్షాకాలం అవడంచేత నిండుగా పారుతూ ఉంది. అదేమిటో ఆ ఏట్లో నీటితోపాటు ఎంతో అంత ఇసుక కూడా ప్రవహిస్తూ ఉంటుంది. గోదావరి వంటి నదులలో వలే కాక ఆ యేరు దాటించే పడవలు వేరు. వాటికి చక్రాలు ఉంటాయి. ఏటి దగ్గరికి పెందలకడనే వెళ్ళాము. కానీ వంతుల ప్రకారం దాటించడం కనుక మా వంతు వచ్చేటప్పటికి కొంత ఆలస్యం అయింది.

**కథలు, గాథలు – చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి**

1. పై పేరాలో ఏ అంశం గురించి ప్రస్తావించారు ?

జ. ..........................................................................................

2. ఆహ్వానం ఎవరి నుండి వచ్చింది ?

జ. ..........................................................................................

3. ఏయే సాధనాలలో ప్రయాణం సాగింది ?

జ. ..........................................................................................

4. పై పేరాకు శీర్షిక పెట్టండి.

జ. ..........................................................................................

**ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. నా 'యాత్ర' పాఠ్యభాగ రచయిత గురించి రాయండి ?
2. 'యాత్రా చరిత్ర' ప్రక్రియా లక్షణాలను గురించి రాయండి ?
3. గంగానదిలో స్నానం చేయడాన్ని రచయిత ఎలా వర్ణించారు?
4. తాజ్‌మహల్ కట్టడ విశేషాలు రాయండి?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో సమాధానం రాయండి.**

1. యాత్రల వల్ల కలిగే ప్రయోజనాలు రాయండి.
2. 'కుతుబ్ మినార్' ని చూసినప్పుడు రచయిత పొందిన అనుభూతిని గురించి రాయండి.
3. 'హరిద్వార్' చేరుకోగానే వర్షపు జల్లు మాకు స్వాగతం పలికింది. అని రచయిత అన్నారు కదా! ఈ మాటలు బట్టి హరిద్వార్ లోని ప్రకృతి రమణీయతను గురించి రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో సమాధానం రాయండి.**

1. ఈ పాఠంలో మీకు నచ్చిన దర్శనీయ స్థలాన్ని గురించి వర్ణిస్తూ పది వాక్యాలు రాయండి.
2. బులుసు వేంకట రమణయ్య 'ఉత్తర భారత దేశ యాత్ర' లో చూసిన ప్రదేశాలను గురించి మిత్రునికి లేఖ రాయండి.
3. మీ ప్రాంతంలో చారిత్రక కట్టడాల పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని గురించి ప్రశంసిస్తూ రాయండి.



## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలకు అర్థాలను పట్టికలో గుర్తించి, వాటితో సొంత వాక్యాలు రాయండి.**

1) ఛత్రం 2) తర్ఫీదు 3) నారి 4) వడి 5) శ్రేణి

| |
|---|
| వరుస, గుర్తు, అందం, శిక్షణ, ఒడ్డు , ఎక్కువ, స్త్రీ, నగరం, వేగం, హారం, గొడుగు |

ఉదా:- తర్ఫీదు = శిక్షణ - సర్కస్ లోని జంతువులకు శిక్షణను ఇస్తారు.

1. ______________________________
2. ______________________________
3. ______________________________
4. ______________________________

**ఆ) కింది వాక్యాలలో గీత గీసిన పదానికి సరైన నానార్థాలను గుర్తించండి.**

ఉదా: అన్ని అవయవాలలో <u>కన్ను</u> ప్రధానమైనది. [ ]

అ) తరువు, చెరువు ఆ) దేశం, కాలం ఇ)చోటు, అద్దం ఈ)నేత్రం, బండిచక్రం

1. బ్రహ్మనాయుడు సహ<u>పంక్తి</u> భోజనాలు ఏర్పాటు చేసాడు. [ ]

అ) వరుస,సేన ఆ) చిలుక,పలక ఇ) చూపు,కప్పు ఈ) దిశ,ఆశ్రయం

2. ద్వాదశ జ్యోతిర్లింగాలలో శ్రీశైల <u>క్షేత్రం</u> ప్రధానమైనది. [ ]

అ) కాలము, కష్టం ఆ) పుణ్యస్థానం, చోటు ఇ) సూర్యుడు, మిత్రుడు ఈ) క్షితి,యాగం

3. ఏ పనినైనా <u>ఉత్సాహంతో</u> చేయాలి . [ ]

అ) ధర్మం, ప్రయత్నం ఆ) న్యాయం, సంబరం ఇ) ప్రయత్నం, సంతోషం ఈ) కోరిక, ఉత్తరం

4. మంచి <u>మిత్రుడు</u> గొప్ప పుస్తకం వంటివాడు [ ]

అ) స్నేహితుడు,సూర్యుడు ఆ) ఆప్తుడు,సన్నిహితుడు ఇ) నేర్పు,మార్గం ఈ) ప్రభువు, ఇంద్రుడు


**ఇ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

ఉదా: మంచి <u>చిత్తం</u>గల వారికి సమాజంలో గౌరవం లభిస్తుంది.

చిత్తం = మనస్సు, హృదయం

1. భారతదేశం పాడిపంటలకు <u>నిలయం</u>. = .................. ..........................
2. వీరనారీమణి <u>రాణి</u> రుద్రమదేవి. = .................. ..........................
3. కృష్ణానదీ <u>తీరం</u>లో అమరేశ్వరాలయం ఉంది. = .................. ..........................
4. మహనీయులు <u>మార్గాన్ని</u> అనుసరించడం మంచిది. = .................. ..........................

**ఈ) కింది వృత్తంలో గల ప్రకృతి వికృతులను గుర్తించి రాయండి.**




| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| 1. | | |
| 2. | | |
| 3. | | |
| 4. | | |

**ఉ) కింద ఇచ్చిన పదాలకు వ్యుత్పత్త్యర్థాలను జతచేయండి.**

అ) నగరం [ ] 1) దైవం వెలసిన ప్రదేశం

ఆ) ఉదధి [ ] 2) కొండలవలె పెద్ద పెద్ద భవనములు కలది.

ఇ) క్షేత్రం [ ] 3) ఉదకమును ధరించునది


**కింది వాక్యాలను పరిశీలించండి.**

1. పచ్చని చెట్లతో కూడిన హరితహారాన్ని చూస్తే, 'కన్నులపండుగగా' ఉంది.
2. ఎర్రకోట నేటికీ చెక్కుచెదర లేదు.

పై రెండు వాక్యాలలోని కన్నుల పండుగ, చెక్కు చెదరలేదు అను రెండేసి పదబంధాలు ఉన్నాయి. అవి సామాన్య అర్థాలను బోధించడం లేదు. కన్నులపండుగ అనే పదబంధం ఎంతో మనోహరంగా అనే విశేషార్థాన్ని ఇస్తోంది. అలాగే చెక్కుచెదరలేదు అనే పదబంధం ఏమాత్రం పాడుకాలేదు అనే విశేషార్థాన్ని ఇస్తోంది. ఈ విధంగా భాషకు సంబంధించిన విశేషమైన అర్థాన్నిచ్చే పలుకుబడులను **జాతీయాలు** అంటారు. వీటిని వేరొక భాషలోకి అనువదించలేము.

మీకు తెలిసిన జాతీయాలను రాయండి.

1. 2. 3. 4.



## వ్యాకరణాంశాలు

**అ) కింది పట్టికను పూరించండి. సంధి ఏర్పడే విధానాన్ని పరిశీలించండి.**

| క్రమ సంఖ్య | సంధి పదం | విడదీసి రాయడం | సంధి పేరు |
|---|---|---|---|
| ఉదా : | లేదని | లేదు + అని | ఉత్వసంధి |
| 1. | మరెక్కడ | | |
| 2. | వారందరు | | |
| 3. | | ధర్మ + ఉపదేశం | |
| 4. | | శత + అబ్దం | |

**ఆ) కింది పదాలను విడదీసి సంధిపేరు రాసి సూత్రీకరించండి.**

1. మహోన్నతం = ____________ + __________ = ______________________
2. దేవాలయం = ____________ + __________ = ______________________
3. శుభోదయం = ____________ + __________ = ______________________
4. మహాలున్నది = ____________ + __________ = ______________________

**ఇ) కింది సమాసాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

1. ఎర్రరాళ్ళు _______________ ____________________
2. తొమ్మిది కోట్ల రూపాయలు _______________ ____________________
3. నదీసవ్వడులు _______________ ____________________
4. పాడిపంటలు _______________ ____________________

### ఈ) కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చండి.

ఉదా: తాజ్‌మహల్ సుందరమైనది. తాజ్‌మహల్ విశాలమైనది.

జ: తాజ్‌మహల్ సుందరమైనది, విశాలమైనది.

1. గయ ప్రాచీనమైనది. గయ ప్రసిద్ధమైనది.
2. హిమాలయ పర్వత శ్రేణులు ఎత్తైనవి. హిమాలయ పర్వత శ్రేణులు విస్తృతమైనవి.
3. సారనాథ్ బౌద్ధ క్షేత్రాలలో ముఖ్యమైనది. సారనాథ్ బౌద్ధ క్షేత్రాలలో చూడదగినది.

## కర్తరి వాక్యాలు – కర్మణి వాక్యాల గురించి తెలుసుకుందాం

### ❖ కర్తరి వాక్యాలు:–

ఉదా:– సూర్యుడు వెలుగును పంచుతాడు.

పై వాక్యంలో వెలుగును పంచే పని చేస్తున్నది "సూర్యుడు" కనుక సూర్యుడు "కర్త". ఇక్కడ కర్త అయిన సూర్యుడు ప్రథమా విభక్తిలో ఉంది. "పంచడం" అనే పనికి గురి అవుతుంది "వెలుగు" కనుక వెలుగుకు ద్వితీయా విభక్తి చేరి "వెలుగును" అని ప్రయోగించబడింది. వాక్యం కర్త అయిన "సూర్యుడిని ప్రధానం చేసి చెప్ప బడినందున" ఇది కర్తరి వాక్యం. క్రియతో అన్వయించే పదం వాక్యంలో ప్రధానమైనది. ఇక్కడ కర్త క్రియతో అన్వయిస్తున్నది కాబట్టి ఇది కర్తరి వాక్యం.

**కర్తరి వాక్యాలు:–** 'కర్త' ప్రధానంగా గల వాక్యాలు కర్తరి వాక్యాలు. కర్తరి వాక్యంలో కర్తకు ప్రథమా విభక్తి వస్తుంది, కర్మకు ద్వితీయా విభక్తి వస్తుంది. కర్తరి ప్రయోగంలో కర్తను బట్టి క్రియా వాచకాలు ఉంటాయి.

### ❖ కర్మణి వాక్యాలు:–

ఉదా:– సూర్యుడిచేత వెలుగు పంచబడుతుంది.

పై వాక్యంలో కర్తకు తృతీయా, కర్మకు ప్రథమా విభక్తులు వచ్చాయి. పంచు అను క్రియకు 'బడు' చేరి పంచబడుతుందిగా మారింది. కర్మ ప్రధానంగా చెప్పబడినది కాబట్టి ఇది కర్మణి వాక్యం.

**కర్మణి వాక్యాలు:–** "కర్మ" ప్రధానంగా గల వాక్యాలు కర్మణి వాక్యాలు. పని యొక్క ఫలితాన్ని అనుభవించేది "కర్మ" అయితే, ఆ పనిని చేసేవాడు "కర్త". కర్మణి వాక్యంలో కర్తకు తృతీయా విభక్తి, కర్మకు ప్రథమా విభక్తి వస్తుంది. కర్మ ప్రధానంగా గల వాక్యాలలో "బడు, బడి" – అనేవి క్రియను అనుసరించి ప్రయోగింపబడతాయి. కర్మణి ప్రయోగంలో కర్మను బట్టి క్రియకు లింగ వచన పురుష ప్రత్యయాలు వచ్చి చేరతాయి.

| కర్తరి వాక్యాలు | కర్మణి వాక్యాలు |
|---|---|
| 1. బుద్ధుడు ధర్మాన్ని బోధించాడు. | 1. బుద్ధుడి చేత ధర్మం బోధించబడింది. |
| 2. శ్రీకృష్ణదేవరాయలు కవులను పోషించాడు. | 2. శ్రీకృష్ణదేవరాయలుచేత కవులు పోషించబడ్డారు. |
| 3. దాతలు గొప్ప దానాలు చేస్తున్నారు. | 3. దాతలచేత గొప్ప దానాలు చేయబడుతున్నాయి. |
| 4. చెట్లు ప్రాణవాయువును అందిస్తున్నాయి. | 4. చెట్లచేత ప్రాణవాయువు అందించబడుతోంది. |

**ఉ) కింది కర్తరి వాక్యాలను కర్మణి వాక్యాలుగా మార్చండి.**

1. ఆమె పాట పాడింది.

జ. ..................................................................................................

2. గాంధీజీ వార్ధా స్కీమును ప్రారంభించారు..

జ) ..................................................................................................

3. బులుసు వేంకట రమణయ్య ఉత్తరదేశ యాత్ర గ్రంథాన్ని రాశారు.

జ) ..................................................................................................

4. షాజహాన్ తాజ్‌మహల్‌ను నిర్మించాడు.

జ) ..................................................................................................

కర్తరి వాక్యాన్ని కర్మణి వాక్యంగా మార్చే విధానం తెలుగులో ఉంది. కాని తెలుగులో ప్రతి వాక్యాన్ని కర్మణిలోకి మార్చడం అందంగా ఉండదు. అందుకే కర్మణి వాక్యం తెలుగుకు సహజం కాదు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే కర్మణికి ప్రయోజనం ఉంటుంది.

### ప్రాజెక్టు పని

❖ మన రాష్ట్రం లేదా మీ ప్రాంతంలో గల యాత్రా స్థలాల విశేషాలను సేకరించండి, చర్చించండి.

### పాఠాంత పద్యం

చ.
అటcజని కాంచె భూమిసురుc డంబర చుంబి శిరస్సరఝ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కలాప కలాపి జాలమున్
గటక చరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్ – అల్లసాని పెద్దన

**భావం:** ప్రవరుడు హిమాలయాలకు వెళ్ళి అక్కడ ఉన్న ప్రకృతి అందాలను చూశాడు. అక్కడ ఆకాశాన్ని తాకుతున్న పర్వతాలను, ఆ పర్వత కొనల నుండి ప్రవహిస్తూ ఉన్న సెలయేళ్ళను, మాటిమాటికి దొర్లుతున్న సెలయేళ్ళ కెరటాల మద్దెల ధ్వనులను, ఆ ధ్వనికి అనుగుణంగా పింఛం విప్పి నెమళ్ళు ఆడుతున్న అందమైన నాట్యమును, ఆ పర్వతాల మధ్యలో ఉన్న ఆడ ఏనుగులచే కదల్చబడిన చెట్లు గల ప్రదేశములను చూశాడు.

**సూక్తి : ఎవరు ఎక్కువ ప్రయాణిస్తే వారికి ఎక్కువ తెలుస్తుంది – ఫుల్లర్**

### ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..................................................................
2. నేను గ్రహించిన విలువ ..................................................................
3. సృజనాత్మక రచన ..................................................................
4. భాషాంశాలు ..................................................................

ఏప్రిల్ 18వ తేదీని వారసత్వ దినోత్సవంగా నిర్వహించుకొంటాం.

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1) బులుసు వేంకట రమణయ్య రచనలను చదివించండి.

2) విద్యార్థులు తాము చేసిన యాత్రను గురించి రచన చేయించండి. తరగతి గదిలో ప్రదర్శించండి.

3) ఉత్తర-దక్షిణ భారతదేశాల మధ్యగల వైవిధ్యాన్ని వివరించండి.



**పాఠాంత అంశము** **గెలుపు నాదే- కథ**

అంతకాలంగా మాళవిక దేశానికి ఉన్న కోశాధికారి చనిపోవడంతో ఆ స్థానంలో మరో కొత్త కోశాధికారి కావలసి వచ్చాడు. రాజ్యంలోని ధనాగారమంతా అతని అధీనంలో ఉంటుంది. కనుక అతడు చాలా నమ్మకమయిన వాడూ డబ్బు మీద ఆశలేనివాడూ కావాలి అటువంటి వాని గురించి రాజుగారు రాజ్యమంతా చాటింపు వేయించాడు. ఆ పదవి గురించి చాలామంది వచ్చినా రాజుగారు పెట్టే పరీక్షకి నిలవలేక వెనక్కి పోతున్నారు. కాని రాజుగారు పెట్టే పరీక్షలో ఓడిపోయిన వారెవరికి, వారు ఎందుకు ఓడిపోయారో అర్థం కాలేదు. "మేం పరీక్షలో పొరపాటు ఏం చేశాం?" అని రాజుగారిని అడిగే ధైర్యం ఎవరికీ లేదు. ఇలా ఉండగా చివర్లో మాధవుడు అనే యువకుడు ఆ పనిని గురించి రాజధానికి వచ్చి రాజుగారిని కలిశాడు. అతడ్ని చూశాక "ఈవాళ మాకు వేరే రాజకార్యముంది కనుక నీవు ఉదయం రా. ఈ రాత్రికి మా అతిథి భవనంలో బస చేయవచ్చు" అన్నారు రాజుగారు మాధవుడితో.

ఒక భటుడు మాధవుడిని వెంటబెట్టుకుని అతిథి భవనానికి తీసుకెళ్ళి, భవనపు అధికారికి "ఈయనకి ఒక గది ఇచ్చి మంచిచెడ్డలు చూడండి" అని చెప్పి భటుడు వెళ్ళిపోయాడు. భవనం అధికారి మాధవుడికి ఒక చక్కటి గది చూపించి "ఇప్పుడే పరుపు మార్పించి దుప్పట్లు కొత్తవి పరిపించాను. హాయిగా భోజనము చేసి విశ్రమించండి, విశ్రమించి ఉదయాన్నే రాజదర్బారుకు వెళ్ళండి" అని వెళ్ళిపోయాడు. మాధవుడు మంచం మీద ఒరిగి, "రేపు రాజుగారు తనకు పెట్టబోయే పరీక్షేమిటా అని ఆలోచిస్తుండగా అతడి వీపుకి ఏదో గట్టిగా తగిలింది. ఏవిటా అని లేచి దుప్పటి ఎత్తి చూసేసరికి చిన్నమూట కనబడింది. ఆశ్చర్యంతో మూటవిప్పి చూస్తే ఖరీదైన పది వజ్రాలున్నాయి. వాటి ఖరీదు ఎంతలేదన్నా లక్ష వరహాలుండొచ్చని అంచనా వేసి భద్రంగా ఆ మూటని తన సంచిలో భద్రపరచుకున్నాడు. మరునాటి ఉదయాన్నే మాధవుడు రాజదర్శనానికి వెళ్ళాడు. రాజుగారు మాధవుడి వివరాలూ, విద్యార్హతలూ కనుక్కుని "అబ్బాయ్ నువ్వు కోశాధికారి పదవికి తగవ్" అన్నాడు కోపంగా.

ఏ పరీక్షా పెట్టకుండా పదవికి అతడ్ని పనికిరాడని ఎందుకంటున్నారో మంత్రితో బాటు సభలో ఎవరికీ అర్థంకాలేదు. ఇంతలో మాధవుడు "మహారాజా ! మీరు పెట్టిన పరీక్షలో నేను నెగ్గాను గనుక ఈ పదవి నాదే !" అన్నాడు. ఆ మాటలకు రాజుగారు ఆశ్చర్యపోయి "ఏం పరీక్ష పెట్టాను !" అన్నాడు. దానికి "కోశాధికారి కావలసినవాడికి ముఖ్యమైనది పరాయిసొత్తు మీద ఆశ ఉండకూడదు. ఆ విషయం కనిపెట్టడానికే మీరు రాత్రి నా దుప్పటి కింద వజ్రాల మూట పెట్టారు. మరొకరైతే ఆ మూట ఆ గదిలో అంతకుముందు బస చేసిన వారు ఎవరో మరచిపోయి వెళ్ళి ఉంటారు కనుక సొంతం చేసుకుంటే పోలా అన్న దురాలోచనతో మూట విషయం ఎవరికీ చెప్పకుండా దాచుకుంటారు. అదే మీ పరీక్ష. ఇదిగో మీ వజ్రాల మూట" అని తన సంచిలో దాచిన వజ్రాల మూటని మహారాజు గారి ముందుంచాడు మాధవుడు.

రాజుగారు ఆశ్చర్యపోతూ "ఆ మూట ఎవరో మర్చిపోయి ఉంటారనుకోకుండా నేను పెట్టానని ఎలా అనుకున్నావు?" అన్నాడు. దానికి మాధవుడు నవ్వి "రాజా ! దీనికి పెద్ద తెలివితేటలు అవసరం లేదు. నాకు గది చూపించే ముందు మీ అధికారి పరుపు దులిపి కొత్త దుప్పట్లు పరిచానన్నాడు. పరుపు దులిపి సర్దేటప్పుడే ఆ మూట ఉంటే అతడికి కనిపించునుగదా అంటే అప్పటికి లేకుండా నేను నగరం చుట్టడానికి బయటకి వెళ్ళినప్పుడు కావాలని పెట్టారని సులువుగా గ్రహించాను అన్నాడు. అతని నిజాయితీతో పాటు సూక్ష్మబుద్ధికి మెచ్చి వెంటనే మాధవుడిని కోశాధికారిగా నియమించాడు రాజు.

**- బుజ్జాయి పత్రిక వారి సౌజన్యంతో**

# 5

# సందేశం

R2F3H8

## చదవండి - ఆలోచించి చెప్పండి



కర్షకవీరుల కాయం నిండా
కాలువకట్టే ఘర్మజలానికి,
ఘర్మజలానికి, ధర్మజలానికి
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్ !

కార్మిక వీరుల కన్నుల నిండా
కణకణ మండే, గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్ !

శ్రీశ్రీ

ప్రశ్నలు :

1) పై గేయంలో ఎవరెవరి గురించి ప్రస్తావించారు?

2) కార్మిక కర్షక వీరుల శ్రమకు ఖరీదు లేదని ఎందుకన్నాడు?

3) ఘర్మజలం కాలువలు కట్టడం అంటే ఏమిటి?

### ఉద్దేశం

దేశ అభివృద్ధిలో శ్రమజీవుల పాత్ర కీలకమైనదని, వీరికి ఎదురయ్యే కష్టాలను గుర్తించాలని, వారి శ్రమను గౌరవించాలని, వారిపట్ల సానుకూల దృక్పథం కలిగి ఉండాలని తెలియజేయటమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

### నేపథ్యం

గుర్రం జాషువా గబ్బిలం ద్వారా తన సందేశాన్ని పరమేశ్వరునికి పంపించారు. ఈ సందేశంలో తన బాధని, కష్టాన్ని, శ్రామికుల జీవనస్థితిగతుల్ని విన్నవించమని వేడుకున్నారు.

### కవి పరిచయం



1895 - 1971

## గుర్రం జాషువా

గుర్రం జాషువా వీరయ్య, లింగమ్మ దంపతులకు గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. ఈయన రచనలు గబ్బిలం, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, కాందిశీకుడు, బాపూజీ, నేతాజీ, నాగార్జున సాగర్, ముసాఫరులు మొదలైనవి. ఈయనకు కవి కోకిల, కవితా విశారద, కవి దిగ్గజ, నవయుగ కవిచక్రవర్తి, మధురశ్రీనాథ, విశ్వ కవిసమ్రాట్ అనే బిరుదులున్నాయి. సత్యహరిశ్చంద్ర నాటకంలో ఈయన రాసిన పద్యాలు వినని తెలుగువారుండరు అంటే అతిశయోక్తి కాదు. **ఈ పాఠ్యాంశం గబ్బిలం నుండి స్వీకరించబడింది.**

## సందేశం

ఉ. చిక్కిన కాసుచేఁ దనివిఁ జెందు నమాయికుఁ డెల్ల కష్టముల్
బొక్కెడు బువ్వతో మరచిపోవు క్షుధానల దగ్ధమూర్తి న
ల్దిక్కులుఁ గల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీ సుతుం
డొక్కఁడు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డఁడై 1



ఉ. పూప వయస్సులో వలస పోయిన చక్కని తెల్గు కైతకున్
ప్రాపక మిచ్చినట్టి రఘునాథనృపాలకుఁ డేలియున్న తం
జాపురి మండలంబునకుఁ జక్కగ దక్షిణభాగ భూములన్
గాపురముండె నప్పరమ గర్భదరిద్రుఁడు నీతిమంతుఁడై 2



ఉ. ముప్పుఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్
బిప్పియెనర్చు నీ భరత వీరుని పాదము కందకుండఁగాఁ!
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ! భరతావని వీని సేవకున్! 3

తే.గీ. వాని తెక్కల కష్టంబు లేనినాఁడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాఁడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనముఁ బెట్టు వానికి భుక్తి లేదు 4



తే.గీ. పామునకుఁ బాలు, చీమకుఁ బంచదార
మేపుకొనుచున్న కర్మభూమిన్ జనించు
ప్రాక్తనంబైన ధర్మదేవతకుఁ గూడ
నులికిపడు జబ్బు గలదు వీఁడున్నచోట 5

ఆ.వె. వాని నుద్ధరించు భగవంతుఁడే లేఁడు
మనుజుఁ డెట్లు వానిఁ గనికరించు
వాఁడు జేసికొన్న పాపకారణ మేమొ
యింతవఱకు వాని కెఱుకలేదు 6



ఆ.వె. ఉదయమాది రక్త మోడ్చి కష్టముఁ జేసి
యినుని సాగనంపి యిల్లు సేరి
యున్న గంజిఁ ద్రావి యొక్కనాఁడా పేద
ప్రక్కమీఁద మేను వాల్చియుండె 7

తే.గీ. ముక్కు మొగమున్న చీఁకటి ముద్దవోలె
విహరణము సేయసాఁగె గబ్బిల మొకండు
దాని పక్షానిలంబున వాని చిన్ని
యాముదపు దీప మల్లన నాఱిపోయె 8



క. తిల్లిక నాఱిపి దయ్యపుఁ
బిల్లవలెం దిరుగుఁ దబిసి పిట్ట నరయఁగాఁ
బల్లవితమయ్యె నాతని
యుల్లంబునఁ గ్రొత్తక్రొత్త యూహాంకురముల్ 9

శా. మృగపక్షిత్వ విచిత్రధర్మములు మూర్తిన్ దాల్చియున్నట్టి నీ
మొగముం జూడదు లోకమట్టి శకునంబుల్ ప్రాతపట్టింపులు
న్దగవీ పేదకు రమ్ము గబ్బిలపు చానా ! నాదు స్వాంతంబులో
దిగులుంబాపి పినాకపాణి కొక సందేశంబు నందింతువా ? 10

**ప్రక్రియ – ఖండకావ్యం**

మహాకావ్యముల నుండి రసాత్మక ఘట్టములను లేదా, ఒకే కథా వస్తువు కలిగిన ఘట్టములను విడిగా గ్రహించి రచించిన కావ్యాన్ని ఖండకావ్యం అంటారు. దీనిలో కవి భావం చిక్కగా ఉంటుంది. వ్యర్థపదాలకు, వర్ణనలకు అవకాశం ఉండదు. ఆత్మాశ్రయరీతి, వస్తు, భావ, శైలి, కవితా రచనలలో నవ్యత ఉంటుంది.

**భావాలు :**

1. దొరికిన కొంచెం సొమ్ముకే తృప్తి చెందే అమాయకుడు, అన్ని కష్టాలనూ పిడికెడు అన్నంతోనే మరచిపోయే వాడు, ఆకలి అనే అగ్నిచేత దగ్ధమైనవాడు. నాలుగు దిక్కుల వ్యాపించి ఉన్న లోకంలో దిక్కులేని ఒక శ్రమ జీవి భారతమాతకు చివరి బిడ్డగా పుట్టాడు.

2. లేత వయస్సులోనే ఆంధ్రప్రాంతం నుండి తెలుగు కవిత్వాన్ని తమిళనాడుకు తీసుకువెళ్ళి ఆశ్రయమిచ్చినటువంటి రఘునాథరాజు పాలించిన తంజావూరు మండలానికి దక్షిణ భాగాన ఆ నిరుపేద నీతిగా జీవిస్తున్నాడు.

3. ఇతని కులాన్ని, సంపదను దోచి, హానితలపెట్టి, శరీరాన్ని పిప్పి చేసే ఈ భారత ప్రజల పాదాలు కందిపోకుండా చెప్పులు తయారుచేసి, జీవితాన్ని గడుపుతాడే తప్ప, ఎప్పుడూ ఈ పని చేయనని తిరస్కరించలేదు. ఇతని సేవలకు భారత ప్రజలు బాకీ పడ్డారు సుమా!

4. కష్టజీవి రెక్కల కష్టమే లేనట్లైతే ఈ దేశంలో పంట పండించడం సాధ్యం కాదు. అతని చెమట ధారలతోనే ప్రపంచానికి భోజనం దొరుకుతుంది. కానీ, అతనికి మాత్రం తిండి ఉండదు.

5. పాముకు పాలు, చీమకు పంచదార పెట్టే ఈ కర్మభూమిలో పుట్టిన ధర్మ దేవతకు కూడా ఇతడు ఉన్న చోట ఉలిక్కి పడే జబ్బు ఉంది. కష్టపడే వానికి విలువ లేకుండా పోయింది.

6. వాణ్ణి దేవుడే ఉద్ధరించకపోతే మనిషి ఎలా ఉద్ధరిస్తాడు. ఇన్ని కష్టాలు పడడానికి వాడు చేసుకున్న పాపమేమిటో వాడికే తెలియదు. తెలిసినప్పుడు కదా పాప పరిహారం.

7. తెల్లవారక ముందే నిద్ర లేచి, తన రక్తాన్ని మరగించి సాయంత్రం వరకు ఎండలో కూర్చొని సేద్యం చేస్తాడు. పదిమందికి సాయపడతాడు. పొద్దువాలిన తర్వాత ఇంటికి పోయి గుక్కెడు గంజి తాగి పడుకుంటాడు.

8. కటిక చీకటి ముద్దకు ముక్కు, ముఖం పెట్టినట్లున్న గబ్బిలం ఒకటి అక్కడ ఎగురుతూ ఉండడం దాని రెక్కల నుండి వచ్చే గాలికి ఆ పేదవాని ఇంట్లోని చిన్న ఆముదపు దీపం మెల్లిగా ఆరిపోయింది.

9. దీపాన్ని తన రెక్కల గాలితో ఆర్పివేసి, దయ్యం పిల్లవలె తిరుగుతున్న ఆ గబ్బిలాన్ని చూడగానే, అతని గుండెల్లో కొత్తకొత్త ఆలోచనలు మొలకెత్తాయి.

10. ఓ గబ్బిలమా ! ఈ లోకంలో జంతుపక్షిధర్మాలు రెండూ కలిసి ఉన్న నీ ముఖాన్ని చూడటానికి ఎవరూ ఇష్టపడరు. కానీ ఈ పేదవాడికి శకునాలవంటి పాత పట్టింపులు ఉండకూడదు. నా మనస్సులో దిగులుపోగొట్టి ఒక సందేశాన్ని శివునికి అందించగలవా ?

## ఇవి చేయండి

Z6N7A1

### అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.రాయండి.**

1. పాఠంలోని పద్యాలను రాగయుక్తంగా పాడండి.
2. మీకు నచ్చిన పద్యం ఏది ? ఎందుకు నచ్చిందో చెప్పండి.
3. రెక్కల కష్టాన్ని నమ్ముకొని జీవించేవారి గురించి తెలిసిన విషయాలు రాయండి.

**ఆ) కింది పేరా చదివి నాలుగు ప్రశ్నలు తయారు చేయండి.**

గురజాడ అప్పారావు ప్రముఖ అభ్యుదయ కవి. సంఘసంస్కర్త, హేతువాది. ఈయన 1862 సం॥లో సెప్టెంబరు 21న విశాఖపట్నంలో జిల్లా రాయవరం గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు వెంకటరామదాసు, కౌసల్యమ్మ. అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించారు. ఇందు కోసం తన రచనల్లో ప్రజలందరికి అర్థమయ్యే వాడుక భాషను ప్రవేశ పెట్టారు. ఆయన రచనల్లో కన్యాశుల్కం నాటకం, దిద్దుబాటు కథ, దేశభక్తి గీతం ఎంతో ప్రసిద్ధి పొందాయి. 1911వ సంవత్సరంలో ఆంధ్ర సాహిత్యపరిషత్ ప్రారంభించారు. గిడుగు వేంకట రామమూర్తి పంతులు గారితో కలిసి వ్యావహారిక భాషోద్యమంలో పాల్గొన్నారు. ఆనాటి సాంఘిక దురాచారాలపై రచనలు చేసిన వీరు 1915 సం॥లో నవంబర్ 30న మరణించారు.



ప్రశ్నలు.

1. ..........................................................................................
2. ..........................................................................................
3. ..........................................................................................
4. ..........................................................................................

**ఇ) పద్యం చదవండి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**



పేదల పేరు చెప్పుకొని పేదల నోళులనొక్కివేసి సం
పాదన చేసి, లక్షలు కృపారహితాత్ములు మేడమిద్దెలన్
మోసమునన్ విలాసములఁబుత్తురుకాలము జాలిగుండెయే
లేదొక బాష్పబిందువిడలేరు బుభుక్షుఁదపించువారికై

మరుత్సందేశం

1. 'కృపారహితాత్ములు" అర్థం రాయండి.

జ. ..........................................................................................

2. బుభుక్ష = ఆకలి. ఈ అర్థంతో సొంత వాక్యం రాయండి.

జ. ..........................................................................................

3. ఈ పద్యం ఏ పుస్తకంలో ఉంది ?

జ. ..........................................................................................................

4. పై పద్యంలో విలాసాలు ఎలా చేస్తారని చెప్పారు ?

జ. ..........................................................................................................

**ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) గుఱ్ఱం జాషువ గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.

ఆ) 'ఖండకావ్య ప్రక్రియ' లక్షణాలను గురించి రాయండి.



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో సమాధానం రాయండి.**

1. పాఠ్యభాగ నేపథ్యం రాయండి.
2. "కష్టజీవుల శ్రమకు భరతావని ఋణపడ్డది" అని అనడంలో కవి భావన ఏమి?
3. శ్రమజీవి శ్రమపడకపోతే ఏం జరుగుతుంది?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి.
2. కష్టజీవుల గురించి కవి పడిన ఆవేదనను పాఠ్యభాగం ఆధారంగా సమర్థిస్తూ రాయండి.
3. మీ ప్రాంతంలోని శ్రామికుల జీవనం గూర్చి రాయండి.



## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థం రాసి, సొంత వాక్యాలలో ఉపయోగించండి.**

1. కష్ట జీవి తనకు చిక్కిన కాసుతో తృప్తి చెందుతాడు.

జ. ..........................................................................................................

2. పరుల క్షుద్బాధను తీర్చాలి.

జ. ..........................................................................................................

3. ఈ రోజుల్లో కూలినాలి చేసుకునే వారు వలసలు వెళ్తున్నారు.

జ. ..........................................................................................................

4. కుచేలుడు బీదవాడయినప్పటికి కృష్ణుడు ఆదరించాడు.

జ. ..........................................................................................................

**ఆ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు నానార్థాలు రాయండి.**

1. తంజావూరుకి దక్షిణ దిక్కున కాపురమున్నాడు. = .................. ........................
2. సకల జీవులకు భూమే ఆధారం. = .................. ........................
3. పద్యపాదం అసంపూర్ణంగా ఉంది. = .................. ........................
4. శ్రామికుడు దేశానికి వెన్నెముక. = .................. ........................

**ఇ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

1. రఘునాథ నృపాలకుడు తెలుగు భాషకు సేవ చేశాడు. ____________, ____________
2. గంగ శివుని శిరస్సు నుండి భూమికి ప్రవహించింది. ____________, ____________
3. ఎంతో పుణ్యం చేస్తే తప్ప మనుజుడై పుట్టడు. ____________, ____________
4. అలసట వలన మేను విశ్రాంతి కోరుతుంది. ____________, ____________

**ఈ) కింది పట్టికలోని ప్రకృతి, వికృతులను వేరు చేసి రాయండి.**

ఆరంజోతి, మనిషి,
కులము, ధర్మం,
మనుష్యుడు, పట్నం,
కొలము, దమ్మం,
పట్టణం,
అరుంధతి

| ప్రకృతి | వికృతి |
|---|---|
| **ఉదా : అరుంధతి** | **ఆరంజోతి** |
| 1 ............... | .................... |
| 2 ............... | .................... |
| 3 ............... | .................... |
| 4 ............... | .................... |



**భాషాక్రీడ**

**అ) కింది పదాల అర్థాల క్రమసంఖ్యలు ఆధారంగా పాఠంలోని పద్యం రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 12 | 3 | 8 | 9 | 15 |
| ప్రజలకు | కష్టము | అనుమానించును | అతడు | అతనికి |
| 14 | 15 | 6 | 10 | 13 |
| పెట్టేటటువంటి | కూడు | పండుటకు | స్వేదమును | అన్నము |
| 7 | 11 | 17 | 1 | |
| ఆనందించుటకు | చిందించి | లేకుండాపోయింది | అతనియొక్క (కష్టజీవియొక్క) | |
| 2 | | 4 | 5 | 16 |
| రెక్కల యొక్క | | లేకుండాపోయిన రోజున | పంటలు | తిండి |

పద్యం ........................................................................................................

........................................................................................................

........................................................................................................

........................................................................................................



## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను కలిపి రాసి, సంధులపేర్లు రాయండి.**

1. క్షుధా + అనల = ____________, ____________.
2. జన్మము + ఎత్తె = ____________, ____________.
3. భరత + ఉర్వర = ____________, ____________.
4. భరత + అవని = ____________, ____________.

**ఆ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి**

1. '<u>విశ్వనాథుడు</u>' సృష్టికర్త.

____________ = ____________, ____________

2. మనరా<u>ష్ట్రకీర్తి</u> నలుదిక్కులు వ్యాపించాలి.

____________ = ____________, ____________

3. చక్కగ <u>దక్షిణభాగ</u> భూములలో నివసిస్తున్నాడు.

____________ = ____________, ____________

4. <u>భారతదేశము</u>ను కర్మభూమి అని చెబుతారు.

____________ = ____________, ____________



## ప్రాజెక్టు పని

మీ గ్రామంలో వివిధ వృత్తులు, వాటి పనిముట్లు, వారి శ్రమను, వారి నైపుణ్యాలను గురించి బొమ్మలతో సహా సేకరించి రాయండి.

## పాఠాంత పద్యం

ఆ.వె. ఎన్నఁగల జీవరాసుల
యన్నిటి గర్భమునఁబుట్టి యటమనుజుండై
తన్నెఱిఁగి బ్రతుకవలెరా
కొన్నాళ్ళకు నెచటనున్న గువ్వలచెన్నా ! **– గువ్వల చెన్నడు**

**భావం :** ఎన్నో జీవరాశుల గర్భానపుట్టి, ఆఖరికి మనుజుడవుతాడు. కనుక మనుజుడైనవాడు ఎక్కడ ఉన్నా గానీ తనని తాను ఎరిగి మసులుకోవాలి.

**సూక్తి : మొత్తం ప్రపంచ సంపదకంటే మానవులే విలువైన వారు – స్వామి వివేకానంద.**

## ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..............................................................................
2. నేను గ్రహించిన విలువ ..............................................................................
3. సృజనాత్మక రచన ..............................................................................
4. భాషాంశాలు ..............................................................................

మే1వ తేదీని ప్రపంచ శ్రామిక దినోత్సవంగా జరుపుకొంటున్నాం.

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1) శ్రమజీవుల కష్టాలను వర్ణించే రచనలు చదివించండి.
2) గుఱ్ఱం జాషువా రచనలను పరిచయం చేయండి.

## మేటి పద్యాలు

*అన్యభాషపైని అధికార మబ్బదు*
*అంతుపట్టదేని సొంత భాష*
*మొదలు నేర్వకున్న తుదయెట్లు నేర్చురా*
*వాస్తవమ్ము నార్లవారి మాట* — *నార్ల వెంకటేశ్వరరావు*

——✻✻✻✻✻——

*తెనుగునాడు నీది తెనుగు బిడ్డవు నీవు*
*తెనుగటన్న నీకు తీపిమెండు*
*తెనుగకన్నె జడలదీర్చి మక్కువ తోడ*
*తెనుగు తోటలందు దిప్పినావు* — *దేవులపల్లి రామానుజరావు*

**పద్యాత్మక పొడుపు కథలు**

*తలయు తోకనుండు పలుక నాలుక లేదు*
*పండ్లు గలవు గాని కానరావు*
*పట్టిచూడనందు ప్రాణమే యుండదు*
*దీని భావమేమి? తిరుమలేశ !* — *(పాముకుసుము/కుబుసం)*

పర్వత శ్రేష్ఠ పుత్రికా పతి విరోధి
అన్నపెండ్లాము అత్తను గన్న తండ్రి
పేర్మి మీరిన ముద్దుల పెద్దబిడ్డ
సున్నమించుక తేగదె సుందరాంగి ! (దరిద్ర దేవత)

******

శతపత్రం బుల మిత్రుని
సుతుఁజంపిన వాని బావ సూనుని మామన్
సతతము దాల్చెడు నాతని
సుతువాహన వైరివైరి ! సున్నంబిదిగో (కుక్క)

## అక్షర విన్యాస పద్యాలు

నిన్నున్, నన్నెన్నన్నన్
నాన్నా ! నిన్నన్న నౌన, నానౌనే ? నే
నన్నానా నిను ! నేనా
నీననెన్నను నను నను నీనేనేనే (ఏకాక్షర పద్యం)

నిన్నున్, నిన్ను + ఎన్ని + అన్నను
నాన్నా, నిన్ను + ఎన్నను + ఔన, నాను+ఔనే, నేను
+అన్నానా ? నిను నేనా
నీ నన్ను (బిడ్డను)+ఎన్ని+అన్నను+నను నను+నీ+నేను+ఏనే ?

పాఠాంత అంశము — జానపద గేయం

పల్లవి. కట్టు కట్టు మామయ్య గొళ్ళు
ఒడికట్టు రైతన్నబిడ్డా ॥2॥

॥చ॥ గొళ్ళు తోలేదే గొర్మానుకొండొల్లు
సాల్లు పాసేదే సంకలాప్రమొల్లు
విత్తనమేసేదే వీరాయి పల్లొల్లు ॥ప॥

॥చ॥ మెట్లగొట్టోదీ మెట్టుపల్లొల్లులూ
కలుపుతీసేదీ కన్నమడకలొల్లు
ఎత్తిపోసేదీ ఏల్పనూరొల్లు. ॥ప॥

॥చ॥ కోతకోసేది కోవెలకుంట్లొల్లూ
కట్టగట్టేదీ కడుమూరొల్లూ
గూళ్ళువేసేదీ గూడూరొల్లూ ॥ప॥





సేకరణ : ఆమళ్ళదిన్నె గోపీనాథ్ గారి జానపద గేయ సంపుటి నుండి సేకరణ

# 6

# పయనం

## చదవండి – ఆలోచించి చెప్పండి

వర్షములు లేక ప్రజలెల్ల వలస పోగ
పల్లెటూళ్ళన్ని కళదప్పి పాడుబడియె
పంచరంగుల చిలుక లంచెంచ బడిన
వసతులెల్లను యీనాడు వల్లకాడు




ప్రశ్నలు :

1. పై పద్యం ఏమి చెబుతోంది.
2. పల్లెలు ఎందుకు కళ తప్పాయి?
3. మీకు ఇలా వెళ్ళే వారి గురించి తెలుసా?

### ఉద్దేశం

సన్నకారు రైతులు, రైతుకూలీలు బ్రతుకుదెరువు కోసం తమ ఊరి నుండి మరో ప్రాంతానికి వలస వెళుతుంటారు. అలా వెళ్ళినవారి జీవన విధానాన్ని, శ్రమను, తెలియజేస్తూ విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించడమే ఈ పాఠం ఉద్దేశం.

### రచయిత పరిచయం



1943 – 2021

## సింగమనేని నారాయణ

కథా రచయిత సింగమనేని నారాయణ గారు అనంతపురం జిల్లా బండమీద పల్లెలో జన్మించారు. సంజమ్మ, రామప్పలు వీరి తల్లిదండ్రులు. సీమకథలు, జూదం, అనంతం, సింగమనేని కథలు అనే పేర్లతో కథా సంపుటాలు వెలువడ్డాయి. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి 'కళారత్న', తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహిత్య పురస్కారాలు లభించాయి. **ఈ పాఠం సింగమనేని నారాయణ రచించిన 'అనంతం' అనే కథల సంపుటిలోనిది.**


# పయనం

గంగన్న ముందు నడుస్తున్నాడు. అతని నెత్తిమీద ఒక పాత ట్రంకుపెట్టె ఉంది. పెట్టెలో ఏముందో అతడు తెరచి చూపిస్తే తప్ప మనకు అర్థంగాదు. అతని వెనకాల భార్య నరసమ్మ, కొడుకు నారాయణ, కోడలు వెంకటలక్ష్మి నడుస్తున్నారు. నరసమ్మ చేతుల్లో బట్టలమూట ఉంది. నారాయణ చేతిలో ఒక చారల సంచి ఉంది. వెంకటలక్ష్మి చంకలో ఆరునెలల పసికందు ఉంది. వాళ్ళు బస్సుదిగి నడుస్తున్నారు. నడుస్తున్న రోడ్డు నున్నగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా పచ్చని పత్తిపొలాలు సాయంత్రం ఎండకు మెరుస్తూ, మందంగా వీస్తున్న గాలికి రెపరెప లాడుతున్నాయి. కంటికి ఆనినంత దగ్గరలో గుబురుచెట్లు, వాటి మధ్య తెల్లటి మేడలు కన్పిస్తున్నాయి. "అదే మనం చేరాల్సిన ఊరు" అంటూ మెల్లగా గొణిగాడు గంగన్న.

"ఎంత బావుందో" అంది వెంకటలక్ష్మి చుట్టూ ఉన్న పొలాలను చూసి మురిసిపోతూ. ఆమె కళ్లకు ఇలాంటి పచ్చటి దృశ్యం కన్పించి ఎంత కాలమయిందో! "నడిచినట్టే లేదు" అంది నరసమ్మ ఆ పొలాలను కళ్లనిండా నింపుకుంటూ! వాళ్లకు మనసుల్లో తమ ఊరూ, బీడుపడ్డ ఎర్రటి పొలాలు, మెదులుతున్నాయి. "మన ఊరు ఇట్లా పచ్చగా ఉంటే, ఇంత దూరం వచ్చే పని ఏముంది ?" అన్నాడు నారాయణ ముందు నడుస్తున్న తండ్రిని ఉద్దేశించి. గంగన్నకు ఒక్క క్షణం తమ ఊరిదృశ్యాలు కళ్లముందు కదిలినాయి. ఊరి చుట్టూ భగ్గుమని మండుతున్న ఎర్రటి నేలలు, గడ్డిమొక్క కూడా కన్పించని ఆ చేన్లు, నిస్సారమై నిర్జీవమై నీటి చుక్క కోసం నోరు తెరచినట్టుండే భూములు అన్ని కళ్లముందు కదిలి తన కొడుకు వైపు అర్థమైందన్నట్లు చూశాడు గంగన్న. "కాని కాలం వస్తే ఇంతే నాయనా!" అంటూ తన జేబును చేతితో తడిమి చూసుకున్నాడు. అతని జేబులో తమ ఊరి వెంకటస్వామి రాసియిచ్చిన జాబు ఉంది. ఆ జాబు అందుకోవాల్సిన మనిషి ఎదురుగా కన్పిస్తున్న ఊళ్లో ఉన్నాడు. ఊరికి దగ్గరగ వచ్చారు వాళ్లు. ఊళ్లో మనుషుల కలకలం వినిపిస్తోంది. ఊళ్లో అడుగుపెట్టగానే ఎదురైన ఇద్దరు ఎగాదిగా చూశారు ఈ నలుగుర్నీ. వాళ్ళకు కొత్తమనుషులు అని చూడగానే అర్థమైంది."యా ఊరన్నా తమది" అనడిగారు మొగాల్లోకి చూస్తూ. పడమటి దిక్కుగా ఉన్న పాపంపల్లె నాయనా! రామప్పగారిని కలుసుకోవల్లని వస్తా వుండాము" అన్నాడు గంగన్న.

"ఓ... మా రామప్పగారి కోసమా! అదిగోఆ కనిపిస్తావుండే పెద్దభవనమే ఆయనది. ఇంతకూ ఏం పని మీద వచ్చినారు" అనడిగాడు వాళ్ళలో ఒకరు. "ఉన్న ఊళ్లో పనుల్లేక బతుకుతెరువు కోసం వచ్చినామన్నా" సిగ్గువిడిచి చెప్పుకున్నాడు గంగన్న "ఔను పాపం! మీ ప్రాంతం నుండి చాలామంది ఈ వైపు వస్తావుండారు. ఈ సంవత్సరం పెద్దకరువు వచ్చి పడిందంటనే" అన్నాడు జాలిని కనబరుస్తూ ఆయన. 'కరువు' అనే మాట వినగానే వాళ్ల శరీరాలు భయంతో జలదరించినాయి. "యాల చెప్పుకోవల్లలే నాయనా? కడుపు చించుకుంటే కరువు కాళ్లమీద పడుతుంది! రామప్పగారు ఏదన్నా పని చూపిస్తే బతికిపోతాము" అన్నాడు. "మీకేం భయం లేదు, పని చేసే పురసత్తు ఉండల్ల గాని ఏదో ఒక ఆదరువు చూపిస్తాడు మా రామప్ప, పొయిరండి...రామప్ప ఇంటికాడే వుండాడు" అంటూ. ఆ ఇద్దరూ వెళ్ళిపోయారు."హమ్మయ్య" అంటూ ఊపిరి పీల్చుకుంది గంగన్న కుటుంబం. ఇంతదూరం నమ్ముకొని వస్తావుండామే, ఇక్కడి పరిస్థితులెట్లా వుండాయో ఏమో? అన్న అనుమానం వాళ్ళను ఒకవైపు పీడిస్తానే ఉంది. వాళ్ళు పలికిన నాలుగు మాటలతో ఒక భయం తొలగి పోయినట్టయింది గంగన్న కుటుంబానికి. చివరికి ఒక పెద్ద భవనం దగ్గరకు చేరుకున్నారు వాళ్ళు. పైన అంతస్తు కూడా ఉంది. భవనం చుట్టూ ప్రహరీ గోడ. గోడకు ఇనుపగేటు

గేటు తెరచే ఉంది. నేరుగా లోపలికి అడుగు పెట్టినారు వాళ్ళు. లోపల విశాలమైన ఆవరణ. పెద్ద పెద్ద గడ్డివాములు. ఒక వైపున రెండు ట్రాక్టర్లు, ఒక జీపూ ఉన్నాయి. ఇక్కడి వాతావరణమంతా గమనించే సరికి, రావాల్సిన చోటుకే వచ్చామనుకున్నారు వాళ్ళు! "ఎవురూ? ఎవురు మీరూ?" అంటూ ఒక నడివయసు మనిషి గద్దిస్తూ ఎదురుగా వచ్చాడు.



గంగన్న "రామప్పగారి కోసం వచ్చినాము" అంటూ వినయంగా చెప్పుకున్నాడు. "యావూరు? ఏమిటి? ఎందుకు? కొత్తమొగాల్లా ఉన్నారే? ఈ ప్రాంతం వాళ్ళు కాదే?" ఇలాంటి ప్రశ్నలన్నీ రకరకాలుగా వేసి జవాబులు రాబట్టి, నమ్మకం కుదిరి, తన వెంట లోపలకు పిల్చుకు పోయాడు ఆ నడివయసు మనిషి. అక్కడ పెద్ద చావిడిలో జగితి మీద నింపాదిగా కూచున్న అర్వై ఏళ్ళ మనిషిని చూపిస్తూ "ఆయనే వెళ్ళి కలుసుకోండి" అని చెబితే ఆశ్చర్యపోయారు వీళ్ళు. రామప్పగారంటే , చాలా లావుగా, ఎత్తుగా, సినిమాల్లో భూస్వామిలా హుందాగా ఉంటాడని భావించిన వీళ్లకు అందుకు విరుద్ధంగా ఆయన కన్పించేసరికి విస్తుపోయారు. రామప్ప గారు పొట్టిగా, కుదమట్టసంగా, ముతక బనియను, ముతకపంచతో, ఎర్రటి ఎరుపు రంగు శరీరంతో, చూడగానే మనలాంటి మనిషే అనిపించేలా ఉన్నాడు. గంగన్న ఆయన దగ్గరకు వెళ్ళి, తన చొక్కా జేబులోంచి కాగితం మడతతీసి, ఆయనకు వినయంగా అందించాడు. దాన్ని అందుకుంటూ 'కూర్చోండి' అన్నాడాయన. వాళ్ళు ఆయనకు ఎదురుగా వున్న చిన్న అరుగుమీద కూర్చున్నారు.

రామప్ప కాగితంలో రాసిన విషయమంతా చదివి, వెంకటస్వామి ఆరోగ్యం గురించి, కుటుంబం గురించి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నాడు. "నాగన్నా" అంటూ కేకవేస్తే, వచ్చిన మనిషికి. వీళ్ళ గురించి చెప్పి మన పెంకుల కొట్టంలో వీళ్ళకు బస ఏర్పాటు చేయించు" అని పురమాయించి, "మీరు వెళ్లండి పొద్దున మాట్లాడుకుందాం" అని పంపించాడు. గంగన్న కుటుంబమంతా పెంకుల పాకలోకి చేరుకుంది. విశాలంగా, రెండు గదులతో అనుకూలంగా ఉంది ఆ పాక! అప్పటికే చీకటి పడుతూ వుంది! పాకలో కరెంటు బల్బు వెలిగించారు. నరసమ్మా, వెంకటలక్ష్మి ఇల్లు

శుభ్రం చేసే పనిలో మునిగిపోయారు. తాము తెచ్చిన బట్టలనూ, ఇతర సామాన్లనూ ఒక మూల సర్దుతున్నాడు గంగన్న. గదిలో ఒకమూల వున్న పాతబెంచీ మీద కూచున్నాడు. ఎక్కడ తమ ఊరు? ఎక్కడ ఈ ఊరు? ఇలా రావల్సి వస్తుందని ఎప్పుడైనా ఊహించినామా? ఒక్కసారిగా తమ ఊరు, ఇల్లు, ఇంటి దగ్గర విడిచిపెట్టి వచ్చిన ముసలితల్లీ, చిన్నకొడుకు గుర్తుకు వచ్చినారు. అతని ఆలోచనల్లో జీవితమంతా ఒకసారి మెదిలింది!

ఐదారు సంవత్సరాల కిందటి వరకూ కూడా గంగన్న కుటుంబం ఆ ఊళ్లో, ఒక స్థాయి గల మంచి రైతు కుటుంబం కిందే లెక్క. పదెకరాల మెట్టా బావి కింద రెండెకరాల సాగుభూమి, స్వంత ఇల్లు, ఇంటి వెనుక దొడ్డిలో గడ్డివాములు, పాడిచ్చే పశువులు, భార్య మెడలో ఐదారు తులాల బంగారము, పచ్చగానే బతుకుతున్న కుటుంబం అతడిది. అప్పుడప్పుడూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికి, ఏదో ఒక ఏడు పంటలు పండి కుటుంబం నిలదొక్కుకొనేది. అయితే గత నాలుగైదు ఏళ్లుగా పరిస్థితులు మారిపోయినాయి. వరుసగా రెండేళ్లు వర్షం రాకపోవటంతో బావిలో నీళ్లు అడుగంటిపోయినాయి. అప్పుచేసి రెండు బోర్లు వేయించాడు. ఆ బోర్లు సంవత్సరం దాటకుండానే మొరాయించాయి. ఆరునెలల్లో అప్పులు మాత్రమే మిగిలాయి. ఈ సంవత్సరమైతే మరీ ఘోరం. గత యాభైఏళ్ళలో ఇంత కరువు ఎప్పుడూ రాలేదని, పాతతరం వాళ్ళు చెబుతున్నారు గంగన్నకు. రోజురోజుకూ తిండిగింజలను ఏపూటకాపూట సమకూర్చుకోవటమే దుర్భరమైపోయింది. ఇంట్లో తినేవాళ్ళు ఆరుగురున్నారు. ఒక్కరికి కూడా చేయటానికి పనిలేదు, గడ్డిలేక రెండు గిత్తల్ని, ఎనుగొడ్డును అయినకాడికి అమ్మి, కొద్దిరోజులు బతుకు ఈడ్చినాడు. గంగన్నకు ఇప్పుడున్న ఒకే మార్గం ఊరు విడవటం. ఎక్కడికైనా వలసవెళ్ళి కూలీనాలీ చేసుకొని పెళ్ళాం పిల్లల్ని పోషించుకోవటం. గంగన్న ఏంచేయాలో పాలుపోక పక్కింటిలో ఉన్న వెంకటస్వామితో మాట్లాడినాడు.



వెంకటస్వామి ఆ ఊళ్ళోనే పెద్దరైతు. అతని ఇద్దరి కొడుకులూ పెద్ద ఉద్యోగాల్లో వున్నారు. పట్టణంలో వ్యాపారాలు, భవంతులు ఉన్నాయి. గంగన్న అతడిని కలిసి నువ్వే ఏదో ఒక దారి చూపి మా కుటుంబాన్ని గట్టున పడెయ్యాలి అని సిగ్గు విడిచి అడిగాడు. గంగన్న పరిస్థితి అతనికి తెలుసు. వెంకటస్వామి బాగా ఆలోచించి "నువ్వు ఏమీ అనుకోనంటే ఒక మార్గం చూపుతాను" అన్నాడు. గంగన్న ఏదైనా సరే చెప్పమన్నాడు. "మా బంధువు ఒకాయన కర్ణాటకలో బళ్ళారి దగ్గర కంపిలి కొట్టాలలో ఉన్నాడు. ఆయన పెద్ద రైతు. అతని దగ్గర సంవత్సరమంతా పని ఉంటుంది. మీరు నలుగురూ అక్కడికి వెళ్ళి కష్టపడితే రోజుకు నాలుగు వందలకు పైగా సంపాదించుకోవచ్చు" అని సలహా ఇచ్చినాడు.

గంగన్న మనసులో ఉన్నది కూడా ఇలాంటి మార్గమే. అంతే ఒక్కరోజు కూడా ఆగలేదు గంగన్న. వెంకటస్వామితోనే దారి ఖర్చులకు ఇప్పించుకొని, మరుసటిరోజు పొద్దున్నే ఎవరికి చెప్పకుండా, మూటాముల్లె సర్దుకొని కుటుంబంతో ఊరు వదిలి పెట్టినాడు. గతం అంతా గుర్తుకు వచ్చి కుమిలికుమిలి దుఃఖించినాడు గంగన్న. కనుకొలకుల నుండి చుక్కలు చుక్కలుగా కారిన కన్నీళ్ళు అతని గడ్డాన్ని తడిపివేసినాయి. ఆ జ్ఞాపకాలు చుట్టుముట్టి గంగన్న గుండె భారమైపోయింది. పక్కన కూచున్న నరసమ్మ అతడిని గమనిస్తూ ఉంది. అతని ఆలోచన ఏమిటో ఆమెకు అర్థమైంది. మనకు మాత్రమేనా ఈ గతి పట్టింది, ఎట్లాంటి రైతులు కూడా పనీపాటా కోసం ఊరు విడిచి పరాయి చోటికి

వెళ్ళిపోతా ఉండారు. కాలమెప్పుడూ ఇట్లాగే ఉంటుందా. రెండేళ్ళు మంచి శనక్కాయపంట పండల్లే గాని మన అప్పులు తీరేది ఎంత సేపు. మళ్ళీ వానలు రాకపోతాయా. మన ఊరి చెరువు నిండక పోతాదా. నువ్విట్లా యదారు పెట్టుకోవద్దు! పాండవుల్లాంటి వాళ్ళు పదమూడేళ్లు వనవాసం చేసినారంట. మనమనగా ఎంత? ఊరుకో..."అంటూ ఓదార్చింది నరసమ్మ. మరుసటి రోజు పొద్దున్నే రామప్పగారు పిల్వనంపితే నలుగురూ వెళ్ళి నిలబడినారు.

రామప్ప "చూడు గంగన్నా! నువ్వు మరీ సిగ్గుపడుతూ నా ముందు నిలబడొద్దు. నా మాదిరి నువ్వూ రైతువే, నీ సంగతంతా మా వెంకట స్వామి వివరంగా రాసినాడు. మీ ప్రాంత కరువు పరిస్థితులు ఇక్కడ అందరికీ తెలుసు. మీ ప్రాంతం నుండి వలసలు వచ్చిన వాళ్ళు ఈ చుట్టుపక్కల దండిగా ఉన్నారు. నువ్వేమీ సంకోచపడవద్దు. మీరంతా మీ సొంత ఇంటిలోమాదిరిగా ఇక్కడ ఉండిపోండి అని చెప్పినాడు. మీకు కావాల్సిన సంబరాలన్నీ అడిగి తీసుకోండి. ఇక్కడ కూడ మీరు రైతుల్లాగే బతకండి. మనందరిదీ రైతు వంశం. మనల్ని మనమే కాపాడుకోవాలి. మీరిక్కడున్నంత కాలము ఇక్కడి రేటుకంటే ఎక్కువగానే మీకు ఫలితం ఇస్తాను. మీ ప్రాంతంలో పరిస్థితులు చక్కబడగానే మీరు వెళ్ళవచ్చు..." అని చెప్పినాడు.

తెలతెలవారుతుండగా గంగన్న, నరసమ్మ నారాయణ, వెంకటలక్ష్మి పచ్చని వరిమళ్ళ గెనాల మీదుగా నడుస్తున్నారు... ఇక్కడి లాగా కనీసం ఒక్క ఎకరా భూమికైనా తమకు సాగునీరు వుంటే..అన్న ఆకాంక్ష వాళ్ళ మనసుల్లో సుడులు తిరుగుతోంది. ఆ ఎర్రటి పొలాలపై నీళ్ళెప్పుడు జాలువారుతాయా... ఇక్కడిలాగా అక్కడ కూడా పచ్చదనం ఎప్పుడు పరిమళిస్తుందా..! అన్న ఆశాంకురాలు వేగంగా మొలకలెత్తుతున్నాయి. కరువులో నడిచిన వాళ్ళ పాదాలు, మెత్తని పచ్చిక మీద ఒత్తిగిలినట్టు మృదువుగా సాగుతున్నాయి. మళ్ళీ తమ ఊరివేపు తమ పాదాలు పయనించాలని, వాళ్ళ మనసుల్లో అనంతమైన ఆశల సవ్వడులు ధ్వనిస్తూనే ఉన్నాయి.

వలస : బ్రతుకు తెరువు లేక ఉన్న ఊరి నుండి పని దొరికే ప్రాంతానికి వెళ్ళి, జీవనం సాగించడం.

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలివ్వండి. రాయండి.**

1. ఈ పాఠానికి "పయనం" అనేపేరు సరైనదేనా? ఎందుకో చెప్పండి?
2. ఈ కథలో మీకు బాగా నచ్చిన సంఘటనను గూర్చి మాట్లాడండి.
3. పాఠం చదవండి కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారో రాయండి.

అ) ఎంత బాగుందో అంది వెంకటలక్ష్మి, చుట్టూ ఉన్న పొలాలను చూసి.

అ) కడుపు చించుకుంటే కరువు కాళ్ళమీద పడుద్ది.

K2T8W2

**ఆ) కింది పేరా చదివి ప్రశ్నలు తయారు చేయండి.**

ఒకే భాషకు చెందిన జనసమూహాల పదజాలం, ఉచ్చారణలలో మార్పు సంతరించుకుంది. ఒక ప్రాంతంలో దైనందిన వ్యవహారంలో వాడే భాషను మాండలిక భాష అంటారు. తెలుగు భాషలో ప్రధానంగా మూడు మాండలికాలు ఉన్నాయి. 1.ఉత్తరాంధ్ర మాండలికం, 2.కోస్తాంధ్ర మాండలికం, 3. రాయలసీమ మాండలికం.

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలు ఉన్నాయి. కోస్తాంధ్రలో ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు ఉన్నాయి. రాయలసీమలో చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలున్నాయి.

**ప్రశ్నలు:**

1. ________________________________
2. ________________________________
3. ________________________________
4. ________________________________

**ఇ) కింది గేయాన్ని చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

కల్లాకపటం కానని వాడా!
లోకం పోకడ తెలియని వాడా!
నవధాన్యాలను గంపకెత్తుకొని
చద్ది అన్నమూ మూటగట్టుకొని
ముల్లుగర్రను చేత బట్టుకొని
ఇల్లాలును నీ వెంట బెట్టుకొని
ఎరువాకా సాగారో రన్నో చిన్నన్నా!
నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్నా!

**– కొసరాజు రాఘవయ్య**



**ప్రశ్నలు :**

1. కల్లాకపటం – అంటే అర్థం ఏమిటి ?

జ. ..............................................................................................

2. లోకం పోకడ అంటే ఏమిటి ?

జ. ..............................................................................................


3. ఈ గేయంలో ఉన్న ప్రాసపదాలు రాయండి.

జ. ..............................................................................................

4. కష్టమంతా ఎప్పుడు తీరుతుంది ?

జ. ..............................................................................................

**ఈ) పాఠం ఆధారంగా క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



రైతుల కష్టాలను గమనించిన నాటి ప్రధాని 'చరణ్ సింగ్' ప్రయత్నాల వల్ల జమీందారీ చట్టం రద్దయి కౌలుదారీ చట్టం అమల్లోకి వచ్చింది. రైతులకు బ్యాంకులు రుణాలు అందించే విధానం వచ్చింది. రైతు బంధుగా పేరు తెచ్చుకున్న 'చరణ్ సింగ్' జన్మదినమైన డిసెంబర్ 23ను జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకుంటారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు పంటల పెట్టుబడి కోసం వడ్డీ లేని ఋణాలు అందిస్తోంది. ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు మొదలగు వాటి కొనుగోలుకు రాయితీలు ఇస్తోంది. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. ఎందుకంటే రైతు దేశానికి వెన్నెముక. దేశాన్ని రక్షించే జవాన్‌కు, పంటలు పండించే రైతన్నకు గల ప్రాధాన్యాన్ని గుర్తించిన లాల్ బహదూర్ శాస్త్రి **"జై జవాన్ జై కిసాన్"** అని నినదించారు.

ప్రశ్నలు

**1. రైతుల దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?**

**జ.** ..................................................................................................

**2. రైతుబంధు ఎవరు?**

**జ.** ..................................................................................................

**3. దేశానికి వెన్నెముక ఎవరు?**

**జ.** ..................................................................................................

**4. "జై జవాన్ జై కిసాన్" అని నినదించినది ఎవరు?**

**జ.** ..................................................................................................

**ఉ) పాఠం ఆధారంగా క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. నరసమ్మ తన భర్తలో ఆత్మస్థైర్యం నింపిన మాటలు రాయండి.
2. ఈ పాఠంలో కరువు తీవ్రత గురించి చెప్పిన మాటలు రాయండి.
3. పయనం పాఠ్యభాగ రచయితను గూర్చి రాయండి ?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో సమాధానం రాయండి.**

1. పాఠ్యభాగ ఉద్దేశం రాయండి.
2. కరువు పరిస్థితులను అధిగమించాలంటే ఏం చేయాలో తెలుపుతూ పత్రికకు లేఖ రాయండి?

3. నరసమ్మ ఆత్మస్థైర్యం గల స్త్రీ అని ఎలా చెప్పగలవు?

4. వ్యవసాయ కూలీలు ఎందుకు వలస వెళతారు?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1) పయనం కథను మీ సొంత మాటల్లో రాయండి.

2) రామప్ప మంచితనం ఆధారంగా మీ గ్రామ పెద్ద మంచితనం గురించి రాయండి?

3) కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేసే వ్యక్తుల గురించి ప్రశంసిస్తూ రాయండి.



## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలను చదివి వాటి అర్థాలను పట్టికలో గుర్తించి రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

పదాలు : ఆకాంక్ష

1. నిర్జీవం
2. పరిమళం
3. అంకురం
4. దు:ఖము
5. వర్షాలు

| | | | | |
|---|---|---|---|---|
| గు | డి | సె | బా | లా |
| ప్రా | సు | వె | ధ | వు |
| ణం | వా | న | లు | కో |
| లే | స | లో | కం | రి |
| ని | న | మొ | ల | క |

**ఉదా : ఆకాంక్ష – కోరిక. వాక్యం: తల్లిదండ్రుల కోరికను పిల్లలు నెరవేర్చాలి.**

1. ______________ ______________________________________________
2. ______________ ______________________________________________
3. ______________ ______________________________________________
4. ______________ ______________________________________________

**ఆ) కింది వాక్యాలు చదవండి. వాటిలోని మాటలను మీ ప్రాంతంలో ఎలా మాట్లాడతారో అలాగే వాక్యాలను తిరిగి రాయండి.**

1. ఇంత దూరం నమ్ముకొని వస్తావుండామే! ఇక్కడ పరిస్థితులెట్లా వుండాయో! ఏమో!

______________________________________________________________

2. మీకేం భయం లేదు! పనిచేసే పురుసత్తు ఉండల్ల గాని, ఏదో ఒక ఆదరువు చూపిత్తాడు మా రామప్ప పొండి, రామప్ప ఇంటికాడే ఉండాడు.

______________________________________________________________

______________________________________________________________

**ఇ) కింది వాక్యాలలోని గీత గీసిన వికృతి పదాలకు ప్రకృతులను రాయండి.**

1. ఆకసంలో హరివిల్లును చూసి పిల్లలు అచ్చెరువొందారు.

జ. ..................................

2. ఆగస్ట్ నెలలో వరుసములు మెండుగా కురుస్తాయి.

జ. ..................................

3. బతుకు పయనం మధురమైనది.

జ. ..................................



## భాషాక్రీడ

**అ) 'ఉండి పొండి' అనే పదములో రెండు పదాలున్నాయి. ఉండి అనే పదానికి ఇక్కడ ఉండు అని అర్థం. పొండి అనే పదానికి వెళ్ళండి అని అర్థం. వేరు వేరు అర్థాలు వస్తున్నాయి. కానీ ఈ రెండు పదాలు కలిస్తే అర్థం 'ఇక్కడే ఉండండి' అని అర్థం వస్తోంది.**

ఇలాంటి పదాలు ఇంకా పాఠంలో ఉన్నాయి. వాటిని గుర్తించండి. మొదటి పదానికి రెండవ పదానికి అర్థం తెలుసుకోండి. రెండు కలిపితే ఏ అర్థం వస్తుందో రాయండి. ఇలాంటివి మరికొన్ని రాయండి.

1. కాని ______________________

కాలం ______________________

కాని కాలం ______________________

2. గుండె ______________________

భారం ______________________

గుండె భారం ______________________

3. నోళ్ళు ______________________

నొక్కుకొను ______________________

నోళ్ళు నొక్కుకొను ______________________

4. ఊపిరి ______________________

పీల్చుకొను ______________________

ఊపిరిపీల్చుకొను ______________________

5. అడుగంటి ______________________

పోవు ______________________

అడుగంటిపోవు ______________________

6. అడుగు ______________________

పెట్టు ______________________

అడుగుపెట్టు ______________________

**ఆ) కింది పదాలు రాయలసీమ మాండలికంలో ఉన్నాయి. ఈ పదాలు కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మాండలికాల్లో ఏయే రూపాలలో ఉంటాయో తెలుసుకొని రాయండి.**

| వ.నెం. | రాయలసీమ | కోస్తాంధ్ర | ఉత్తరాంధ్ర |
|---|---|---|---|
| 1. | పురసత్తు | ............... | ................ |
| 2. | కుదుమట్టసం | ................ | ................. |
| 3. | మదారు | ................ | .................. |
| 4. | సంబడం | ................ | .................. |
| 5. | గెనాలు | ................ | .................. |



## వ్యాకరణాంశాలు

**అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

ఉదా:- అతని ఆలోచనల్లో <u>జీవితమంతా</u> మెదలింది.

జీవితము + అంతా = ఉత్వసంధి.

1. గంగన్నలో ఆశాంకురాలు వేగంగా <u>మొలకెత్తాయి.</u>

జ. ________________ + ________________ = ________________

2. రైతు కోడలు పెట్టెలో <u>ఏముందని</u> తెరచి చూచింది.

జ. ________________ + ________________ = ________________

3. <u>రామప్పగారంటే</u> వీరే.

జ. ________________ + ________________ = ________________

4. <u>మనందరిదీ</u> రైతు కుటుంబం.

జ. ________________ + ________________ = ________________

**ఆ) కింది వాక్యాలలో ఉన్న సమాస పదాలను గుర్తించి, విగ్రహ వాక్యాలను రాయండి.**

1. ఆ గ్రామంలో రామప్ప పెద్దరైతు. ____________________
2. పల్లెలలోని పచ్చ పొలాలను చూస్తే ఆనందం కలుగుతుంది. ____________________
3. గంగన్నకు ఒకక్షణం తన ఊరి దృశ్యాలు కళ్ళముందు కదిలాయి. ____________________
4. అరుగు మీద కూర్చున్న అరవై ఏళ్ళ మనిషే రామప్ప. ____________________

### ఆమ్రేడిత సంధి

ఆహా + ఆహా = ఆహాహా

ఒకే పదం రెండు సార్లు పూర్వ, పరపదాలుగా ఉన్నప్పుడు పరపదాన్ని (రెండవ పదాన్ని) 'ఆమ్రేడితం' అంటారనికింది తరగతిలో తెలుసుకున్నారు. పై ఉదాహరణలో **పూర్వపదం చివర 'ఆ' అనే అచ్చు ఉండగా దానికి ఆమ్రేడితం పరమైంది. ఈ విధంగా అచ్చుకి ఆమ్రేడితం పరమైతే** పైన చూపినట్లుగా ఆమ్రేడిత సంధి జరుగుతుంది.

| సూత్రం : అచ్చునకు ఆమ్రేడితము పరమగునపుడు సంధి తరుచుగా జరుగుతుంది. |
|---|

**ఇ) కింది వాక్యాలలోని ఆమ్రేడిత సంధి పదాలను గుర్తించి విడదీసిరాయండి.**

1. అయ్యయ్యో! ఎంత కష్టం వచ్చిందో! ________________ + ________________
2. ఔరౌర! ఏమి వైపరీత్యము! ________________ + ________________
3. ఓహోహో! ఇంత జరిగిందా? ________________ + ________________

**ఈ) కింది వాక్యాలను పరిశీలించి, నేర్చుకుందాం.**

1. **అనుమత్యర్థక వాక్యం:–** అనుమతిని ఇస్తున్నట్లు సూచించే వాక్యాన్ని 'అనుమత్యర్థక' వాక్యం అంటారు.
2. **ఆశీరర్థక వాక్యం :–** ఆశీర్వచనాన్ని తెలిపే వాక్యాన్ని 'ఆశీరర్థక' వాక్యం అంటారు.
3. **ప్రశ్నార్థక వాక్యం :–** ప్రశ్నతో కూడుకొని ఉన్న వాక్యాన్ని 'ప్రశ్నార్థక' వాక్యం అంటారు.
4. **ఆశ్చర్యార్థక వాక్యం :–** ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ చేప్పే వాక్యాన్ని 'ఆశ్చర్యార్థక' వాక్యం అంటారు.
5. **నిషేధార్థక వాక్యం :–** చేసే పనిని నిషేధిస్తూ చెప్పే వాక్యాన్ని 'నిషేధార్థక' వాక్యం అంటారు.

పై వాక్యాలను కింది తరగతులలో నేర్చుకున్నాం కదా!

**ఉ) కింది వాక్యాలను చదవండి. అవి ఎటువంటి వాక్యాలో గుర్తించి, రాయండి.**

1. ఆహా! ఎంత బాగుందో! ________________________________
2. గిరీ ఎక్కడున్నావు? ________________________________
3. మీరు ఉత్తీర్ణులగుదురు గాక ! ________________________________
4. మీరు పుస్తకాలు తీసుకోవచ్చు. ________________________________
5. సిగ్గుపడుతూ నా ముందు నిలబడొద్దు. ________________________________

### అసమాపక క్రియలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| భూతకాలిక అసమాపక క్రియ | క్త్వార్థకం | తిని, | వెళ్ళి, | చూసి, | చేసి |
| వర్తమానకాలిక అసమాపక క్రియ | శత్రర్థకం | తింటూ, | వెళ్తూ, | చూస్తూ, | చేస్తూ |
| భవిష్యత్‌కాలిక అసమాపక క్రియ | చేదర్థకం | తింటే, | వెళ్తే, | చూస్తే, | చేస్తే |

**క్త్వార్థకం :** భూతకాల అసమాపక క్రియను క్త్వార్థకం అంటారు. అంటే ఈ అసమాపక క్రియ భూతకాలాన్ని బోధిస్తుంది.

ఉదా: గంగన్న కుటుంబం వలసవెళ్ళి, జీవితాన్ని గడిపింది.

**శత్రర్థకం :** వర్తమాన కాల అసమాపక క్రియను శత్రర్థకం అంటారు. ఈ అసమాపకక్రియ వర్తమానాన్ని తెలుపుతుంది.

ఉదా: గంగన్న తన కుటుంబాన్ని తలుచుకుంటూ బాధపడుతున్నాడు.

**చేదర్థకం :** భవిష్యత్ కాల అసమాపక క్రియను చేదర్థకం అంటారు. ఈ అసమాపక క్రియ భవిష్యత్తును తెలుపుతుంది.

ఉదా : వర్షం పడితే, పంటలు పండుతాయి.

**ప్రాజెక్టు పని** **రైతుల శ్రమను తెలిపే గేయాలు సేకరించి, నేర్చుకుని ప్రదర్శించండి.**

### పాఠాంత పద్యం



చ: జలరుహనాభ! రైతు, పశుసంపద దేశ సుభిక్షమయ్య, మే
మలరెడి పాడిపంటలకు హాలికులంత శ్రమించిరయ్య, దు
ర్బలులను బ్రోచుకర్షకులు భారతలక్ష్మికి ప్రాణమయ్య,యీ
కలియుగరైతులయ్య, త్రిజగన్నుతపావనులయ్య, మాధవా!

**బాలకవి – వేంకటరమణాచార్యులు**

భావం : ఓ మాధవా! పద్మము నాభియందు కలిగినవాడా! రైతులు మన దేశానికి పాడిపంటలను ఇవ్వడానికి ఎంత శ్రమిస్తున్నారో కదా! రైతు, పశువుల వల్లనే దేశం సుభిక్షమవుతుంది. బలహీనులైన వారిని పోషించే కృషీవలురు భారతదేశ సుసంపన్నతకు ప్రాణం వంటివారు. వారు మూడులోకాల వారిచే స్తుతింపబడుతున్న పవిత్రమూర్తులు.

సూక్తి - పని అనేది మానవుని విచారాన్ని పోగొడుతుంది - సిసిరో

## ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..............................................................
2. నేను గ్రహించిన విలువ ..............................................................
3. సృజనాత్మక రచన ..............................................................
4. భాషాంశాలు ..............................................................

మే14వ తేదీని ప్రపంచ వలస దినోత్సవంగా జరుపుకొంటాం

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1) కరువు వచ్చినప్పుడు ప్రజలు పడే కష్టాలను విద్యార్థులకు వివరించండి.

2) రైతులు ఆత్మగౌరవంతో జీవించే విధానాన్ని తెలియజేయండి.

3) కరోన వలస జీవుల కష్టాలను వర్ణించే రచనలు సేకరించి చదివించండి.

## మేటి పద్యాలు

**అక్షర విన్యాసం**

*నీ నామ మననమును నే*
*మానను నా మనమున - నను మానమ్మున్నే ?*
*నీ నామమె నా నామము*
*నా నీమము మామమామ నమ్మును మనుమన్* (ద్వ్యక్షర పద్యం)

*****

*మౌని యను నియమ మయమున*
*నేననయము నియమమూని నిన్నెన్నన్నన్*
*మానుము నీ యనుమానము*
*నేనౌ నీనమ్మిన యమినిన్ నను మను మీ* (త్ర్యక్షర పద్యం)

*****

*కమలాకర కమలాకర*
*కమలాకర కమలకమల కమలాకారా !*
*కమలాకర కమలాకర*
*కమలాకరమైన కొలనుగని రాసుదతన్* (చతురక్షర పద్యం)

**పద్యాత్మక పొడుపు కథ**

*అంచిత చతుర్థ జాతుడు*
*పంచమ మార్గమున నేగి ప్రథమ తనూజన్*
*గాంచి తృతీయం బక్కడ*
*నుంచి ద్వితీయంబుదాటి యొప్పుగవచ్చెన్* (భూమి, నీరు,అగ్ని, వాయువు, ఆకాశాలు)

పాఠాంత అంశము

## దేశభక్తి కథ



కోటయ్య మధ్య తరగతి కుటుంబికుడు. అతని వృత్తి వ్యవసాయం. తనకున్న పది ఎకరాల భూమిలో రాత్రింబవళ్ళు పనిచేస్తాడు. ఒక్కొక్కసారి ఆశించిన ఫలితం రాకున్నా నిరుత్సాహ పడక వచ్చిన ఫలంతో సంతృప్తిగా జీవిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య వినయం, వివేకం గల గృహిణి. ఇలా చాలా కాలం గడిచిపోతుంది. కోటయ్య పెద్దకుమారుడు ప్రసాద్ బి.యస్సీ చదువును పూర్తి చేశాడు. ఆశించిన ఉద్యోగం కోసం ప్రయత్నం చేయకుండా తమకున్న పొలంలోనే వ్యవసాయం చేయాలనుకున్నాడు. తన అభిప్రాయాన్ని తండ్రికి తెలిపాడు.

కోటయ్య ఆశ్చర్యపోయి "అదేమిటిరా ఇంత చదువు చదివి, వ్యవసాయం చేస్తానంటావేమిటి? వ్యవసాయం వల్ల నీకేమి లాభం? చదువుకున్న వాడివి ఏ ఉద్యోగంలోనో చేరొచ్చుగదా..!" అన్నాడు. అప్పుడు ప్రసాద్ నాన్నగారు..! వ్యవసాయం ఒకశాస్త్రం. ప్రభుత్వం వ్యవసాయం గురించి ఎంతగానో ఆలోచించి, దీని కోసం వివిధ పథకాలు అమలు పరుస్తూ, రైతులకు ప్రోత్సాహమిస్తోంది. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే కావలసినంత ఆదాయం వస్తుంది. రైతులు పంటలు పండిస్తూ తాము పండించే పంటల ద్వారా దేశంలో ఎంతో మంది ఆకలి తీర్చిన వాళ్ళవుతారు. అంతే కాకుండా వ్యవసాయం దేశాభివృద్ధిలో ప్రముఖ స్థానం వహిస్తుందని" చెప్పాడు. ఇంత వివేకంతో ప్రసాద్ చెప్పిన మాటలను కోటయ్య కాదనలేకపోయాడు.

ఉన్నత విద్య చదువుకున్న ప్రసాద్ తన తల్లిదండ్రుల సహకారంతో వ్యవసాయంలో ప్రవేశించాడు. తన తోటి గ్రామస్థులందరిని కూడగట్టుకొని 'రైతు సంఘాన్ని' స్థాపించాడు. మన దేశంలో జనాభా పెరిగినంతగా సాగు భూమి పెరగలేదని ఈ రోజుల్లో నూతన పద్ధతుల ద్వారా పంట దిగుబడి పెంపకం చాలా అవసరం అని గుర్తించాడు. దీని కోసం వ్యవసాయ శాఖ వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. ప్రభుత్వం రైతులకిచ్చే ప్రోత్సాహకాన్ని తనతోపాటు రైతులందరూ సద్వినియోగం చేసుకునేలా చేశాడు. వ్యవసాయంలో అధిక దిగుబడులను ఎలా సాధించాలో వ్యవసాయశాఖ వారు ప్రచురించే పుస్తకాలు, కరపత్రాల ద్వారా తెలుసుకుని, తోటి రైతులందరికీ తెలియజేశాడు. సహకార సంఘాల ద్వారా విత్తనాలు, క్రిమి సంహారక మందులు, రాయితీల ద్వారా ఎరువులను పొందాడు. సాటి రైతులను కూడా మెరుగైన స్థితిలో ఉంచాడు.

ఇప్పుడు ఆ గ్రామస్థులందరికి ప్రసాద్ ఆదర్శవంతుడు. ఇతర గ్రామాల రైతులందరికీ మార్గదర్శకుడు. వ్యవసాయాభివృద్ధితో పాటు తమ గ్రామానికి కావాల్సిన సౌకర్యాలు రోడ్లు, విద్యుత్, ఆసుపత్రి, గ్రంథాలయం మొదలైన వసతులను ఏర్పాటు చేశాడు. పాఠశాలను ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేశాడు. తమ ఊరిని ఆదర్శ గ్రామంగా నిలిపాడు. కోటయ్య ఇదంతా చేసిన తన కొడుకును చూస్తూ "చదువు కేవలం ఉద్యోగాల కోసమే కాదు, జీవితాల బాగు కొరకు కూడా. జీవించడం కోసం చేసే ప్రతి పనీ గౌరవించ దగినదే. నీలాగా చదువుకున్న వారు వ్యవసాయం చేయడం, చేయించడం నిజమైన దేశభక్తి" అని తన మనసులో అనుకొన్నాడు, ఇదే విషయాన్ని అందరికి చెప్పసాగాడు.


7

# చైతన్యమూర్తులు

X5Y6T4

ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి ఎందరో మహనీయులు కృషి చేశారు. వీరి సామాజిక రంగాలు వేరైనప్పటికీ వీరు చేసిన సేవలు ఎన్నటికీ మర్చిపోలేనివి. వారిలో కొందరిని గురించి తెలుసుకుందాం.

## సంఘసంస్కర్త వీరబ్రహ్మం



వీరబ్రహ్మంగారు ప్రకృతాంబ, పరిపూర్ణయ్య దంపతులకు (1608-క్రీ.శ) లో ప్రభవించారు. సమకాలీన సమాజంలోని సాంఘిక, మత దురాచారాలను, మూఢ విశ్వాసాలను ఖండించి, సరికొత్త తత్త్వాన్ని ప్రబోధించారు. ఆయన ప్రబోధాల ఫలితం వల్ల హిందూ మహమ్మదీయ మతస్థులలో సహనం, సమన్వయం మౌలిక సూత్రాలయ్యాయి.

బనగానపల్లెలో గరిమిరెడ్డి అచ్చమ్మ గారింట్లో పశువులు కాయటానికి 'వీరంబొట్లయ్య' వీరబ్రహ్మం గోపాలకుడుగా చేరారు. తాను మేపుతున్న పశువుల చుట్టూ ఒక గీత గీయగా క్రూరజంతువులు లోపలకు వచ్చేవికావు. గిరి లోపలి పశువులు బయటకు వెళ్ళేవికావు. ఆసమయంలో తాను 'రవ్వలకొండ'లో గుహలో కూర్చుని తాళపత్రాలపైన కాలజ్ఞాన తత్త్వాలు రాసుకునేవారు. ఒకనాడు అచ్చమ్మ రహస్యంగా అడవికి వెళ్ళి ఆయన మహిమలు చూసి, తెలుసుకొని శరణువేడి అతనికి శిష్యురాలైంది. అప్పటినుండి 'వీరం బొట్లయ్య' 'వీరయ్య'గా మారారు.

పెద్దకామెర్ల గ్రామ నివాసి శివకోటయ్య కుమార్తె 'గోవిందమ్మ'ను వివాహం చేసుకున్నారు. ఆ దంపతులకు సిద్ధలింగయ్య, గోవిందయ్య, పోతులూరయ్య, శివరామయ్య, ఓంకారమయ్య అనే ఐదుగురు కుమారులు, వీరనారాయణమ్మ అనే కుమార్తె కలిగారు. కర్మానుష్ఠానం చేస్తూనే కర్మసన్న్యాసిగా ఉన్న రాజయోగి వీరబ్రహ్మం.

కాలజ్ఞానం, ద్విపదకాలజ్ఞానం, సౌజన్య పత్రికలు, జీవైక్యబోధ, సిద్ధగురుబోధ, కాళీమకుటంతో వీరకాళికాంబా శతకం, కాళికాంబా సప్తశతి, గోవిందమ్మ వాక్యాలు అనేవి వీరబ్రహ్మంగారి రచనలు. వీరబ్రహ్మం తెలుగుకవులలో విశిష్టమైన కవి. ఆయన కవిత్వం సామాజిక మార్పుకోరే వారంతా అధ్యయనం చేయాలి. ఎందుకంటే వీరబ్రహ్మం కులాలకు, సమూహాలకు, స్థలాలకు, ఆశ్రమాలకు పరిమితం కాకుండా అప్పటి సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. అంతేకాక ఆనాటి సాంఘిక, ఆధ్యాత్మిక రంగాలలో ఆధిపత్యాన్ని ధ్వంసం చేసి, తనచుట్టూ అల్లిన మౌఢ్యాన్ని ప్రవచనాలతో కడిగి పారేశారు. సంప్రదాయంలో ఉంటూనే సంప్రదాయంపై తిరుగుబాటు చేసిన వ్యూహకర్తగా వీరబ్రహ్మాన్ని గుర్తించవచ్చును.

వీరబ్రహ్మంగారు స్త్రీలను గౌరవించమన్నారు. కులాలన్నీ సమానమన్నారు. సోమరితనం వద్దన్నారు. శ్రమను,

శ్రామికులను గౌరవించమన్నారు. మోసం, దగా, కుట్రలు వద్దన్నారు. చిల్లరరాళ్ళకు మొక్కొద్దన్నారు. అన్నింటికీ దేహమే మూలమన్నారు. గురుశిష్యుల సంబంధాన్ని గూర్చి చెప్తూ జ్ఞానం ఒకరి సొత్తు కాదని, దానికి కుల, మత, లింగ వివక్షతలుండకూడదని చాటారు. సిద్దయ్య, కక్కయ, అన్నాజయ్య, ఆనంద భైరవ యోగి, రెడ్డప్పస్వామి మొదలైన వారిని శిష్యులుగా గ్రహించి కుల, మత, వర్ణ, వర్గ రహిత సమాజానికి బీజం వేశారు.


వీరబ్రహ్మంగారు స్త్రీ పురుషులిద్దరూ సమానమని చెప్పి లింగవివక్ష వలదన్నారు. కర్మ సిద్ధాంతాన్ని వదిలి, ప్రతివ్యక్తి తనను తాను తెలుసుకుని పేరు, ప్రతిష్ఠల కోసం ప్రాకులాడకుండా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటూ బ్రతకమన్నారు. పరపీడన, కులమౌఢ్యంతో మనిషిని పశువుగా మారొద్దన్నారు. సంపద ఒకచోట కుప్పపోసి నిరుపయోగం చెయ్యొద్దని, ఉన్నదానిలో కొంత దానం చెయ్యాలని చెప్పిన సామ్యవాది వీరబ్రహ్మం. అస్పృశ్యత అమానుషమని, చదువుల వల్ల వినయం పెరగాలని ప్రబోధించారు. ఏ సాంఘికాంశానికైనా మూలాన్ని గ్రహించి, ఎవరైనా దౌర్జన్యకరంగా మాట్లాడితే మౌనమే సమాధానమన్న అహింసావాది వీరబ్రహ్మం.

నీతి, ప్రేమ బోధించని చదువులు, జ్ఞానం వ్యర్థమని, మనసులో దీపం పెట్టే అర్థవంతమైన చదువులు చదవాలని చెప్పిన సమతావాది వీరబ్రహ్మం.

అన్ని మతాలలో మంచిని సమన్వయం చేసుకొని, పరస్పర సహకారంతో మెలిగే సంఘాన్ని నిర్మింపచేసుకోమన్న మహనీయుడు వీరబ్రహ్మం. తీర్థాలన్నీ శరీరంలోనే ఉన్నాయని, మనుషులందరూ కలిసిమెలిసి జీవించే నూతన సమాజం ఏర్పడాలని కాంక్షించిన సామ్యవాది, మానవతావాది వీరబ్రహ్మం.

## జానపద బ్రహ్మ
## నేదునూరి గంగాధరం

**"నేదునూరి గంగాధరం – పథమంతా జానపదం, తెలుగు వాఙ్మయపు వెలుగు తెలిపినట్టి దిట్టలలో, చూడంగా గంగాధరం – మేరువురా గంగాధరం"**



అన్న **వానపల్లి నూకరాజు**గారి మాటలు అక్షరసత్యాలు. జనం నోట్లో నానుతూ వారి నుంచి వచ్చేదే జానపదం. చాల కాలం వరకు దీనిని ఒక సాహిత్య ప్రక్రియగా ఎవరూ గుర్తించలేదు. జానపద సాహిత్యం గొప్పదనాన్ని తెలుసుకొని కనుమరుగు కాకుండా ముందు తరాలకు అందించాలని భావించారు గంగాధరం. ఆ సంకల్పంతో ముందుకు సాగి ఇరవై ఎనిమిది ఏళ్లు శ్రమించి ఎన్నో రచనలు సేకరించారు. తాను స్వీయ రచనలు చేసారు. జానపద సాహిత్య సేకరణ కోసం తను సంపాదించిందంతా ధారబోసిన జానపద సాహిత్యజ్యోతి. జానపదవాఙ్మయ భిక్షువు. "శ్రీ నేదునూరి గంగాధరం". జానపద సాహిత్య సేకరణలో పతి అడుగుజాడల్లో నడుస్తూ తనదగ్గరున్న బంగారాన్ని, విలువైన చీరలను కూడా తృణప్రాయంగా ఇచ్చేసిన మహాసాధ్వి గంగాధరం సహధర్మచారిణి గంగమాంబ. నేదునూరి గంగాధరంగారు 1904 జూలై 4వ తేదీన రాజమండ్రికి మూడు మైళ్ళ

దూరంలో ఉన్న కొంతమూరులో జన్మించారు. 1930లో ఎలిమెంటరీ స్కూలు టీచరుగా రాజమండ్రికి వచ్చి తన సాహిత్య కృషిని కొనసాగించారు. ఈయన అనేక నాటకాలను, పద్యకవితలను రచించారు. ఈ సమయంలోనే జానపదుల గుండెలో నుండి వెలువడిన జానపద సాహిత్యాన్ని వెలికితీసే ప్రయత్నం మొదలయింది.

ఆంధ్రజాతి ప్రాచీనత, సంస్కృతి, భాష, సాహితీవైభవము మన జానపదవాఙ్మయంలో కన్పిస్తుంది. వీరి అముద్రిత గ్రంథాలలో పదాలు-పదకథలు, గేయాలు, సంవాదాలు, హాస్యపాటలు, లాలిపాటలు, చెక్కభజనలు, పాటలు,జానపద చాటువులు, కథలు-గాథలు, సామెతలు, పిల్లల ఆటపాటలు, మాండలిక పదకోశము, సాంప్రదాయక విజ్ఞానం, పారిభాషిక పదాలు, జీవద్భాషానిఘంటువు, స్త్రీల వేడుకపాటలు, పేరంటాళ్ళ కథలు, కుశల విద్యలు, కులయాచకులు, ఔషధము-వస్తుగుణ వివరణ మొదలైనవి ఎన్నో ఉన్నాయి.

నేదునూరి గంగాధరం గారు తనకున్న ఆరు ఎకరాల భూమి, తుదకు తన భార్య మెడలోని పుస్తెలు కూడా అమ్మి జానపద వాఙ్మయాన్ని సేకరించారు. జానపద సాహిత్యం కోసం ఆయన ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తూనే సెలవుల్లో కాలినడకన ఊరూరు తిరిగేవారు. జనాన్ని చైతన్యపరిచి, తనకు కావలసిన సమాచారాన్ని వారినుండి సేకరించేవారు. ఆంధ్రదేశంలోని పాతపాటలు సేకరించడంలో విశేష కృషిచేశారు. తెలుగు సాహిత్య ప్రియులు ఆయన రుణం తీర్చుకోలేనిది. మన దేశంలో జానపద సాహిత్యానికి సంబంధించిన రెండే గ్రంథాలయాలున్నాయి, వాటిలో ఒకటి పంజాబ్ రాష్ట్రంలో దేవేంద్ర సత్యార్థిగారిది. మరొకటి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని నేదునూరి గ్రంథాలయం. ఇంత విశిష్టత ఉన్న గ్రంథాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకు గర్వకారణం.


సుమారు 40 ఏండ్ల నిర్విరామ కృషి, శ్రమతో గంగాధరంగారు భద్రపరచిన సాహిత్యంలో కొన్ని వెలుగు చూశాయి. వాటిలో వ్యవసాయ సామెతలు, జానపద వ్యాసాలు, పసిడిపలుకులు, మిన్నేరు, మున్నేరు, ఆటలు, పాటలు, స్త్రీల వ్రతకథలు, మంగళహారతులు వంటి సంకలన గ్రంథాలు, పండుగలు పరమార్థాలు వంటి విమర్శనాత్మక గ్రంథాలు ముద్రితమయ్యాయి.

తాను సేకరించిన జానపద గేయాలు, పాటలు ఏఏ ప్రాంతాలలో ఏ విధంగా ప్రచారంలో ఉన్నాయో కూడా వివరించారు. బుడబుక్కలవారు, కొమ్మదాసరివాళ్ళు, ఎరుకలవాళ్ళకు సంబంధించిన పాటలను సేకరించి, వారి ఆచారవ్యవహారాలను చక్కగా వివరించారు. ఇవి జానపద పరిశోధకులకు మార్గదర్శకాలుగా ఉన్నాయి.

గంగాధరంగారు తన జీవిత సర్వస్వాన్ని జానపదవాఙ్మయ సముద్ధరణకు ధారబోసి 1970 మార్చి 11వ తేదీన పరమపదించారు.



## మేటి చిత్రకారుడు
## వడ్డాది పాపయ్య



**"ఇటు సున్నా, అటు సున్నా, మధ్య నేనున్నా!**
**నిలువు గీతగా ఒకటిగా నిలుచున్నా!**
**ఇటు రజో వలయం, అటు తమో నిలయం !**
**సత్త్వమై సత్యమై నిలుచున్నా!**
**గతం సున్నా, భవిష్యం సున్నా!**
**వర్తమానమై నిలుచున్నా!"** అని తనను గురించి తాను చెప్పుకున్న చిత్రకారుడు వడ్డాదిపాపయ్య. తెల్లని ఖద్దరు పంచె, అదే రంగు లాల్చీ, ఆడంబరం లేని సామాన్యుడు, చిత్రకళారంగంలో అసామాన్యుడు. వడ్డాది పాపయ్య కళాదృష్టి అద్భుతసృష్టి. వీరు అందమైన, ఆహ్లాదకరమైన, అపురూపమైన వర్ణచిత్రాలు గీయడంలో దిట్ట. తెలుగు సంస్కృతిని, పురాణాలను, పండుగలనూ, దేవతలనూ తన కళాచాతుర్యం తో అందమైన చిత్రాలుగా మార్చి, కళాభిమానులను రంగుల లోకంలో విహరింప చేసిన గంధర్వ చిత్రకారుడు వడ్డాది పాపయ్య.

పాపయ్య గారు సెప్టెంబర్ 10, 1921 సంవత్సరంలో మహాలక్ష్మి, రామమూర్తి దంపతులకు శ్రీకాకుళంలో జన్మించారు. తండ్రి వృత్తిరీత్యా చిత్రకళా ఉపాధ్యాయుడు కావడంతో వీరికి బాల్యంనుంచే చిత్రకళపై ఆసక్తి కలిగింది. తండ్రే కుంచె పట్టి ఓనమాలు దిద్దించారు. తండ్రి మిగిల్చిన రంగులతో బొమ్మలు గీయడం ప్రారంభించి, మొట్టమొదటగా 'హనుమంతుని' చిత్రం గీశారు. బాల్యం నుంచి బొమ్మలు గీయడంలోనే నిమగ్నమయ్యేవారు. చిత్రాలు గీయడంలో ఎన్నో ప్రయోగాలు చేసేవారు. రంగులనూ సొంతంగా తయారుచేసుకొనే వారు . ప్రకృతి రమణీయతను చిత్రకారుడు తన హృదయానుభూతిని పొంది చిత్రిస్తారాయన. ఎన్నో రకాల చిత్రకళా శైలులను అద్భుతంగా చిత్రించగల నైపుణ్యం కలవారు. చిత్రకళా శైలిని ఎవరూ అనుకరించలేని క్లిష్టత వారికే సొంతం. వారి చేతిలోని కుంచె బొమ్మల లాలిత్యం, సుకుమారత్వం ఉట్టిపడేలా చిత్రించేది. తాను గీసిన చిత్రాల మీద వ.పా అని తన పేరును రాసుకొనేవారు.

వ.పా చిత్రకారుడే కాక రచయిత కూడా. 1940 దశకంలో ఆయన అనేక కథలు రాశారు. ఆయనకు భారతీయ సనాతన ధర్మం మీద విపరీతమైన గౌరవం వుండేది. రామాయణ భారత ఇతిహాసాలను, పురాణాలను చదివారు. ఖగోళ, జ్యోతిష, ప్రాకృతిక శాస్త్రాలపై సంపూర్ణ అవగాహన వుంది. ఉపనిషత్తుల సారాన్ని బాగా గ్రహించారు. తెలుగు సాహిత్యంలో విశ్వనాథ, అడవి బాపిరాజు, బుచ్చిబాబు, కరుణశ్రీల సాహిత్యం చదివారు. కరుణశ్రీ పుష్పవిలాపం, ఉమర్ ఖయ్యాం, తిరుపతి వెంకటకవుల బాలల బొమ్మల భారతానికి బొమ్మలు వేశారు. పాపయ్య చిత్రాలను చూసి ముగ్ధులైన ప్రముఖనిర్మాత చక్రపాణి గారు, మద్రాసు పిలిపించుకొని "చందమామ, యువ" పత్రికలకు బొమ్మలు వేయించుకొన్నారు. దాదాపు 20 సంవత్సరాల పాటు తన బొమ్మలతో చందమామ పత్రికకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టారు

తెలుగు వారికి దేవతా మూర్తులు ఇలాగే వుండి వుంటారన్న భావన వీరి చిత్రాల ద్వారా కలిగింది. వారు గీసిన చిత్రాలలో గంగావతరణం, శివపార్వతుల కైలాసవైభవం, శ్రీరామపట్టాభిషేకం వాటికవేసాటి. వారు ఏ చిత్రాన్నయినా

గీయడం మొదలు పెడితే గంటగంటన్నరలోనే చిత్రాన్ని వేయడం, రంగులద్దటం పూర్తి చేసేవారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని కాలంలో చిత్రాలను అద్భుతంగా మలచడంలో వారి ఊహాశక్తి అనన్య సామాన్యం. అనుకరణకు సాధ్యం కాని శైలి, ఊహలకు కూడా అందని రూపాలలో చిత్రాల కూర్పు, రేఖల జిగిబిగి కళాభిమానులకు ఊపిరి బిగబట్టిస్తాయి. రంగుల మేళవింపులో వడ్డాది పాపయ్య గారు కొత్త అధ్యాయాన్ని సృష్టించారు.



చందమామ పత్రిక వారి సౌజన్యంతో

తీరిక సమయాలలో వీరు వ్యంగ్యచిత్రాలను గీసేవారు. వీరు గీసిన కార్టూన్లు బహుళ జనాదరణ పొందాయి. "యువ" పత్రికలో బొమ్మలకే ప్రాణం వస్తే శీర్షిక చాలా నవ్వు తెప్పించేది. వారిది ప్రత్యేక శైలి, వారు గొప్ప చదువరి గనుక బొమ్మల చిత్రీకరణలో వేషధారణ అంశాలు, భావాలు, వ్యాఖ్యా రచన అన్నీ వారికే చెల్లుతాయేమో అనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా వున్న చిత్రకారుల్ని గురించి, వారి శైలులని గురించి తెలుసుకొనే నిత్య విద్యార్థిగా ఉండేవారు. పాపయ్య గారు రవివర్మ,ధురంధర్, దామెర్ల రామారావు లు తనకు స్ఫూర్తి అనేవారు.ఆయన అంత గొప్ప చిత్రకారుడైనా తను నివసించే కశింకోట గ్రామంలో ఒక సామాన్యునిలా వ్యవహరించేవారు. తన కళాసృజనకు ఆటంకం కల్గించకూడదని జాగ్రత్త పడేవారు. వ్యక్తి ఆరాధనను ప్రోత్సహించకూడదనే ఉద్దేశంతో తనను కలుసుకోడానికి వచ్చిన వారితో నిర్మొహమాటంగా మాట్లాడేవారు. కాలం విలువ తెలిసిన వారు కావడంతో తన వద్దకు వచ్చిన వారితో క్లుప్తంగా మాట్లాడేవారు. ఎవరైనా తనను పొగడుతుంటే గుర్తింపూ, ప్రశంసా గుర్రానికి మేత లేని మాలీషు వంటివని, వ్యక్తిని కాదు ఆయన కృషిని గుర్తించాలనేవారు. ప్రచారానికి ఆర్భాటాలకు దూరంగా వుంటూ లలితకళా వినీలాకాశంలో వెలుగొందిన చిత్రకళా సూరీడు వపా.

1992 సంవత్సరంలో మనకు దూరమైనా ఆయన గీసిన చిత్రాలుమాత్రం అందరి మనస్సులలో శాశ్వతంగా వుండిపోతాయి. వడ్డాది పాపయ్యగారు తాను గీసిన చిత్రాలతో ఆచంద్రతారార్కం జీవించే వుంటారు.

## తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు
# ఫాతిమా షేక్



**తనకు ఎన్ని అవమానాలు ఎదురైనా కేవలము పేద బాలికలకు విద్య నేర్పడం కోసము తన జీవితాన్ని త్యాగం చేసిన ఒక మహిళా మూర్తి గురించి తెలుసుకుందాం. ఎక్కడైతే అవమానింపబడ్డారో అక్కడే ఒక ఉపాధ్యాయినిగా గౌరవించబడ్డారు "ఫాతిమా షేక్".**

ఫాతిమా షేక్ 1831 జనవరి 9న జన్మించారు. చిన్నతనంలోనే ఫాతిమా తన తల్లిదండ్రులను కోల్పోయారు. ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ పర్యవేక్షణలో ఆమె పెరిగి పెద్ద అయ్యారు. వారి బంధువు మున్షి గఫార్ సంరక్షణలో ఈ అన్నాచెల్లెళ్ళు ఇద్దరూ పూనా పట్టణంలోని గంజి పేట్ ప్రాంతంలో ఆవాసం ఏర్పరచుకొని స్థిరపడ్డారు. ఫాతిమా షేక్ సోదరుడు ఉస్మాన్ షేక్ తన చెల్లెలిని అల్లారుముద్దుగా చూసుకునేవారు . ఆర్థికంగా స్థిరపడిన తన అన్న ప్రోత్సాహంతో ఫాతిమా ధార్మిక విద్యను, ఉర్దూను చదవడం, రాయడం నేర్చుకున్నారు.

బాలికలకు విద్యను నేర్పేందుకు పూలే దంపతులు ఉస్మాన్ షేక్ సహకారం కోరినప్పుడు పూలే దంపతుల లక్ష్యసాధనలో తనవంతు పాత్రను నిర్వహించాలని ఫాతిమా షేక్ నిశ్చయించుకున్నారు. ఆమె నిర్ణయాన్ని అన్న ప్రోత్సహించారు .ఆ నిశ్చయం మేరకు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వలె తాను కూడా విద్యాబోధన చేయాలంటే మరాఠీ- ఆంగ్ల భాషలను అభ్యసించవలసిన అవసరం వచ్చింది. అందుకు ఫాతిమా సంసిద్ధురాలై పూలేదంపతుల మార్గదర్శకత్వంలో మరాఠీభాషను నేర్చుకున్నారు. ఫాతిమా షేక్ మరాఠీభాషను నేర్చుకుని తర్వాత అదే పాఠశాలలో ఉపాధ్యాయినిగా సేవలందించారు.

D6P1L9

ఉపాధ్యాయ శిక్షణ నిమిత్తం సావిత్రిబాయి పూలే, ఫాతిమా అహ్మద్‌నగర్‌లోని మేడం సింథియా ఫెరారే మిషనరీ పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఉపాధ్యాయ శిక్షణలో మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందారు. ప్రభుత్వం చేత గుర్తించబడిన అధికారిక ఉపాధ్యాయ శిక్షణాలయంలో ఉపాధ్యాయవృత్తివిద్యాశిక్షణ పొందిన తొలి ముస్లిం మహిళగా ఫాతిమాషేక్ చరిత్ర సృష్టించారు. తగిన విద్యార్హత పొంది ఆధునిక విద్యాబోధన చేసిన ప్రథమ ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఫాతిమా షేక్ కొనియాడబడ్డారు.

సుమారు170 సంవత్సరాల క్రితం తనకు తానుగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆధునిక విద్యను అభ్యసించి చదువు చెప్పడానికి తగిన అర్హతను సంపాదించి, స్వచ్ఛందంగా విద్యాసేవలను అందించడానికి నడుంకట్టిన ఫాతిమా షేక్ ఎన్నో భౌతిక దాడులను కూడా ఎదుర్కొన్నారు. సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ ఒక మహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సమన్వయంతో బాలికావిద్య కోసం కృషి చేశారు. ఇలా బాలికావిద్య కోసం శ్రమిస్తున్న వీరిని కొందరు ఆకతాయలు వేధింపులకు గురిచేశారు. ఎన్ని కష్టాలు పడుతున్నా వారిద్దరి పట్టుదల ఏమాత్రం సడలలేదు సరికదా మరింత బలపడింది. ఆకతాయిల చర్యలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నారు.ఎన్నో అవస్థలను ఎదుర్కొంటూ సావిత్రిబాయి వెంట మొక్కవోని ధైర్యంతో నడిచింది ఫాతిమా షేక్. సమాజం నుంచి దారుణమైన రీతిలో ఎదురైన అసమ్మతిని అవమానాన్ని, తిరుగుబాటును ఎదుర్కొని, ఆడ పిల్లల చదువుల కోసం బలంగా, స్థిరంగా నిలబడిన ఆదర్శ ఉపాధ్యాయురాలు "ఫాతిమా షేక్" అనడంలో సందేహం లేదు.


**కార్టూన్ స్వేచ్ఛా విహంగం**

# రాగతి పండరి



**చిత్రకళలోనుంచి పుట్టి రవ్వంత హాస్యం, చిటికెడు అతిశయోక్తి, చెంచాడు వ్యంగ్యం, జతచేసి గీసేదే వ్యంగ్యచిత్రం (కార్టూన్). తన వ్యంగ్యచిత్రాలతో సున్నితమైన హాస్యాన్ని చమత్కారాన్ని తెలుగు నుడికారాన్ని జతచేసి ప్రజలను చైతన్యవంతం చేయడానికి తన కళను ఉపయోగించిన చిత్రకారిణి ఈమె.** పురుష వ్యంగ్య చిత్రకారులు రాజ్యం చేస్తున్న కార్టూన్ జర్నలిజంలో ఒక స్త్రీ చిత్రకారిణిగా ప్రవేశించి అంచెలంచెలుగా ఎదుగుతూ, శారీరకలోపం తనకు అవరోధం కాదని నిరూపించారు ఆమె. కార్టూన్‌ల కోసమే పత్రికలు ప్రత్యేక శీర్షికలు నిర్వహించే స్థాయికి ఎదిగిన స్ఫూర్తి స్త్రీ చైతన్యదీప్తి రాగతి పండరి.

రాగతి గోవిందరావు, శాంతకుమారి దంపతులకు మూడో సంతానంగా 22-7-1965న పండరి విశాఖపట్నంలో జన్మించారు. పుట్టిన ఏడాదికే పోలియో మహమ్మారి సోకడంతో దివ్యాంగురాలయ్యారు. బడికి వెళ్ళే వీలు లేకపోవడంతో అక్క రమ చెప్పే పాఠాలతో చదువుకున్నారు. ఇంట్లో అందరూ సాహిత్యప్రియులు కావడంతో ఆమె కూడా పుస్తకాలతో సహవాసం చేసేవారు. పత్రికలు చదువుతున్నప్పుడు ప్రముఖ వ్యంగ్యచిత్రకారులు 'శ్రీ జయదేవ్' గారి చిత్రాలు ఆమెను ఆకర్షించాయి. కార్టూన్‌లు గీయడం నేర్చుకోవాలనే తలపుతో, మొక్కవోని దీక్షతో స్వయంగా గీయడం నేర్చుకున్నారు. ఒకరోజు ధైర్యం చేసి ఆమె వేసిన కొన్ని కార్టూన్‌లను జయదేవ్ గారికి పంపి తన విషయం తెలియజేసి కార్టూన్‌ల లోపాలను తెలియజేయమని రాశారు. ఆయన అవి చూసి ఆ కార్టూన్‌లు ఉండాల్సిన సైజు, రాసే విధానం వంటి చిన్న చిన్న సవరణలను తెలియజేశారు. మొదట్లో పత్రికలకు ఆమె పంపిన కార్టూన్‌లు తిరుగుటపాలో వచ్చినా అధైర్యపడలేదు. అది ఆమెలోని పట్టుదలను పెంచింది. ఆమె ఎనిమిదేళ్ళ వయసులో మొదటి కార్టూన్ ఆంధ్రజ్యోతిలో ముద్రింపబడి సంచలనం సృష్టించింది.




వ్యంగ్యచిత్ర ప్రస్థానాన్ని మొదలుపెట్టిన ఆమె ఇక వెనుదిరిగిచూడలేదు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ప్రగతి అనామిక, స్పందన, స్వాతి, యువ, జయశ్రీ, కల్పన, మహిళ వంటి ఎన్నో పత్రికల్లో ఆమె కార్టూన్‌లు ప్రచురింపబడేవి. మొదటగా ఆంధ్రజ్యోతి పత్రిక వారు అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా 'రాగతి పండరి' ఫోటో కార్టూన్‌తో సహా ఆమెను పరిచయం చేశారు. రాగతి పండరిని చూసిన పాఠకులు ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు. ఆమె

కార్టూన్‌లు సమకాలీనసమాజంపై స్త్రీ సమస్యలపై మానవ ప్రవృత్తిలోని ద్వంద్వ ఆలోచనా విధానంపై ఎక్కు పెట్టిన బాణాలు. అవి నచ్చి అభిమానులు ఆమె కార్టూన్‌ల కోసం పత్రిక కొనడం మొదలుపెట్టారు. కార్టూన్‌లతో పాటు ఆమె సంపాదకుని కోరికపై గుండ్రని చేతిరాత చక్కటి చిత్రాలతో 'కవి చమత్కారాలు' అనే శీర్షికతో చిత్రాలు గీశారు.

తరువాత కొన్నాళ్ళకు ఆమె కార్టూన్‌లతో పాటు పత్రిక సంపాదకులు 'వీరాజి' గారి కోరిక మేరకు హాస్యధారావాహికలకు (సీరియల్) బొమ్మలు గీయడం మొదలుపెట్టారు. శ్రీ గోలి శంకరరావు గారితో కలిసి కార్టూన్‌లతో కథను మలచడం మొదలుపెట్టి సఫలీకృతులయ్యారు. ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రికలో "అయ్యో పాపం అబ్బాయిలు", "యవ్వనం పిలిచింది", "దెయ్యాలు ఎక్కడున్నాయి", "కవి చమత్కారాలు" అనే శీర్షికలకు చిత్రాలు గీశారు. ఆంధ్రభూమి సంపాదకులు వారంవారం రాసే సంపాదకీయ వ్యాసం అయిన "సికరాజకీయం" అనే దానికి అనుబంధంగా కార్టూనులు వేసి పత్రికా ప్రేమికులనే కాక రాజకీయ నాయకులను సైతం మెప్పించారు. ఆంధ్రభూమి వారపత్రికలో రాజకీయ చదరంగం, శ్రీమతి, ఇద్దరమ్మాయిలు, కాలేజీ గాల్స్ వంటి శీర్షికలతో 9 సంవత్సరాలు ధారావాహికంగా శీర్షికను నిర్వహించి, ప్రతివారం ఆంధ్రపాఠక లోకాన్ని నవ్వుల సంద్రంలో ఓలలాడించారు.




ఆంధ్రజ్యోతి సంపాదకులు పురాణం గారి కోరికపై నవగ్రహం, అనుగ్రహం, మగాడిచెవిలో పూలు, భళే భళారే అనే పేర్లతో శీర్షికలు నిర్వహించారు. దీపావళి పండుగ కోసం వివిధ పత్రికల వారు ప్రత్యేక సంచికలను విడుదల చేసేవారు. అ సమయంలో దీపావళి టపాసులు పేలకపోయినా ఆమె వేసిన కార్టూన్‌లు మాత్రం పేలేవి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారు సైతం ఆ ప్రత్యేక సంచికను తెప్పించుకోవడానికి కారణం రాగతి పండరిగారే.

ఆమెకు గురు సమానులైన జయదేవ్ గారు ఆమె కార్టూన్‌ల గురించి రాగతి పండరి కార్టూన్ సామ్రాజ్యాన్ని మొత్తం తను కైవసం చేసుకున్న ఏకైక మహిళా కార్టూనిస్టుగా ప్రశంసించారు. సామాజికస్పృహతో అనునిత్యం కొత్తకొత్త అంశాలపై ఆమె విసిరిన విసురులు కోకొల్లలు. ముఖ్యంగా తెలుగు మహిళల జీవనసమస్యలను ఆకళింపు చేసుకుని వ్యంగ్యం జోడించి తన సన్నటి, అతి స్వల్పమైన గీతలతో పొందికైన వ్యాఖ్యలతో నవ్వుల పంటను పండించింది. పండుగలకు, పబ్బాలు, అల్లుళ్ళు, ఆడపడుచులు, దొంగలు, పోలీసులు, ఆఫీసులు, పార్కులు.... ఆమె తాకని వస్తువు అంటూ లేదు. లాగని తీగలేదు, నడవని డొంకలేదు, స్వైరవిహారమే. కార్టూన్‌లో ఏమూల వెతికినా తేట తెలుగుదనమే. ఏ చోట స్పృశించినా తేనెల తెలుగుమాటలే. దివ్యాంగురాలైన స్త్రీ అయినప్పటికీ అకుంఠిత దీక్ష, నిరంతర పరిశ్రమ, వ్యంగ్యచిత్రకళమీద ఉన్న మక్కువతో, స్వయం కృషితో, ఇంతింతై అన్నట్లు ఎదిగిన స్వయం ఉపాధి మహిళా కార్టూనిస్టు. తెలుగు పాఠకలోకానికి హాస్యామృతాన్ని పంచిన ఈమె ఊపిరితిత్తుల వ్యాధితో 19-02-2015లో స్వర్గస్తులయ్యారు. ఈమెను స్ఫూర్తిగా తీసుకొని మీరూ కార్టూన్లు గీయడానికి ప్రయత్నించండి.

**'ఉత్తమ ఉపాధ్యాయిని'**
## తాడి నాగమ్మ (1908 )



**స్వాతంత్ర్యోద్యమ సంగ్రామంలో ఆంధ్ర మహిళలు ఎందరో ఉద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమం తర్వాత వారు అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు నెలకొల్పి అవసరం ఉన్న స్త్రీలకు పిల్లలకు స్వతంత్రంగా జీవించడానికి చేయూతనిచ్చారు. వారికి స్వాతంత్ర్యోద్యమం మొదటి మెట్టు అయితే సేవారంగం రెండో మెట్టు అయ్యింది. దేశభక్తికి సమాజసేవకు భాష, వర్గ విభేదాలు అడ్డు కావని నిరూపించారు. అలాంటి త్యాగశీలిని గూర్చి తెలుసుకుందాం.**

తూర్పుగోదావరి తీరాన, రాజోలు తాలూకా ఆదుర్రు శివారు మోరిపోలం గ్రామానికి అనుబంధంగా సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన కూలి, నాలి చేసుకొని బతికే ఇరవై ముప్పై కుటుంబాలు ఉండేవి. ఆగ్రామంలో జులై ఆరవ తేదీన తాడి నాగమ్మ జన్మించారు. ఆ మట్టిలో ఉన్న ప్రభావం ఏమిటో కాని ప్రతియింటా చదువులో రత్నాలుగా వెలిసిన వాళ్ళున్నారు. ఒక డాక్టరో, ఇంజనీరో, గ్రాడ్యుయేటో అయ్యారు. మోరిపోలం ప్రాంతమంతా బౌద్ధస్తూపాలకు నిలయం. బహుశ ఆ వారసత్వం వల్ల అందరూ చదువులో పైకి వచ్చారేమో అనే నమ్మకం ఉంది.

ఐదవ తరగతి వరకు స్వంత గ్రామంలోనూ, హయ్యర్ గ్రేడ్ శిక్షణను రాజమండ్రిలోని పిఠాపురం రాజావారి పాఠశాలలోనూ చదివారు నాగమ్మ. తరువాత మోరిపోలం పాఠశాల ఉపాధ్యాయినిగా ఉద్యోగం చేసి, అక్కడి ప్రజలకు చేయూత నిచ్చి. చాలా మంది పిల్లలకు చదువు నేర్పారు. ఆమె పొన్నమండ, పాశర్లపూడి గ్రామాలలో ఉపాధ్యాయినిగా పనిచేసి, ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును అందుకున్నారు. పదహారవ యేట తాడి వెంకన్నను పెళ్ళి చేసుకొన్నారు. భర్త కుటుంబ పోషణ కొరకు రంగూన్ వెళ్లారు. కొంతడబ్బు పంపించేవారు. ప్రాథమిక విద్య కోసం మగపిల్లలను యిద్దరినీ మచిలీపట్నంలోని రాంజీరావు హాస్టల్‌లో చేర్పించారు. కొంత మెరుగైన ఆర్థిక పరిస్థితులతో తన ముగ్గురు పిల్లలను పెద్దగా చదువులు చదివించారు. ఆ కాలంలో ఒకదళిత కుటుంబం నుండి ఒక డాక్టరు, ఇంజనీరు, గ్రాడ్యుయేటుగా ఎదగటం, ఆంధ్రరాష్ట్రంలోనే అరుదు. పిల్లల చిన్నతనంలోనే నాగమ్మ భర్త చనిపోయారు. ఉపాధ్యాయినిగా ఉద్యోగం చేస్తూ, పిల్లలను ఉన్నత స్థితికి తీసుకొచ్చారు. ఆ ఊరిలో కూడా అందరికీ ఆమె శాయశక్తులా సహాయపడేవారు. చదువు, సంస్కారం, ఆత్మగౌరవం అనే విలువలతో సంఘంలో గౌరవం సంపాదించుకున్నారు.

**'పొరపాట్లను అంగీకరించు, మొహమాటం లేకుండా ప్రకటించు'** అనే బుద్ధుని ఆదర్శాలను విద్యార్థులకు నాగమ్మ బోధించారు. అంటే నీ జ్ఞానాన్ని ఇంకొకరికి పంచిపెట్టు అనే ఆశయం ఆచరణగా జీవించారు. ఈమె కుటుంబం కూడా సంస్కరణఉద్యమాలతో సన్నిహితంగా ఉండేది. 1930లో గాంధీ కోస్తాజిల్లాల్లో పర్యటించిన సందర్భంగా రాజోలులో నిర్వహించిన సభలో చురుకుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా గాంధీతో సంభాషించిన నాటి నుండి ఆమె గాంధేయవాదిగా కొనసాగారు. గ్రామంలో మహిళామండలిని స్థాపించి, మంత్రసానులతో ప్రత్యేకంగా ప్రసూతి సదుపాయాలను ఏర్పాటు చేయించడం, ఇండ్లలో ప్రాథమిక వైద్య సౌకర్యాలను సమకూర్చడం చేశారు.

గ్రామంలో దేవాలయాలకు అనుబంధంగా లైబ్రరీలను నిర్వహించి అందుకోసం పుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్లు సేకరించారు. పండగల సమయాల్లో పిల్లలకు పళ్ళు, మిఠాయిలు పంచిపెట్టేవారు. వ్యవసాయకూలీల కోసం రాత్రి పాఠశాలలు నిర్వహించేవారు. పేదప్రజల కోసం, బడిపిల్లల పుస్తకాల కోసం, ఆర్థికసహాయం చేశారు. ప్రధానంగా చేపలు పట్టేవారి పిల్లల చదువు కోసం ఆమె చాలా కృషి చేశారు. ప్రజలలో జాతీయ భావాలను రేకెత్తించేందుకు భజన, బుర్రకథ, నాటకం, సినిమా వంటి కార్యక్రమాలను నిర్వహించేవారు. ఆమె రచనలు చేయడం ఎప్పుడు మొదలు పెట్టారో తెలియదు కానీ నాటి రాజకీయ ఉద్యమాల వాతావరణంలో అనేక సంఘటనలను తన రచనల్లో పొందుపరిచారు. అవి 1938, 1939 లలో గృహలక్ష్మి పత్రికలో తరచుగా ప్రచురితమయ్యాయి. వీటన్నింటిని 1960లో ప్రజల జనజీవన సమస్యలు అనే కథా సంకలనంగా ప్రచురించారు. సామాజిక కార్యాచరణతో పాటు రచయిత్రిగా కూడా మంచి పేరు పొందారు. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ సంపాదకత్వంలో వెలువడిన ఆంధ్రకవయిత్రులు అనే పుస్తకంలో కథారచయిత్రిగా ఆమె పేరును పేర్కొనడం విశేషం. ఆమె రచనల్లో అస్పృశ్యతా నిర్మూలన, గాంధేయ సిద్ధాంతం, స్వాతంత్ర్య ఉద్యమం అనే అంశాలు చోటు చేసుకున్నాయి.

**కింది ప్రశ్నలకు పదివాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. సంఘసంస్కర్త వీరబ్రహ్మం గారి గురించి రాయండి.
2. జానపద సాహిత్యానికి నేదునూరి గంగాధరం చేసిన సేవల గురించి రాయండి.
3. వడ్డాది పాపయ్య మేటి చిత్రకారుడని ఎలా చెప్పగలవు?
4. తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా ఫాతిమా షేక్ చేసిన సేవల గురించి రాయండి.
5. రాగతిపండరి కార్టూనిస్టుగా ఎదిగిన విధానాన్ని మీ సొంత మాటల్లో రాయండి.
6. తాడి నాగమ్మ సమాజానికి చేసిన సేవలను రాయండి.



**మేటి పద్యం**

**తొలి తెలుగు పద్యం**

పండురంగని అద్దంకి శాసనంలోని తరువోజు పద్యం మొదటి తెలుగు పద్యంగా గుర్తించబడింది. అప్పటి పద్యభాష ఎలా ఉందో ఒకసారి చదివి చూడండి.

*పట్టంబు గట్టిన ప్రథమంబు నేణ్డు*
*బలగవ్వ ౕం బొప్పంగ బై లేచి సేన*
*పట్టంబు గటిఇచ్చి ప్రభుబణ్డరంగు*
*బఇచ్చిన సమత్త పడువతో బోయ*
*కొట్టంబు లణ్డెణ్డు గొణి వేంగినాణ్టిం*
*గొళల్చి యాత్రిభవనాంకుశబణ నిల్పి*
*కట్టెపు దుగ్గ ౕంబు గడు బయల్సేసి*
*కణ్డుకూ ర్బెజవాడ గావింఇచె మెచ్చి*

*– శాసన పద్యమంజరి గ్రంథమునుండి (పండురంగని అద్దంకి శాసనములోని తరువోజ పద్యం – క్రీ.శ. 848)*

# సెమిస్టర్ - 2

## విషయసూచిక


| క్ర.సం. | పాఠం | ప్రక్రియ | ఇతివృత్తం | కవి / రచయిత | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 8. | మేలిమలుపు | కథ | ఆత్మస్థైర్యం | దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి | డిసెంబర్ | 90 |
| 9. | చిరమాలిన్యం | వచన కవిత | మానవ విలువలు | షేక్ ఖాజా హుస్సేన్ | డిసెంబర్ | 102 |
| 10. | నాటి చదువు | ఆత్మకథ | వ్యక్తిత్వ వికాసం/ చదువు విలువ | మామిడిపూడి వేంకట రంగయ్య | జనవరి | 112 |
| 11. | సమదృష్టి | గజల్ | సమానత్వం | పైడి తెరేష్ బాబు | ఫిబ్రవరి | 123 |
| 12. | భువన విజయం | సాహితీరూపకం | భాషాభిరుచి | వేటూరి ప్రభాకరశాస్త్రి డా.సి.వి సుబ్బన్న | ఫిబ్రవరి | 133 |
| 13. | ఆతిథ్యం | ఇతిహాసం | అతిథి గౌరవం | తిక్కన సోమయాజి | మార్చి | 146 |
| 14. | కళా వారసత్వం **(ఉపవాచకం)** | వ్యాసం | కళల వైశిష్ట్యం | రచయితల బృందం | | 159 |
| | 1. భరతనాట్యం<br>2. భాంగ్రానృత్యం<br>3. కథాకళి<br>4. గుస్సాడి<br>5. ఒడిస్సీ<br>6. హరికథ | | | | డిశంబర్<br>జనవరి<br>జనవరి<br>ఫిబ్రవరి<br>మార్చి<br>మార్చి | |
| 15. | అకారాది పట్టిక | | | | | 166 |


సంస్కృతం కాంపొజిట్ కోర్సుగా చదివేవారు ఉపవాచకం మినహా అన్ని పాఠ్యాంశాలు చదవాలి.

* పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.

ప్రతిపాఠం వెనుక మేటిపద్యం శీర్షికలో ఇచ్చిన పద్యాలను విద్యార్థులు కంఠస్థం చేయాలి. అవి పరీక్షించబడవు.

# 8

# మేలిమలుపు



## చదవండి - ఆలోచించి చెప్పండి



ఎప్పుడూ ఒప్పుకోవద్దురా 'ఓటమి'
ఎప్పుడూ వదులుకోవద్దు రా 'ఓరిమి' ॥ఎప్పుడూ॥

నొప్పిలేని నిమిషమేది జననమైన మరణమైన
జీవితాన అడుగడుగునా

నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీది కాదు
బ్రతుకు అంటే నిత్య ఘర్షణ ॥ఎప్పుడూ॥

దేహముంది ప్రాణముంది నెత్తురుంది సత్తువుంది
అంతకన్నా సైన్యముందునా

ఆశ నీకు అస్త్రమౌను శ్వాస నీకు శస్త్రమౌను
ఆశయమ్ము సారథౌను రా ॥ఎప్పుడూ॥

– సిరివెన్నెల సీతారామశాస్త్రి


ప్రశ్నలు :

1. కవి ఏయే సన్నివేశాలను ప్రస్తావించాడు?
2. పై గేయంలో అస్త్ర శస్త్ర సారథులుగా వేటిని పేర్కొన్నాడు?
3. నీ ఆశయం ఏమిటి?

### ఉద్దేశం

జీవితంలో మనకెదురయ్యే బాధాకరమైన సంఘటననైనా, సంతోషకరమైన సంఘటననైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని, జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, గొప్ప ప్రయత్నాల చేత ఒడిదుడుకులను అధిగమిస్తూ మనల్ని మనం ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలని తెలపడమే ఈ పాఠం ఉద్దేశం.

### కవి పరిచయం



1887–1980


### దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి తూర్పుగోదావరి జిల్లా చంద్రంపాలెం గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు తిమ్మనశాస్త్రి, సీతమ్మ. వీరు కృష్ణపక్షం, ఊర్వశి, పుష్పలావికలు, అమృతవీణ, బహుకాల దర్శనం, కృష్ణశాస్త్రి వ్యాసావళి, మంగళకాహళి పేరుతో దేశభక్తి గేయాలు మొదలైనవి రచించారు. వీరికి ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదును, భారత ప్రభుత్వం పద్మభూషణ్, కేంద్ర సాహిత్య పురస్కారంతో సత్కరించింది. ప్రస్తుత పాఠం **పుష్పలావికలు** నుండి గ్రహించబడినది.

## మేలిమలుపు

"ఏమండీ! ఈరోడ్డుఎక్కడికిపోతుంది" అని ఒకడు అడిగాడట. "నేను ముప్పయ్యేళ్ళ నుంచి చూస్తున్నాను ఎక్కడికీ వెళ్లడంలేదు. ఇక్కడే ఉంది ఈ రోడ్డు" అని మహాతెలివైనవాడిలాగ రెండోవాడు జవాబుచెప్పాడట! ఇది చురుకైన మాటలాగ కనబడుతుంది. కాని దీనిలో నిజంలేదు. రోడ్డెక్కడికీ వెళ్లకపోవడం ఏమిటి? అది హమేషా ఎక్కడికో ఒకచోటుకి వెడుతూనే ఉంటుంది. ఒక్క క్షణం నిలబడకుండా రోడ్డు నడుస్తుంది. రకరకాలుగా నడుస్తుంది. రోడ్డు పరుగెత్తుతుంది కూడా. ఎటొచ్చి ఎప్పుడూ విరామం లేకుండా కదులుతూ ఉండడంవల్ల చలనం లేకుండా ఉన్నట్లుంటుంది. గిర్రుగిర్రున తిరిగే బొంగరం కదలకుండా ఉన్నట్లు కనపడుతుందే అలాగ. దారి వెయ్యికాళ్ల జెర్రి వంటిది. పాపం దానికి రవ్వంతైనా విశ్రాంతి లేదు. అలాగే ప్రతిమనిషి జీవితంలో విశ్రాంతి లేని పయనం వుంటుంది.


బాటసారులలాగే దారులు రకరకాలు. చేలల్లో గట్లదారులు, తోపుల్లో పుంతదారులు, కొండకనుమలలో కునికే దారులు,నగరాలకు వెళ్ళే రహదారులు ఇలా ఎన్నో ఉన్నాయి. ఈ దారుల్లో మలుపులు హెచ్చుతగ్గులు వుంటాయి. ఆ దారుల్లో ప్రయాణించే వారు తమ ప్రయాణాన్ని సర్దుబాటు చేసుకొని ప్రయాణిస్తారు. ఇందులో కష్టాలు, సుఖాలు ఉండవచ్చు. దారుల్లోని రకాలు లాగే మానవుల జీవితాలు కూడా రకరకాలుగా కొనసాగుతుంటాయి. ఒక్కొక్కరి జీవితం ఒడిదుడుకులు లేక, మలుపులు లేక కదలించే సంఘటనలు లేక,కష్ట సుఖాలు లేక ఎన్నడూ కొనసాగదు.




మార్గానికి మలుపులే గాక ఎగుడు దిగుడులు కూడా ఉండాలి అంటాను. ఉండకపోతే ఎలాగ? వైకుంఠపాళీ ఆట ఉంది. పరమపద సోపాన పటం మీద ఆడేది. ఇది జీవితమంత ఆకర్షవంతంగా ఉంటుంది. నాటకంలాగ కనిపిస్తుంది. ఎందుచేత అంటే? దీని నిండా మలుపులూ ఎగుడు దిగుడులూను! ఎప్పుడేది జరుగుతుందో ఏది మరునిముసం సిద్ధంగా ఉందో మనకు తెలియదు. ముందు వచ్చేది నిచ్చెనో విషసర్పమో మనకు తెలియదు. వరుసగా నిచ్చెనలే వచ్చేసి, పరమపదం ఇట్టేఎక్కేసి కూర్చుంటే ఆట బాగుండదు.

పరమపదం దాకా పరచుకున్న పథంలో ఒక మలుపు తిరిగితే నిచ్చెన, మరొకటి తిరిగితే పన్నగం, ఆ పాముకాటు వల్ల కిందికి ఒరగడం, అంతలో తేరుకుని ఒకనిచ్చెన ఎక్కడం, మరొక సోపానం దాటడం, పూల

తోటలో కాలుపెట్టడం, ఆనందధామపు అంచులూ, గోపుర శిఖరాలూ కనబడడం, ఇంతలో ఒక కాలాహి కరవడం, మళ్ళీ సొమ్మసిల్లి నేలరాలడం ఇలా మలుపులతో ఎగుడు దిగుడులతో సాగే ఆటే వైకుంఠపాళి, మానవ జీవితం కూడా వైకుంఠపాళి ఆటలాంటిదే. ఈ ఆటలో నిచ్చెనలు ఎక్కడం పాము మింగడం ఉన్నట్లే మానవ జీవితంలో హెచ్చుతగ్గులుంటాయి. వీటి అన్నిటి వల్లనే జీవితానికి గమనం, ఊపు, చైతన్యం, ఉత్సాహం, లక్ష్యం వస్తాయి. మలుపులూ ఎగుడుదిగుడులూ జీవిత మార్గంలో ఉండి తీరాలి.





జీవిత మార్గంలో గొప్ప మలుపులున్న మానవుని జీవితం మహాకావ్యం అవుతుంది. రామాయణం లాగా మహాభారతంలాగా, ఆ మానవుణ్ణి మహాత్ముడంటారు. జీవిత మార్గంలో మలుపు తిరిగితే ఆపద వచ్చినా, ఆనందం కలిగినా, తరువాత స్థిమితంగా వాటిని నెమరు వేసుకొన్నప్పుడు మాత్రం అన్నీ అమూల్యంగానే కనబడతాయి. ఆప్తంగా ఉంటాయి. వాటిని మాసిపోనియ్యం. అవి తీయనివై పోతాయి. అనంత యాత్రామార్గం మీద అవి మనకు దారి బత్తెంగా నిలుస్తాయి. బతుకుదారి మలుపు తిరిగితే 'రాజు కింకరుడు, కింకరుడు రాజు అవ్వడం తథ్యం'. ఈ సత్యాన్ని తెలిపేదే 'సత్యహరిశ్చంద్రుని' కథ. అల్లాగే ఇలాంటి నిజాన్ని తెలిపే కాశీమజిలీ కథ చూద్దాం.

అనగా అనగా ఒకగ్రామంలో ఒక యువకుడున్నాడు. వానికి తల్లితండ్రి ఎవ్వరూ లేరు. మాధుకరం చేసుకునేవాడు. వడిదుడుకులు లేక వాని బ్రతుకు సుఖంగా సాగేది. బ్రతుకుతున్నానని వానికి తెలియదు. వానికి రాత్రీపగలు తేడా లేదు. అంతలో వానికి తెలియకుండానే వాని బ్రతుకు తెరువు ఒక మలుపు తిరుగుతుంది.

ఒకనాడు ఊరుకోలేక ఉన్న ఊరు వదలి బయలు దేరాడు. ఎక్కడికో తెలియదు. నడిచాడు, నడిచాడు. మునిమాపు వేళకు ఒక పట్టణ పరిసరానికి వచ్చాడు. అక్కడ ఆగాడు. "పాతబడిన మానవుని కన్న పలుకరించే తోట నయం" అనుకున్నాడు. అలసి ఉన్నాడు కనుక, దరిద్రుడు కనుక, అట్టి శ్రమలు అలవాటయి పోయాయి కనుక, హంస తూలికాతల్పం అక్కరలేకుండానే నిద్ర పోయాడు. ఇంతలో తెల్లవారబోతుండగా వాడి నిద్దర అంచులు కదలినట్లయింది. ఏదో కలకలం సోకి ఒళ్ళు విరుచుకున్నాడు. లేచికూర్చున్నాడు. ఎదురుగా రత్న భూషణాలతో పెద్దఏనుగు, ఏనుగు మీద బంగారపు అంబారీ, ఆ ఏనుగు పక్కన వెండి వేత్రాలతో భటులు. ఆ ఏనుగు ముందు గంభీరంగాను, వినయంగాను నిలబడ్డ ఒకపెద్దమనిషి. ఆ ఏనుగుతొండంతో పట్టుకున్న ఒక మందార మాలిక. ఆ ఏనుగుకి దూరదూరాన వేలకొద్దీజనం. "ఏమిటి ఇదంతా !" అనుకున్నాడు. ఇంత గొప్ప కలను కరిగించి మాయం చేయగూడదనుకొని మళ్ళీ నిద్ర పోదామనుకుంటుంటే ఆ ఏనుగు మందారదామాన్ని వాని మెడలో వేసి, ఆ తొండంతోనే వాణ్ణి భద్రంగా ఎత్తి, అంబారీలో కూర్చోబెట్టి, పట్టణం వైపుమళ్ళింది. "జయము జయము మహారాజా" అని జయజయధ్వానాలు చేశారు అక్కడి జనం. ఆ పట్టణపు రాజు పురుష సంతానం లేకుండా చనిపోయాడు. పట్టపు ఏనుగు ఎవరిమెడలో దండవేస్తుందో వాడు రాజుకావాలని మంత్రి, రాజగురువూ, అందరూ నిశ్చయించారు. పట్టం కోసం ఆత్రంగా అడ్డుపడిన అందరినీ

తప్పించుకొని, ఊరుబయట చెట్టుకింద ధూళిలో కొలువున్న కుచేలుడి దగ్గరకు వచ్చి, ఆ భద్రగజం వాణ్ణి మహారాజుగా ఎన్నుకుంది. తరువాత వాడు బంగారపు బొమ్మ వంటి రాజుకూతుర్ని వివాహం చేసుకుంటాడు. వాడి బ్రతుకుతెరువు ఎంత పెద్దమలుపు తిరిగిందో ! మానవ జీవితంలో మలుపులన్నిటి వెనుక మంగళ సంఘటనలే ఉండనక్కరలేదు. కష్ట సుఖాలు ఉంటాయి.



అలాంటి భావాన్ని తెలిపేదే రామాయణం. అంతవరకు ఆనందంగా నడిచింది శ్రీరాముని కథ. బాల్యక్రీడలు, విశ్వామిత్ర క్రతురక్షణ, సీతా కల్యాణం, పరశురామగర్వభంగం, అహల్యా శాప విమోచనం తర్వాత పట్టాభిషేకమహోత్సవం వరకు వచ్చింది. ముందు కూడా అలాగే మధుమార్గం పరచుకున్నట్లు ఉంటుంది. అయితే, దారి హఠాత్తుగ మలుపు తిరిగి ఊరుకుంది. పట్టాభిషేకం బదులు వనవాసం పిడుగులా వచ్చి పడింది. అలాగే మరో మలుపు వెనక మాయలేడి పొంచి ఉంటుంది. ఇటువంటి మలుపులతో రామాయణం సాగుతుంది.

గొప్పవాళ్ళ జీవితమార్గం అంతా మలుపులే. సామాన్యుల బ్రతుకుల దారుల్లోనూ మలుపులుంటాయి. కాని, అందరి జీవితాల్లోనూ మలుపు వెనక ఇట్టి తీవ్ర సంఘటనలు ఉండనక్కరలేదు. దినదినమూ మన జీవితంలో చిరుమలుపులు వస్తాయి. అక్కరలేని అతిథిరావడం, అనుకోకుండ ఉద్యోగం పోవడం, ఆశించని ధనం రావడం, అనురాగంతో పెంచుకున్న అలరుతీగను ఏ పశువో తుంచివేయడం, చిరస్నేహ బంధం అకారణంగా తెగి తునిగిపోవడం, ఇవన్నీ మలుపులే. మన మార్గంలో మలుపులు తిరగడం తలుపు తీయడం వంటిదే. తెరవగానే ఆప్తబంధువు ఎదురుకావచ్చు. అయితే ఈ మలుపుల్ని పట్టించుకోని వాళ్ళున్నారు కొందరు. మలుపుల కోసం ఎదురు చూస్తుంటారు కొందరు. తీరికగా కూర్చుని మార్గంలో మలుపులు మలచుకొంటారు కొందరు. కొందరికి ఆదిపర్వం మొదలుకొని స్వర్గారోహణం దాకా మలుపులే. ఏదయినా మార్గానికి మలుపులు కావాలి మలుపు వెనకాల మథనం ఉండనీ, మధువనం ఉండనీ !

జీవిత లక్ష్య గమనంలో ఏది ఎదురైనా వాటిని అధిగమించాలి. లక్ష్య ఛేదనలో ఎదురయ్యే కష్టనష్టాలను భరించాలి. సుఖదు:ఖాలను పొందాలి. నిరాశానిస్పృహలకు తట్టుకోవాలి. అప్పుడే జీవితంలో ఓటమిని అంగీకరించాక విజయాన్ని సాధించగలుగుతాం. జీవిత మలుపులను అధిగమించి, సుఖప్రదమైన జీవనాన్ని సాగిస్తాం. విజేతగా నిలుస్తాం. పదిమందికీ ఉపయోగపడతాం.

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

G8V7P3

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. రాయండి.**

1. "మలుపులున్న జీవితం మహాకావ్యం అవుతుంది" అని కవి ఎందుకు అన్నాడు?
2. వైకుంఠపాళీ ఆట గురించి కవి చెప్పిన విషయాన్ని గూర్చి మిత్రులతో చర్చించండి.
3. పాఠం చదవండి వీటిగురించి కవి చెప్పిన విషయాలు రాయండి

అ. నాటి ప్రయాణం - ____________________

ఆ. దారుల రకాలు - ____________________

ఇ. జీవిత మార్గం - ____________________

**ఆ) కింది గద్యాన్ని చదివి నాలుగు ప్రశ్నలు తయారుచేయండి.**

ఆచంట జానకిరామ్ ఒకసారి రైలు ప్రయాణంలో సుప్రసిద్ధ కవి పండితులు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారిని కలిశారు. ఆ సంఘటన గూర్చి జానకిరామ్ ఇలా చెప్పాడు ఒక్క కవిత్వం గురించే కాదు. ఆ తెల్లవారు జామున మేము మాట్లాడుకున్నది. సంగీతము గురించీ, నృత్యం గురించి, నాటకరచన గురించి, ధర్మశాస్త్రం గురించి, సాధన గురించి ఎన్నో విషయాలు చెప్పారు నాకు ఆయన. ప్రతి మనిషికి ఒక ఉన్నత లక్ష్యము ఉండాలని ఆ లక్ష్యాన్ని సాధించడానికి నిరంతర యత్నముండాలనీ అన్నారు. జీవితం ఒక తోకతెగిన గాలిపటమువలె గాలిలో కొట్టుకుపోయినట్టు ఉండరాదు. ఆకాశంలోకి ఎంతదూరం వెళ్ళినా సూత్రపు పట్టు మనం వదలరాదు అన్నారు.

ప్రశ్నలు:

1. ____________________
2. ____________________
3. ____________________
4. ____________________

**ఇ) కింది పేరాను చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**



కళ్లెదుటే తమ్ముణ్ణి బలిగొన్న స్ప్రూ వ్యాధిని నిర్మూలించాలని అనుకున్నాడు. పాతికేళ్లపాటు ఆకలి, నిద్ర, అలసటలను విస్మరించి కృషిచేశారు. తన కృషి ఫలితంగా 1945 సం॥లో జులై20వ తేదీన స్ప్రూ వ్యాధికి మందు కనుగొన్నారు. వైద్యరంగంలో ధ్రువతారగా నిలిచాడు ఆయనే మన ఎల్లాప్రగడ సుబ్బారావు. వీరు 1895 సం॥లో జనవరి 21న భీమవరంలో జన్మించారు. తండ్రి చిరుద్యోగి అయినప్పటికీ కొడుకు చదువుకోసం వెనుకడుగు వేయలేదు.

కష్టపడి చదివించారు. ఈయన రామకృష్ణమఠం సహకారంతో వైద్యశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. విద్యార్థి ఉపకార వేతనంతో లండన్ వెళ్లి, 'ట్రాపికల్ స్కూల్ మెడిసిన్' నుండి డిప్లొమా అందుకున్నాడు. వైద్యరంగంలో నిష్ణాతుడై అనేక పరిశోధనలు చేశారు. క్షయరోగ నివారణ, బోదకాలు, టైఫాయిడ్, పాండురోగం మొదలైన రోగాల నిర్మూలనకు మందులను కనుగొన్నారు. తన జీవితంలో ఎన్నో మలుపులు, ఒడిదుడుకులు చూసిన వీరు అపజయాల నుంచి విజయాలను సాధించారు. వీరు 1948సం॥లో ఆగష్టు 9న మరణించారు.

ప్రశ్నలు :

1. "నిర్మూలించాలి అని అనుకోవడం" అంటే ఏమిటి?

జ. ____________________

2. 'చిన్న ఉద్యోగి' అని అర్థం వచ్చే పదం ఏది?

జ. ____________________

3. 'జయం' అనే పదానికి వ్యతిరేకపదాన్ని గుర్తించి రాయండి.

జ. ____________________

4. వైద్యరంగం మాదిరిగా మరొకొన్ని రంగాల పేర్లు రాయండి.

జ. ____________________

**ఈ) పాఠం ఆధారంగా ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి గురించి రాయండి.
2. శ్రీరాముని జీవితంలోని మలుపులు గురించి రాయండి.



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రచయిత జీవితాన్ని ఎందుకు వైకుంఠపాళీతో పోల్చాడు?
2. జీవనగమనంలో వేటిని అధిగమించాలి?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో జవాబులు రాయండి.**

1. అనాథ యువకుడు రాజుగా ఎదిగిన కథను రాయండి.
2. మానవుని జీవితం అనేక మలుపులతో ముడిపడి ఉంటుంది. దీనిని సమర్థిస్తూ రాయండి.
3. మీ కుటుంబంలో, బంధువులలో వైఫల్యాలను అధిగమించి, విజయాలు పొందిన వారిని గురించి మీ తల్లిదండ్రులను అడిగి తెలుసుకొని వారిని ప్రశంసిస్తూ రాయండి.

## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలకు పట్టిక ఆధారంగా అర్థాలను గుర్తించి రాయండి?**

ఉదా : బాటసారి = ప్రయాణికుడు

| | | | | | |
|---|---|---|---|---|---|
| గొ | ప్ప | సే | వ | కు | డు |
| ఎ | ప్ర | మం | చి | ది | పు |
| దు | యా | గం | మ | దూ | రం |
| రు | ణి | కో | లు | కొ | ను |
| ప | కు | ప్ర | మా | దం | భ |
| డు | డు | మం | చి | ది | ణ |

1. తేరుకొని = ____________________
2. కింకరుడు = ____________________
3. క్రతువు = ____________________
4. నయం = ____________________

**ఆ) కింది పదాలకు నానార్థాలను జతపరచండి.**

1. చైతన్యం ( ) అ) సంతోషం, సౌఖ్యం, స్వర్గం
2. మదనం ( ) ఆ) యజ్ఞం, విష్ణువు, ఒక ప్రజాపతి
3. సుఖం ( ) ఇ) ఉమ్మెత్త, కాముకత్వం, వసంత కాలం
4. క్రతువు ( ) ఈ) తెలివి, ప్రాణం, ప్రకృతి

**ఇ) కింది పదాలకు పదసమూహం నుండి పర్యాయపదాలను వెదికి రాయండి.**

నేస్తాలు, గజము, మిత్రులు, సర్పము, చుక్కలు, భూపాలుడు,
భుజంగము, నృపాలుడు, స్నేహితులు, తారలు, కుంజరము

ఉదా : నేస్తాలు = మిత్రులు, స్నేహితులు

1. పన్నగం = ____________________
2. నక్షత్రాలు = ____________________
3. రాజు = ____________________
4. ఏనుగు = ____________________

**ఈ) కింది వాక్యాలలోని ప్రకృతి వికృతులను గుర్తించి రాయండి.**

1. అంబ వంట చేస్తుంది. చేసిన పదార్థములను అమ్మ వడ్డిస్తుంది.

జ. ...................................................................................................

2. రాజు కింకరుడు. కింకరుడు రాయడు అవడం తథ్యం.

జ. ...................................................................................................

3. దివిలో చంద్రుడు తిరుగుతూ, భువిపై చందురుడు వెన్నెల కురిపిస్తాడు.

జ. ...................................................................................................

4. నేను పట్టణంవెళ్లాలి. ఆ పట్నంలో నా మిత్రుణ్ణి కలవాలి.

జ. ...................................................................................................



## భాషాక్రీడ

**అ) కింది పదాలను పరిశీలించండి. పదంలో దాగున్న మరొక పదాన్ని గుర్తించి, ఆ పదానికి అర్థాన్ని రాయండి.**

ఉదా : మునిమాపు = ముని = మౌనంగా ఉండేవాడు

1. **అలవాటు** ____________ = ______________________________________
2. **మందారం** ____________ = ______________________________________
3. **రామాయణం** ____________ = ______________________________________
4. **తట్టుకోవాలి** ____________ = ______________________________________
5. **ఉండనక్కరలేదు** ____________ = ______________________________________
6. **అప్పుడప్పుడు** ____________ = ______________________________________
7. **పరమపదం** ____________ = ______________________________________



## వ్యాకరణాంశాలు

**అ) కింది వాక్యాలలోని సంధి పదాలను గుర్తించి, విడదీసి, సంధి పేరు పట్టికలో రాయండి.**

1. పరుగు పందెంలో పరుగెత్తు వారు వెనుతిరిగి చూడరాదు.
2. మహాత్ముల జీవితం అందరికీ ఆదర్శంగా ఉంటుంది.
3. భీమవరంలో జరుగు తెలుగు మహోత్సవాలకు అందరూ ఆహ్వానితులే !
4. కొండల మీద ప్రయాణమంతా మలుపుల దారులతో ఉంటుంది.
5. అమ్మతో రోజూ మాట్లాడాలని ఉంటుంది.

| సంధి పదం | విడదీయడం | సంధి పేరు |
|---|---|---|
| పరుగెత్తు | పరుగు + ఎత్తు | ఉత్వ సంధి |
| | + | |
| | + | |
| | + | |
| | + | |

**ఆ) తత్పురుష సమాసం**

సమానమైన అర్థాలు గల రెండు పదాలు కలిసి ఒకే పదంగా ఏర్పడితే దాన్ని సమాసం అంటారని కింది తరగతిలో తెలుసుకున్నారు కదా!

**కింది సమాస పదాన్ని పరిశీలించండి.**

సూర్యకిరణాలు – సూర్యుని యొక్క కిరణాలు

పై ఉదాహరణలో 'సూర్య' 'కిరణాలు' అనే పదాలు పూర్వ, ఉత్తర పదాలుగా ఉన్నాయి. వీటిలో 'కిరణాలు' అనే ఉత్తర పదానికి ప్రాధాన్యం ఉంది. సూర్య అనే పూర్వపదం కిరణాలు ఎవరివనే విషయాన్ని బోధిస్తుంది. ఇలా **ఉత్తర పద ప్రాధాన్యం** కలిగిన సమాసాన్ని **తత్పురుష సమాసం** అంటారు.

తత్పురుష సమాసంలోని పూర్వ పదం తరువాత ప్రథమా విభక్తి నుండి సప్తమీ విభక్తి వరకు గల విభక్తులలో ఏ విభక్తి ప్రత్యయం వస్తుందో ఆపేరుతో తత్పురుష సమాసం అని పిలుస్తాం. పై ఉదాహరణలో సూర్యుని తరువాత షష్ఠీ విభక్తి ప్రత్యయం **యొక్క** వచ్చింది. కనుక షష్ఠీ విభక్తి పేరు మీదుగా దీనిని **షష్ఠీ తత్పురుష సమాసం** అని పిలుస్తాం.

ప్రస్తుత పాఠంలోని తత్పురుష సమాసాలను పరిశీలిద్దాం.

| విభక్తి | విభక్తి ప్రత్యయాలు | విగ్రహవాక్యం | సమాసపదం | సమాసం పేరు |
|---|---|---|---|---|
| ప్రథమా | డు,ము,వు,లు | రాజ్యము అర్ధభాగం | అర్ధరాజ్యం | ప్రథమా తత్పురుష |
| ద్వితీయా | నిన్,నున్,లన్ కూర్చి గురించి | సూక్ష్మమును దర్శించువాడు | సూక్ష్మదర్శి | ద్వితీయా తత్పురుష |
| తృతీయ | చేతన్, చేన్, తోడన్, తోన్, | మందారములతో చేసిన మాలిక | మందారమాలిక | తృతీయా తత్పురుష |
| చతుర్థీ | కొఱకున్, కై | బ్రతుకు కొరకు తెరువు | బ్రతుకు తెరువు | చతుర్థీతత్పురుష |
| పంచమీ | వలనన్, కంటెన్, పట్టి | పాము వలన కాటు | పాము కాటు | పంచమీ తత్పురుష |
| షష్ఠీ | కిన్,కున్,యొక్క,లోన్,లోపలన్ | పదముల యొక్క ధ్వనులు | పదధ్వనులు | షష్ఠీ తత్పురుష |
| సప్తమీ | అందున్, నన్ | బాల్యమందు క్రీడలు | బాల్య క్రీడలు | సప్తమీ తత్పురుష |

పట్టికలో పూర్వ పదాల తరువాత వచ్చిన విభక్తి ప్రత్యయాల ఆధారంగా తత్పురుష సమాసం ఎలా ఏర్పడిందో గమనించండి.

కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలను రాసి, సమాసం పేరు తెలపండి.

1. పూలతోట = ______________________
2. దారిబత్తెం = ______________________
3. మందారదామం = ______________________
4. జీవితమార్గం = ______________________

### అలంకారం

పద్యంలోకాని, గద్యంలోకాని చెప్పదలచిన విషయాన్ని బాగా అర్థమయ్యేలా మనసుకు హత్తుకునేలా చెప్పడానికి అలంకారాలు దోహదపడతాయి. అలంకారాలు రెండు రకాలు **1. శబ్దాలంకారాలు 2. అర్థాలంకారాలు.** శబ్దాలంకారాలు శబ్దసౌందర్యాన్ని పెంపొందిస్తే, అర్థాలంకారాలు భావ సౌందర్యాన్ని కలిగిస్తాయి.

అర్థాలంకారాలలో ఒకటైన అతిశయోక్తి అలంకారాన్ని గురించి తెలుసుకుందాం.

#### ❖ అతిశయోక్తి అలంకారం :-

**కింది వాక్యాన్ని పరిశీలించండి.**

ఉదా: ఆ నగరంలోని భవనాలు చంద్రమండలాన్ని (ఆకాశాన్ని) తాకుతున్నాయి.

పై ఉదాహరణలో భవనాలు చంద్రమండలాన్ని తాకుతున్నాయి అని వర్ణించారు. మేడలు వాస్తవంగా ఆకాశాన్ని తాకవు. అంత ఎత్తు ఉన్నాయని చెప్పడం ముఖ్య ఉద్దేశ్యం. ఇలా ఉన్న స్థితిని ఎక్కువ చేసి వర్ణించి చెబితే దానిని **'అతిశయోక్తి'** అలంకారం అంటారు.

ఇలా ఒక వస్తువును గురించి గాని, ఒక విషయాన్ని గురించి గాని, **గోరంతను కొండంతగా** చేసి చెప్పడాన్ని అతిశయోక్తి అలంకారం అంటారు.

**కింది వాక్యాలలో అలంకారాన్ని గుర్తించి రాయండి.**

1. జాతరలోని డప్పు చప్పుళ్ళు ఆకాశాన్ని తాకాయి.
2. బావిలోనికి తొంగి చూస్తే పాతాళం కనిపిస్తుంది.
3. సందేశం పాఠంలోని 'పాముకు బాలు' పద్యంలోని అలంకారాన్ని గుర్తించి రాయండి.

### పాఠాంత పద్యం

ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు బూసెజ్జపై
నొకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్ట శాల్యోదనం
బొకచో బొంత ధరించు, నొక్కొక తఱిన్ యోగ్యాంబరశ్రేణి,లె
క్కకు రానీయడు కార్యసాధకుడు దు:ఖంబున్ సుఖంబున్ మదిన్

**– ఏనుగు లక్ష్మణకవి**

భావం : అనుకున్న పనిని సాధించడంలో కార్యసాధకుడు కష్ట సుఖాలను లెక్కచేయడు. అవసరమైతే నేలపై పడుకుంటాడు. మరొకపుడు పూలపాన్పుపై శయనిస్తాడు. ఒకసారి కాయలు, పండ్లతో కడుపునింపుకుంటాడు. మరోసారి విందు భోజనమును తింటాడు. ఒకప్పుడు అతుకుల బొంతతో సరిపుచ్చుకుంటాడు. వేఱొకప్పుడు మంచి వస్త్రాలను ధరిస్తాడు. కాని మనసులో కష్టసుఖాలను లెక్కింపడు.

**సూక్తి – కిందపడ్డానని ఆగిపోకు. తిరిగి ప్రయత్నం చేస్తే విజయం నీదే – అబ్దుల్‌కలాం**

### ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..........
2. నేను గ్రహించిన విలువ ..........
3. సృజనాత్మక రచన ..........
4. భాషాంశాలు ..........

**జనవరి 2వ తేదీని ప్రపంచ స్ఫూర్తి దినోత్సవంగా జరుపుకొంటాం**

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించిన గొప్ప వ్యక్తులను గూర్చి విద్యార్థులకు చెప్పండి.
2. బహుకాల దర్శనం నాటిక వేయించండి.
3. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కొన్న వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులచే చదివించండి.



## పాఠాంత అంశము

### "ఇది" కథ



ఒక రాజసభలో ఒక విశిష్ట కవి ఉండేవాడు. అతను తన మాటల చమత్కారంతో రాజును సంతోషపెట్టేవాడు. ఒకసారి ఆ రాజు దగ్గరకు నాలుగు శాస్త్రములు చదివిన పండితుడొకడు వచ్చాడు. అతని పాండిత్యం ముందు సభలోని పండితులు ఎవరూ నిలువలేకపోయారు. విశిష్ట కవి రాజుగారి దగ్గరకు వెళ్ళి, ఆ పండితునితో వాదించడానికి అనుమతినిమ్మని అడిగాడు. విశిష్ట కవికి నిజమైన పాండిత్యం లేదు అని తెలిసిన రాజు అతని చమత్కార పలుకులు విని సంతోషించవచ్చని ఆ పండితునితో వాదించడానికి అనుమతిచ్చాడు.

అంతలో విశిష్ట కవి ఆ వచ్చిన పండితుని "అయ్యా ! "ఇది" అను పదమునకు ఎన్ని అర్థములు ఉన్నాయో చెప్పగలరా ?" అని అడిగాడు. ఆ పండితుడు 'ఇది అనగా సమీప వస్తువు'. దానికి అర్థము లేదని చెప్పెను. అది విన్న విశిష్ట కవి ఈ విధముగా అన్నాడు. "ఇదేనా మీ పాండిత్యం? తొమ్మిది ద్వీపాలలో నాల్గు ఏళ్ళు చదివాననీ, కాశీలో పన్నెండు ఏళ్ళు చదివానని విర్రవీగుచున్నారు మీ చదువు బూడిదలో పోసిన పన్నీరు ఇది అనే మాటకు వంద అర్థాలు ఉన్నాయి" అన్నాడు. ఆ పండితుడు ఆశ్చర్యపడి "నేను ఇన్ని అర్థాలు వినలేదు, చదవలేదు" అని బదులిచ్చాడు. దానికి విశిష్ట కవి తిరిగి ఇలా జవాబు చెప్పాడు.

"ఇది అనే పదానికి ప్రయోగములు చూడండి. ఏమండీ మీరు కొంచెం ఇదిగా ఉన్నారు. మీ మొగము ఎంతో ఇదైనట్లుంది. మీ శరీరము ఇదిగా ఉన్నదా ఏమిటి ? మీకు నాలుగు నెలల నుండి పని ఇదిగా ఉంది. ఎంత ఇది ఉన్నప్పటికీ అంత ఇది పనికిరాదు. కొంచెం ఇదిగా ఉండాలి. కానీ లేకపోతే మన పని ఇదైపోతుంది. ఒంట్లో ఇది ఉంటే కదా ఏదైనా. ఆ ఇది కొంచెం పోతే తర్వాత ఏమి ఇదౌతుంది. మీ ఇదేమి బాగోలేదు. ఎవరి ఇది వారు చూసుకోవాలి. కానీ ఒకరు ఇది చేస్తారా? ఇందులో మీ సేనాధిపతి గారి ఇది కూడా కొంత ఉంది. ఆయన బొత్తిగా ఇదైనవాడు. అధికారితో ఇది వచ్చింది. మరొక ఇదైతే ఏదైనా చేసుకొందుము".

అయ్యా! చూశారా "ఇది" పదానికి ఎన్ని ప్రయోగాలూ, అర్థములున్నాయో మీ ఇది చూస్తే నాకు ఎంతో ఇదిగా ఉంది. ఇది మొదలుకొని ఇది అనగా ఏంటో తెలుసుకొని కొంచెం ఇదిగా ఉండండి" అన్నాడు విశిష్ట కవి. ఆ మాటలకు ఆ పండితుడు జీవితంలో ఎన్నడూ పొందనంత ఆశ్చర్యాన్ని పొందాడు. రాజు, సభాసదులు విశిష్ట కవి నవ్వారు. తర్వాత రాజు ఇద్దరిని సన్మానించాడు.

– చిలకమర్తి లక్ష్మీనరసింహం

9

# చిరమాలిన్యం

చదవండి - ఆలోచించి చెప్పండి



సమ సమాజ మంట సాధింతురట మీరు
ఒకరి బాగునొక్కరోర్వలేరు
సమత సాధ్యమగునె మమత పెరగకున్న
సయ్యదయ్య మాట సత్యమయ్య

- సయ్యద్ మహమ్మద్ ఆజమ్ (సూక్తి శతకం)


ప్రశ్నలు :

1. పై పద్యంలో దేని గురించి ప్రస్తావన ఉంది?
2. సమత సాధ్యం కావాలంటే ఏమి పెరగాలి?
3. ఒకరి బాగును మరొకరు ఎందుకు ఓర్చుకోలేరు?

**ఉద్దేశం:**

తోటివారి సుఖదుఃఖాలలో పాలుపంచుకోవడం, సహానుభూతిని కలిగి ఉండడం, మానవత్వాన్ని పెంచడం వంటి భావాలను విద్యార్థుల్లో నింపడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

కవి పరిచయం




1949 -2020

## దేవి ప్రియ
## షేక్ ఖాజా హుస్సేన్

దేవిప్రియగా పేరొందిన షేక్ ఖాజా హుస్సేన్ గుంటూరు జిల్లాలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు షేక్ హుస్సేన్ సాహెబ్, షేక్ ఇమాంబి. కవి, రచయిత, పాత్రికేయులుగా, సంపాదకులుగా ప్రసిద్ధులు. వీరి రచనల్లో అమ్మచెట్టు, సమాజానంద స్వామి, గరీబ్ గీతాలు, నీటిపుట్ట, తుఫాను, తుమ్మెద, అరణ్యపురాణం ముఖ్యమైనవి. వీరు 2017లో కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారంతో పాటు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం పొందారు. ఈ పాఠ్యాంశం **గాలి రంగు** వచన కవితా సంపుటి నుండి స్వీకరించబడింది.

# చిరమాలిన్యం



1. ఆకాశానికీ
భూమికీ మధ్య
అవతరించాం
గగన డమరుక లయనీ
అడివిని ఊయలలూగించే వాయురాగాలనీ విన్నాం
హోరుజలపాతాల బృందగానాలని అవధరించాం
సిగ్గు తెలిసి ఆకులు ధరించాం
రాళ్ళని మలిచి ఆయుధాలు చెక్కుకున్నాం
సాటి జంతువులని చంపి ఆకలి తీర్చుకున్నాం








2. మాటలు నేర్చుకున్నాం
లిపులు కూర్చుకున్నాం
దేవుళ్ళని సృష్టించుకున్నాం
నక్షత్రాలకి నామకరణం చేశాం
గ్రహాలని విగ్రహాలుగా మార్చాం
నిప్పుని రాజేశాం







3. చక్రాన్ని ఊహించి దొర్లించి గిరగిరా తిప్పాం
ఖండాలు దాటి పోయాం వచ్చాం
రాజ్యాలు దాటి పోయాం వచ్చాం
రాజ్యాలు నిర్మించాం
సామ్రాజ్యాలు ఆక్రమించాం
నదులు మళ్ళించాం సముద్రాలు మథించాం
గ్రహాల మీద అడుగులు వేశాం
నియంతలుగా ఏలాం



నిరంకుశుల్ని నాశనం చేశాం
శ్రామిక రాజ్యాలు కూల్చాం
సంపదలు దోచుకున్నాం

4. కానీ సోదరా!
మనిషి మాలిన్యాన్ని ఇన్ని నులివెచ్చని కన్నీళ్ళతో
కడిగి శుభ్రం చేయలేక పోయాం ....!



**ప్రక్రియ - వచన కవిత**

తెలుగు సాహిత్యంలో పద్యం తర్వాత వచన కవితా ప్రక్రియా ప్రసిద్ధి పొందింది. సామాజిక చైతన్యం కలిగించే వస్తువు వచన కవిత్వంలో ఉంటుంది. ఛందోనియమాలు లేకున్నా అంత్యప్రాసలు వచన కవితకు అలంకారాలు. అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని వచ్చే విధంగా రచన చేయడానికి వచన కవిత అనువైనది.

## సారాంశం

1. ఆకాశానికి భూమికి మధ్యన పుట్టాం. ధ్వనుల లయని, అరణ్యాలలో వీచే గాలిసవ్వడిని విన్నాం. జలపాతాల జోరులను ఆలకించాం. సిగ్గుతో ఆకులను బట్టలుగా చుట్టుకున్నాం. చేతికి అనువైన రాళ్ళను ఆయుధాలుగా మలచాం. ఆకలి తీర్చుకోవడానికి జంతువులను చంపి తిన్నాం.

2. భాషను నేర్చుకున్నాం. లిపిని కల్పించుకున్నాం. భక్తితో, భయంతో దేవుళ్ళను, విగ్రహాలను చెక్కుకున్నాం. నక్షత్రాల గుంపులకు పేర్లు పెట్టాం. ఆ గ్రహాలను బొమ్మలుగా మార్చాం. అగ్నిని రాజేశాం.

3. చక్రాన్ని కనుగొన్నాం, వాహనాలను తయారుచేసాం వాటిని ఉపయోగించి, ఖండాంతరాలకు ప్రయాణం చేశాం. రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నాం. దండయాత్రలతో సామ్రాజ్యాల్ని వశం చేసుకున్నాం. కాలువలు తవ్వి నీటిని మళ్ళించాం. సముద్రాల నుండి ఖనిజ సంపద తీశాం. అంతరిక్షంలోకి వెళ్లాం. నియంతలుగా పరిపాలన చేశాం. ఒంటెద్దు పోకడను లేకుండా చేశాం. శ్రమజీవుల ఆవాసాలను కూల్చివేశాం. వారి సంపదలు దోచుకున్నాం.

4. కాని సోదరా, ఎన్నో విజయాలు సాధించినప్పటికీ మనిషి మనసులో చిరకాలంగా పేరుకుపోయిన మలినాన్ని మానవత్వమనే కన్నీళ్ళతో కడగలేకపోయాం.

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.**

1. వచన కవితను లయాత్మకంగా చదవండి.
2. కవితలో ఏయే అంశాలను కవి వర్ణించాడో చెప్పండి?
3. పాఠాన్ని చదవండి కింది వాటి గురించి రెండు వాక్యాలను రాయండి.

అ) రాగాలు - గానాలు ........................................................................................

........................................................................................................................

ఆ) భాష - లిపి ..................................................................................................

........................................................................................................................

ఇ) చక్రము - ప్రయాణం ........................................................................................

........................................................................................................................

ఈ) సంపద - సముద్రం ........................................................................................

........................................................................................................................

**ఆ) కింది పేరా చదివి, జతపరచండి.**

రచయితలు, కవులు తమ రచనలను ప్రచురించే సమయంలో సొంత పేరు మార్చుకుని నచ్చిన ఇతర పేరుతో రచనలు చేస్తారు. వాటినే 'కలం పేర్లు' అంటారు. రచనలలో వారి అసలు పేరు బదులు వేరే పేర్లు వాడతారు. ఉదాహరణకు కిళాంబి వెంకట నరసింహాచార్యులు గారు 'ఆత్రేయ' అనే కలం పేరుతో రచనలు చేశారు. జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు 'కరుణశ్రీ' అనే కలం పేరుతో రచనలు చేశారు. బి.నరసింగరావు, బాల త్రిపుర సుందరమ్మ ఇద్దరూ కలిసి 'బీనాదేవి' కలం పేరుతో కవిత్వం రాశారు. 'జాస్మిన్' పేరుతో రాచకొండ విశ్వనాథ శాస్త్రి కథలు రాసేవారు. ఇలా ఎంతోమంది కవులు కలం పేరుతో రచనలు చేశారు.

| | | |
|---|---|---|
| 1. కిళాంబి వెంకట నరసింహాచార్యులు | (   ) | అ) కరుణశ్రీ |
| 2. జంధ్యాల పాపయ్య శాస్త్రి | (   ) | ఆ) జాస్మిన్ |
| 3. బాలా త్రిపుర సుందరమ్మ | (   ) | ఇ) ఆత్రేయ |
| 4. రాచకొండ విశ్వనాథ శాస్త్రి | (   ) | ఈ) బీనాదేవి |

### ఇ) కింది గేయం చదవండి. భావం రాయండి.



ఇస్మాయిల్

దివిలో ఊగే విహంగాన్ని
భువిలో పాకే పురుగు బంధిస్తుంది!
గడియేని ఆగని సూర్యుణ్ణి
గడియారపు బాహువులు బంధిస్తాయి!
పీతడెక్కల చంద్రుణ్ణి
చేతులెత్తే సముద్రం బంధిస్తుంది!
గలగలలాడే తరంగాల్ని
జలకాలాడే అంగాలు బంధిస్తాయి!
తనచుట్టూ తను తిరిగే చక్రాన్ని
మలుపులు తిరిగే రోడ్డు బంధిస్తుంది!

**పై కవితకు భావం రాయండి.**

భావం : ______________________________

______________________________

______________________________

______________________________

### ఈ) కింది పేరాను చదవండి. ప్రశ్నలు తయారు చేయండి.



వంగపండు ప్రసాదరావు జానపద వాగ్గేయకారుడు. హేతువాది, 'ఉత్తరాంధ్ర గద్దర్' గా పేరు తెచ్చుకున్నారు. మూడు దశాబ్దాల పాటు 300కు పైగా జానపదపాటలు రచించారు. పేదప్రజలను, గిరిజనులను ఎంతో చైతన్య పరిచారు. విప్లవ కవిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందారు. 'ఏం పిల్లడో ఎల్దమొస్తవ' పాటతో ప్రజలను ఉర్రూతలూగించారు. వీరి పాటలు అన్ని గిరిజన మాండలికాలతో పాటు తమిళం, బెంగాళీ, కన్నడ, హిందీ వంటి పది భారతీయ భాషలలోకి అనువదించబడ్డాయి. వంగపండు 'యంత్రమెట్లా నడుస్తు ఉందంటే...' అనే పాట ఆంగ్లంలోకి అనువదించబడింది. ఇది అమెరికా, ఇంగ్లాండులలో కూడా అభిమానం చూరగొన్నది. ఇలా ఎన్నో పాటలతో ప్రజలను సామాజికచైతన్యం వైపు నడిపించారు. వీరు 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి 'కళారత్న' పురస్కారం అందుకున్నారు.

ప్రశ్నలు :

1. ______________________________

2. ______________________________

3. ________________________________

4. ________________________________

**ఉ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. 'వచన కవిత' ప్రక్రియ లక్షణాలను గూర్చి తెలపండి?
2. మానవుడు నదులను మళ్ళించి ఏం చేశాడు?
3. సామ్రాజ్యకాంక్ష వల్ల ఏమి జరుగుతుంది?
4. గ్రహాలపైకి వెళ్ళడంలో మానవునికి గల ఆలోచనలేవి?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాల్లో సమాధానం రాయండి.**

1. కవి దేవిప్రియను గురించి రాయండి.
2. గేయంలో కవి వేటిని నాగరికతగా పేర్కొన్నాడు.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.
2. ఈ పాఠానికి 'చిరమాలిన్యం' శీర్షిక సరైనదేనా ఎందుకు ? రాయండి ?
3. సాటి మనుషులకు సహాయం చేయడం మన బాధ్యత అని తెలియజేస్తూ మిత్రునికి లేఖ రాయండి?



## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీత గీసిన పదానికి అర్థం రాసి,వాటితో సొంత వాక్యాలు రాయండి.**

1. విశ్వంలోని గ్రహాలను కనిపెట్టి వాటికి నామకరణం చేశారు.

2. మనిషిలోని మాలిన్యాన్ని శుభ్రం చేయాలి.

3. కార్మికులు నిరంతరం శ్రమించి సంపదలు సృష్టిస్తారు.

4. ఆదిమానవుడు కానలలో జీవించాడు.

**ఆ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

1. రాత్రి వేళ <u>నింగి</u>లో నక్షత్రాలు కనిపిస్తాయి.
2. సకల జీవులకు <u>ధరణి</u> పుట్టినిల్లు.
3. ఆదిమానవుడు <u>ఆకులను</u> వస్త్రాలుగా ధరించాడు.
4. శాస్త్ర సాంకేతికతతో <u>సాగరాలను</u> శోధించాడు.

1. ..............................
2. ..............................
3. ..............................
4. ..............................

**ఇ) కింది ప్రకృతి, వికృతులను జత చేసి రాయండి.**

| | | |
|---|---|---|
| అ) గృహము | (     ) | 1. రేడు |
| ఆ) సముద్రము | (     ) | 2. గీము |
| ఇ) రాజు | (     ) | 3. సంద్రం |

| ప్రకృతి | వికృతి |
|---|---|
| 1 ............. | ............... |
| 2 ............. | ............... |
| 3 ............. | ............... |



**భాషాక్రీడ**

**అ) కింద పదాలకు అర్థాలు పెట్టెలో ఉన్నాయి. వాటిని అకారాది క్రమం ఆధారంగా గుర్తించి రాయండి.**

| అ | ఋ | ఇ | ఉ | అం |
|---|---|---|---|---|
| మాలిన్యం, | నామకరణం, | నిర్మించడం, | నిరంకుశులు, | బృందగానం |
| ఒ | ఎ | | | |
| అవతరించుట | విగ్రహం | | | |

| ఏ | ఊ | ఈ | ౠ |
|---|---|---|---|
| బొమ్మ | కనికరం లేనివారు | కట్టడం | పేరు పెట్టుట |

| అః | ఆ | ఓ |
|---|---|---|
| కలిసిపాడడం | మలినం | పుట్టుట |

| | | |
|---|---|---|
| ఉదా : మాలిన్యం | = | మలినం |
| 1. ................. | = | ...................... |
| 2. ................. | = | ...................... |
| 3. ................. | = | ...................... |
| 4. ................. | = | ...................... |
| 5. ................. | = | ...................... |



## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి సంధి పేర్లను రాయండి.**

1. పంచామృతం = ............ + ............. = ......................
2. రాజ్యమేర్పాటు = ............ + ............. = ......................
3. ఉత్తరాంధ్ర = ............ + ............. = ......................
4. ఉర్రూతలూగించు= ............ + ............. = ......................

**ఆ) కింది పదాలకు విగ్రహ వాక్యం రాసి సమాసాన్ని తెలపండి.**

1. ఏడురాజ్యాలు =................................ =................................
2. ఆయుధశక్తి =................................ =..................................
3. దేశభక్తి =................................ =.................................
4. అక్షర రూపం =................................ =................................

**ద్విరుక్తటకారాదేశ సంధి**

**ఇ) కింది పదాలను విడదీసిన విధానాన్ని పరిశీలించండి.**

1. కుట్టుసురు = కుఱు + ఉసురు = కు(ఱ్) + ఉ + ఉసురు = కు(ట్ట్) ఉ + ఉసురు = కుట్టుసురు
2. చిట్టడవి = చిఱు + అడవి = చి(ఱ్) + ఉ + అడవి = (చిట్ట్) ఉ + అడవి = చిట్టడవి
3. కట్టెదుట = కడు + ఎదుట = క(డ్) + ఉ + ఎదుట = క(ట్ట్) ఉ + ఎదుట = కట్టెదుట
4. నట్టిల్లు = నడు + ఇల్లు = న(డ్) + ఉ + ఇల్లు = న(ట్ట్) ఉ + ఇల్లు = నట్టిల్లు
5. నిట్టూర్పు = నిడు + ఊర్పు = ని(డ్) + ఉ + ఊర్పు = ని(ట్ట్) ఉ + ఊర్పు = నిట్టూర్పు

పై ఉదాహరణలలో పూర్వపదాలుగా కుఱు, చిఱు, కడు, నడు, నిడు అను పదాలు ఉన్నాయి. పరపదాల మొదట అచ్చులు పరమయ్యాయి.

> కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దంబుల ఱ, డ లకు అచ్చు పరమైనప్పుడు **ద్విరుక్తటకారం** ఆదేశంగా వస్తుంది.

పై సూత్రం వల్ల పూర్వపదాల చివరి హల్లులైన ఱ, డ ల స్థానంలో ద్విరుక్తటకారం వచ్చిచేరడంవల్ల ద్విరుక్తటకారాదేశ సంధి జరిగింది.

**ఈ) క్రింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి**

చిట్టెలుక = ............ + ............. = .............................................
చిట్టాకు = ............ + ............. = .............................................
నట్టేట = ............ + ............. = .............................................

**ఉ) అలంకారాలు**

**❖ అంత్యానుప్రాస అలంకారం :**

శబ్ద సౌందర్యాన్ని పెంపొందించేవి శబ్దాలంకారాలు. శబ్దాలంకారాలలో ఒకటైన అంత్యాను ప్రాసాలంకారం గురించి తెలుసుకుందాం!

**కింది పదాలను పరిశీలించండి.**

1. రాళ్ళను మలిచి ఆయుధాలుగా <u>చెక్కుకున్నాం.</u>

   జంతువులని చంపి ఆకలి <u>తీర్చుకున్నాం.</u>

2. మాటలు <u>నేర్చుకున్నాం.</u>

   లిపులు <u>కూర్చుకున్నాం.</u>

   దేవుళ్ళను <u>సృష్టించుకున్నాం.</u>

పై కవితలోని పాదాలన్నింటి చివర ఒకే విధమైన లయాత్మక పదాలు వచ్చాయని గమనించాలి. ఇలా అన్ని పాదాలలోనూ చివరన ఒకే విధమైన లయాత్మక పదాలు ఉంటే అంత్యాను ప్రాసాలంకారం అవుతుంది.

**పాఠంలోని అంత్యానుప్రాస కలిగిన పాదాలను గుర్తించి రాయండి.**

1. ....................................  2. ..........................................

3. ......................................  4. ..........................................

**పాఠాంత పద్యం** 

**ఇనుములోన గాగ హీనలోహమ్ములు**
**బంగరౌనటంట పసరుపూయ**
**వె(ఱ్ఱికూతయటర విజ్ఞాన యుగములో**
**సమసమాజ కాంక్షి చారువాక** **- బలరామకృష్ణ (చారువాక శతకం)**

భావం : కొలిమిలో కాగిన లోహాలు బంగారం పూత పెడితే బంగారంలా మెరుస్తాయి కాని బంగారం కాదు అలాగే విజ్ఞాన యుగంలో మూఢ విశ్వాసాలేంటి అని ప్రశ్నిస్తున్నాడు సమసమాజాన్ని కోరుకునే చారువాకుడు.

**సూక్తి** - గంధపు చెక్కలా సేవలో అరిగిపో కాని ఇనుములా తుప్పు పట్టకు - **మోక్షగుండం విశ్వేశ్వరయ్య**

 **ఈ పాఠంలో నేర్చుకున్నవి**

1. నాకు నచ్చిన అంశం ..........................................................................
2. నేను గ్రహించిన విలువ ..........................................................................
3. సృజనాత్మక రచన ..........................................................................
4. భాషాంశాలు ..........................................................................

జూన్ 21వ తేదీని ప్రపంచ మానవతావాద దినోత్సవంగా జరుపుకొంటాం.

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1) మానవ పరిణామక్రమంలో జరిగిన మార్పులను వివరించండి.

2) మానవతావాద దినోత్సవం గూర్చి విద్యార్థులకు వివరించండి.

3) అంత్యప్రాసలతో వచన కవితలు రాసేటట్లుగా విద్యార్థులను ప్రోత్సహించండి.

## పాఠాంత అంశము

**ముఖాముఖి (ఇంటర్వ్యూ)**

తుని ప్రభుత్వ పాఠశాలకు మాతృభాషా దినోత్సవానికి అతిథిగా వచ్చిన కవి, వైద్యుడు, సంగీతకారుడు అయిన శ్రీపాద పినాక పాణి గారితో 8వ తరగతి విద్యార్థులు జరిపిన ముఖాముఖి కార్యక్రమం.

విద్యార్థులు: నమస్కారం అండీ.

పినాకపాణి: శుభాశీస్సులు పిల్లలూ! అందరు బాగున్నారా!.

విద్యార్థులు: అయ్యా! మీరు సాహిత్య, సంగీత, కళా, వైద్య, సామాజిక రంగాలలో చక్కగా రాణించారు. ఇదెలా సాధ్యమైంది. మాకోసం చెప్పండి. మేం మీలాగ కావడానికి మార్గదర్శనం చేయండి.

పినాకపాణి : నేను వృత్తిరీత్యా వైద్యుణ్ణి, నాకు సంగీతం అంటే ఇష్టం. సాహిత్యాభిరుచీ ఎక్కువే. నేను చిన్నప్పటి నుంచి ప్రతి అంశాన్ని పరిశీలించి, శ్రద్ధగా నేర్చుకునేవాణ్ణి. పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చు.

విద్యార్థులు: మీరు సమాజ సేవకునిగా పేరు తెచ్చుకున్నారు కదా! మీరు చేసిన సేవలను చెప్పండి?

పినాకపాణి: వైద్యవృత్తిలో ఉన్నందుకు రకరకాల వ్యక్తులు తారసపడుతుంటారు. వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకుంటాను. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి ఆతని కుటుంబ పరిస్థితులు, పరిసరాల వాతావరణం, ఆర్థికస్థితులు కారణమౌతాయి. ఉన్న ఆర్థికస్థితిలోనే మంచితిండి తినమని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సలహా ఇస్తుంటాను.

విద్యార్థులు: మీరు చేసే పని మాకు బాగా నచ్చింది. నేటి సమాజంలో మనుషులకు మానవత్వం లేక తోటి వారికి సాయపడడం లేదు. ఇలాంటి వారికి మీరిచ్చే సందేశం ఏమిటి?

పినాకపాణి: నా చిన్నతనంలో స్వచ్ఛమైన జీవితం ఉండేది. ఈనాటి జీవనంలో ఉన్న మాలిన్యం ఆనాడు లేదు. స్వార్థం ఉండేదే కాదు. మన ఆలోచన, ప్రవర్తన, ఆచరణలో మార్పు రావాలి. పొరుగువారికి సహాయ పడాలి. అందరూ బాగుండాలి.

విద్యార్థులు: గొప్పగా సెలవిచ్చారు. రేపటి పౌరులుగా మేమెలా ఎదగాలి? దీనికి తగిన సూచనలు చేయగలరు.


పినాకపాణి: ఎవరికైనా తల్లిదండ్రుల, గురువుల మార్గదర్శనం ప్రగతికి సోపానం. బడిలో ఉపాధ్యాయుల బోధనలు మనలను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి నడుపుతాయి. వినయం, వివేకం, క్రమశిక్షణ, పట్టుదల మీ వృద్ధికి దోహద పడతాయి. పిల్లలూ! ఎల్లప్పుడు 'ఎదిగే కొద్దీ ఒదగాలి' అన్న సూత్రం పాటించాలి. అదే మనలను విజయ శిఖరాలకు చేరుస్తుంది. రేపటి పౌరులుగా మీరు ఉన్నతంగా ఎదిగి, దేశాభివృద్ధికి తోడ్పడాలి. పిల్లలూ! 'దీర్ఘాయుష్మాన్ భవ'.

# 10

# నాటి చదువు

C5D4D3

## చదవండి - ఆలోచించి చెప్పండి



ఉపాధ్యాయులకు నా పట్ల వాత్సల్యం ఎక్కువ. పిల్లవాని నడత గురించి, చదువు గురించి ప్రతి సంవత్సరం స్కూలు వారు పంపే సర్టిఫికెట్ లో నా గురించి మంచిగానే పంపేవారు. నేను రెండవ తరగతి తరువాత అనేక బహుమతులు సంపాదించాను. అయిదవ, ఆరవ తరగతుల్లో నెలకు నాలుగు రూపాయల చొప్పున 'విద్యార్థి వేతనం' కూడా పొందాను. ఇందుకు నా తెలివితేటలతో పాటు అదృష్టం కూడా పని చేసిందని నా అభిప్రాయం. ఏది ఏమైనా విద్యను పొందడమంటే "ఓర్పు, సహనంతో పాటు నిరంతర శ్రమ కల్గి వుండాలి" అని గాంధీ గారు తన ఆత్మకథ "సత్యశోధన"లో చెప్పారు.

– మహాత్మాగాంధీ (సత్యశోధన)


ప్రశ్నలు :

1. పై పేరాలో ఎవరు దేనిగురించి చెప్పారు?
2. విద్య రావాలంటే ఏఏ గుణాలుండాలని గాంధీజీ అన్నారు?
3. మీరు ఎప్పుడైనా ఎవరి ఆత్మకథనైనా చదివారా?

**ఉద్దేశం**

"ఆత్మకథ"ని పరిచయం చేస్తూ, నాటి విద్యావిధానాన్ని విద్యార్థులకు తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**రచయిత పరిచయం**



1889 – 1981

### ఆచార్య మామిడిపూడి వేంకట రంగయ్య

మామిడిపూడి వేంకట రంగయ్య గారు నెల్లూరు జిల్లా కోవూరు తాలుకా పురిణి గ్రామంలో జన్మించారు. వీరి తండ్రి వెంకటేశాచార్యులు, తల్లి నరసమ్మ. వీరు సంగ్రహ ఆంధ్రవిజ్ఞానకోశ నిర్మాణంలో సంపాదక వర్గానికి అధ్యక్షులుగా 1958 సంవత్సరంలో మొదటి సంపుటాన్ని విడుదల చేశారు. **మారుతున్న సమాజం నా జ్ఞాపకాలు** పేరుతో ఆత్మకథ రాసుకున్నారు. వీరి సేవలను మెచ్చి భారత ప్రభుత్వం 1968 సంవత్సరంలో పద్మభూషణ్ పురస్కారం ఇచ్చి గౌరవించింది. **ఈ పాఠం వారి ఆత్మకథ నుండి స్వీకరించబడింది.**

## నాటి చదువు


మాది నెల్లూరు జిల్లా కోవూరు తాలూకాలోని పురిణి గ్రామం. దీనిని పెద్దగ్రామంగా పరిగణించవచ్చును. మా తండ్రి వెంకటేశాచార్యులు. తల్లి నరసమ్మ. సర్వధారి సంవత్సర పుష్య శుద్ధ సప్తమి (1889 జనవరి 8) నా జన్మదినం. నా బాల్యం సాఫీగానే నడిచిపోయింది. నా గ్రామస్థులు నేను వారికి గౌరవపాత్రులైన వెంకటేశమయ్య కుమారుడనని, నా పట్ల ప్రేమాభిమానములు కలవారయ్యారు. నాకు అయిదవ ఏట అక్షరాభ్యాసం చేసి, గ్రామంలోని వీథి బడిలో చేర్చారు. నాకు 'శిరోభూషణం రాఘవాచార్యులుగారు' అయ్యవారు. పెద్దబాలశిక్ష మాకు పాఠ్యగ్రంథం. మా బడిలో 15, 20 మంది కంటే ఎక్కువగా పిల్లలుండేవారు కారు. ఆడపిల్లలు ఎవరూ ఆ రోజులలో బడికి వచ్చి చదువుకొనేవారు కారు.

మా బడి అక్షరాలా వీథిబడియే. అయ్యవారి చిన్న పూరి ఇంటికి ముందు ఖాళీ ప్రదేశమే మాబడి. దానికి వీథికి మధ్య ఒక గోడ కూడ లేదు.అది వీథిలో కలిసిపోయి ఉండేది. బడిలో పిల్లలు నేలమీద కూర్చుండి వారి చదువును సాగించేవారు.కొందరు చిన్న తాటాకుచాపలను తెచ్చుకొని వాటిపైన కూర్చుండేవారు. ఆ రోజులలో బెంచీలు వాడుకలోకి రాలేదు. పిల్లలు గోచీ పెట్టుకొని బడికి వచ్చేవారు. దానికి అదనంగా వారికి దుస్తులు ఉండేవి కావు. బడికి రాని పిల్లలు కూడా గోచీతోనే తిరగడం మామూలు. చలికాలంలో మాత్రం ఒక చిన్నదుప్పటిని కప్పుకొని బడికి వచ్చేవారు. విద్యావిధానంలో మా కాలం ఒక సంధియుగం. పాతకొత్త కలిసి పోతున్న కాలం. పిల్లలలో కొందరు కఱ్ఱపలకలపై సుద్దముక్కతో వ్రాసేవారు.

మరికొందరు అప్పుడప్పుడే ఉపయోగంలోకి వచ్చిన స్లేటు పలకలను స్లేటు బలపాలను ఉపయోగించేవారు. స్లేటు పలకలను ఎండుకొబ్బరి ముక్కలతో రుద్దడం వారి అలవాటు, కాగితాలు, రెక్క పేనాలు పిల్లలే తయారు చేసుకొని ఉపయోగించేవారు. కరక్కాయ సిరా కొందరు ఉపయోగించేవారు. కానీ, తక్కిన వారు పాతపద్ధతి ప్రకారం గంటంతో  తాటాకులపై వ్రాయడం నేర్చుకొనేవారు. నేను అలాగు నేర్చుకొన్న వాడిని.

సూర్యోదయానికి ముందే పిల్లలు బడికి రావడం మామూలు, మొదట వచ్చిన వాని అర చేతిలో సిరీ, తర్వాత వచ్చినవాడి చేతిలో చుక్క అయ్యవారు పెట్టేవారు. పిల్లలందరు 8 గంటల ప్రాంతంలో ఇండ్లకు వెళ్ళి చల్లన్నం తిని, వెంటనే తిరిగి బడికి వచ్చేవారు. మధ్యాహ్నం పదకొండుగంటలకు ఇండ్లకు వెళ్ళి భోజనం చేసి, రెండు గంటల ప్రాంతంలో బడికివచ్చి, సాయంకాలం సూర్యాస్తమయ సమయంలో ఇంటికి వెళ్ళిపొయ్యేవారు. నేలమీద అక్షరాలు వ్రాసి నేర్చుకోవడంతో వారి విద్య ప్రారంభమయ్యేది. క్రమక్రమంగా పలకల మీద అక్షరాలను, గుణింతాన్ని రాయుటకు నేర్చుకొనేవారు. తర్వాత బాలశిక్షలోని చిన్నచిన్న మాటలను రాసేవారు. ఈ విధంగా సంవత్సరములో రాతను, సునాయాసంగా బాలశిక్షను చదవడం వారు పూర్తి చేసేవారు. దీనితోపాటు ఉదయం, సాయంత్రం ఎక్కాలను వల్లించడం ఒక దినచర్య.


ఇది పూర్తికాగానే రెండవ సంవత్సరం భిన్నాలు, అటు తర్వాత మావులు నేర్చుకొనే వారు. కూడికలు, తీసివేతలు, గుణకార భాగారాలు, వడ్డీ కట్టడం, బాలశిక్షలోని ఇతర రకములైన లెక్కలు నేర్చుకొనడం  జరిగేది. బాలశిక్షను చక్కగా చదవగల వారికి రెండవ సంవత్సరం "పెద్దపుస్తకం" అనగా భారతమో, భాస్కర రామాయణమో చదవడం నేర్పేవారు. పౌర్ణమి, పాడ్యమి, అలాగే అమావాస్య, పాడ్యమీలు సెలవు రోజులు. ఆ సెలవు రోజులలో వల్లించుటకు సుమతి శతకం, వేమన శతకం, రుక్మిణీ కల్యాణం మొదలైన వాటిలోని నాలుగైదు పద్యాలను పలకల మీద వ్రాసుకొనిపోయి, విదియనాడు బడికి వచ్చేనాటికి వాటిని ఒప్పగించేవారు. ఈ విధంగా చదువు పూర్తి అయ్యేటప్పటికి  రెండు మూడు వందల పద్యాలు వారికి కంఠతా వచ్చి ఉండేవి. 5-వ ఏటి నుంచి 7 వరకు నేను వీథిబడిలో చదివి, పైన వివరించిన విద్యను పూర్తిగా నేర్చుకొన్నాను.




ప్రతిసంవత్సరము బడిని తనిఖీ చేసి పిల్లలను పరీక్షించుటకు ఒక ప్రభుత్వ ఇన్‌స్పెక్టరు వచ్చేవాడు. ఆ సందర్భంలో జరిగిన ఒక విషయం నాకు ఇంకా జ్ఞాపకం ఉన్నది. నేను రెండో తరగతిలో ఉన్నప్పుడు బడి తనిఖీకి ఇన్స్పెక్టరు రాత్రి 7-8 గంటల మధ్య వచ్చాడు. ఆయన దగ్గర ఒక గుడ్డిలాంతరు ఉండేది. దాని ఎదుట పిల్లలందరిని సమావేశపరచవలసిందిగా అయ్యవారిని ఆదేశించాడు. పిల్లల పరీక్షను ఆ రాత్రియే పూర్తి చేసి, మరుసటి రోజు ఉదయమే గ్రామాంతరానికి వెళ్లే ఉద్దేశంతో వచ్చినాడు. రాత్రి 7-8 గంటలప్పుడు పిల్లలందరు నిద్రలో ఉండేవారు. వారిని లేపి, బడిలో హాజరు పెట్టడం ఒక సమస్య. తక్కిన పిల్లల విషయం నాకు తెలియదు. కాని, నన్ను లేపి ఒక అరటిపండును నా చేతిలో పెట్టి బడికి తీసుకొని వెళ్లినారు. ఇన్స్పెక్టరు నన్ను ఒక పద్యం చదువుమని, ఒక ఎక్కం ఒప్పగించుమని లాంతరు ఎదుట బాలశిక్షలోని రెండు వాక్యాలను చదువుమని అడిగాడు.నేను ఆయన కోరిన ప్రకారం చేశాను. అంతటితో నా పరీక్ష పూర్తి అయి నేను కృతార్థుడైనట్లు చెప్పాడు. తక్కిన పిల్లల పరీక్ష కూడా ఇదే పద్ధతిలో జరిగింది. ఆ పరీక్షలో పిల్లలందరూ కృతార్థులైనారు.

బడిపిల్లలందరూ దసరాకు ముందు ఇరవై రోజులు దసరా పద్యాలను ఒప్పగించడానికి నేర్చుకొనేవారు. ఈ పద్యాలను గుండ్రంగా కత్తిరించిన తాటాకులలో రాసి వాటినన్నింటిని కలిపి ఒక పుస్తకంలా కుట్టి ఉంచేవారు. దీనిని చేతిలో పెట్టుకుని పిల్లలు అయ్యవారితో కూడా గ్రామంలోని కొందరి ఇండ్లకు వెళ్ళి, పద్యాలను ఒప్పగించేవారు. ఇంటి యజమానులు పిల్లలకు పప్పుబెల్లాలను, అయ్యవారికి అర్ధ, పావలా డబ్బులను ఇచ్చి పంపి వేయడం మామూలు. దసరాలో పిల్లలందరు మంచి దుస్తులను ధరించి, చేతిలో విల్లంబులను గాని, కోతికొమ్మంచిని గాని పెట్టుకొని దసరా పద్యాలను చదువుటకు వెళ్లేవారు. నా పినతల్లి వెంకమ్మ తిరుపతి నుండి నాకు ఒక చల్లడం (పంట్లాం), ఒక చొక్కాయ, ఒక టోపీని తెచ్చి ఇచ్చింది. ఈ దుస్తులను వేసుకొని, చేతిలో కోతికొమ్మంచిని పెట్టుకొని దసరా కార్యక్రమంలో నేను పాల్గొనేవాడను.

ఈ విధంగా నేను నా బాల్యంలో నా వీధిబడి విద్యను పూర్తిచేశాను. ఈనాడు ఇలాంటి వీధిబడులుగాని, విద్యావిధానం గాని లేదు. మా గ్రామంలోనూ, ఇతర గ్రామాలలోనూ ప్రభుత్వం వారో, జిల్లాపరిషత్తు వారో విద్యాలయాలను స్థాపించి నడిపిస్తున్నారు. అవి కొంత విశాలమైన ఇండ్లలో నెలకొని ఉన్నవి. వాటిలో మగపిల్లలే గాక ఆడపిల్లలు చదువుతున్నారు. ఒక అయ్యవారికి బదులు కొంత ఉన్నతవిద్యను అభ్యసించి, ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారు ఉపాధ్యాయులుగా ఉన్నారు. ఒక ఉపాధ్యాయునికి బదులు తరగతుల సంఖ్యను బట్టి నలుగురైదుగురు ఉపాధ్యాయులున్నారు. బెంచీలు,కుర్చీలు, మేజాబల్లలు, నల్లబల్లలు, ఇతరములైన పటాలు, వివిధ విషయాలను బోధించే పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, పేనాలు మొదలైన పరికరాలు వాడుకలోకి వచ్చినవి. గోచి పెట్టుకొని ఎవరూ బడికి వెళ్ళడము లేదు. అందరు ఒంటినిండా దుస్తులు వేసుకొని



వెళ్లుతున్నారు. వీటి అన్నిటిమూలంగా నేను చిన్ననాడు నేర్చిన విద్య కంటె సర్వవిధాలా విశాలతరమైన విద్య అందరికి అందుబాటులోకి వచ్చింది. ఇది హర్షింపదగిన పరిణామం. నా చిన్ననాటి చదువు ఈలాంటిది కాదు. ఈతరం వారికి దానిని గురించి ఏమీ తెలియదు. అందుచేతనే దానిని గురించి కొంచెం దీర్ఘంగా రాశాను.

నేను విద్యార్థిగా ఉన్న రోజులలో విద్యార్థులకు ఉపాధ్యాయుల పట్ల అత్యంత గౌరవం ఉండేది. వారికి ఎదురు చెప్పడం గాని, వారి ఆదేశాలకు అన్యథా ప్రవర్తించడం గాని గొప్ప నేరమని వారు భావించేవారు. ఇది అనాదిగా మన దేశంలో ఏర్పడిన సంప్రదాయం. నా జీవిత కాలంలో మనసమాజం అన్ని రంగాలలో అనేక విధాలుగా మారింది. పారిశ్రామికంగా దేశం ముందడుగు వేస్తున్నది. అక్షరాస్యత పెరిగింది. విద్యార్థులు ఆధునిక యుగంలో ప్రాధాన్యత వహించిన విజ్ఞానశాస్త్రం, సాంకేతిక శాస్త్రం, సామాజిక శాస్త్రం మొదలైన వాటిలో ఉత్తీర్ణులగుచున్నారు.

నాడు స్తంభించి పోయిన సమాజం ఈనాడు సజీవంగా ప్రవర్తిస్తున్నది. మొత్తంమీద మనం ఉత్తమ మార్గంలో నడుచుటకు ప్రయత్నిస్తున్నామనేదే నా విశ్వాసం. కావున ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకొని దేశాభివృద్ధికి తోడ్పడగలరని ఆశిస్తున్నాను. ఈ ప్రయత్నం ఫలప్రదం కావలెననేదే నా ఆశయం.

**ప్రక్రియ – ఆత్మకథ**

వ్యక్తి తన జీవితానుభవాలు, భావాలతో కలబోసి తనకు తానే రాసుకునే సాహితీ ప్రక్రియ ఆత్మకథ. ఇది కేవలం ఆ వ్యక్తి చరిత్ర మాత్రమే కాదు. ఆయా కాలాలను ప్రస్ఫుటించే సమాజ చరిత్ర కూడా. ఇది ఉత్తమ పురుష కథనంలో ఉంటుంది.

G1E7Y8

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. రాయండి.**

1. పాఠం ద్వారా మీరు గ్రహించిన విషయాలు చెప్పండి.
2. మీరు ప్రాథమిక పాఠశాలలో చదివేటప్పుడు జరిగిన ఒక సంఘటన గురించి చెప్పండి.
3. పాఠం ఆధారంగా విద్యావ్యవస్థలో నాటి, నేటి స్థితిగతులను తెలుపుతూ కింది పట్టికను పూరించండి.

| క్రమ సంఖ్య | అంశం | నాటి స్థితి | నేటి స్థితి |
|---|---|---|---|
| i | పాఠశాల భవనాలు | ..................... | ......................... |
| ii | ఉపాధ్యాయులు | ..................... | ......................... |
| iii | విద్యార్థుల క్రమశిక్షణ | ..................... | ......................... |
| iv | పాఠ్యపుస్తకాలు,రాత పరికరాలు | ..................... | ......................... |

**ఆ) పాఠం చదివి, నాటి విద్యా విధానంలోని విషయాలను గురించి వ్రాయండి.**

1. పిల్లలు అక్షరాలు నేర్చుకొనే విధానం

జ. ________________________________________

2. పెద్దబాలశిక్షతో పాటు నేర్చుకొనేవి :

జ ________________________________________

3. రెండవ సంవత్సరంలో నేర్చుకొనేవి :

జ ________________________________________

4. పిల్లల వేషధారణ దసరాలో ఎలా ఉండేది:

జ ________________________________________

**ఇ) కింది పేరా చదివి బుచ్చిబాబు గారి నాలుగు ఇష్టాయిష్టాలు రాయండి.**



ప్రకృతి సౌందర్యం పట్లకూడ నా దృక్పథం ఇట్లాంటిదే. సహజంగా విచ్చలవిడిగా పెరిగిపోయిన అడవులు కొండలు, లోయలు, సెల యేళ్ళు నాకిష్టం. అట్లాంటి ప్రకృతి వర్ణించడంలో ఎంతో ఆనందం పొందుతాను. కృత్రిమంగా నెలకొల్పిన పార్కులు క్రమంగా ఉంటాయి. కాని వాటికి వ్యక్తిత్వం లేదు. అవి నావి కావు. నాలో ఉన్న తృష్ణని

సంతుష్టిపరచలేవు. నా వ్యక్తిత్వాన్ని నశింపజేసి, విడగొట్టి తనలో కలుపుకునే శక్తి వాటిలో లోపించినట్లనిపిస్తుంది. సహజమైన ఊరవతల ప్రకృతికి ఈ శక్తి ఉంది.

**నా అంతరంగ కథనం - బుచ్చిబాబు**

1. ..........................................  2. ..................................................

3. ..........................................  4. ..................................................

**ఈ) కింది పేరా చదివి బహుళైచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలను గుర్తించండి.**



దివాకర్ల తిరుపతి శాస్త్రి (1872 -1919), చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి(1870 - 1950) జంట కవులు. వీరు తిరుపతి వేంకట కవులుగా సుప్రసిద్ధులు. వీరిద్దరూ ఇంచుమించుగా వంద గ్రంథాలు, అనేక నాటకాలు రచించారు. అందులో ధాతురత్నాకర చంపూ, కాళీసహస్రం, క్షమాపణం వంటి సంస్కృత గ్రంథాలు రచించారు. లక్ష్మణా పరిణయము అనే భాగవత కథ, జాతక చర్య అనే జ్యోతిష శాస్త్ర గ్రంథాలు రచించారు. వీటితో పాటుగా ఏలా మాహాత్మ్యము, (ఏలా నది గురించి తెలిపే కావ్యం) బొబ్బిలి పట్టాభిషేకం మొదలైన కావ్యాలు రాశారు.. 'పతివ్రత' అలాగే ఆవు - పులికి మధ్య జరిగిన సంభాషణను తెలిపే 'గోదేవి' వంటి కథాకావ్యాలు రాశారు. 'జెండా పై కపిరాజు చెల్లియో! చెల్లకో! పద్యాలు వీరు రాసిన పాండవోద్యోగ విజయమనే నాటకం లోనివి. వీటితో పాటు భారత వీరులు, షష్టిపూర్తి మొదలైన వచన రచనలు చేసారు. ఈ జంట కవులు తెలుగు సాహిత్యానికి లభించిన ఆణిముత్యాలు.

1. పై పేరాలో పేర్కొన్న జంట కవులు ఎవరు ? ( )

(అ) విజయనగర వేంకట కవులు (ఆ) తిరుపతి వేంకట కవులు (ఇ) వేంకటగిరి వేంకటకవులు

2. ఆవు - పులి సంభాషణ తెలిపే కావ్యం ( )

(అ) గోదేవి (ఆ) పతివ్రత (ఇ) క్షమాపణ

3. "చెల్లియో చెల్లకో" పద్యం ఉన్న నాటకం ( )

(అ) భాగవతోద్యోగం (ఆ) పాండవోద్యోగం (ఇ ) బొబ్బిలి పట్టాభిషేకం

4. నది గొప్పతనాన్ని తెలిపే రచన ( )

(అ) కృష్ణ మాహాత్మ్యం (ఆ) పెన్నా మాహాత్మ్యం (ఇ) ఏలా మాహాత్మ్యం

**ఉ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి :**

1. నాటి చదువు పాఠ్యభాగ రచయిత గురించి రాయండి.
2. తనఖీలో ఇన్స్పెక్టరు మామిడిపూడి వేంకట రంగయ్యను ఏమని ప్రశ్నించారు ?
3. దసరా పండుగకు ముందు పిల్లలు పద్యపఠన కార్యక్రమాన్ని ఏవిధంగా నిర్వహించేవారు ?
4. నాటి విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల ఎలాంటి భావన కలిగి ఉండేవారు ?

## వ్యక్తీకరణ – సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో సమాధానాలు రాయండి**

1. ఆత్మకథా ప్రక్రియా లక్షణాలను గురించి రాయండి
2. వేంకట రంగయ్య పరీక్షలలో కృతార్థుడైన విధం రాయండి.
3. నాటి విద్యార్థులు దసరా పండుగకు చేసిన కార్యక్రమాన్ని గురించి రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. ఆనాటి విద్యావిధానంలో ఉన్న ప్రత్యేకత ఏమిటి?
2. విద్యా ఆవశ్యకతను రాయండి.
3. నాటి, నేటి విద్యా విధానాల తారతమ్యం గురించి రాయండి.

## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాసి, వాటితో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా – <u>విద్య</u>కు సాటియైన ధనం లేదు.        విద్య – చదువు

**చదువు** వలన సంస్కారం ఏర్పడుతుంది.

1. రాజు యుద్ధంలో విజయం సాధించిన సైనికులకు <u>**పారితోషికం**</u> ఇచ్చాడు.

జ. ..........................................................................................

2. అతడు పరీక్షలలో <u>**కృతార్థుడు**</u> అయ్యి ఉద్యోగం సాధించాడు.

జ. ..........................................................................................

3. నేను ఐదవ తరగతిలో ఉన్నప్పుడు పద్యాల పోటీలో పాల్గొన్నట్లు <u>**జ్ఞాపకం**</u> ఉంది.

జ. ..........................................................................................

4. శ్రీనాథుడు <u>**పాండిత్యం**</u>తో గౌడ డింఢిమ భట్టును ఓడించాడు.

జ. ..........................................................................................

**ఆ) కింది ప్రకృతి, వికృతి పదాలను జతపరచి రాయండి.**

1. అమావాస్య        అ. బత్తి
2. ఆర్య        ఆ. అమవస
3. ఉపాధ్యాయుడు        ఇ. అయ్య
4. భక్తి        ఈ. ఒజ్జ

| ప్రకృతి | వికృతి |
|---|---|
| 1. ...................... | ...................... |
| 2. ...................... | ...................... |
| 3. ...................... | ...................... |
| 4. ...................... | ...................... |



## భాషాక్రీడ

**అ) కింది ఆధారాలతో గళ్ళను పూరించండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | | | 2 | |
| | | | | | |
| | | | 3 | | |
| 4 | | | | | 6 |
| | | | | 5 | |
| | | | | | |

అడ్డం:

1. రచయిత పుట్టిన గ్రామం (3)
2. నక్షత్రం (2)
3. చిన్నపాటి కత్తిని ఇలా అంటారు (2)
4. రచయిత తల్లి పేరు(4)
5. తండ్రి తండ్రిని ఏమంటారు (2)

నిలువు:

1. "పుణ్యం" వికృతి పదం (2)
2. ఈ పాఠంలోని పిల్లలు దసరా పద్యాలు ఏ ఆకులపై రాసారు (3)
3. నాయనమ్మ (2)
4. ఆభరణాలు (3)
5. వంద పద్యాలు కల కావ్యం (3)



## వ్యాకరణాంశాలు

**అ) కింది సంధి పదాలకు తగిన విధంగా సమాధానాలు రాయండి.**

| | | | |
|---|---|---|---|
| ఉదా: అక్షరాభ్యాసం | = | అక్షర + అభ్యాసం | - సవర్ణదీర్ఘసంధి |
| 1. సూర్యోదయం | = | ________+________ | -________________ |
| 2. గ్రామాంతరం | = | ________+________ | -________________ |
| 3. విద్యాలయాలు | = | ________+________ | -________________ |
| 4. మధ్యాహ్నం | = | ________+________ | -________________ |

**ఆ) కింది పదాలకు విగ్రహవాక్యాలురాసి, సమాస నామాలు రాయండి**

1. నా జన్మదినం =..........................................................................

2. పెద్దబాలశిక్ష =..........................................................................

3. పాతపద్ధతి =..........................................................................

4. రెండుగంటలు =..........................................................................

**ఇ) కింది వాక్యాలను పరిశీలించండి.**

1. పుస్తకములు మంచి నేస్తాలు : పుస్తకాలు మంచి నేస్తాలు.
2. దేశమునకు గ్రామములు పట్టుకొమ్మలు : దేశానికి గ్రామాలు పట్టుగొమ్మలు.
3. పోతన భాగవత పద్యములు మధురమైనవి : పోతన భాగవత పద్యాలు మధురమైనవి.
4. అర్థవంతమైన అనేక వాక్యముల సముదాయమే వ్యాసం : అర్థవంతమైన అనేక వాక్యాల సముదాయమే వ్యాసం.
5. నా మిత్రుడు దూర ప్రాంతములో నివసిస్తున్నాడు : నా మిత్రుడు దూర ప్రాంతాన నివసిస్తున్నాడు.

**పై వాక్యాలలో పుస్తకములు–పుస్తకాలు, నేస్తములు–నేస్తాలు, దేశమునకు–దేశానికి, గ్రామములు–గ్రామాలు, పద్యములు–పద్యాలు, వాక్యములు–వాక్యాలు, ప్రాంతము–ప్రాంతాన వంటి పర్యాయ పదాలున్నాయి.**

| పూర్వపద చివరి అక్షరం | | పరమైన అక్షరాలు | ఉదాహరణలు | |
|---|---|---|---|---|
| పుస్తక | ము | లు | పుస్తకాలు | పుస్తకాలు, పుస్తకాల, పుస్తకాన |
| గ్రామ | | | గ్రామాలు | గ్రామాలు, గ్రామాల, గ్రామాన |
| పద్య | | ల | పద్యాలు | పద్యాలు, పద్యాల, పద్యాన |
| వాక్య | | న | వాక్యాలు | వాక్యాలు, వాక్యాల, వాక్యాన |
| ప్రాంత | | | ప్రాంతాలు | ప్రాంతాల, ప్రాంతాన |

**సూత్రం : లు, ల, నలు పరమగునపుడు మువర్ణమునకు లోపంబునూ, తత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబునూ విభాషగానగు.**

అంటే కావ్యభాషలో పద్యములు, పద్యాలు అని రెండు రూపాలుగా ఉంటాయి. నేటి తెలుగులో పద్యాలు, పుస్తకాలు వంటి రూపాలే ఉంటాయి. ని, కి ప్రత్యయాలు చేరినప్పుడు పద్యాన్ని, పద్యానికి మొదలైన రూపాలుంటాయి.

ఈ) కింది పట్టికను పరిశీలించండి.

| పురుషలు | సర్వనామములు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|---|
| ఉత్తమ | నేను-మేము | నేను క్రమశిక్షణతో నడుచుకుంటాను | మేము క్రమశిక్షణతో నడుచుకుంటాము |
| మధ్యమ | నీవు-మీరు | నీవు మంచి మార్గాన్ని ఎంచుకో | మీరు మంచి మార్గాన్ని ఎంచుకోండి |
| ప్రథమ | అతడు-ఆమె / వాడు - వారు<br>అది, ఇది / అవి, ఇవి | అతడు గొప్ప విద్యావంతుడు<br>అది మంచి పుస్తకం | వారు గొప్ప విద్యావంతులు<br>అవి మంచి పుస్తకాలు |

మొదటి వాక్యంలో తనగురించి తానే చెప్పుకోవడం జరిగింది. - **ఉత్తమ పురుష**

రెండవ వాక్యంలో ఎదుట ఉన్న వ్యక్తిని గురించి చెప్పబడింది. - **మధ్యమ పురుష**

పై పట్టికలో మూడవ వాక్యంలో ఎక్కడో ఉన్న వ్యక్తిని గురించి చెప్పబడింది. - **ప్రథమపురుష**

ఎక్కడో ఉన్న వ్యక్తులను గురించి చెప్పడానికి వాడే సర్వనామాలను **ప్రథమ పురుష** అని, ఎదుటి వాని గురించి చెప్పడానికి వాడే సర్వనామాలను **మధ్యమ పురుష** అని, తనను గురించి తాను చెప్పుకునే సర్వనామాలను **ఉత్తమ పురుష** అని అంటారు. తానుత్తమ ఎదుట మధ్యమ, ఎక్కడో ప్రథమ, అనేది పురుషలను గుర్తుంచుకోవడానికి సులువైన మార్గం.

1. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్నప్పుడు మాట్లాడే వ్యక్తి **ఉత్తమ పురుష,**
2. ఎదురుగా వింటున్న వ్యక్తి **మధ్యమ పురుష,**
3. ఎవరి గురించి మాట్లాడుతున్నామో తాను **ప్రథమ పురుష.**

## పాఠాంత పద్యం

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మ మెల్ల ఁజదివితిఁదండ్రీ!

భావం : తండ్రీ ! గురువులు నన్ను చదివించారు. నేను ధర్మశాస్త్రం మొదలైన ముఖ్యమైన శాస్త్రాలు చదివాను, చదువులలోని రహస్యమంతా చదివాను.

**- బమ్మెర పోతన (ఆంధ్రమహాభాగవతం)**



**సూక్తి : సమాజ వ్యవస్థను సమూలంగా మార్చడానికి విద్యే మార్గం - సర్వేపల్లి రాధాకృష్ణన్**

## ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..............................................................................
2. నేను గ్రహించిన విలువ ..............................................................................
3. సృజనాత్మక రచన ..............................................................................
4. భాషాంశాలు ..............................................................................

నవంబర్ 11వ తేదీని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకొంటాం.

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1. తెలుగులో సుప్రసిద్ధులైన వారి ఆత్మకథలను చదివించండి.
2. విద్యార్థుల గత జీవితానుభవాలను ఆత్మకథారూపములో రాయించండి.
3. దసరా పండుగ వైశిష్ట్యాన్ని వివరించండి.

## పాఠాంత అంశము

## దసరా పాట

ఆనాటి కాలంలో గురువులు దసరా సమయంలో విద్యార్థులను వెంటపెట్టుకొని ప్రతి ఇంటికి వెళ్లి పద్యాలు, పాటలు పాడేవారు. ఆ ఇంటి యజమానులు సంతోషించి గురువులకు డబ్బులు ఇచ్చేవారు. విద్యార్థులకు పప్పు, బెల్లం పంచేవారు.

రాజాధిరాజయో రాజమార్తాండ
వినవయ్య మా మనవి వివరంబుగాను
ఘనులను విని మమ్ము ఘన తరంబుగను
బడి బాలకులము మేము బడలంగలేము.
ఊరూర దిరుగంగ వోపికలు లేవు.
మీ ధర్మమును గోరి మేము వచ్చితిమి
మీతోటి సాటెవరు భూతలంబునను
కోటి సూర్యులతోటిసాటి మీ మోము
సజ్జనులు మెచ్చిరి సభ యందుమిమ్ము
విప్రజన పోషకా వినరయ్య మీరు
రాజ మహారాజ వో రమ్య చరిత
చేపట్టి మా మనవి చిత్తమందుంచి
చిన్న వారలమంచు చేరంగదీసి
కాదనక లేదనక ఘనముగా చూచి
పన్నీరు గంధంబు బాగుగా పూసి
పండుటాకులు మంచి మెండు పోకలను
అయ్యవారికి చాలు అయిదు వరహాలు
తెప్పించి కట్నంబు లిప్పించవలెను
మా పప్పు బెల్లాలు మాకు దయచేసి
శీఘ్రముగ నంపుడీ శ్రీమంతులారా
ఏదయా మీదయా మామీద లేదు
యింత సేపుంచుట యిది మీకు తగునా
దసరాకు వస్తిమని విసవిసలు పడక
చేతిలో లేదనక అప్పివ్వరనక
రేపురా మాపురా మళ్ళి రమ్మనక
యిప్పుడు లేదనక యివ్వ లేమనక
యిరుగు పొరుగుల వారు యిస్తారు సుమ్మి
గొప్పగా చూడండి తప్పకను మీరు
పావలా బేడైతే పట్టేది లేదు
అర్ధరూపాయిస్తే అంటేది లేదు
ముప్పావలా యిస్తే ముట్టేది లేదు
హెచ్చు రూపాయిస్తే పుచ్చుకుంటాము
జయ విజయీభవ దిగ్విజయీ భవ

11

# సమదృష్టి

L6H4KZ

## చదవండి - ఆలోచించి చెప్పండి



వినఁదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక ! వివరింపఁదగున్
గని కల్ల నిజముఁ దెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో సుమతీ !
- బద్దెన

ప్రశ్నలు:

1. ఎవరు చెప్పినా ఏమి చెయ్యాలి ?
2. కల్ల అంటే అర్థం చెప్పండి.
3. నీతిపరుడు అంటే ఎవరు ?

### ఉద్దేశం

సమస్త మానవులను వర్గ, వర్ణమును బట్టి కాక గుణాన్ని, సంస్కారాన్ని బట్టి గౌరవించాలని, విద్యార్థుల్లో సర్వమానవ సమానత్వభావన కల్గించడం ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

### కవి పరిచయం:



1963 - 2014

### పైడి తెరేష్ బాబు

కవిగా, గాయకునిగా, సాహితీవేత్తగా పైడి తెరేష్ బాబు ప్రసిద్ధులు. వీరు ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు సుబ్బమ్మ, శాంతయ్య. అల్పపీడనం, హిందూమహాసముద్రం వంటి రచనలు చేశారు. ఆకాశవాణిలో వ్యాఖ్యాతగా తన బాణీ వినిపించారు. ప్రస్తుత పాఠ్యాంశం **అల్పపీడనం** కవితా సంపుటి నుండి స్వీకరించబడింది.

## సమదృష్టి

కన్నొకటే నలుపు - కంటిచూపు నలుపుకాదు
చెట్టొకటే నలుపు - చెట్టు కాపు నలుపు కాదు

చినుకు స్పర్శకే కదా నేలకడుపు పండేది
మబ్బొకటే నలుపు - మబ్బు చినుకు నలుపు కాదు


చరుపు తగిలితే కదా నిదుర మత్తు వొదిలేది
అక్షరమే నలుపు - దాని చరుపు నలుపు కాదు

అరిచి మరీ పిలవనిదే తూర్పు తలుపు తెరవదు
గొంతొకటే నలుపు - దాని అరుపు నలుపు కాదు

కలలే కదా అందమైన భవితకు పునాదులు
రేయి ఒకటి నలుపు - రేయి కలలు నలుపు కాదు

ఎదురీతకు దిగావో నదికోతలు తప్పవు
ఈత ఒకటే నలుపు - ఈత గెలుపు నలుపు కాదు

పరుగుతోనే బతుకు వెలితి పూడ్చగలవు మిత్రుడా
కులమొకటే నలుపు... నీ పరుగు నలుపు కాదు





**ప్రక్రియ - గజల్**

గజల్ అనే పదం గజాల్ నుంచి పుట్టింది. ఉర్దూ సాహిత్యం నుంచి తెలుగులోకి వచ్చిన సాహిత్య ప్రక్రియ ఇది. అరబ్బీ భాషలో గజల్ అనగా **రాగాలాపన** అని అర్థం. ఛందో వ్యాకరణ బద్ధమై, లయాత్మకమైన నడకతో, స్వేచ్ఛా ప్రవృత్తిని, నిర్భర భావావేశాన్ని ప్రకటించే సాధనం గజల్. ఇందులో విషయ వ్యాప్తి అధికం. భావం ఏ చరణానికి ఆ చరణం విడి విడిగా ఉంటుంది. పల్లవిని **మత్లా** అనీ, చరణాన్ని **మక్తా** అని అంటారు. అంత్యప్రాసతో పాటు కవి **నామముద్ర** ఉంటుంది. దీన్నే 'తఖల్లస్' అంటారు. కొండంత భావాన్ని గోరంతలో చెప్పే రసగుళిక గజల్.

### భావం

1. కంటిలోపల గుడ్డు నలుపైనంత మాత్రాన చూసే చూపు నలుపు కాదు. చెట్లు, కాండం మొదలయినవి దూరానికి నల్లగా కనబడతాయి. కాని ఆ చెట్లు వివిధ రకాల రంగులు, రుచులు కలిగిన ఫలాలను ఇస్తాయి. అవి వివిధ రంగులలో కనబడతాయి.

2. కారుమబ్బులు నల్లగా ఉంటాయి. కాని వాన చినుకులు నల్లగా ఉండవు. వాన చినుకులతో నేల తడిసి, నేలమీద ఉన్న విత్తనాలు మొలకెత్తుతాయి. అవి పెరిగి మానవాళికి, జంతువులకు ఏదో రూపంలో ఆహారాన్నిస్తున్నాయి. కనుక మేఘం రంగును బట్టి కాకుండా మేఘం స్వభావాన్ని ఆలోచించాలి.

3. మొద్దునిద్ర అజ్ఞానానికి చిహ్నం. నిద్రమత్తు వదిలించాలంటే తట్టి లేపడం అవసరం. అలాగే అజ్ఞానాన్ని లేకుండా చేయాలంటే చదువు అవసరం. అక్షరాలు నల్లగా ఉంటాయి, కాని చదువు నలుపు కాదని అర్థం చేసుకోవాలి.

4. సామాన్యంగా పక్షుల రంగులు కంఠం దగ్గర ఎక్కువ శాతం నల్లగా ఉంటుంది. కాని పక్షుల కూతలు, కిలకిలా రవాలు నలుపు కాదు. ఆ కిలకిలా రవాలతోనే తెల్లవారుతుంది. సూర్యోదయమవుతుంది. అందరూ చైతన్యవంతులు అవుతారు. పక్షుల కంఠం కాదు చూడవలసింది మేలుకొలిపిన ఆ కిలకిలారవాలను చూడాలి. స్వభావాన్ని పరిశీలించాలి.

5. రాత్రి నిద్రలో కలలు(ఊహలు, కల్పనలు) వస్తుంటాయి. ఇవి రాత్రిలాగా నల్లగా ఉండవు. ఈ ఊహలు కల్పనలు అందమైన భవిష్యత్తుకు పునాదులవుతాయి. కనుక రాత్రి నలుపు గురించి ఆలోచించక, మంచి ఊహలు, కల్పనలు అందమైన వేకువ గురించి ఆలోచించాలి.

6. నదిలో మునిగి ఈత కొట్టేటప్పుడు ఏమీ కనపడవు. ఈతని కళ్ళు మూసుకుని కొడతాం కాబట్టి అంతా నలుపుగా ఉంటుంది. ఈతలో ఊపిరి పీల్చుకోవడానికి పైకి తేలినప్పుడు కొంతదూరం దాటినట్లు తెలుస్తుంది. నదిలో ఎదురీదేటప్పుడు ఈత వేగానికి నీళ్ళ కోతకు గురయ్యి ముందుకు వెళ్తాం. ప్రయత్నించడమే కష్టం. ప్రయత్న ఫలితం (గెలుపు) విజయం వైపు తీసుకు వెళ్తుంది. సమస్యల సుడిగుండాలలో ఏమీ తెలియదు, తోచదు. సమస్యా పరిష్కారానికి సాధన ఒకటే ఉపాయం.

7. నీ సహచరులు ప్రయత్నించలేదు కానీ ప్రయత్నం చేస్తే ఊరికే పోదు. నీ ప్రయత్నం సహచరుల బ్రతుకులు బాగుచేయగలదు. కాబట్టి ప్రయత్నం ఆపకు.

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

R4S1X2

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. రాయండి.**

1. సమదృష్టి గజల్‌ను రాగ, భావయుక్తంగా పాడండి.
2. పాఠంలో మీకు నచ్చిన అంశాన్ని గురించి మాట్లాడండి.
3. కింది వాటిని గురించి రాయండి.

అ) కంటిచూపు ______________________

అ) నిదురమత్తు ______________________

ఇ) నదికోత ______________________

**ఆ) కింది గద్యాన్ని చదివి ప్రశ్నలను తయారుచేయండి.**



మద్దూరి నగేష్ బాబు కవిత్వం చదువుతుంటే పల్లెలో తిరుగుతున్నట్లే ఉంటుంది. కడుపు మాడ్చుకుంటూ కిరసనాయిలు బుడ్డి దీపం ముందు కూర్చోని, వెంట్రుకలు కాల్చుకుని, చదువుతున్న పిల్లలు కన్పిస్తారు. ఆకలి మంటలతో కదిలే పల్లె పదాలు కన్పిస్తాయి. ముతకచీర ఉయ్యాలలో జోలపాటలు పాడే తల్లులను చూడవచ్చు. ముఖ్యంగా తాతల, నాయనమ్మల కష్టాల బతుకుల కథలు వినవచ్చు. రచ్చబండ, వెలివాడ, పుట్ట, గోదావరి, కాస్త సిగ్గుపడదాం, ఊరు–వాడ మొదలైన కవితా సంపుటాలతో తెలుగు సాహిత్య ప్రపంచంలో కొత్త ఒరవడి సృష్టించారు. బడుగులకు గొడుగు పట్టారు.

ప్రశ్నలు.

1. ______________________________

2. ______________________________

3. ______________________________

4. ______________________________

**ఇ) క్రింది గద్యాన్ని చదివి నాలుగు ముఖ్యమైన వాక్యాలు రాయండి.**

జిల్లెళ్ళమూడి అమ్మగారు 1958 ఆగస్టు 15న అన్నపూర్ణాలయం ప్రారంభోత్సవం చేశారు. ఆ సత్రంలో భోజనం చేయడానికి ఆకలే అర్హత. వేషధారణ బట్టి కాకుండా ఆకలిని బట్టే అన్నం పెట్టారు. అన్ని బాధల కన్నా ఆకలి బాధే ఎక్కువ అనేవారు. అన్ని వర్గాలవారు అన్నిరకాల వారు అమ్మ చేతి ప్రసాదాన్ని అమృతోపమానంగా ఆరగించేవారు. అమ్మ తన ఇంటికి **అందరి ఇల్లు** అని పేరు పెట్టారు. బాపట్ల కుష్టు ఆస్పత్రి రోగులకు అరటిపళ్ళు, పులిహోర పంపేవారు. అన్నంతో పాటు అందరికీ బట్టలనూ ఇచ్చేవారు. 1971లో సంస్కృత పాఠశాల, కళాశాలలను నెలకొల్పి భాషాభివృద్ధికి, సంస్కృతి సంప్రదాయాల అభివృద్ధికి నడుంకట్టారు. అక్కడ చదివే ప్రతి విద్యార్థికి ఉచిత వసతి భోజన సౌకర్యాలు కల్పించారు. ఆసుపత్రిని నెలకొల్పి ఉచితంగా సేవలు అందించారు. ఇలా పలు రంగాలలో ఎనలేని సేవా కార్యక్రమాలు చేసిన **అమ్మ** సేవలు చిరస్మరణీయం.

1. ______________________________

2. ______________________________

3. ______________________________

4. ______________________________

**ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. సమదృష్టి కవిని గురించి రాయండి?
2. కవి పాఠంలో వేటిని నలుపుతో పోల్చాడు?

## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. గజల్ ప్రక్రియా లక్షణాలను గురించి రాయండి.
2. 'కలలు కనడమే బంగారు భవితకు పునాది' అని అనడంలో కవి ఉద్దేశం ఏమి?
3. తూర్పు తలుపు తెరవడు అంటే ఏమిటో రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సమదృష్టి పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి?
2. సమసమాజ స్థాపనకు నీవు ఏమి చేయగలవో రాయండి.
3. సమదృష్టిపై కవిత రాయండి.

## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సరైన అర్థాలను రాసి, వాటితో సొంత వాక్యాలను రాయండి.**

ఉదా॥ తొలకరి చినుకులు వర్షఋతువుకు సంకేతం.
సంకేతం = గుర్తు
రహదారిపై జీబ్రా చారలు నడక దారికి గుర్తు

1. తల్లిస్పర్శ బిడ్డకు నులివెచ్చగా ఉంటుంది.

______________________________

2. ఒక్క చరుపుతో మత్తు వదులుతుంది.

______________________________

3. విద్యార్థులు భవితకై బాగా శ్రమించాలి.

______________________________

4. ఏటికి ఎదురీత అన్నివేళల మంచిది కాదు.

______________________________

**ఆ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు నానార్థాలు రాయండి.**

1. ఆ కోనసీమ అందాలు కన్నులకింపు కూర్చుతాయి.

______________________________

2. మనిషి నలుపు కానీ గుణం కాదు.

______________________________

3. ఆ నగరం వరదలలో మునిగిపోయింది.

______________________________

4. పల్లె సీమలు కష్టాల పాలైనాయి.

______________________________

**ఇ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

ఉదా॥ అనవసరంగా రాత్రి వేళలలో బయట తిరుగరాదు.

జ. రాత్రి = నిశ, యామిని, రేయి

1. భూమి కట్టిన పచ్చని వస్త్రాలు చెట్లు.

______________________________

2. రైతులు నేలతల్లిని నమ్మి పంటలు పండిస్తారు.

______________________________

3. మా ఊరు కుందూనది ఒడ్డున ఉంది.

______________________________

4. మా మిత్రులందరికి కబడ్డి అంటే ఇష్టం.

______________________________

**ఈ) కింది ప్రకృతి – వికృతులను జతపరచండి.**

| | | |
|---|---|---|
| అ. రేయి | ( ) | 1. అక్కరం |
| ఆ. కులం | ( ) | 2. మది |
| ఇ. అక్షరం | ( ) | 3. రాత్రి |
| ఈ. మతి | ( ) | 4. కొలము |

**వ్యుత్పత్త్యర్థాలు :** వ్యుత్పత్తి అనగా పుట్టుక. పదాల పుట్టుక తెలిపే విధానాన్ని వ్యుత్పత్తి అంటారు. ఆ శబ్దాల వ్యుత్పత్తి ద్వారా అర్థాన్ని తెలిసేది **వ్యుత్పత్త్యర్థం**.

ఉదా : 1. గురువు – అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలేవాడు. (ఉపాధ్యాయుడు)

2. శూరుడు – శౌర్యమును ప్రదర్శించేవాడు. (వీరుడు)

**కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.**

1. భాస్కరుడు______________ 2. శారద______________

3. విద్యార్థి______________ 4. క్షేత్రం______________



## భాషాక్రీడ

**అ) కింది పదాలకు అర్థాలను పట్టికలోని సరైన అక్షరాలతో కూర్చి రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1. స్నేహితుడు = ........................ | వ్య | | ర్శ | | | యం |
| 2. తాకుట = ........................ | | క్ష | | రే | | |
| 3. క్షయంకానిది = ........................ | మి | | స్ప | | | అ |
| 4. రాత్రి = ........................ | | రం | | యి | | |
| 5. సాధన, ప్రయత్నం = ........................ | సా | | త్రు | డు | | వ |



## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

ఉదా॥ కన్నొకటి - కన్ను + ఒకటి = ఉత్వసంధి

1. మచ్చొకటి - ________ + ________ = ____________
2. గొంతొకటి - ________ + ________ = ____________
3. మబ్బొకటి - ________ + ________ = ____________
4. చెట్టొకటి - ________ + ________ = ____________

**ఆ) కింది పదాలను విడదీసి సంధి ఏమిటో తెల్పండి.**

1. దివ్యౌషధం = ____________________________________________
2. ఏకైక = ____________________________________________
3. సురైక = ____________________________________________
4. అష్టైశ్వర్యాలు = ____________________________________________

**ఇ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

1. చినుకుస్పర్శ = ____________________ ____________________
2. రేయిపగలు = ____________________ ____________________
3. అక్షరం = ____________________ ____________________
4. నల్లమేఘం = ____________________ ____________________

ఈ) కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చండి.

1. వర్షం నేలను తాకింది. వర్షం పంటలకు ప్రాణం పోసింది.

2. విద్య అజ్ఞానాన్ని తొలగిస్తుంది. విద్య విజ్ఞానాన్నిస్తుంది.

3. విద్యార్థులు నిరంతరం శ్రమించారు. విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

4. ప్రజలందరు సమానత్వం పాటించాలి. ప్రజలందరు శాంతిని స్థాపించాలి.

## వృద్ధి సంధి

| | పూర్వపదం | పరపదం | సంధి జరిగే విధానం | సంధి పదం |
|---|---|---|---|---|
| 1. | వసుదా | ఏక | వసుధ్+అ+ఏక | వసుధైక |
| | ధ్ + ఆ | ఏ | ఆ+ఏ = ఐ | |
| 2. | సకల | ఐక్య | సకల్+అ+ఐక్యం | సకలైక్యం |
| | ల్+అ | ఐ | అ+ఐ = ఐ | |
| 3. | దయా | ఏధితం | దయ్+ఆ+ఏధితం | దయైధితం |
| | య్+ఆ | ఏ | ఆ+ఏ = ఐ | |
| 4. | మహా | ఐశ్వర్యం | మహ్+ఆ+ఐశ్వర్యం | మహైశ్వర్యం |
| | హ్+ఆ | ఐ | ఆ+ఐ = ఐ | |
| 5. | దివ | ఓకసులు | దివ్+అ+ఓకసులు | దివౌకసులు |
| | వ్+అ | ఓ | అ+ఓ = ఔ | |
| 6. | దేశ | ఔన్నత్యం | దేశ్+అ+ఔన్నత్యం | దేశౌన్నత్యం |
| | శ్+అ | ఔ | అ+ఔ | |
| 7. | గంగా | ఓఘం | గంగ్+ఆ+ఓఘం | గంగౌఘం |
| | గ్+ఆ | ఓ | ఆ+ఓ = ఔ | |
| 8. | మహా | ఔన్నత్యం | మహ్+ఆ+ఔన్నత్యం | మహౌన్నత్యం |
| | హ్+ఆ | ఔ | ఆ+ఔ = ఔ | |
| 9. | ఋణ | ఋణం | ఋణ్+అ+ఋణం | ఋణార్ణం |
| | ణ్+అ | ఋ | అ+ఋ = ఆర్ | |

| పూర్వపదంలో చివరి స్వరం | పరపదంలో మొదటి స్వరం | ఏకాదేశ వర్ణం |
|---|---|---|
| అ<br>ఆ | ఏ<br>ఐ | ఐ |
| | ఓ<br>ఔ | ఔ |
| | ఋ | ఆర్ |

అకారానికి 'ఏ, ఐ'లు పరమైతే 'ఐ'కారం. 'ఓ ఔ'లు పరమైతే 'ఔ'కారం, ఋకారం పరమైతే 'ఆర్' ఏకాదేశంగా వస్తాయి. పాఠంలోని వృద్ధి సంధి పదాలను గుర్తించండి.

## పాఠాంత పద్యం





ఆ.వె. పరుల స్వేచ్ఛకొక్క ప్రతిబంధకమ్ముగా
నిలువ రాదు సుమ్ము నీదు స్వేచ్ఛ
పంచుకొనని స్వేచ్ఛ కుంచుకపోవురా!
నవయుగాల బాట నార్లమాట.

**– నార్ల వేంకటేశ్వర రావు.**

భావం : నీ స్వేచ్ఛ ఎదుటివారి స్వేచ్ఛకి ప్రతిబంధకం కారాదు. ఒకరికొకరు స్వేచ్ఛను పంచుకోకపోతే అది సంకుచితమవుతుంది.

సూక్తి : ప్రపంచాన్ని రెండుకళ్ళూ తెరచిచూడు – రవీంద్రనాథ్ ఠాగూర్



## ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..............................................................
2. నేను గ్రహించిన విలువ ..............................................................
3. సృజనాత్మక రచన ..............................................................
4. భాషాంశాలు ..............................................................

ఏప్రిల్ 5వ తేదీని సమతా దినోత్సవంగా జరుపుకొంటాం.

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1. గజల్ ప్రక్రియలో వెలువడిన రచనలు చదివించండి.
2. సర్వమానవ సమానత్వ భావనను పెంపొందించే కథలు, కవితలు చెప్పండి.
3. సమసమాజ నిర్మాణానికి శ్రమించిన వారి గురించి విశదపరచండి.

పాఠాంత అంశము

## నవ్వుతూ ... కథ

రామచంద్రరావు ఎప్పుడూ నవ్వుతూ కన్పిస్తాడు. అతనికి నవ్వడం ఒక స్వభావమైపోయినట్లు, కష్టాలు, చికాకులు అతనికి దూరంగా తొలగి ఉంటాయన్నట్లు అన్పిస్తుంది. ఊళ్ళో అందరినీ అతను నవ్వుతూ పలకరిస్తాడు. అందరూ అతనికి స్నేహితులే.

అతను పక్కనుంటేనే మూర్తికి ఒళ్ళంతా తేలికపడినట్లు, ఉదయపు నీరెండవంటి ఉత్సాహం వచ్చినట్లు అన్పిస్తుంది. మూర్తికి సమస్యలు చాలా ఉన్నాయి. కానీ ఆ సమస్యలన్నీ రామచంద్రరావు ఎదురుగా ఉన్నంతసేపు మంచు విడిపోయినట్లు మాయమైపోతాయి.

కానీ మూర్తికి ఎప్పుడూ ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది. ఎందుకు అతని వదనాన ఒక విషాదరేఖ గాని, విసుగు గాని కన్పించవు? ఏ జీవిత రహస్యం ఇతనికి తెలుసు? సుఖంలోని, ఆనందంలోని ఏ కీలకాన్ని ఇతను వశపరచుకున్నాడు.

తీరా చూస్తే, రామచంద్రరావు సామాన్యుడు. ఆస్తీ, హోదా ఉన్నవాడు కాదు. ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. నా అన్నవాళ్ళు ఎవ్వరూ లేరు. అతను ఒంటరివాడు. ఏలూరు నుండి వచ్చే బస్సు ప్రమాదానికి గురైందని, ప్రయాణీకులకు చాలామందికి గాయాలు అయ్యాయని విన్నాడు మూర్తి. వారిలో రామచంద్రరావు ఒకడు అని తెలిసి బాధపడ్డాడు. కంగారుపడ్డాడు. సరాసరి టిక్కెట్టు కొనుక్కుని ఏలూరు వెళ్ళి ఆస్పత్రికి చేరుకున్నాడు. గాయపడిన వారిలో రామచంద్రరావును గుర్తించడం కష్టమయ్యింది. అతని తలకి, చెంపలకి కట్లు ఉన్నాయి. అతనికి స్పృహ లేదు. మూర్తి గాబరాపడ్డాడు. తక్కిన గాయపడినవారందరి దగ్గర వారివారి భార్యలూ, తల్లిదండ్రులూ ఉన్నారు. రామచంద్రరావు మాత్రం ఒంటరిగా మృత్యువుకి, బ్రతుకుకి మధ్య ఉన్న మసకమసక అంచుమీద ఉన్నాడు. మూర్తికి కన్నీళ్ళు తిరిగాయి. ఇంత ఉత్తముడికి ఎందుకు ఇటువంటి గతి పట్టింది అనుకున్నాడు. అతని మంచం పక్కన ఒక కుర్చీ మీద కూర్చున్నాడు. స్పృహ రాగానే కావలించుకుని ఏడుస్తాడని అనుకున్నాడు. తనకి ఏడ్పు వచ్చేస్తోంది. ఎలాగ ఇతనికి ధైర్యం చెప్పి ఓదార్చడం? అనుకున్నాడు. ఎప్పటికోగాని రామచంద్రరావుకి స్పృహ రాలేదు. అతడు కదలడం మొదలుపెట్టాడు. దు:ఖంతో మూర్తి గుండెలు కొట్టుకున్నాయి. ఆనంద ఆవేశంతో రామచంద్రరావు కళ్ళు తెరిచాడు. ఓ నిమిషం తదేకంగా మూర్తికేసి చూశాడు. 'బతికే ఉన్నానా అంటూ నవ్వాడు'. సన్నని, చిన్నని నవ్వు హాయిగా మొగ్గవిడిచి తెల్లని పువ్వు రేకులను విచ్చుకుంటూ ఉన్నట్లు ఉంది.

మూర్తి ఖంగు తిన్నాడు. అలాటి విపత్సమయంలో కూడా అతను నవ్వగలడని అనుకోలేకపోయాడు. ఎటువంటి పరిస్థితినయినా ఎదుర్కొనే మానసికస్థితి ఉండాలని అనుకున్నాడు. – హాస్యకదంబం

12

# భువనవిజయం

A4N3W6

## చదవండి - ఆలోచించి చెప్పండి

భువన విజయాఖ్య సభ యిది దివిని వెలయు
వర సుధర్మకు సరి జోదు సరసు లార !
సార సంగీత సాహితీ క్షీర ధార
లంద ఁజేతురు కవులు మీరందుకొనుడు.



ప్రశ్నలు :

1. పై పద్యం దేని గురించి చెబుతోంది ?
2. కవులు ఏం అందజేస్తారు ?
3. దివిని వెలసిన సభ ఏది ?

**ఉద్దేశం**

విద్యార్థులకు అష్టదిగ్గజ కవులున్న భువనవిజయాన్ని పరిచయం చేస్తూ తెలుగు భాషకు ఉన్న ప్రత్యేకతను, ఘనతను, మాధుర్యాన్ని తెలియపరచడం, భాషాభిమానాన్ని పెంపొందించడమే ఈ పాఠ్యాంశ ప్రధాన ఉద్దేశ్యం.

కవి పరిచయం



1888 - 1950

### వేటూరి ప్రభాకరశాస్త్రి

వేటూరి ప్రభాకరశాస్త్రి కృష్ణాజిల్లా పెదకళ్ళేపల్లిలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు సుందరశాస్త్రి, శేషమ్మ. తండ్రి వద్ద, మద్దూరి రామావధాని వద్ద సంస్కృతాంధ్రాలు నేర్చుకొన్నారు. శాస్త్రిగారు గొప్ప పరిశోధకులు, కవి, నాటకకర్త. దేశచరిత్ర, భాషాసాహిత్యాలను పరిశోధించి అమూల్యమైన వ్యాసాలు రచించారు. ప్రాచీన కవుల చాటువులను సేకరించి చాటుపద్యమణిమంజరిని కూర్చారు.

కవి పరిచయం



1929 - 2017

### సి.వి. సుబ్బన్న

సి.వి. సుబ్బన్న పూర్తి పేరు కడప వెంకట సుబ్బన్న. ఈయన కడప జిల్లా ప్రొద్దుటూరులో చెన్నప్ప, రంగమ్మ దంపతులకు జన్మించారు. వీరు అనేక అవధానాలు చేసి "శతావధాన ప్రబంధం త్రిపుటి" పేరుతో గొప్ప గ్రంథాన్ని ప్రకటించారు. సరస్వతీ పుత్ర, అవధాని పితామహ బిరుదాంకితులు.

ఈ పాఠం వేటూరి ప్రభాకరశాస్త్రి, సి.వి సుబ్బన్న గార్లు రచించిన అవధాన విద్య పుస్తకం నుండి స్వీకరించబడింది.

## భువనవిజయం

**(భువనవిజయసభ ప్రారంభం)**

**వ.మా.** రాజాధిరాజా! రాజమార్తాండ! సాహితీ సమరాంగణ సార్వభౌమ శ్రీకృష్ణదేవరాయలవారు విచ్చేయుచున్నారహో!

(సాహిత్యసభలో ఉన్నవారంతా లేచి నిలబడి అభివాదం చేస్తుంటారు. రాయలవారు ఏతెంచి, రాజ సింహాసనంపై ఆసీనులవుతారు)

**రాయలు:** అష్టదిగ్గజకవులకు, సాహితీప్రియులకు, పురప్రజలకు స్వాగతం. మా పాలనలో జీవితాన్ని ఆనందంగా గడుపుతున్న జానపదులు సైతం కొన్ని రసవంతమైన సమస్యలను పంపించారు. మీరు వీటిని రసవత్తరంగా పూరించి నేటి భువనవిజయం సభను రంజింపచేయండి. ఇక ఆంధ్రభాషామతల్లిని స్తుతిస్తూ సమస్యలను, దత్తపదులను పూరించి, ఆశుకవితా వినోదం సాగిద్దాం.

(రాయల మాటలయ్యాక అందరు సుఖాసీనులవుతారు)

**పెద్దన :** చిత్తం రాజేంద్రా! కవిచంద్రా! మీతో నేటి భువనవిజయ సభను ప్రారంభించాలని నా అభిలాష.

**సూరన :** మీ ఆలోచన నిజమే పెద్దనామాత్యా! కానీ ప్రభువుల ఏలుబడిలో ఎన్నోభాషలు ఉండగా, తెలుగుభాషపై ఇంత మక్కువ చూపడానికి గల కారణమేమిటో? (అని అడిగి ఆసీనులయ్యారు)

**రాయలు :** అదేమిటి సూరనకవీ! మందారమకరందాలు జాలువారే తెలుగును ఇష్టపడని వారుందురే? తెలుగదేలనందువా?

**గీ.** **తెలుగదేల యన్న దేశంబు తెలుగేను**
**తెలుగు వల్లభుండ తెలుగొకండ**
**ఎల్ల నృపులు గొలువ నెఱుగవే బాసాడి**
**దేశ భాషలందు తెలుగు లెస్స!** 1

(సభాసదులంతా కరతాళధ్వనులు చేస్తారు) మరి ఇంతటి మన తెలుగు భాష మీద ఎవరికైనా ఎందుకు మమకారముండదు. పెద్దనార్యా! కవులారా! మేము తర్వాత పద్యమును పూరిస్తాం. ముందు మీరంతా పద్యపూరణకు పూనుకోండి.

**పెద్దన :** చిత్తం ప్రభూ! మీ అభిప్రాయమే శిరోధార్యం.

**రాయలు:** పెద్దనామాత్యా! నీ పద్య పూరణకు సమస్య ఇదిగో.

**'అగ్రజానుజులై రనుజాగ్ర జులుగ'**

**పెద్దన :** ఆహాహా ఏమి సమస్య."అన్నదమ్ములు తమ్ముడన్న లయ్యారు" ప్రభూ ! నా పూరణ ఇదిగో !

(అంటూ పద్యం ప్రారంభించారు.)

**తే.** **పుష్యమిన్ భరతాఖ్యుడు పుట్టినాడు**
**మొనసి లక్ష్మణుఁ డాశ్లేష బుట్టినాడు**
**భరత లక్ష్మణక్రమమిది యరసిచూడ**
**నగ్రజానుజులై రనుజాగ్రజులుగ** 2

కాని లోకవ్యవహారం రామలక్ష్మణభరతశత్రుఘ్నులు అని ఉంటుంది.

**రాయలు : కరినెత్తుకపోయి యెలుక కలుగున దినియెన్ –** దీనిని అర్థవంతంగా పూరించండి భట్టుమూర్తిగారు.

**భట్టుమూర్తి :** పల్లె జీవనులకు సుపరిచితమైన చక్కని సమస్య ఇచ్చారు మహారాజా (అంటూ సమస్య పూరించడం ప్రారంభించారు.)

**కం. కరులు, చిలుక లెద్దులు శ**
**ర్కరతో నొనరించి యార్చ, కడఁ బెట్టెడుచో**
**గరి మఱచె వర్తకుండా**
**కరి నెత్తుకపోయి యెలుక కలుగున దినియెన్.** 3

**రామభద్రుడు :** ఆహా ! ఎంత అద్భుతపూరణ

ఎలుక ఏనుగును ఎత్తుకొని పోగలదా? ఆ ఏనుగు రంధ్రములో పట్టునా? హ..హ..హ.. ఏనుగులు, చిలుకలు, ఎద్దులు మొదలైనవి చక్కెరతో చేసిన బొమ్మలు. వ్యాపారి పగలంతా వీటిని అమ్మాడు. సాయంత్రానికి అన్ని బొమ్మలను ఎత్తిపెట్టి, ఒక్క ఏనుగు బొమ్మను మరిచాడని, దానిని ఎలుక రంధ్రంలోకి ఈడ్చుక పోయిందన్న మీ భావం వీనులవిందుగా ఉంది. (సభాసదులంతా కరతాళధ్వనులు చేస్తారు)

**రాయలు :** బహు బాగు.

**రామభద్రుడు:** కృతజ్ఞతలు మహారాజా! (అని కూర్చుంటారు.)



**రాయలు :** ముద్దుపలుకుల ముక్కుతిమ్మన కవీ అందుకోండి. **గాడిదయేడ్చెం గదన్న ఘనసంపన్నా!.** దీనిని పూరించండి. (సభలోని వారంతా ఘొల్లున నవ్వుతారు)

**తిమ్మన :** రాజశేఖరా! (అంటూ నమస్కరించి ఇలా అన్నారు) మానవులలో ఆడిన మాటలు తప్పే వారు కొందరు ఉన్నారు. జంతువులలో దీనిని చూడలేం. ఐనా దైవ కృపతో పూరించెదను.

**కం. ఆడిన మాటను తప్పిన**

**గాడిద కొడుకంచుతిట్టగా... విని అయ్యో!**

**వీడా నాకొడుకని యొక**

**గాడిదయేడ్చెం గదన్న ఘనసంపన్నా!.** 4

**ధూర్జటి :** లౌకిక జీవన గమనంలో గ్రామీణుల దూషణను, ఆడితప్పిన జనుల హీనస్వభావాన్ని తెలుపుతూ మాట నిలబెట్టుకోవడం విలువను చాటారు. ఆడితప్పే మనిషిని గాడిద కొడుకని తిట్టినపుడు విశ్వాసానికి మారుపేరుగా నిల్చిన జంతువు గాడిద ఏడ్చింది అన్నారు. దీనిని చెప్తూ దృష్టాంత రూపంలో సాగిన మీ పూరణ. భళా!,

**రాయలు :-** ధూర్జటి! తిమ్మన కవీంద్రులు లోకరీతిని భీతిలేకుండా పలికారు.

ఇప్పుడు **నననన నాన నాన నన నానన నానన నాన నాననా!**అనే సమస్యను

మీరు పూరణచేయండి.

**ధూర్జటి :** ప్రభూ! (అని నమస్కరిస్తూ) అక్షర విన్యాసం తప్ప అర్థంలేని సమస్య ఇచ్చారు. అయినా చక్కని పూరణ కావిస్తాను.

**చ. నిను నిను నిన్నునిన్ను నిను నిన్నును నిన్నును నిన్నునిన్నునుం**

**గని, లయతాళ సంగతుల గానకళా పరిపూర్ణమానస**

**మ్మున, పలు కూనిరాగముల మోదమునల్లుచు పల్కునిట్టులన్**

**నననన నాన నాన నన నానన నానన నాన నాననా!.** 5

**మల్లన :** భళా ! శ్రీకాళహస్తీశ్వరుని వరప్రసాదం కవిత్వంగా పొందిన ధూర్జటీ! భువనవిజయ కవులను చూచిన జానపదులు మన కవుల కావ్యసాహిత్యాన్ని, మన సభ గొప్పతనాన్ని గూర్చి పొలంలో పనులు చేసుకుంటూ కూడా లయ, తాళానికి అనుకూలంగా, మిక్కిలి సంతోషంతో కూనిరాగాలను అల్లుకునే స్థితిని కళ్లకు కట్టితివి. పనిలో పాటతోపాటు పద్యాలనూ పాడుకునే వైఖరి అద్భుతం !

**రాయలు :** ఔనౌను! జానపదుల సొత్తు జానపదం. సత్యం చెప్పారు.

**రాయలు :** రామకృష్ణా!. తదుపరి మీదే వంతు. మీ పదగుంఫనాన్ని మేమెరుగుదుము. మేక మరియు తోక ఈ రెండుదత్త పదాలతో ఒక సీస పద్యం చెప్పండి.

**తెనాలిరామకృష్ణుడు :** (ప్రణామం చేస్తూ) మమ్మేలిన దేవర! నన్నాదేశిస్తే కాదంటానా? ఆలకించండి మహాప్రభో!.

సీ: మేకతోకకుమేక తోకమేకకుమేక । మేకతోకకు తోక తోకమేక
మేకతోకకుమేక తోకమేకకుమేక । మేకతోకకు తోక తోకమేక
మేకతోకకుమేక తోకమేకకుమేక । మేకతోకకు తోక తోకమేక
మేకతోకకుమేక తోకమేకకుమేక । మేకతోకకు తోక తోకమేక
గీ: మేక తొకతోక తొకతోక తోకమేక ; మేక తొకతోక తొకతోక తోకమేక
మేక తొకతోక తొకతోక తోకమేక ; మేక తొకతోక తొకతోక తోకమేక. 6

**భట్టుమూర్తి:** మీరు సామాన్యులు కారు రామకృష్ణా! ఏమేమి! మేకలకాపరి అడవికి మేతకై మేకలు తీసుకపోతున్నాడా! ఒక మేక ముందరపోతుందా!. ఆ మేకకు తోక వెనుక భాగాన ఉంటుంది. ఆ తోక వెనుక మరొక మేక ఉంది.ఇలా మేకలమంద పోతున్న తీరును మేక, తోక, మేక,తోక అన్న దత్తపదాలతో చక్కగా, చిక్కగా చెప్పారు.

**రామభద్ర :** సెబాసు రామకృష్ణకవీ! మీ కత్తికి రెండు వైపుల పదునే మరి. అందుకే మీరు **వికటకవి** అయ్యారు.

**రాయలు :** రామభద్రా! **గోలకొండ, మూలముండ, పూలదండ, కొత్తకుండ** ఈ పదాలను ఆధారం చేసుకుని భారతార్థంలో ఒక పద్యం చెప్పండి.

**రామభద్ర :** చిత్తం మహాప్రభో! రామభక్తుడనైన నాకు భారతార్థం పూరణనిచ్చారు. పూరణ చేసెదను.

తే.గీ. ఓయి కురురాజ! నీ కొడుకుత్త గోల
కొండవలెనుండు, వినుమూలముండదింక,
భండనమ్మున గెలిపింతు పాండుసుతుల,
నురమునన్ బూలదండ రేకొత్తకుండ. 7

**పెద్దన :** ఓయి! కురురాజా! నీ కొడుకు దుర్యోధనునిది ఉత్త గోలకలిగిన మనస్సు. ఆకారంలో కొండలాగ ఉన్నాడు. బుద్ధిబలంలేని వాడు. నా మాట వినుము యుద్ధం వస్తే సర్వం నాశనం. సమరంలో ధర్మానికి బద్ధులైన పాండవులు గెలుస్తారు. నీ కుమారులు మరణిస్తారు.

**రాయలు :** పద్యం బాగుంది రామభద్రా! కొత్తకుండను రేకు ఒత్తకుండ అన్నారు చూడు... అద్భుతంగా ఉందయ్యా. తర్వాత పింగళి సూరనా! మా ఆరాధ్య దైవమైన శ్రీ హరి దశావతారాలను గురించి ఆశువుగా ఒక పద్యాన్ని పూరించాలని వేరొకరు పంపారు. ప్రారంభించండి.

**సూరన:** శ్రీహరిభక్తి నికాయా! శ్రీకృష్ణదేవరాయా! కోరినట్లే వినిపిస్తాను.

సీ. మత్స్యమై జలనిధి మడియించె సోమకుఁ, గూర్మమై కవ్వపుఁగొండ మోసెఁ
గిటియై హిరణ్యాక్షు గీటడంగించెను, హరియై వధించెఁ బ్రహ్లాదజనకు
వటుఁడై బలిదనుజు వంచించి కుదియించె, భార్గవుఁడై క్షత్రపంక్తిఁ జెండె
దశరథరాముఁడై దశకంఠుఁ దెగటార్చె, శౌరియై దుష్టుల సంహరించె

గీ. బుద్ధుఁడై త్రిపురస్త్రీల బుద్ధిమార్చి రుద్రుచే వారిభర్తను ద్రుంగఁజేసెఁ
గల్కియై మ్లేచ్ఛసంతతిఁ బిట్టుమార్చు, హరి దశావతారచరిత్ర మభినుతమ్ము. 8

**రాయలు :** మత్స్యావతారాన సోమకాసురుని చంపాడు. కూర్మమై మందరగిరిమోసి పాలసముద్రం చిలకడానికి సాయమయ్యాడు. వరాహరూపంలో హిరణ్యాక్షుని చీరాడు. నృసింహమై హిరణ్యకశిపుని చీల్చాడు. వామనుడై బలిని పాతాళానికి పంపాడు. పరశురాముడై రాజుల దర్పాన్ని కూల్చాడు. శ్రీరాముడై రావణుని వధించాడు.శ్రీకృష్ణుడై దుష్టులను అంతంజేశాడు. బుద్ధుడై పురస్త్రీల బుద్ధినిమార్చి, శివునిచేత త్రిపురాసురుని చంపించాడు.కల్కిగా నీతిహీనులను కూల్చాడు. దశావతార కార్యకారణాలను మనోహరమైన సీసంతో సభాసదులను అలరింపజేశావు. .

**సూరన:** మీ అభినందన స్పందనకు వందనం.

**పెద్దన:** మహాప్రభో! వచ్చే దారిలో ఒక జానపదుడు ఒక సమస్యనిచ్చాడు. మీరు అనుమతిస్తే మీకిస్తాను.

**రాయలు :** తప్పకుండ. సభారంభంలో మీకు మాటిచ్చాను కదా! కానివ్వండి. సమస్యను అందివ్వండి.

**పెద్దన :** ప్రభూ! అందుకోండి " అందరు నందరే మఱియు నందరు నందరె యంద రందరే". దీనిని పూరించండి.

**సూరన :** అదీ సంగతి. ప్రభువుల వారికి ఇవ్వదగిన సమస్య.

**రాయలు :** అష్టదిగ్గజ కవులార! నాకీర్తిని దిగంతాలకు వ్యాపింపచేయాలన్న మీ కుతూహలానికి సంతోషం. పూరణ చేసెదను. సంతోషం. ఆలకించండి.

ఉ. కొందరు పాండితీధనులు, కొందరునాగరకుల్ వదావదుల్
కొందరు చాతురీప్రియులు, కొందరు నీతికి భూతికి సిద్ధహస్తులౌ
కొందరు నాయకుల్ మఱియుఁ గొందరు గాయకులంద రందరే
అందరు నందరే మరియు నందరు నందరే యందరందరే. 9

**తిమ్మన :** సభలో కొందరు పాండిత్యమే ధనంగా కలవారు. కొందరు నాగరికులు. ఇంకొందరు ప్రవక్తలు. మరికొందరు చాతుర్యాన్ని ఇష్టపడేవారు. నీతికి, సంపదకు నిలయమైనవారు ఇంకొందరు. నేతలు మరియు గాయకులు. ఇలా సభలోని వారినుద్దేశించి చెప్పారు. దీనిలో మన రాజ్యంలోని ప్రజల సాహితీ సామర్థ్యాలను గుర్తుచేస్తూ అందరు అందరే అనడం వలన ఎవరికి వారే గొప్ప అని అర్థం.

**రాయలు:** కవిపండితులారా! మీ సమస్యా పూరణల పద్య గానంతో మా మనసెంతో మురిసింది. సభికులకు కృతజ్ఞతాంజలులు. స్వస్తి.

(సభలోని వారంతా సగౌరవంగా రాయల వారికి నమస్కరిస్తారు. అందరూ నిష్క్రమిస్తారు.)

**ప్రక్రియ - సాహితీ రూపకం**

తెలుగు సాహిత్య ప్రక్రియలలో రూపకం ఒకటి. దీనిలో నటులు ఆయా పాత్రలను ధరిస్తారు. అంటే నటులు ఆయా పాత్రల గుణ రూపాలను ఆరోపించుకొని అభినయిస్తారు.

**సమస్య**

అవధాన ప్రక్రియలో పద్యంలో ఒక పాదాన్ని తార్కిక అంశంతో ముడిపెట్టి వర్ణన చేయమని అడగడాన్ని సమస్య అంటారు.

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

T7K4S5

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు అడిగిన విధంగా రాయండి.**

1. అష్టదిగ్గజ కవుల పేర్లు చెప్పండి.
2. ఈ పాఠంలో బాగా నచ్చిన పద్యాన్ని గురించి మాట్లాడండి.
3. పాఠం చదవండి. కింద సూచించిన పద్యాలకు భావాలు చర్చించండి.

   అ) "కరినెత్తుక పోయి యెలుక కలుగున తినియెన్".

   ఆ) గాడిద యేడ్చెం గదన్నా ఘన సంపన్నా.

4. "మత్స్యమై జడనిధి మడియించె"-పద్యభావం ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| అవతార నామం | సాధించిన కార్యం | అవతార నామం | సాధించినకార్యం |
|---|---|---|---|
| 1.మత్స్యావతారం | సోమకుని చంపడం. | 6. | |
| 2. | | 7. | |
| 3. | | 8. | |
| 4. | | 9. | |
| 5. | | 10. | |

**ఆ) కింది పేరాను చదివి నాలుగు ప్రశ్నలు తయారు చేయండి.**

తెలుగు పద్యానికి వెయ్యేళ్ళకుపైగా చరిత్ర ఉంది. అవధానాల చరిత్ర కూడా ప్రాచీనమే. ఆధునిక కాలంలో వందల సంఖ్యలో అవధానాలను నిర్వహించి, ఈ విద్యకు ఒక గుర్తింపు, గౌరవం తెచ్చిన ఘనత తిరుపతి వెంకట కవులదే. కాశీ కృష్ణాచార్యులు, వెంకటరామకృష్ణ కవులు, కొప్పరపుకవులు, జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, గాడేపల్లి వీరరాఘవశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, పింగళి కాటూరి కవులు, సి.వి.సుబ్బన్న, రాళ్ళబండి కవితాప్రసాద్, ఆశావాది ప్రకాశ రావు మొదలైనవారు అవధానులుగా ప్రసిద్ధులు. ఆ కోవలో అవధాన విద్య కొత్త చివుళ్ళను సంతరించుకుంటున్నది. అష్టావధానంలో నిషిద్ధాక్షరి, సమస్యా పూరణం, దత్తపది, వర్ణన, ఆశువు, న్యస్తాక్షరి, పురాణ పఠనం, అప్రస్తుత ప్రసంగం మొదలైన అంశాలున్నాయి. శతావధానంలో వందమంది పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు అవధాని ఆశువుగా సమాధానం చెప్తాడు. వీటిని ధారణ చేసి వరుసగా మళ్ళీ చదువుతారు.

ప్రశ్నలు :

1. ..........................................................................................

2. ..........................................................................................

3. ..........................................................................................

4. ..........................................................................................

**ఇ) కింది పద్యాన్ని చదివి, ఇచ్చిన బహుళైచ్ఛిక ప్రశ్నలకు జవాబులు గుర్తించండి.**



**ఆ.వె. మధురమధురమైన మన భాషకంటెను**
**చక్కనైన భాష జగతి లేదు**
**తల్లిపాల కంటె తనయున కేపాలు**
**బలమునీయగలవు ? తెలుగుబిడ్డ**

**– నార్ల చిరంజీవి**

ప్రశ్నలు.

1. మధురమైన భాష ఏది ? ( )

అ) హింది ఆ) ఇంగ్లీషు ఇ) తెలుగు ఈ) ఏదీకాదు

2. చక్కనైన భాష ............... లేదు. ( )

అ) లోకంలో ఆ) జగతిలో ఇ) ఏదీకాదు ఈ) ప్రపంచంలో

3. బిడ్డకు ఏవరి పాలు బలము ( )

అ) తల్లి ఆ) సవతి తల్లి ఇ) పెంపుడు తల్లి ఈ) ఏదీకాదు

4. పై పద్యాన్ని ఎవరు రచించారు ? ( )

అ) నార్ల వెంకటేశ్వరరావు ఆ) నార్ల చిరంజీవి ఇ) ఏదీకాదు

**ఈ) పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. సి.వి. సుబ్బన్న కవి గురించి రాయండి?
2. సాహిత్య రూపక ప్రక్రియా లక్షణాలను గురించి రాయండి?
3. సమస్యా పూరణం అంటే ఏమిటి ?

## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. భువన విజయం ఏ ప్రక్రియకు చెందినది?
2. పాఠంలో గల ఓయి కురురాజా అనే దత్తపది పద్యభావం రాయండి.
3. భువన విజయ సభలో మీరు సామాన్యులుకారు రామకృష్ణా అని భట్టుమూర్తి ఎందుకు అన్నాడో రాయండి?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. పాఠంలో ముక్కు తిమ్మన కవి చెప్పిన పద్యానికి భావం రాయండి.
2. తెలుగు భాషా ఔన్నత్యాన్ని సొంత మాటలలో రాయండి.
3. భువన విజయం రూపకం ఆధారంగా తెలుగు ఘనతను గురించి కరపత్రం తయారుచేయండి?

## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాసి, వాటితో సొంతవాక్యాలు రాయండి.**

1. విద్యార్థి విజ్ఞాన <u>తృష్ణ</u> ను కలిగి ఉండాలి.
2. పిల్లల ఎదుగుదలకు గురువుల <u>దీవెనలు</u> దోహదపడతాయి.
3. సాహిత్యాన్ని ఆస్వాదించే <u>అభిలాష</u> కలిగి ఉండాలి.
4. శ్రీకృష్ణదేవరాయలు తెలుగు<u>వల్లభుడు</u>.

**ఆ) కింది పదాలు చదివి, వాటికి సరిపోయే నానార్థాలతో జతపరచండి.**

| | | |
|---|---|---|
| అ) బాస | (      ) | 1. జలము, రుచి, పసరు. |
| ఆ) చీరు | (      ) | 2. యోగ్యం, శ్రేష్ఠం, క్షేమం. |
| ఇ) రసము | (      ) | 3. పిలుచు, గోఱు, చీల్చు. |
| ఈ) లెస్స | (      ) | 4. ఒట్టు, ప్రమాణం, భాష |

**ఇ) కింది వాక్యాలను చదివి, పర్యాయపదాలను గుర్తించి రాయండి.**

ఉదా: మేకలకు తోక చిన్నగా ఉంటుంది. కోతికి వాలం అందం. హనుమంతుడు లాంగూలంతో ఎగిరాడు.

1. అమ్మ చూపు ప్రేమకు సంకేతం. అమ్మ ప్రేమకు దృష్టిదోషం ఉండదు. అమ్మ లోకము మనపై ఆలోకనమే.
2. శంకరి ఆదిశక్తి. పార్వతి సింహ వాహిని.జగన్మోహిని కష్టాలను తొలగిస్తుంది.
3. మందరగిరిని కూర్మం మోసింది. తనను తాను కాపాడుకోగలదు కమఠం. తాబేలు నీటిలో, భూమిపై తిరుగుతుంది.
4. శౌరికి సుభద్ర చెల్లెలు. మురారి అర్జునునికి బావమరిది. గోపాలుడు అందరివాడు.

**ఈ) కింది వాటికి ప్రకృతి వికృతులు గుర్తించండి.**

1. శర్కర ( ) అ) విన్నాణం
2. పద్యం ( ) ఆ) చక్కెర
3. విజ్ఞానం ( ) ఇ) పద్దెం



## భాషాక్రీడ

**అ) ఒకే అక్షరంతో వచ్చే వాక్యాల్ని రాయండి.**

ఉదా : కాకీక కాకికి కాక కేకకా?

1.................................. 2............................... 3......................................



## వ్యాకరణాంశాలు

ప్రథమా విభక్తి మీది క,చ,ట,త,ప లకు గ,స,డ,ద,వ లు వస్తే గసడదవాదేశసంధి అని తెలుసుకున్నారు కదా!

**అ) కింది గసడదవాదేశ సంధి పదాలను విడదీసి రాయండి.**

1. గొప్పవాడు గదా = ..................... + .....................
2. కొలువు సేసి = ..................... + .....................
3. వాడుదక్కరి = ..................... + .....................

**ఆ) గసడదవాదేశ సంధి పదాలను కలిపి రాయండి.**

1. కూర + కాయ = ................................................
2. కాలు + చేయి = ................................................
3. తల్లి + తండ్రి = ................................................

**ఇ) కింది పదాలకు విగ్రహ వాక్యాలను రాసి సమాసాల పేర్లు రాయండి.**

1. రెండు దిక్కులు ................................................ = ..............................
2. అసాధ్యము ................................................ = ..............................
3. పనిపాటలు ................................................ = ..............................

**చంపకమాల పద్య లక్షణాల గురించి తెలుసుకుందాం.**

పాఠంలోని కింది పద్యపాదానికి గురు, లఘువులను గమనించండి.

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| నినుని | నునిన్ను | నిన్నుని | నునిన్ను | నునిన్ను | నునిన్ను | నిన్నునుం |

**చంపకమాల పద్య లక్షణాలు:-**

1. చంపకమాల వృత్తజాతి పద్యం.
2. ఇది నాలుగు పాదాల పద్యం.
3. ప్రతి పాదంలో 21 అక్షరాలు ఉంటాయి.
4. ప్రతి పాదంలో న,జ,భ,జ,జ,జ,ర అనే గణాలు వరుసగా వస్తాయి.
5. ప్రతి పాదంలో 11వ అక్షరం యతి స్థానం.
6. ప్రాస నియమం ఉంది.
7. పై పాదంలో మొదటి అక్షరం 'ని', కి 11వ అక్షరం 'ని' కి యతి చెల్లినది.

పాఠంలోని చంపకమాల పద్యంలో మిగిలిన పాదాలకు గణ విభజన చేసి, లక్షణాలను సమన్వయం చేయండి.

### వృత్త్యనుప్రాసాలంకారం

**కింది వాక్యాలను పరిశీలించండి.**

1. వాడు బడికి వడి వడిగా వచ్చాడు.
2. ధీరవీర పరాక్రమ రాకుమార! లేరా పోరు సలుప కదలిరారా!
3. విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణు కృష్ణు

పై వాక్యాలను గమనించండి. మొదటి వాక్యంలో 'డ' అనే హల్లు పలుమార్లు పదే పదే పునరావృత్తమయ్యింది. రెండో వాక్యంలో 'ర' అనే హల్లు పదేపదే పునరావృత్తమయ్యింది. మూడవ వాక్యంలో 'ష్ణ' అనే సంయుక్త హల్లు చాలా సార్లు వచ్చింది. ఇలా ఒక పద్యంలో గాని, పద్య పాదంలోగాని ఒకటి లేదా అంతకంటే ఎక్కువ హల్లులు పదేపదే పునరావృత్తమయితే అది **వృత్త్యనుప్రాసాలంకారం**.

పాఠంలోని **వృత్త్యనుప్రాస** అలంకారానికి చెందిన ఉదాహరణలను వెతికి రాయండి.




### ప్రాజెక్టు పని

**అష్టదిగ్గజ కవుల వివరాలను, వారి రచనలను సేకరించి పట్టికరూపంలో రాయండి**

| వ.సం | కవి | కాలం | రచనలు |
|---|---|---|---|
| 1. | అల్లసాని పెద్దన | | |
| 2. | నంది తిమ్మన | | |

## పాఠాంత పద్యం



చ. తలచినంతనె తన్మయత్వము కల్గి
తీపినొందించు పీయూష తెలుగు భాష
చదివినంతనె మదిలోన సుధలుగురియు
దివ్య కావ్యసమున్మేష తెలుగు భాష ! – విశ్వనాథ

భావం : తలవగానే తన్మయత్వాన్ని పొందే తీపినిచ్చే అమృతము తెలుగుభాష. చదవగానే ఆనందాన్ని రెట్టింపు చేసే భాష తెలుగుభాష.

సూక్తి : ఆంధ్రత్వము లేని బ్రతుకు నాశింపకుమీ –తుమ్మల సీతారామమూర్తి చౌదరి

## ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..............................................................
2. నేను గ్రహించిన విలువ ..............................................................
3. సృజనాత్మక రచన ..............................................................
4. భాషాంశాలు ..............................................................

మార్చి 27వ తేదీని ప్రపంచ రంగస్థల దినోత్సవంగా జరుపుకొంటాం.

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1. మీ పాఠశాల విద్యార్థుల చేత భువనవిజయ రూపకాన్ని ప్రదర్శింపచేయండి.
2. తేటగీతి, ఆటవెలది వంటి పద్యాలు విద్యార్థులు రాసేటట్లు ప్రోత్సహించండి.

## పాఠాంత అంశము

### రుబాయిలు

జీవితం బెల్ల బహుశాస్త్ర సేవలందుc
గడిపితి, రహస్యములు చాల గ్రాహ్యమయ్యె
నిప్పుడు వివేకనేత్రంబు విప్పిచూడc
దెలిసికొంటి నాకేమియుc దెలియదంచు.

ఆదిమధ్యాంత రహితమై యలరుచుండు
కాలయవనిక భేదింపఁ గలమె మనము?
ఇటకు నెందుండివచ్చె నింకెటకుఁ బోవు
బ్రాణియను ప్రశ్న కెవ్వాఁడు బదులు సెప్పు? – దువ్వూరి రామిరెడ్డి. (పానశాల)

**రుబాయి తేటగీతిలా వుంటుంది. దేశీయ ఛందస్సులో వుంటుంది. నాలుగు పాదాలుంటాయి. వీటిని అర్ధపాదములని అంటారు ఒకటి, రెండు, నాలుగవ పాదములకు అంత్యనియమము ఉంటుంది. వేమన పద్యాలలా రుబాయిలలో తత్త్వములు, నీతులు సంక్షేపించి చెప్పుటకు అనువుగా ఉంటుంది.**

**జాతీయాలు–న్యాయాలు**

1. అరణ్య రోదన – అరణ్య రుదిత న్యాయం – అడవిలో ఏడ్చుట వ్యర్థం
2. కూస్తున్న గాడిద మేస్తున్న గాడిదను చెరపెనన్నట్లు – అవ్యాపార వ్యాపార న్యాయం
3. సేవకునిదే గుర్రం – అశ్వభృత్య న్యాయం
4. రోలు పోయి మద్దెలతో మొరపెట్టుకొన్నట్టు – ఉలూఖలమర్దల న్యాయం
5. గుణవంతుడగు కుమారుడు ఒక్కడే చాలును – ఏకపుత్ర న్యాయం
6. ముల్లు తీసుకొనుటకు ముల్లే తగునన్నట్లు – కంటక న్యాయం
7. అరటి ఆకు ముల్లుపై పడినా, ముల్లు అరటి ఆకుపై పడినా ఆకుకే ప్రమాదం – కదళీకంటక న్యాయం
8. ఏనుగు మింగిన వెలగపండు లాగున – కరికపిత్థ న్యాయం
9. కాకిముక్కున దొండపండు గట్టినట్లు – కాకత్రోటిబింబ న్యాయం
10. బావిలో కప్ప – కూపస్థమండూక న్యాయం
11. గాడిదకేమి తెలుసు గంధం పొడి వాసన – గర్దభచందన న్యాయం
12. బెల్లం కొట్టిన రాయి అన్నట్లు – గుడోపల న్యాయం
13. ఈ ఊరికి ఆ ఊరెంత దూరమో ఆ ఊరికి ఈ ఊరు అంతే దూరమన్నట్టు – గ్రామదూర న్యాయం
14. నమలిన దానినే మరల మరల నమలుట – చర్వితచర్వణ న్యాయం
15. పులిని జూచి నక్కవాత బెట్టుకొన్నట్లు – చిత్రకాయజంబుక న్యాయం
16. కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువన్నట్లు – ఛురికకూష్మాండ న్యాయం
17. కాళ్ళు కాలిన పిల్లి విధం – దగ్ధపదమార్జాల న్యాయం
18. నదులన్నింటికిని సముద్రమే ఆధారమన్నట్లు – నదీ సముద్ర న్యాయం
19. ఓడలు బండ్లగుట, బండ్లు ఓడలగుట – నౌకశకట న్యాయం
20. అడుసు తొక్కనేల కాళ్ళు కడుగనేల ? – పంకప్రక్షాళన న్యాయం

13

# ఆతిథ్యం




## చదవండి - ఆలోచించి చెప్పండి



దీనుం డైనను శాత్రవు
డైనన్ శరణనుచు వేడు నపుడు ప్రియత న
మ్మానవుని కోర్కె దీర్చిన
వాని సుజను దండ్రు బుధులు వసుధ కుమారా!

– పక్కి లక్ష్మీనరసింహ కవి.

ప్రశ్నలు

1. పై పద్యం ఏం చెబుతోంది?
2. ఎవరిని సుజనులు అంటారు?
3. శరణుకోరడం అంటే ఏమిటి?

### ఉద్దేశం

"అతిథి దేవోభవ" ఇంటికి వచ్చిన అతిథులను గౌరవించాలని వారికి లోటు రానీయకూడదని, తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

### నేపథ్యం

భీష్మ పితామహుడు ధర్మరాజుకు ధర్మబోధనలు చేస్తూ మనల్ని శరణు కోరిన వారిని ఆదుకుంటే ఎటువంటి ఫలితం దక్కుతుందో చెప్పాడు. ఈ కథ పూర్వం రాక్షసమంత్రి శుక్రాచార్యుడు ముచికుందుడు అనే రాజుకు చెప్పినకథ. ఈ కథ అతిథి మర్యాద, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మొదలైన విలువలను చెప్తుంది. ఒక వేటగాడు అడవికి వెళ్ళి, పక్షిని వేటాడి తిరిగి ఇంటికి వెళుతుండగా పెద్ద గాలివాన వచ్చింది. దాని వలన వేటగాడు అడవిలో చిక్కుకున్నాడు. చివరకు ఒకచెట్టు కిందకు చేరి, తడిసిన శరీరంతో గజగజ వణక సాగాడు. అప్పుడు ఒక పావురం శరణుకోరిన వేటగాడికి ఆతిథ్యం ఇచ్చిన రీతిని ఈ ఘట్టం తెలియజేస్తుంది.

### కవి పరిచయం



13వ శతాబ్దం

## తిక్కన సోమయాజి

కవిత్రయంలో తిక్కనసోమయాజి రెండవ వారు. ఇంటి పేరు కొట్టరువు. తల్లిదండ్రులు అన్నమ్మ, కొమ్మనలు. తిక్కన నెల్లూరిని పాలించిన మనుమసిద్ధి ఆస్థానంలో మంత్రిగా ఉండేవారు. నిర్వచనోత్తర రామాయణం. ఆంధ్రమహాభారతం రచించారు. విరాట పర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు పదిహేను పర్వాలను రచించారు. ఈయన శైలి నాటకీయం. ఈయన బిరుదులు ఉభయ కవిమిత్రుడు, కవిబ్రహ్మ. ప్రస్తుత పాఠ్యభాగం **మహాభారతం శాంతి పర్వంలోని తృతీయాశ్వాసం** నుండి తీసుకోబడింది.

## ఆతిథ్యం

వ. అప్పక్షి ధ్వంసకుందు శయనంబు ప్రాపించియుండ నమ్మహీరుహంబు కోటరంబున వసియించి యుందునది యొక్క కపోతంబు దనవల్లభ యెటయేని మేతకుంబోయి రాక తడసిన శోకించి. 01

సీ. ఎచట నున్నది యొక్కొ యింత ప్రొద్దొకచోట
నుండునే ననుఁ బాసి యుజ్జ్వలాంగి?
యమ్మేను లేకున్న నిమ్మేని కలిమి ని
రర్థకం బధికానురాగయుక్త
యగు సతీగుణముల యైహికాముష్మిక
సుఖసాధనంబులు సువ్వె! పతికి
యేకారణంబున నే మయ్యెనో వాన
యేపునఁ దెగియెఁ గానోపు నకట !



తే. నేమి సేయుదు? మందిరం బిపుడు పాడు
వాఱుచున్నది యనఁగ నప్పలుకు లెల్ల
బోయవలలోన నున్న కపోతి విని మ
నంబు సంతోషపూరమగ్నంబు గాఁగ. 02

క. పతి మదికి నింత యెక్కిన
యతివ గదా పుణ్యవతి ప్రియాలాపము లీ
గతి వినఁ గాంచితిఁ జన్మము
గృతకృత్యం బయ్యె నాకు గెలిచితి జమునిన్. 03

వ. అని యుల్లంబునన యుగ్గడించి పతికిం దన తెఱంగెఱింగించి, మఱియు నిట్లనియె. 04

* చ. శరణము సొచ్చినం దగఁ బ్రసన్నతఁ గైకొని రక్షణంబు సా
దరముగఁ జేయు టత్యధిక ధర్మముగా బుధకోటి సెప్పు ; నీ
వరసి మహోర్తు వీని శరణాగతు నోపినభంగి నాపదం
బొరయక యుండఁజేయుము ప్రభూతపు సీతునఁ గొంకు వోయెడున్. 05

క. అని యేర్పడ భాషించిన
విని శోకము డిగ్గ విడిచి విహగము గరుణం
దనజాతి సెప్పి తగ ని
ట్లనియె మనుజ భాషణముల నా లుబ్ధకుతోన్. 06

క. 'ఓ యన్న ! డస్సినాఁడవు
మా యింటికి నతిథి వైతి మసలక నీకుం
జేయవలయు నాతిథ్యం ;
బేయది భవదీప్సితార్థ మెఱిఁ గింపు తగన్'. 07

* చ. అనవుడు నుల్ల మెంతయుఁ బ్రియంబు వహింపఁగఁ బక్షివైరి 'సీ
తున సకలాంగకంబులుఁ బ్రతున్నము లయ్యెడు దీనిఁ బాపవే!'
యనిన విహంగమంబు రయమారఁగ నచ్చటి పుల్లలెల్ల ము
క్కునఁగొని తెచ్చి ప్రోవిడి యకుంఠిత మైన దయాగుణంబునన్. 08

వ. ఆ పొంత పల్లియకు రయంబునం జని పుల్లతల సంగతంబైన యింగలంబు. 09


క. కొని వచ్చి పుల్ల ప్రోవునఁ
దనుకంగాఁ జేసి నెమ్మి దఱుకొత్తఁగ ని
ట్లను బోయతోడ 'మే నీ
యనలంబునఁ గాఁచికొనుటకై లె' మ్మనఘా ! 10

చ. అనవుడు వాఁడు గువ్వహృదయం బలరం దనయంగకంబు ల
య్యనలశిఖాకలాపమున నల్లన యల్లన కాంచి శీత బా
ధన ముడుగంగఁ జేయఁగఁ బదంపడి యాఁకలి చాలఁదోఁ చెఁ దోఁ
చిన నెఱిఁగించె గువ్వ కది సేయ నుపాయము లేక యాత్మలోన్. 11

వ. వగచి వెలవెలంబాఱి తలంచికొని వాని కిట్లనియె. 12

తే. ఖగములకు జీవనం బనఁ గలదె సంగ్ర
హించినట్టిది యాఁకలి కేమియైన
మాకు దొరకొన్నఁ దిందుముగాక ! యైన
నీవు డస్సితి వాతిథ్యనియతి వలయు. 13

వ. నా శరీరం బాహారంగా నిచ్చెదఁ గొనుము 14.



కII అని పలికి యగ్ని వలగొని
తన దేహము దానిలోనఁ దడయక యిడినం 15
గని బోయ విస్మయంబున
మనమూనఁగఁ గొంతసేపు మ్రాన్పడియుండెన్

✼ మ.'కలదే యిమ్మెయి పౌరుషంబు జగతిం గారుణ్య మేపార ని
ప్పులుఁ గిట్లిచ్చునె మేను? నాదు చరితంబుల్ నిందకుం బట్టులై
తలఁపన్ వచ్చిన నింత కీ డగునె యేతత్క్రూరతా ఘోర చే
ష్టలు మానంగలవాఁడఁ ; బక్షి గురువై సంధించె సద్బోధమున్'. 16.

**ప్రక్రియ – ఇతిహాసం**

ఇతిహాసం అనగా పూర్వమిట్లు జరిగిందని తెలియజెప్పునది. దీనిలో ఇతివృత్తం గతంలో జరిగినదై ఉంటుంది. ఇవి తొల్లిటి కథలు. శ్రీమద్రామాయణం, మహాభారతం ఇతిహాసాలు.

**భావాలు :**

1. వలలో ఉన్న పావురంతో వేటగాడు గాలివాన సమయంలో ఒక చెట్టు కింద రాతి మీద వణుకుతూ పడుకున్నాడు. ఆ చెట్టు తొర్రలో పావురాల జంట ఉంది.అందులో ఆడు పావురం మేతకు పోయింది. అది ఎంతకూ రాకపోవడంతో మగపావురం విచారపడుతూ .....ఇలా అంది.

2. "నా భార్య ఇంతసేపు ఎక్కడ ఉందో నన్ను వదిలి ఎక్కడా ఉండదు. ఆమె లేని నా బ్రతుకు ఎందుకూ పనికిరాదు. అనువైన భార్య యొక్క సుగుణాలే భర్తకు ఇహపరాలలో సుఖసాధనాలు కదా.. ఏ కారణాల వల్ల ఏమైపోయిందో? ఏమో? కుండపోతగా వాన కురవడం వలన మరణించిందేమో! నేనేం చేసేది. ఆమె లేని నా ఇల్లు పాడైపోయినట్లున్నది" అని బాధపడుతున్న మగపావురం మాటలన్నీ వలలో చిక్కిన ఆడపావురం వింది. అపుడు పట్టలేని సంతోషంతో ....

3. భర్త మెప్పు పొందిన భార్య ఎంతో పుణ్యాత్మురాలు. నా గురించి అనురాగం కలిగిన నా భర్త మాటలు చెవులారా విన్నాను. ఇక నా జన్మధన్యం అయింది. నేను ఈ రోజు నా మృత్యువుని జయించాను.

4. అని తన మనసులో అనుకుంటూ తన ఉనికి భర్తకు తెలిపి ఇలా అంది.

5. "ఆదుకొనమంటూ మన దగ్గరకు వచ్చిన వారిని దయతో ఆదరించాలి. వారిని కాపాడటం కన్న మించిన పుణ్యం మరొకటి లేదు–అని పెద్దలంటారు. ఈ గాలివానలో చిక్కి చలికి వణుకుతున్న వేటగాడికి సహాయం చేసి కాపాడు"

6. భార్య మాటలను విన్న మగ పావురం భార్యకు ఏమైందో? అన్న విచారాన్ని వదిలేసి, వేటగానిపై జాలిపడింది. వేటగానితో ఇలా అంది.

7. ఓ అన్నా !ఈ గాలివానలో నువ్వు బాగా అలసిపోయి ఉన్నావు. మా ఇంటికి వచ్చిన అతిథివి. ఆలస్యం కాకుండా నీకు అతిథి మర్యాద చెయ్యాలి. నీకు కావాల్సినది ఏదో చెప్పు అంది.

8. వేటగాడు ఆ పావురం చెప్పినది విని, సంతోషించాడు. "ఈ చలికి నా అవయవాలు వణుకుతున్నాయి. కావున ముందు నా చలిని పోగొట్టు" అన్నాడు. ఆ పావురం జాలిపడి దగ్గరలో ఉన్న చిన్నచిన్న పుల్లలను ఏరుకొచ్చి పోగుచేసింది.

9. పక్కనే ఉన్న పల్లెకు వేగంగా వెళ్ళి, నివురుగప్పిన నిప్పు కలిగిన చిన్న కర్రపుల్లను తెచ్చింది.

10. తీసుకువచ్చిన ఆ అగ్గితో చిదుగు పుల్లలను (రెక్కలతో విసిరి) మండేలా చేసింది. సంతోషంతో చలి కాచుకోమని రమ్మని వేటగాడిని పిలిచింది.

11. పావురం సంతోషించేటట్లు వేటగాడు మండే మంటలతో వంటిని మెల్లమెల్లగా చలి కాచుకొని తీర్చుకున్నాడు. అంతలోనే ఆకలి వేసింది. ఆ విషయాన్ని పావురంతో చెప్పాడు. ఆ పక్షికి ఆ సమయంలో వేటగాని ఆకలిని ఎలా తీర్చాలో తోచలేదు. తనలో తాను

12. దుఃఖించి వెలవెలపోతూ తన మనసులో ఏం చేయాలో మననం చేసుకుంటూ ఆ వేటగానితో ఇలా అంది.

13. "మా జీవితాల్లో తిండిని కూడబెట్టడం ఉండదు. ఆకలి వేసినపుడు దొరికింది తింటాం. నువ్వు ఇప్పుడు బాగా అలసిపోయావు. తప్పనిసరిగా నీ ఆకలి తీర్చాలి'.

14. "నాకు నేనుగా నీకు ఆహారమౌతాను".

15. అని చెప్పి ఆ పావురం మంట చుట్టూ తిరుగుతూ మంటల్లో పడిపోయింది. ఆ దృశ్యాన్ని చూసి వేటగాడు నివ్వెరపోయాడు. కొంచెంసేపు కొయ్యబారిపోయినట్లు ఉండిపోయాడు.

16. లోకంలో ఇలాంటి త్యాగగుణం, అతిథి ధర్మం ఎక్కడైనా ఉంటుందా. నాపై దయతో నా ఆకలి తీర్చాలని తానే నాకు ఆహారంగా మారింది. నేను ఈ పక్షి జాతికే ద్రోహం చేస్తున్నాను. నా ప్రవర్తనకు నాపై నాకే అసహ్యం పుడుతోంది. ఇతర ప్రాణులకు హాని చేయడం హింస కదా. ఇక నుంచి ఏ ప్రాణికి హాని కలిగించేపని నేను చేయను. నా వేట వృత్తిని మానేస్తాను. త్యాగానికి, ధర్మబుద్ధికి ఈ పక్షే నాకు గురువు అనుకున్నాడు.

## ఇవి చేయండి

### అవగాహన - ప్రతిస్పందన

X1I5Z4

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.**

1. పాఠంలోని పద్యాలను రాగయుక్తంగా పాడండి, వాటి భావాలను చెప్పండి.
2. కథను మీ సొంత మాటల్లో చెప్పండి.
3. కింది పద్యాన్ని చదవండి, ప్రతిపదార్థాన్ని పరిశీలించండి.

చ. 'శరణము సొచ్చినం దగఁ బ్రసన్నతఁ గైకొని రక్షణంబు సా
దరముగఁ జేయు టత్యధిక ధర్మముగా బుధకోటి సెప్పు నీ
వరసి మహోర్తు వీని శరణాగతు నోపినభంగి నాపదం
బొరయక యుండఁజేయుము ప్రభూతపు సీతునఁ గొంకు వోయెడున్

| | | |
|---|---|---|
| శరణము + చొచ్చినన్ | = | శరణాగతి పొందగా |
| తగన్ | = | ఒప్పుగా |
| ప్రసన్నతన్ | = | దయతో |
| కైకొని | = | అంగీకరించి |
| రక్షణము | = | ఆశ్రయం |
| సాదరముగన్ | = | గౌరవముగా |
| చేయుట | = | ఆచరించటం |
| అత్యధిక ధర్మముగాన్ | = | గొప్ప పుణ్య కార్యముగా |
| బుధ కోటి | = | పండిత సమూహం |
| చెప్పున్ | = | చెబుతారు |
| నీవు + అరసి | = | నీవు విచారించి |
| మహా + ఆర్తున్ | = | గొప్ప బాధలో ఉన్న |
| శరణ + ఆగతున్ | = | రక్షణ కోరుతున్న |
| వీనిన్ | = | ఈ బోయవాడిని |
| ఓపిన భంగిన్ | = | చేతనైనంతలో |
| ఆపదన్+పొరయక+ఉండన్ | = | కష్టాల పాలు కాకుండా |
| చేయుము | = | కాపాడుము |
| ప్రభూతపు సీతునన్ | = | ఎక్కువ అవుతున్న చలితో |
| కొంకుపోయెదున్ | = | అవయవాలు కొంకర్లు పోతున్నాయి |

**ఆ) కింది కథను చదివి సంభాషణను చదివి నాలుగు ప్రశ్నలు తయారు చేయండి.**



యుద్ధ భూమి నుండి వెనుదిరుగుతూ ఉన్న సమయంలో 'రథం ఆపు !'అన్నాడు రాజు, 'ఎందుకని?'అన్నాడు సారథి, 'ఆ చెట్టు పైన పక్షి పిల్లలున్నాయి, అవింకా కళ్లయినా తెరవలేదు, అవి కింద పడితే చనిపోతాయి' అన్నాడు రాజు. 'వెనుక శత్రువులు తరుముకొస్తున్నారు. వాళ్ళ చేతుల్లో చనిపోతాము!' అన్నాడు సారథి. 'బాట చిన్నగా ఉంది. రెండు రథాలు ఈ బాటలో పట్టవు, శత్రువుల రథం ఈ బాటలోకి వచ్చిందంటే ఈ ఒరిపిడికి చెట్ల మీద పక్షి పిల్లలు కింద పడిపోతాయి'. అన్నాడు రాజు. 'నేను చెబుతున్నాను' ఆపు అన్నాడు రాజు. 'నా రాజును కాపాడుకోవడం నా విధి' అన్నాడు సారథి. 'విజేత శత్రువులు నన్ను చంపినా నాకిష్టమే గాని,

ఆ రెక్కలు, కళ్ళూ రాని పక్షిపిల్లలు చనిపోవడం నాకిష్టం లేదు' అన్నాడు రాజు. "అన్ని ప్రాణులూ సమానమే. నా ప్రాణం నాకు తీపి నీ ప్రాణం నీకు తీపి. అట్లాగే పక్షి ప్రాణం పక్షికి తీపి. భూత దయ మరువకు, మనం 'ధర్మాన్ని రక్షిస్తే ధర్మం మనలను రక్షిస్తుంది'. తిప్పు రథాన్ని వెనక్కు" అన్నాడు రాజు. ఇక కాదనలేక రథాన్ని వెనక్కు రణరంగం వైపుకు తిప్పాడు సారథి. వెనుకకు తిరిగి వేగంగా వస్తున్న రాజు, సారథి, రథాన్ని చూసిన శత్రువులు భయంతో పారిపోయారు. **(చందమామ కథలు)**

**ప్రశ్నలు.**

1. ..........................................................................................

2. ..........................................................................................

3. ..........................................................................................

4. ..........................................................................................

**ఇ) కింది కవితను చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



రంతిదేవు డొకరాజు
అన్నపానములు లేక చిక్కిపోవ
పాయసాన్నం కలిగె నొకనాడు
పెట్టమని నొకబాటసారి!
సాదరమున సగమునిచ్చె
మిగిలిన సగం తినబోవ
మరొక్కరొచ్చాకలనడిగె!
దాని నంత సగమునిచ్చె
మిగిలిన సగం తినబోవ
ఇంకొకరొచ్చాకలనడిగె!
మొత్తమిచ్చి మమతపంచె

**ప్రశ్నలు**

1. రంతి దేవుడు ఎవరు ?

జ. ..........................................................................................

2. రంతి దేవుడు ఎందుకు చిక్కిపోయాడు ?

జ. ..........................................................................................

3. బాటసారి రంతిదేవుని ఏమని అడిగాడు ?

జ. ..........................................................................................

4. మమత పంచడం అంటే ఏమిటి?

జ. ..........................................................................................................

**ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. ఆతిథ్యం పాఠ్యభాగ కవి గురించి రాయండి?
2. ఇతిహాస ప్రక్రియ లక్షణాలను గురించి రాయండి?
3. అతిథి మర్యాదను గురించి ఆడ పావురం మగపావురంతో ఏమని పలికింది?
4. పావురం దేహత్యాగానికి పూనుకున్న స్థితిని చూసి, వేటగాడు ఏమనుకున్నాడు?
5. భర్త మాటలు విన్న ఆడపావురం ఏమనుకున్నది?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ఈ పాఠానికి ఆతిథ్యం శీర్షిక తగిన విధంగా ఉందని మీరు భావిస్తున్నారా? ఎందుకు?
2. అతిథులకు మీరు ఎలా మర్యాద చేస్తారో, రాయండి.
3. ఎవరయినా ఆపదలో ఉంటే వారికి మీరు ఎలా సహాయపడతారో రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పాఠ్యభాగ సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి.
2. కపోతము, వేటగాని మధ్య జరిగిన సంభాషణ రాయండి.
3. జంతువులు / పక్షుల సంరక్షణకు కృషి చేస్తున్న వారిని ప్రశంసిస్తూ రాయండి.



## భాషాంశాలు

### పదజాలం

**అ) గీత గీసిన పదానికి అర్థం రాసి, సొంత వాక్యాలలో రాయండి.**

1. బుధుల మాటలే పిల్లలకు శ్రేయస్కరం

..........................................................................................................

2. మా మందిరంలో విహంగం గూడుకట్టుకుంది

..........................................................................................................

3. కపోతం, మేతకు వెళ్ళిన భార్యను తలుచుకొని శోకంలో మునిగింది.

..........................................................................................................

4. జన్మము కృతకృత్యంబయ్యె.

..........................................................................................................

**ఆ) కింది పదాలను, సరియైన నానార్థాలతో జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. అంగం | (  ) | అ) ధర్మం, శుభం, మోక్షం |
| 2. విహంగం | (  ) | ఆ) అపకారం, మాలిన్యం, తప్పు |
| 3. శ్రేయం | (  ) | ఇ) సిగ, కిరణం, మంట |
| 4. శిఖ | (  ) | ఈ) పక్షి, బాణం, మబ్బు |
| 5. కీడు | (  ) | ఉ) అవయవం, భాగం, శరీరం |

**ఇ) కింది గీతగీసిన పదాలకు పర్యాయ పదాలను గుర్తించి రాయండి.**

1. పులుగులు పంటల్ని నాశనం చేసే పురుగుల్ని తింటాయి. (  )

అ) పక్షి, విహంగం   ఆ)పులుపు, పులుసు   ఇ) డేగ, రాబందు

2. గురువు బోధన శిష్యుని అంతరంగంలో నిలుస్తుంది. (  )

అ) హృదయం, మనస్సు   ఆ)సారంగం, తరంగం   ఇ) లోపల, బయట

3. వర్షంలో తడిసిన వేటగాని దేహం చలికి వణికింది. (  )

అ)కరుణ, కారుణ్యం   ఆ)శరీరం, కాయం   ఇ) కన్ను, చెవి

4. ధరణికి హరితహారాలు వృక్షాలు. (  )

అ) గాలి, నీరు   ఆ) భూరుహాలు, క్ష్మాజాలు   ఇ) పువ్వులు, కాయలు

**ఈ) కింది ప్రకృతి, వికృతులను జతపరిచి రాయండి.**

| | | |
|---|---|---|
| 1. త్యాగం | (  ) | అ) గుణము |
| 2. యముడు | (  ) | ఆ) సుఖము |
| 3. గొనము | (  ) | ఇ) చాగం |
| 4. సుగము | (  ) | ఈ) జముడు |

**ఉ) కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.**

1. అతిథి ______________________

2. మహీరుహము ______________________


3. శరీరం ______________________

4. పక్షి ______________________



## భాషాక్రీడ

**అ) కింది ఆధారాలతో గళ్ళను పూరించండి.**



**అడ్డం**

1. కిరాతునికి మరో పేరు (4)
3. "కపోతము" పురుష వాచక పదం అయితే స్త్రీ వాచకపదం? (3)
5. వేటగాడిని ప్రేమగా పావురం ఇలా పిలిచింది (2)
6. మాట్లాడతానని ఇలా అంటారు(3)
7. పావురాన్ని వలనుండి వదిలితే, ఆ పావురానికి ఇది వస్తుంది(2)
8. పుల్లలు కాలిపోయాక ఇది మిగులుతుంది.(2)
10. 'విడవక ' అనే అర్థంతో వాడేపదం (4)
11. 'వస్తాడు' అనే పదానికి వ్యతిరేకపదం తికమకగా పడింది(2)
13. "కా"ను విభజిస్తే ఇలా అవుతుంది.

**నిలువు**

2. వానతోపాటు ఇది వచ్చింది(2)
3. కపోతానికి ఈ గుణముంది(3)
4. భార్యను ఇలా అంటారు, కింది నుంచి పైకి(2)
5. 'అనగానే' అనే అర్థం వచ్చే పదం(4)
6. భాషకు ఉండాల్సింది.(2)
7. నెలంతా పనిచేస్తే ప్రతిఫలాన్ని ఇలా పిలుస్తారు(2)
8. మంచాలలో ఇదో రకం (3)
9. వేటగానికి చలికాగాకా ఇది వేసింది. కింద నుండి పైకి(3)
12. "నా" అనే పదానికి బహువచనం(1)



## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

1) ఉజ్జ్వలాంగి =.................................................................................

2) ఇట్లనియె =.................................................................................

3) మందిరంబిపుడు =.................................................................................

4) అత్యధికం =.................................................................................

### ఆ) కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి.

| | | |
|---|---|---|
| 1. ప్రొద్దొకచోట | | |
| 2. అధికానురాగం | | |
| 3. ప్రియాలాపం | | |
| 4. శరణాగతుడు | | |
| 5. సకలాంగములు | | |

### సరళాదేశ సంధి

| | | | | |
|---|---|---|---|---|
| ఇచ్చెదన్ + కొనుము | → | ఇచ్చెదన్ + గొనుము | → | ఇచ్చెదఁగొనుము |
| సాదరముగన్ + చేయు | → | సాదరముగన్ + జేయు | → | సాదరముగఁజేయు |
| చేసెన్ + టక్కు | → | చేసెన్ + డక్కు | → | చేసెండక్కు |
| సొచ్చినన్ + తగ | → | సొచ్చినన్ + దగ | → | సొచ్చినందగ |
| ననున్ + పాసి | → | ననున్ + బాసి | → | ననుఁబాసి |

పై ఉదాహరణలో పూర్వపదాల చివరన ఉన్న ద్రుతాలకు పర పదాల మొదటి అక్షరాలుగా ఉన్న క, చ, ట, త, ప, అను పరుషాలు పరమౌతాయి. (ద్రుత ప్రకృతికము మీఁది పరుషములకు సరళములగు)

పరుషాలు : క, చ, ట, త, ప,
↓ ↓ ↓ ↓ ↓
సరళాలు : గ, జ, డ, ద, బ,

పై పట్టికలో చూపిన విధంగా పరుషాల స్థానంలో సరళాలు ఆదేశంగా వచ్చాయి. అలా వచ్చిన ఆదేశ సరళాలకు ముందున్న ద్రుతాలకు (సూత్రం : ఆదేశ సరళాలకు ముందున్న ద్రుతమునకు బిందు, సంశ్లేషలు విభాషనగు) అను సూత్రం వలన ఖండ బింధువు, పూర్ణబింధువు, సంశ్లేషలు విభాషగా వచ్చి అయా విభాగం మూడులోని రూపాలు ఏర్పడతాయి.

### ఇ) కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసం పేర్లు రాయండి.

1. సతీగుణములు =.............................. ..............................
2. సుఖసాధనములు =.............................. ..............................
3. పక్షిగురువు =.............................. ..............................
4. శరణాగతుడు =.............................. ..............................

### ఈ) కింది పద్య పాదాలకు గురు, లఘువులు గుర్తించి, పద్య లక్షణాలను రాయండి.

1. శరణము సొచ్చినం దగ బ్రసన్నత గైకొని రక్షణంబు సా
2. అనవుడు నుల్ల మెంతయు బ్రియంబు వహింప గ బక్షివైరి సీ

ఉ) క్రింది వాక్యాంలో అలంకారాన్ని గుర్తించి లక్షణంతో సమన్వయం చేయండి.

1. మంచి మాటలు మాణిక్యాలవలె చెవులకు అలంకారాలౌతాయి.

2. ఆమె ముఖం చంద్రబింబం వలె ప్రకాశిస్తున్నది.

### ప్రాజెక్టు పని

త్యాగ గుణాన్ని తెలిపే కథలను సేకరించి తరగతి గదిలో ప్రదర్శించండి.

### పాఠాంత పద్యం

కొంచెమైనను తగఁబంచి కుడువ మేలు
పనుల యెడ దు:ఖమోర్చి యల్పంబు సుఖము
ననుభవించుట హితము, శత్రునకునైన
నిచ్చుటయ లెస్స యడిగిన యెడ నృపాల! – తిక్కన

**భావం :** తనకున్నది కొంచెమే అయినా మరొక ప్రాణితో దాన్ని పంచుకొని అనుభవించటం మేలైన పద్ధతి. కార్యాలు సాధించే క్రమంలో కలిగే శారీరక కష్టం, మానసిక వేదన సహించి, శ్రమించి పొందే అల్పసుఖమే అయినా సంతృప్తిగా అనుభవించడం హితకరం. అడిగినవాడు శత్రువైనా కోరిన దానిని ఇవ్వటమే మంచిది.

**సూక్తి : జీవులన్నిటిపై జాలి చూపిన వాడే గొప్పవాడు – బుద్ధుడు**

### ఈ పాఠంలో నేర్చుకున్నవి

1. నాకు నచ్చిన అంశం ..................................................................
2. నేను గ్రహించిన విలువ ..................................................................
3. సృజనాత్మక రచన ..................................................................
4. భాషాంశాలు ..................................................................

మాతృదేవో భవ ! పితృదేవో భవ ! ఆచార్యదేవో భవ ! అతిథిదేవో భవ ! –ఉపనిషత్‌సూక్తి

**ఉపాధ్యాయులకు సూచనలు :**

1) ఈ పాఠాన్ని విద్యార్థులచే నాటకీకరణ చేయించండి.

2) రంతిదేవుని వృత్తాంతాన్ని పిల్లలకు వివరించండి.

3) భారతంలో చిన్న కథలు – పుస్తకంలోని కథలు చదివించండి.

## మేటి పద్యం

*కూటికిఁ గాకులు కూసెను*

*వేటావల మూఁకగూడి ! యేడువ దొడగెన్*

*కాటికిఁ గుఱ్ఱలు చేరెను*

*తేటవరపు పోతరాజు ! లేఁడా ! లేఁడా !*

*– హాస్యకదంబం నుండి సేకరణ*

## పాఠాంత అంశము

### వెదకబోయిన తీగ కథ

ఒక గ్రామంలో ఒక ధనవంతుడు ఉండేవాడు. అతడు ధనంలో కుబేరుడంతటివాడు. ఒకసారి అతని వీపులో చిన్న గాయం అయ్యి పుండుగా మారింది. మొదట ఆయన తనకు తెలిసిన చిట్కా వైద్యాలు ఎన్నో చేశాడు. కానీ,ఏ మాత్రం తగ్గకుండా  ఆ పుండు మరింత పెద్దదయింది.

ఆ ధనవంతునికి ఒక కొడుకున్నాడు. తండ్రి పుండును మాన్పించేందుకు ఎంతో మంది వైద్యులను రప్పించి వైద్యం చేయించాడు. ఫలితం దక్కలేదు. వీపులో పుండు ఎప్పటిలాగే ఉండి ఆయన్ను తీవ్ర అస్వస్థతకు గురి చేయసాగింది. పెద్ద పెద్ద వైద్యులు సైతం ఆ పుండును మాన్పించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

ఇదిలా ఉండగా ఒకరోజు ఆ ఊరికి ఒక మునీశ్వరుడు వచ్చాడు. ఆయన ఎంతో మహిమ కలవాడని విన్న ధనవంతుని కొడుకు ఆయన్ను కలుసుకొని తన తండ్రి విషయం చెప్పి "మీరు తపస్సంపన్నులు  ఎలాగైనా మా తండ్రిగారి పుండును మాన్పించి ఆయన బాధను నివారించండి" అని వేడుకున్నాడు. మునీశ్వరుడు సరేనని అతనితో ఇంటికి వెళ్ళాడు. చాలా సేపు ధనవంతుని పుండును పరిశీలించి  ఈ పుండు మామూలు ఔషధాలకు లొంగేది కాదు. దీన్ని నయం చేయడానికి ఒక తీగ ఆకులు పనిచేస్తాయి. సాధారణంగా ఆ తీగ దట్టమైన అడవులలోను, పర్వత ప్రాంతాలలోను లభిస్తుంది. ఆ తీగ ఆకులను తెచ్చి వాటి పసరును పుండు మీద  పోస్తే కొద్దిరోజుల్లోనే మానిపోతుందని చెప్పి, ఆ తీగ ఆకులు ఎలా ఉంటాయో,దానిని ఎలా గుర్తించాలో వివరంగా చెప్పాడు.

ధనవంతుని కుమారుడు ఆ తీగ  ఆకులను తీసుకొని రావడానికి ప్రయాణమయ్యాడు. తనకు కావలసిన ఆహార పదార్థాలను సమకూర్చుకొని, మునీశ్వరుని ఆశీర్వాదం పొంది బయలు దేరాడు. ఇంటి నుండి కొంత దూరం వెళ్ళాడు. అక్కడ అతనికి రెండు వైపులా దట్టంగా పెరిగిన మొక్కలు కనిపించాయి. అతడు వాటి మధ్య నుండి ముందుకు నడుస్తుండగా అతని కాలికి ఏదో తీగ చుట్టుకొంది. వెంటనే అదుపు తప్పి దభీలుమని కింద పడిపోయాడు. తన కాలికి తగిలిన ఆ తీగను పరిశీలనగా చూశాడు. మునీశ్వరుడు  చెప్పిన ఆనవాళ్లకు ఆ తీగ సరిగ్గా సరిపోయింది. వెంటనే ఆ తీగను తీసుకొని వెనక్కి వెళ్లి మునీశ్వరునికి  విషయం చెప్పి ఆ తీగను చూపించాడు. అప్పుడు మునీశ్వరుడు "మనకు కావలసిన తీగ  ఇదే ! నువ్వు "**వెదకబోయిన తీగ నీ కాలికే తగిలింది**"అని ఆ తీగ ఆకుల  పసరుతో ధనవంతుని పుండుకు  చికిత్స చేశాడు. వారం రోజుల్లోనే ధనవంతుడు కోలుకున్నాడు. పుండు మానిపోయింది. అప్పటినుండి "**వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు**" అన్న సామెత వాడుకలోకి వచ్చింది.

14

# కళా వారసత్వం

Q9Z7W2

భారతదేశం కళలకు పుట్టినిల్లు, ఆ కళలలో మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి. **భిన్నత్వంలో ఏకత్వం** కలిగిన విశిష్టదేశం భారతదేశం. ఆ విశిష్టతే ప్రపంచదేశాలలో భారతదేశాన్ని ప్రత్యేక స్థానంలో నిలబెట్టింది. భారతదేశపు గొప్ప వైవిధ్యాన్ని అన్ని రాష్ట్రాల ప్రజలు అవగాహన చేసుకోవాలి. అన్ని ప్రాంతాల ఆచారాలను అభినందించాలి. దాని కోసం రూపొందిన కార్యక్రమం '**ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్**'. ఇది జాతీయతా భావాన్ని పెంపొందిస్తుంది. భారతదేశ సమగ్రతను, ఐక్యతను బలోపేతం చేస్తుంది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల కళాసంప్రదాయాల్ని తెలుసుకోవాలి. కళలు అరవైనాలుగు రకాలు. ఈ కళలలో కొన్ని శాస్త్రీయకళలయితే కొన్ని జానపద కళలు. వీటిలో అయిదింటిని లలితకళలుగా పేర్కొంటారు. అవి చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, సాహిత్యం, నాట్యం. లలిత కళలు మనిషికి అలౌకిక ఆనందాన్ని కలిగిస్తాయి. మనిషిని ఉన్నత స్థితికి నడిపిస్తాయి. అటువంటి లలితకళలలో, సంగీత సాహిత్యాల సమాహారకళగా విరాజిల్లుతున్నది నాట్య కళ. ఇది మన కళాసంస్కృతికి సమున్నత స్థానం కల్పించింది. కుల, మత, ప్రాంతీయాలకు అతీతంగా నిలుస్తోంది. జాతీయసమైక్యతను చాటి చెబుతోంది. కొన్ని నాట్యరీతులు మనదేశంలో ఎక్కడ ఉద్భవించాయో నేటి తరం తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉంది. ఈ కళావారసత్వమే భారతీయులకు నిజమైన ఆస్తిపాస్తులు. ఈ కళారూపాల వలన విజ్ఞాన సంపద, ఆధ్యాత్మిక ఔన్నత్యం తెలుస్తాయి. మన రాష్ట్రశాస్త్రీయ నృత్యం అయిన కూచిపూడి గురించి గత తరగతులలో తెలుసుకున్నాం. ఇప్పుడు ఇతర రాష్ట్రాలలో నాట్యరీతుల గురించి తెలుసుకుందాం. **ఏప్రిల్ 29వ తేదీని అంతర్జాతీయ నృత్యదినోత్సవంగా జరుపుకొంటాం.**

## భరతనాట్యం



భారతదేశంలో అతి ప్రాచీనమైన నృత్యం భరతనాట్యం. ఇతర శాస్త్రీయ నృత్యాలకు తల్లివంటిది. ఇది తమిళనాడులో ఆలయ నృత్యం నుండి ఉద్భవించిన నృత్యరూపం. భరతముని పేరుతో పుట్టి ప్రసిద్ధి గాంచినది భరతనాట్యం.

తమిళనాడు తంజావూరులో నట్టువనార్లు, దేవదాసీలు ఈ కళకు పోషకులుగ చెబుతారు. భ- భావం, ర-రాగం, త- తాళం అనే మూడు ప్రాథమిక నృత్య కళాంశాలను భరతనాట్యం చక్కగా మేళవిస్తుంది. ఇందులో నృత్యభంగిమలతో పాటు 64రకాల, హస్త, పాదకదలికలు ఉన్నాయి. పురాతన దేవాలయాల మీద శిల్పాలు భరతనాట్య భంగిమలలో నాట్యం చేస్తున్నట్లుగా ఉంటాయి. కాంచీపురం శివాలయంతో పాటు, అనేక పురాతన హిందూ దేవాలయాల పై వివిధ భంగిమలలో శివుని శిల్పాలు తీర్చిదిద్దబడి ఉన్నాయి. చిదంబరంలోని

నటరాజ దేవాలయంలో తూర్పు రాజగోపురం 108 భరతనాట్య భంగిమలను వర్ణించే శిల్పాలతో విరాజిల్లుతోంది. వీటిని నాట్యశాస్త్రంలో కరణాలుగా సూచిస్తారు. బాదామీ గుహలలో శివుని శిల్పానికి ఉన్న 18 చేతులు భరతనాట్యం లోని హస్తముద్రలను తెలియజేస్తాయి. నాట్యశాస్త్రం ప్రకారం భరతనాట్యం మూడువిధాలుగా ఉంటుంది. అవి నృత్తం, నృత్యం, నాట్యం. **నృత్తం** అంటే శరీర అవయవాల కదలిక. **నృత్యం** అంటే రస భావాలతో అభినయ ప్రధానమైన నర్తనం. **నాట్యం** అంటే నృత్త, నృత్య సమ్మేళనం. అవయవాల ద్వారా అభినయం చేస్తూ ప్రేక్షకులకు తాము ప్రదర్శించే విషయాలను అర్థమయ్యేలా చూపడమన్నమాట.

దేవదాసీలు అనే ఆలయనృత్యకారిణులు ఈ నృత్యం ప్రదర్శించేవారు. దేవదాసీ అంటే భగవంతునికి దాసీలు లేదా సేవకులుగా అంకితం చేయబడినవారు. భరతనాట్య నర్తకి వస్త్రధారణ హిందూ వధువు మాదిరిగా ఉంటుంది. ప్రత్యేక పద్ధతిలో చీర ధరిస్తారు. సంప్రదాయ ఆభరణాలతో అలంకరించుకుంటారు. కళ్ళకు కాటుక, అభినయించడానికి తగినట్లు తీర్చుకుంటారు. లయబద్ధంగా నర్తించడానికి కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు. చేతులకు గోరింటాకు, కాళ్లకు పారాణితో శోభిల్లుతూ, ఆహార్యం తోనే ఆకట్టుకునే విధంగా అలంకరణ ఉంటుంది. భరతనాట్యానికి సంగీతం కర్ణాటక శైలిలో ఉంటుంది. 1798 నుండి 1832 వరకు తంజావూరును పాలించిన సర్ఫోజీ కాలంలో పోనయ్య, వడివేలు, శివానందం, చిన్నయ్య అనే నలుగురు నట్టువనార్లు ఆధునిక భరతనాట్యాన్ని రూపొందించారు.

పాశ్చాత్యుల వలసలతో క్షీణించిన ఈ నాట్యకళకు శాస్త్రీయ కళాకారుడైన 'కృష్ణయ్యర్' మద్రాస్‌లో మ్యూజిక్ అకాడమీని స్థాపించి, భరతనాట్యానికి తిరిగి జీవం పోశారు. భరతనాట్యంలో ప్రఖ్యాతి గాంచిన నాట్యగురువు 'మీనాక్షి సుందర పిళ్ళై'. అతని శిష్యులలో ఒకరైన 'రుక్మిణీదేవి అరుండేల్' శాస్త్రీయ నృత్యపునరుద్ధరణకు కృషి చేశారు. ఆమె అనేక భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చారు. ఎన్నో జాతీయ అవార్డులను, పద్మ విభూషణ్ పురస్కారాన్ని పొందారు. భారతీయ శాస్త్రీయ నృత్యాలు నేర్చుకోవడానికి వచ్చిన అమెరికన్ డ్యాన్సర్ '**ఎస్తేరు షర్మాన్ గారు తన పేరును రాగిణి దేవిగా మార్చుకొని**' భరతనాట్యాన్ని అంతర్జాతీయంగా విస్తరింపచేయడానికి కృషి చేస్తున్నారు.

బాల సరస్వతి, మృణాళినీ సారాభాయ్, పద్మా సుబ్రహ్మణ్యం, అలార్మెల్ వల్లి, యామినీ కృష్ణమూర్తి, అనిత రత్నం వంటి భరతనాట్య కళాకారులు వారి ప్రదర్శనలతో భరతనాట్యాన్ని విశ్వవ్యాప్తం చేశారు.

## భాంగ్రా నృత్యం




అబ్ అంటే నది. పంచ అంటే అయిదు. జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ అనే ఐదు నదులు ప్రవహించే ప్రదేశం కాబట్టి పంజాబ్ అని పేరు వచ్చింది. పంజాబ్ వ్యవసాయానికి చాలా అనువైన ప్రాంతం. అక్కడ ప్రజలు ఎక్కువగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తారు. వీరు పంట రాబడి ఆనందంలో ఈ నృత్యం చేస్తారు.

పంజాబులో పుట్టిన రైతుల నృత్యం భాంగ్రా. భాంగ్రా అనేది పంజాబ్ లో వివిధ జానపద నృత్యాల సమ్మేళనంగా చెప్పవచ్చు. సింధు నాగరికత ప్రాంతంలో పుట్టిన అతిప్రాచీన నృత్యం భాంగ్రా. 'భాంగ్రా' జననాట్యంగా పిలవబడుతుంది. బాధలు అన్నీ మరిచిపోయి చేసే నృత్యంగ భాంగ్రాని పేర్కొంటారు. ఈ నాట్యం చేస్తున్నప్పుడు ప్రతి ఒక్కరూ ఇది నా నాట్యం అని భావిస్తూ చేస్తారు. పంజాబులోని కథలను వివరించే చిన్నపాటలకు సైతం ఈ నృత్యం చేస్తారు. భాంగ్రా

పాటలు ప్రేమ, దేశభక్తి, పండగల ఇతివృత్తాన్ని కలిగి ఉంటాయి. ఈ నృత్యాలలో 'సమ్మి', 'ఝుమ్మర్', 'లుడ్డీ', 'గిద్ద','ధమాల్' 'సియాల్కోటి' వంటి విభిన్న రీతులున్నాయి. ఝుమ్మర్, ధమాల్ నృత్య రీతులను ప్రామాణిక భాంగ్రాగా పేర్కొంటారు. సియాల్కోటి నృత్యం ఒంటి కాలితో ప్రదర్శింపబడుతుంది.

జలియన్ వాలాబాగ్ సంఘటన దేశాన్ని స్వాతంత్ర్యంవైపు కదంతొక్కించింది. దేశం అంతటా భాంగ్రానృత్యం ద్వారా స్వాతంత్ర్యకాంక్ష రగులుగొల్పారు. ఈ విధంగా భాంగ్రా చురుకుగా వ్యాప్తి చెందింది. భాంగ్రా లో డోలు వాయిద్యానికి ప్రత్యేక స్థానం ఉంది. డోలు రెండు వైపులా భాంగ్రా బీట్‌ను సృష్టిస్తుంది. భాంగ్రా నృత్యకారులు రకరకాల రంగురంగుల దుస్తులు ధరిస్తారు. మగవారు తలపాగా, ఆడవారు చున్నీ తప్పనిసరిగా ధరిస్తారు. భాంగ్రా నృత్యంలో రుమాలు ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. రుమాలు మణికట్టు చుట్టూ సంప్రదాయకంగా కట్టబడి ఉంటుంది. రుమాలు చేతికదలిక తెలియజేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తుంది. విదేశాలలో స్థిరపడిన పంజాబీలు భాంగ్రాను ప్రపంచవ్యాప్తంగా విస్తరింప చేశారు. పాశ్చాత్యసంగీతంలో సైతం భాంగ్రా ప్రభావాన్ని చూపిందని చెప్పవచ్చు. లండన్‌లో భాంగ్రా సంగీతం బాగా ప్రాచుర్యం పొందింది. ఉత్తరఅమెరికా అంతటా ప్రత్యేకమైన భాంగ్రా పోటీలు జరిగాయి. ఈ విధంగా భాంగ్రా విదేశాలలో సైతం జనాదరణ పొందింది. భాంగ్రాలో ఆడవారి నాట్యాన్ని **'గిద్ద'** అని అంటారు. మొదట ఈ నాట్యాన్ని మగవారు మాత్రమే చేసేవారు. ఇప్పుడు స్త్రీలు కూడా చేయడం వల్ల 'భాంగ్రా' 'గిద్ద' అని వేరుచేయడం జరిగింది. పంజాబ్‌లో పుట్టిన భాంగ్రా ప్రపంచం మొత్తాన్ని ఉర్రూతలూగిస్తున్నది.

## కథాకళి



ఇతిహాస కథలను ఆడుతూ చెప్పే నృత్యమే కథాకళి. నృత్యంగా కథాకళిలో ప్రతి భావం మానవ ప్రవర్తనను మార్చడానికి, ఆధ్యాత్మికతను సాధించడానికి వేదికవుతుంది. కథాకళి సంస్కృత కావ్యాలలో దాగిఉన్న రహస్యాన్ని వెలికితీసింది. ఈ రహస్యాన్ని విస్తృత సమాజానికి అందుబాటులోకి తెచ్చింది. కేరళ రాష్ట్రానికి చెందిన శాస్త్రీయ నాట్యకళారీతి కథాకళి. కథ అంటే కథ, కళి అంటే ఆట. కథల ఆట అని చెప్పవచ్చు.

17 శతాబ్దానికి చెందిన వెట్టత్తురాజు కథాకళికి మెరుగులు దిద్దారు. రాజు కథాకళికి ముఖ్యమైన ఘట్టాలను పరిచయం చేశాడు. కొట్టారక రాజు ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించే నాటకాలను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ విధంగా ఇతిహాసాలలో పవిత్రకథలు ప్రజలకు చేరువయ్యాయి. 17వ శతాబ్ది చివరిలో 'కళియోగం' అనే కథాకళి బృందాలు స్థాపించబడ్డాయి. ఈ బృందాలు కేరళలోని దేవాలయాలలో కథాకళి నృత్య రూపకాన్ని ప్రదర్శించేవి.

ఇందులో కళాకారులు రామాయణం, మహాభారతం మొదలైన ఇతిహాసాల నుంచి, పురాణాలనుంచి పాత్రలను ప్రదర్శిస్తారు. కళాకారులు ధగధగ మెరిసే ఆభరణాలు, కిరీటాలు, దుస్తులతో ఆకట్టుకుంటారు. వివిధ రకాలైన పాత్రలకు వివిధ సంకేతాలతో కూడిన మేకప్ వేసుకుంటారు. మానవులు, దేవతలు, రాక్షసులు మొదలయిన రూపాలను ప్రదర్శించడానికి వివిధ రకాలైన దుస్తులను, అలంకరణ సామగ్రిని వాడతారు. **ఈ కళ కున్న ప్రత్యేకత ఏమిటంటే కళాకారులెవరూ నోరు తెరిచి మాట్లాడరు**. కథనంతా హావ భావ ప్రకటనల తోనూ, చేతి సంజ్ఞలతోనూ ప్రకటింప చేస్తారు. ముఖంలో కనిపించే చిన్న, పెద్ద కదలికలు, కనుబొమలు, కను గుడ్లు, ముక్కు, చెంపలు, గడ్డం మొదలైన వాటిని సూక్ష్మంగా నేర్పుగా కదలిస్తూ వివిధ భావాలను ప్రకటిస్తారు. భావ ప్రకటన ఆవశ్యకతను బట్టి ఏ అవయవాలను కదిలించాలన్నది ప్రదర్శించడానికి వివిధ రకాలైన దుస్తులను, అలంకరణ సామగ్రిని వాడతారు.

300 సంIIరాలు  కథాకళికి బాసటగా నిలిచిన 'నంబూద్రి' కుటుంబానికి చెందిన ఓలప్పమన్న ఈ కళకు ఆదరణను పెంచారు. కథాకళి యొక్క సంస్కృతిని పాశ్చాత్యులకు అందించడానికి బార్బరా విజయకుమార్, కళామండలం విజయకుమార్ కలసి "కళా చేతన కథాకళి" అనే సంస్థను స్థాపించారు. – బ్రిటన్ లోని అన్ని వయసులవారికి శాస్త్రీయ కథాకళిని అందించడానికి వారు 30 సంవత్సరాలు కృషిచేసారు.కథాకళిలోని అద్భుతమైన దుస్తులు, అలంకరణతో కథాకళి ప్రత్యేకమైనదిగా చెప్పవచ్చు. సున్నితమైన గానంతో, శక్తిమంతమైన నటనతో ప్రపంచం నలుమూలలు ఆకర్షించే విధంగా అలరారుతోంది కథాకళి.

V4K5V6

## గుస్సాడి నృత్యం

రాజగోండులకు దీపావళి పెద్ద పండుగ. చలికాలం ప్రారంభమయ్యేసరికి పంటలన్నీ చేతికి వచ్చి వుంటాయి. తాము చెమటోడ్చి చేసిన కష్టం, ధాన్యలక్ష్మిగా నట్టింట చేరి వుంటుంది. గోండులందరూ ఆటపాటలతో కాలక్షేపం చేసే రోజులు ప్రారంభమౌతాయి. రకరకాల వస్త్రాభరణాలు వేసుకుని, యువజనులు సంగీత వాయిద్యాలతో అతిథులుగా పొరుగు గ్రామాలకు తరలి వెడతారు. కొమ్ములూదుతూ. తప్పెట్లు వాయిస్తూ



యాత్రలు సాగిస్తారు. గోండుల పురాణ గాథలలోని "దండారియారౌడ్, సిసిసెర్మారౌడ్" అనే కథానాయకులను అనుసరిస్తూ ప్రతి సంవత్సరం నృత్యాలు చేస్తారు.

గోండు యువకులు 20 నుంచి 40 మంది దాకా చేరి చేసే దండారీ నృత్యంలో గుస్సాడి నృత్యం ఒక భాగం. దీపావళి నెలలో సంప్రదాయ పద్ధతిలో ఈ నృత్యం జరుగుతుంది. పౌర్ణమినాడు. కార్యక్రమం ప్రారంభమౌతుంది. చతుర్దశి వరకూ జరుగుతుంది. గుస్సాడి నర్తకునికి కావలసిన సామగ్రిలో ముఖ్యమైనది నెమలిపింఛంతో తయారుచేసిన తలపాగా. ఇందులో గొఱ్ఱెపోతు కొమ్ములను కూడా అమర్చుతారు. కృత్రిమ గడ్డాలు, మీసాలతో వేషం కడతారు. మేకతోలు కప్పుకుంటారు.ఇక వాయిద్యాలు, డప్పు, తుడుము, పిపే, బాకా, కలికొయ్ (తప్పెట) మొదలైనవి బృందానికి హుషారునిస్తాయి. సంగీతవాయిద్యాలను, గుస్సాడి నృత్యపరికరాలను గోండులు పరమపవిత్రంగా భావిస్తారు. నాట్యారంభానికి ముందు వాటికి పూజ చేస్తారు.

లయబద్ధమూ, క్రమబద్ధమూ అయిన దండారి నృత్యం గుస్సాడి నృత్యంలో భాగం. దండారి నృత్యం చేస్తున్న బృందంలోకి గుస్సాడి బృందం అకస్మాత్తుగా ప్రవేశిస్తారు. గోండు భాషలో గుస్సాడి అంటే 'అల్లరి' అని అర్థం. దండారి బృందం వలయం లోపలి వైపుకు తిరిగి నిలుచుంటారు. ఎడమవైపుకు నెమ్మదిగా అడుగులు వేస్తూ, అడుగులు వేసినప్పుడల్లా కుడి పాదాన్ని ఎడమకాలు మీదికి వూగిస్తుండడంతో నృత్యం ప్రారంభమౌతుంది. ప్రతినర్తకుని చేతిలో రెండు కోలాటం కర్రలు వుంటాయి. నర్తకులు తమ చేతుల్లోని రెండు కర్రలను ఒకదానితో మరొకదానిని తాకిస్తారు. తరువాత కుడివైపున వున్న నర్తకుని కర్రను కొడతారు. ఇలా అడుగులువేస్తూ, కోలాటమాడుతూ, నర్తకులందరూ వంగి

కర్రలను నేలకి తాకించి, నాలుగుదిక్కులకు అడుగులు వేస్తారు. దేవతలందరికి ప్రణమిల్లడానికి ఇలా నాలుగు దిక్కులకు అడుగులు వేస్తారు. దేవతలకు మ్రొక్కిన తరువాత వలయాన్ని సరిచేసుకుని, కర్రలను పాదాల వద్ద వుంచి, పాటకు అనుగుణంగా చేతులతో చప్పట్లు కొడతారు. ఒక బృందం చరణాన్ని ముగించగానే రెండవ బృందం రెండవ చరణాన్ని అందుకుంటూ బృందగానం చేస్తారు.

పై విధంగా దండారీల నృత్యం కొనసాగుతుండగా నలుగురైదుగురు గుస్సాడీలు హఠాత్తుగా దండారీల వలయంలోకి చొచ్చుకొని వస్తారు. మెడలో గవ్వల హారాలూ, తుంగకాయల హారాలూ వుంటాయి. నడుముకు, మణికట్టుకూ చిరు గజ్జెలు వుంటాయి. కంటి చుట్టూ తెల్లరంగు పూసుకుంటారు. మొలకు నారింజరంగు లంగోటీలు ధరిస్తారు. గుస్సాడీల వేషం ఆకర్షణీయంగా వుంటుంది. శరీరంపైన నలుపు చారల చుక్కలతో వింతవింత అలంకరణలు వుంటాయి. గుస్సాడీలు ప్రవేశించగానే దండారీలు చెల్లాచెదురౌతారు. ఇది ప్రేక్షకులకు ఎంతో వినోదాన్ని కలిగిస్తుంది.

## ఒడిస్సీ నృత్యం



ఒడిస్సీ నృత్యం భారతీయ శాస్త్రీయ నృత్య రూపాలలో ఒకటి. ఇది తూర్పు భారతదేశంలోని ఒడిశా రాష్ట్రంలో పుట్టింది. క్రీ.పూ 2వ శతాబ్దంలో ఖారవేలుని పరిపాలనలో ఒడిస్సీ నృత్యం ఎక్కువ పోషింపబడినట్లు ఉదయగిరిలోని హాతిగుంఫా శాసనం ద్వారా తెలుస్తుంది. ఒడిస్సీ నృత్యకారులు నాట్యశాస్త్రం నుండి పుట్టిన అతిప్రాచీన నృత్యం ఒడిస్సీ అని చెబుతారు. రాణిగుంఫా గుహలో రాతిఫలకంలో నృత్యం చేస్తున్న పురుషులు, స్త్రీల వర్ణనలు చెక్కబడ్డాయి. ఈ వర్ణనలు ఒడిస్సీ నృత్యం పురాతనమైనదని ఋజువు చేస్తున్నాయి.

పూరీ జగన్నాథుని ఆలయంలో వివిధ రకాల ఆరాధనల్లో మహరీ నృత్యాలు ఉన్నాయి. 'మహరీ' అనే పదాన్ని 'దేవదాసీ' పదానికి పర్యాయపదంగా చెప్పవచ్చు. ఎనిమిది, తొమ్మిదేళ్ళ వయసున్న బాలికలు గురువుద్వారా నృత్యంలో శిక్షణ పొందుతారు. తర్వాత "చీర బందన్" అని పిలవబడే వేడుక ద్వారా మహరీలు ఆలయ నృత్యం ప్రదర్శించడం మొదలు పెడతారు. మహరీలు నృత్యం దేవుని సేవగా భావిస్తారు. జయదేవుడు రాసిన గీతగోవిందం లోని పాటలకు మహరీలు నృత్యం చేసేవారు. 1950 వరకు ఈ నృత్యం ఏ రంగస్థలంపైనా ప్రదర్శింపబడలేదు.

ఒడిస్సీ చరిత్రలో మరొక ముఖ్య సంప్రదాయం "గోటిపువాస్". "గోటిపువా" అంటే బాలుడు అని అర్థం. మొక్కులు చెల్లించడం కోసం ఈ గోటీపువాలు గానం, నృత్యం ద్వారా దేవతలకు కృతజ్ఞతలు తెలుపుతారు. గోటిపువాలు స్త్రీలవలె దుస్తులు ధరించి బృందాలుగా ఆలయం బయట నృత్యం చేస్తారు. గోటిపువా సంప్రదాయంలో శిక్షణ పొందినవారు తర్వాత ఈ నాట్యానికి గురువులుగా వ్యవహరిస్తారు. 1950 సం.లో కొందరు పండితులు, గురువులు

ఈ నృత్యాన్ని రంగస్థలం పైకి ప్రదర్శనగా తీసుకురావడానికి ఒక సంఘాన్ని స్థాపించారు. ఆ సంఘాన్ని 'జయంతిక' అని పిలుస్తారు. పంకజ చరణ్ దాస్, కేలు చరణ్ మోహపాత్ర, దేబా ప్రసాద్ దాస్, మయాధర్ రౌత్, రఘునాథ్ దత్త ఈ 'జయంతక'లోని ముఖ్యులుగా పని చేశారు. వీరు ఒడిస్సీకి శాస్త్రీయ గుర్తింపుకోసం కృషి చేసారు.

ఒడిస్సీ నృత్యంలో 'పంకజ్ చరణ్ దాస్' ఆది గురువుగా గుర్తింపు పొందారు. కేలు చరణ్ మోహ పాత్ర తన శిష్యురాలు సంజుక్త పాణిగ్రాహితో కలసి ఒడిస్సీ ప్రదర్శనలను ఇచ్చారు. సంజుక్త ఒడిస్సీ నృత్యంలో జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలను పొందింది. దేబా ప్రసాద్ శిష్యురాలైన ఇంద్రాణీ రెహ్మాన్ అంతర్జాతీయంగా ఒడిస్సీ నృత్యాన్ని విస్తృతపరిచారు. కేలు చరణ్ మోహ పాత్ర విద్యార్థిని ప్రతిమ గౌరీ బెంగుళూరుకి దగ్గరలో హేసరఘట్టలో నృత్య గ్రామ్ స్థాపించారు. ఇలా జయంతకలోని ప్రతి ఒక్కరూ ఒడిస్సీ నృత్యాన్ని విస్తృత పరచడానికి కృషి చేసారు.

## హరికథ

సంగీతం, సాహిత్యం, నృత్యం, అభినయం మేలుకలయిక హరికథ, మహారాష్ట్రలో 17వ శతాబ్దంలో హరికథ పుట్టినట్లు తెలుస్తోంది. హరికథను మహారాష్ట్రలో అభంగ్, కేరళలో కథాప్రసంగం, కన్నడంలో కీర్తన కాలక్షేపం, బెంగాలీ కీర్తన, తమిళంలో హరికథా కాలక్షేపం, తెలుగులో హరికథ అనీ అంటారు. హరికథాగానం చేసేవారిని కథకుడు, కథాగానపరుడు, కథా ప్రసంగి, భాగవతార్, హరిదాసు, దాసు అనే పేర్లతో పిలుస్తారు.



ఒకే వ్యక్తి కథ నిడివిబట్టి మూడు గంటల పాటు చేసే కథాగానమే హరికథ. కథకుడు అన్ని రకాల పాత్రల్లో జీవిస్తూ ప్రేక్షకులను శ్రోతలను మెప్పిస్తాడు కనుకనే హరికథ సమాహార కళారూపం. కథకుడు ఆకర్షణీయమైన ఆహార్యంతో ఏకకాలంలో గొంతుతో వాచికం, గానం, సాత్త్వికం, కాలితో నృత్యం, చేతులతో ఆంగికం గుప్పిస్తూ అభినయిస్తాడు.

చేతిలో చిడతలు, కాలికిమువ్వలు, పట్టుపంచె కట్టు, నడుముకి బిగించి కట్టిన పట్టుకండువ, మెడలో పూలకండువా ధరించి, ఆడుతుపాడుతూ అలరిస్తారు. నిర్వాహకుల ఆర్థిక స్థితిని బట్టి వయోలిన్, హార్మోనియం, తబల, మృదంగం, వీణ, కంజీర మొ॥న వాటిని సహకార వాద్యాలుగ చేసుకొని సందర్భానుసారంగ పాత్రోచితంగ కథ చెప్తారు. సంగీత సాహిత్యాలతో పాటు, అభినయ పూర్వకంగా కథలోని వస్తువు (కథావిషయం)ను బట్టి భక్తిని, విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించగలవాడు ఉత్తమ హరికథకుడు. ఆదిభట్ల నారాయణదాసు హరికథా పితామహునిగా పేరొందారు.

కథకుడు వాయిద్యగాళ్ళ మధ్య వేదికపై పద్మాసనం వేసుకొని కూర్చుని సభారంగం శాంతికై ఇష్టదేవత, గురుస్తుతులతో ప్రారంభిస్తాడు. హరికథ నేటి మానవునికి హరిభక్తిని మాత్రమేకాక అనేక విషయాలను బోధించేదిగ ఉండి, పరిష్కారమార్గాలను సూచించడం ద్వారా నిజమైన సామాజిక ప్రయోజనాన్ని సాధించగలుగుతోంది. హరికథ కేవలం భక్తిప్రబోధకమే కాక దేశభక్తి, సాంఘికదురాచారాలపై ధ్వజమెత్తే సామాజిక శక్తిగా ఎదిగి, జాతీయ సమైక్యత సాధన ప్రక్రియగ కూడా ఉపయోగపడుతోంది.

హరికథావాఙ్మయం సమాజంలో అనేక సమస్యలను తనలో ఇముడ్చుకొని, వాటికి పరిష్కార మార్గాలను సూచిస్తూ, ప్రజలకు జ్ఞానబోధ చేస్తూ, కర్తవ్య పాలనచేసే సమయంలో నిస్సందేహంగా సానుకూల ప్రయోజనం సాధిస్తున్నది. హరికథా ప్రక్రియలోని మరో ప్రత్యేకత ఏమిటంటే అది సామాజికునితో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది. అందుకనే ఎన్నో సాహిత్యప్రక్రియలు సాధించలేని పరిష్కార మార్గ సూచిగా, సర్వకళల సమాహార రూపంగ హరికథ విలసిల్లుతున్నది. అటు పండితులకు ఇటు పామరులకు ఆమోదయోగ్యమైన ప్రక్రియ హరికథ. ప్రభుత్వ ప్రచార సాధనాలుగా వినియోగింపబడే ఎన్నో ప్రక్రియల కంటే అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాన్ని సాధించగలిగేది హరికథా ప్రక్రియ అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.



**కింది ప్రశ్నలకు పదివాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. కళల ద్వారా జాతీయ సమైక్యతను ఎలా సాధించవచ్చో వివరించండి.
2. భరతనాట్యం ఇతర నాట్యాలకు తల్లి వంటిది అని ఎలా చెప్పవచ్చు.
3. రైతుల నృత్యంగా ఆవిర్భవించిన భాంగ్రా అంతర్జాతీయంగా జనాదరణ పొందడాన్ని బట్టి నీవు ఏమి గ్రహించావు?
4. గుస్సాడీల నృత్యరీతిని గురించి రాయండి.
5. కథాకళి, ఒడిస్సి నృత్యరీతుల ప్రత్యేకతను వివరించండి.
6. హరికథ సామాజిక చైతన్యాన్ని ఎలా కలిగిస్తుందో రాయండి.

**మేటి పద్యం**

*గౌరవించుడు తల్లిదండ్రుల గౌరవించుడు పెద్దలన్*
*గౌరవించుడు సాటివారల గౌరవించుడు ఒజ్జలన్*
*గౌరవించుడు దేశమాతను గౌరవించుడు పద్యమున్*
*గౌరవంబున మిమ్మునెల్లరు కాంతురప్పుడె నిత్యమున్*

## అకారాది పట్టిక

**అ**

అంకురం = మొగ్గ తొడుగు, మొలక
అంచితం = పూజించబడినది
అంతస్తు = స్థాయి, మేడపై భాగం
అంబారి = ఏనుగు మీది పీఠం
అక్షరం = నాశనం లేనిది, నశింపనిది
అక్షరాలా = పూర్తిగా, ఉన్నది ఉన్నట్లుగా
అగడ్త = కందకం
అగ్రతాంబూలం = మొదటి గౌరవం
అణచివేయు = నొక్కిపట్టు,లొంగదీయు
అతి = ఎక్కువ
అతిథి = తిథి నియమం లేకుండా ఇంటికి భోజనానికి వచ్చేవాడు
అతివ = స్త్రీ
అద్భుతం = ఆశ్చర్యం, వింతైనది
అనఘుడు = పుణ్యాత్ముడు, పుణ్యుడు
అనర్గళం = ప్రతిబంధం లేనిది
అనాది = ఆదిలేనిది
అనిశము = ఎల్లప్పుడు
అనిలంబు = గాలి
అన్యథా = మరియొక విధంగా, వేరుగా
అభినందన = మెచ్చుకొనుట
అభిలాష = కోరిక
అభివాదం = పాద నమస్కారం
అమరుడు = మరణం లేనివాడు
అమూల్యం = వెలకట్ట వీలులేనిది
అయోమయం = ఏమి అర్థం కాని స్థితి
అరసి = విచారించి
అల్లన = మెల్లగా
అవధరించు = విను
అవశ్యం = తప్పకుండా, తప్పనిసరైనది
ఆటంకం = ఇబ్బంది కలగడం, అవరోధం

**ఆ**

ఆదరణ = గౌరవం
ఆదరువు = ఆధారం
ఆదేశం = ఆజ్ఞ
ఆప్యాయత = ప్రేమ
ఆలపించు = వినిపించు
ఆశువు = వేగం
ఆసరా = ఆధారం

**ఇ**

ఇంగలము = అగ్ని
ఇనుడు = సూర్యుడు

**ఉ**

ఉపక్రమించు= పూనుకొను
ఉల్లము = మనస్సు

**క**

కంఠతా = కంఠస్థం చేయు
కంఠము = గొంతు
కటాక్షం = దయ
కదన రంగం = యుద్ధభూమి
కనకం = బంగారం
కని = చూసి
కబళించు = మింగు
కరతలామలకం=సులువుగా అధీనమగునది
కరి = ఏనుగు
కర్మ = పని
కర్మభూమి = మానవలోకం
కలకలం = సందడి
కలవరపడు = కంగారుపడు
కలవారు = ధనవంతులు
కలిమి = సంపద
కళాభిజ్ఞులు = కళలలో నైపుణ్యం కలవారు, విద్వాంసులు
కాంక్ష = కోరిక
కాకతాళీయం = కాకి వ్రాలగా తాటిపండు పడిన విధం (హటాత్తుగా జరగుట)
కాననం = అడవి
కిటి = పంది
కుఠారం = గొడ్డలి
కుతూహలం = సంతోషం
కుద = తాకట్టు
కుదిరి = అనుకూలించి, అమరి,
కురులు = శిరోజాలు
కులుకు = ఒయ్యారములు పోవు
కృతార్థుడు = ధన్యుడు, కృతకృత్యుడు
కృప = దయ
కైమోడ్పు = నమస్కారం
కైత = కవనం
కొదమ సింగం = వయస్సులో ఉన్న సింహం.
కొద్ది = తక్కువ
కోటరము = తొర్ర
కోణం = అంచు, ఇంటిలో ఒక మూల
కౌముది = వెన్నెల
క్రీడలు = ఆటలు
క్షుణ్ణం = పూర్తిగా

**ఖ**

ఖగము = పక్షి

**గ**

గగనం = ఆకాశం
గర్జించు = పెద్ద ధ్వని చేయు
గర్భదరిద్రుడు = పుట్టుకతో బీదవాడు
గౌతమీ నది = గోదావరి

**ఘ**

ఘట్టం = భాగం, అంకం
ఘనసారం = కర్పూరం

**చ**

చక్రవర్తి = రాజులకు రాజు
చతురత = నేర్పు
చప్పున = వెంటనే
చమత్కారం = నేర్పు
చలనం = కదలడం
చాన = స్త్రీ
చిట్టడువులు = దట్టమైన అడవులు
చిహ్నం = గుర్తు
చూపరులు = చూసేవారు
చెండు = పూబంతి
చెక్కు చెదరకపోవడం = దెబ్బ తినకుండ
చెదిరి = పక్కకు వెళ్లి
చేలము = వస్త్రము

**ఛ**

ఛత్రం = గొడుగు

**జ**

జగతి = నేల
జలధి = సముద్రం
జడుడు = మూర్ఖుడు
జనం = ప్రజలు
జన్మము = పుట్టుక

జపం = ధ్యానం
జయించిన = గెలిచిన
జలదరించు = వణుకు
జలపాతం = నీరు ఎత్తుమీద నుండి కిందికి దూకడం
జిజ్ఞాస = తెలుసుకోవాలనే కోరిక
జోదులు = వీరులు, పరాక్రమవంతులు
టెలిగ్రాం = తంతి సమాచారం

**డ**

డస్సి = అలసిపోయి
డిగ్గవిడిచి = దిగవిడిచి

**త**

తక్కిన = మిగిలిన
తడయక = జాగుచేయక
తడిమి = తాకి
తబిసిపక్కి = తపస్సు చేసేపక్షి
తరుణం = సమయం
తర్ఫీదు = శిక్షణ
తార్కాణం = నిదర్శనం
తిన్నె = అరుగు, వేదిక
తిల్లిక = దీపం
తీర్థము = పుణ్యక్షేత్రం
తృప్తికరం = తనివి, తర్పణం
తృష్ణ = కోరిక
తెగటార్చు = నశింప చేయు
తెరువు = మార్గం
తెలివి = వివేకం
తెల్లబోవు = ఊహించని సమాచారంతో ఆశ్చర్యానికి లోనగు
తేజరిల్లు = ప్రకాశించు

**ద**

దండిగా = ఎక్కువగా
దర్శించడం = చూడడం
దారుణ = భయంకరమైన
దినచర్య = ప్రతిదినం చేసే పని
దివి = స్వర్గం
దివ్య = ప్రకాశించే, అలౌకికమైన
దుర్గం = కోట
దృఢ = గట్టి
ధృతి = ధైర్యం

**న**

నాట్య భంగిమ = నాట్యంలో శరీర విన్యాస రీతి
నామకరణం = పేరు పెట్టుట
నారి = స్త్రీ
నింద = దూషణ
నింపాది = నెమ్మది
నియంత = అధినాయకుడు
నియతి = నియమం
నిరంకుశులు = అదుపు లేనివారు
నిరర్థకం = పనికిరానిది
నిరాకరించుట = తిరస్కరించుట
నిర్జీవం = ప్రాణంలేని
నిలయం = స్థానం
నూతన = కొత్త
నెట్టడం = తోయడం
నెమ్మది = నింపాది
నెలకొను = కుదురుకొను

**ప**

పంక్తి = వరుస
పంచాక్షరి = ఐదు అక్షరాలు కలిగినది
పంచామృతం = ఐదు అమృతాలు (ఆవుపాలు, పెరుగు, నేయి, చక్కర, తేనె)
పక్షము = రెక్క
పగిది = విధము, రీతి
పట్టు = నెలవు
పథం = త్రోవ
పదిలం = జాగరూకత
పన్నగం = పాము
పల్లవితం = చిగురించు
పరవశించు = మైమరచు
పరిణామం = మార్పు
పరువము = వయసు
పలాయనం = పారిపోవు
పల్లవించు = చిగురించు
పస్తులు = ఉపవాసం
పాండిత్యం = పండితుని లక్షణం
పాదుకొల్పు = నెలకొల్పు, ప్రారంభించు, స్థాపించు,
పాపుట = పోగొట్టుట
పారితోషికం = బహుమానం
పాసి = వదిలి
పాపి = పోగొట్టి
పితామహుడు = తాత, తండ్రికితండ్రి
పినాకపాణి = శివుడు
పునీతం = పవిత్రం
పురసత్తు = అవకాశం
పులుముకొను = రుద్దు, నలుపు
పూప వయస్సు = బాల్యం
పూరణ = పూర్తిచేయు
పొంత = పక్క
పొదిగిన = అమర్చిన
పోరు = యుద్ధం
ప్రణామం = నమస్కారం
ప్రతిభ = ప్రజ్ఞ
ప్రతిమ = బొమ్మ
ప్రవర్తన = నడవడిక
ప్రాక్తనము = పురాతనం
ప్రాచీనం = పురాతనం

**బ**

బత్తెం = కూలి, భోజనంకై ఇచ్చే ద్రవ్యం
బహూకరించు = సన్మానించు
బాటసారి = దారిన నడచువాడు
బాసాడి = మాట్లాడి,
బాహుదర్పము = భుజబలం
బుధకోటి = పండితుల సమూహం
బృందం = సమూహం
భద్రగజం = పట్టపు ఏనుగు
భరతావని = భారతదేశం
భవిత = భవిష్యత్తు
భవ్య చరితం = శుభమైన కథ
భుక్తి = భోజనం
భూషణం = అలంకారం

**మ**

మందం = లావు
మందిరం = ఇల్లు
మక్కువ = ఇష్టం
మట్టం = అడుగు భాగం
మణి = విలువైన ఒక రాయి

మణిపూస = శ్రేష్ఠమైనది
మది = మనస్సు
మథించు = చిలుకు
మనోహరం = అందమైన
మహాత్ముడు = గొప్పవాడు
మహిమ = గొప్పదనం
మహీరుహం = చెట్టు
మహోన్నత = గొప్ప
మాధుకరం = భిక్షా వృత్తి
మాధురి = తియ్యదనం
మాధుర్యం = తియ్యదనం
మానాథుడు = లక్ష్మీపతి
మార్గం = దారి
మిరుమిట్లు = కాంతి
ముక్తకంఠం=ఒకే అభిప్రాయంతో పలకడం
ముగించు = పూర్తి చేయు
మూగడం = గుమిగూడడం
మూర్ఖం = అవివేకం, మొండితనం
మేత = పశువుల ఆహారం
మేను = శరీరం
మేలి ఘటనలు = గొప్పవైన సందర్భాలు
మైలు = 1.6 కి.మీ

**య**

యుగయుగములు = చాలాకాలం నుండి
యుద్ధ పటిమ = యుద్ధంలో నేర్పు

**ర**

రంజింపచేయు = ఆనందింపచేయు
రతనాల సీమ = రాయల సీమ
రమారమి = దాదాపు
రసభరితం = రసముతో నిండినది
రాగ సుధ = గానామృతం
రేయి = రాత్రి

**వ**

వక్కాణించు = నొక్కిచెప్పు
వడి = వేగం
వదరు = ఎక్కువగా మాట్లాడు.
వదావదులు = వక్తలు
వనిత = స్త్రీ
వల్లభ = భార్య
వల్లించడం=చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పడం
వాడుక = ఉపయోగం
వాత్సల్యం = ప్రేమ
వార్త = సమాచారం
విగ్రహం = ప్రతిమ
విజయ గీతిక = గెలుపు పాట
విన్యాసం = చక్కని ప్రదర్శన
విపులం = విరివియైన
విభవం = సంపద
విరామం = విశ్రాంతి
విశదము = స్పష్టం
విశాలం = పెద్దదైన
విశ్రాంతి = ఉపశమనం
విస్మరించు = మరచిపోవు
విహగము = పక్షి
విహరణం = తిరగడం
విహరించి = తిరిగి
వీడ్కోలు = వెళ్ళడానికి ఇచ్చే అనుమతి
వీనులవిందు = చెవులకింపుగా
వీర గాథలు = వీరుల కథలు
వెనుక తట్టు = వెనుక భాగం
వెలుగు జాడలు = ప్రకాశవంతమైన ఆనవాళ్ళు
వెల్లివిరియు = ప్రవహించు
వైకుంఠపాళి= పాము నిచ్చెన ఆట, క్రీడా విశేషము
వైశిష్ట్యం = గొప్పతనం

**శ**

శరీరం = దేహం
శర్కర = పంచదార
శిరోధార్యం = అంగీకారయోగ్యం
శోకించు = దు:ఖించు

**స**

సంక్షిప్తం = తగ్గింపబడిన
సంపూర్ణం = నిండైన, పూర్ణ
సంశయించు = అనుమానించు
సత్కరించు = గౌరవించు
సదుపాయం = ఏర్పాటు
సద్య = వెంటనే
సమ దృష్టి = సర్వభూతములను సమముగా జూచుచూపు.
సమర్పించు = అందించు
సమీపం = దగ్గర
సముద్రం = సాగరం
సమ్మతి = అంగీకారం
సస్యరమ = పంట, లక్ష్మి
సారయశ = స్వచ్ఛమైన కీర్తి
సుందరం = అందమైన
సునాయాసం = అతి సులభం
సురుచిర = మనోజ్ఞమైన
సూనృతం = సత్యవాక్కు
సొంపుకూర్చు = అందాన్నిచ్చు
సొత్తు = సంపద, సొమ్ము
సౌఖ్యం = సుఖం
స్పందన = కదలుట
స్పర్శ = తాకుట
స్మృతి = జ్ఞాపకం
స్వర్గతుల్యము = స్వర్గంతో సమానం
స్వస్తి = శుభం
స్వాంతం = మనస్సు

**హ**

హంసతూలికాతల్పం = మెత్తని హంస ఈకలు పెట్టి కుట్టి సిద్ధము చేసిన పరుపు
హేల = ఆనందం
హొయలు = సౌందర్యము, అందము

## వ్యుత్పత్త్యర్థములు

గురువు - అంధకారమనే అజ్ఞానమును పోగొట్టువాడు (ఉపాధ్యాయుడు)

అతిథి - తిథి మొదలైన నియమాలు లేకుండా ఇంటికి భోజనానికి వచ్చేవాడు (గృహాగతుడు)

దాశరథి - దశరథుని కుమారుడు - (శ్రీరాముడు )

ధార్మికుడు - ధర్మాన్ని ఆచరించేవాడు (పుణ్యాత్ముడు)

నగరం - కొండల వలే పెద్ద పెద్ద భవనములు కలది (పట్టణం)

పక్షి ధ్వంసకుడు - పక్షులను ధ్వంసం చేసేవాడు (వేటగాడు)

భాస్కరుడు - కాంతిని కలుగజేయువాడు (సూర్యుడు)

విద్యార్థి- విద్యను అర్జించువాడు

విహంగం - ఆకాశంలో వెళ్ళునది (పక్షి)

శరీరం - రోగాదులచే శిథిలమయ్యేది(మేను)

శూరుడు - శౌర్యము ప్రదర్శించేవాడు (వీరుడు)

హృదయం - హరింప బడునది (గుండె)

క్షేత్రం - దైవం వెలసిన ప్రాంతం (దేవాలయం )

## పర్యాయపదాలు

ఆకాంక్ష = కోరిక, వాంఛ, ఈప్సితం
ఆశ = ఇచ్ఛ, ఈప్స, కాంక్ష
ఇల్లు = ఆవాసం, గృహం, నిలయం
ఉన్నతి = వికాసం, అభివృద్ధి, ప్రగతి
ఉపాధ్యాయుడు = గురువు, చదువు చెప్పేవాడు,
ఒడలు = శరీరం, మేను, దేహం
కదనరంగం = యుద్ధభూమి, రణస్థలి,రణరంగం
కలిమి = సంపద, ఐశ్వర్యం,
కొండ = పర్వతం, గిరి, అద్రి
కొడుకు = అంగజుడు, ఆత్మజుడు, తనూజుడు
కోవెల = గుడి, దేవాలయం, దేవస్థానం
చిత్తము = మనసు, హృదయం
జలం = నీరు, ఉదకము, తోయము,
జెండా = కేతనం, పతాక ధ్వజం
తండ్రి = అయ్య, జనకుడు, పిత
తీరం = దరి, ఒడ్డు, కూలం
తేజం = వెలుగు, కాంతిపుంజం, ప్రకాశం
నగరం = పురము, పట్టణము, వీడు
పరిమళం = సువాసన, తావి, సుగంధం
పసిడి = బంగారం, స్వర్ణం, కనకం
భార్య = అర్ధాంగి, ఆలు, ఇల్లాలు
కదనరంగం = యుద్ధభూమి, రణస్థలి,
వనిత = పడతి, మహిళ, మగువ
సంవత్సరం = వర్షం, వత్సరం, ఏడాది.

## ప్రకృతి - వికృతి

అక్షరం - అక్కరం
అద్భుతం - అబ్బురం
ఆశ్రయం - ఆసరా
కాంక్ష - కచ్చు
చంద్రుడు - చందురుడు
తీరం - దరి
దీపం - దివ్వె
ధర్మం - దమ్మం
పంక్తి - బంతి
పక్షి - పక్కి
భోజనం - బోనం
యోధుడు - జోదు
రత్నం - రతనం
విధం - వితం
సంధి - సంది
స్తంభం - కంబం
స్థలం - తల
స్నానం - తానం

## నానార్థాలు

అంకురం = మొలక, జలము, రక్తము,
గంగ = నది, భగీరథి, నీరు,
చీర = నార చీర, గోచి, రేఖ
తార = నక్షత్రం, ఓంకారం, వాలి భార్య
తీర్థం = నీరు, పుణ్యస్థలం, పుణ్యనది
దర్శనం = చూపు, కన్ను, బుద్ధి,
దివి = స్వర్గం, ఆకాశం, పాలపిట్ట
ధర్మం = పుణ్యం, యాగం, న్యాయం
ప్రతిష్ఠ = కీర్తి, స్థాపన, గౌరవం
ఫలము = పండు, ప్రయోజనం, పంట
బతుకు = జీవితం, జీవితకాలం, జీవనోపాయం
మందిరం = గుడి, ఇల్లు, శరీరం
మాట = పలుకు, నింద, వార్త
మిత్రుడు = సూర్యుడు, స్నేహితుడు
రక్తం = ఎరుపు, రుధిరం, రాగి
వర్షం = వాన, సంవత్సరం, జంబూద్వీపం
విహగము = పక్షి, మబ్బు, బాణం
సంతానం = బిడ్డ, ఒక కల్పవృక్షం, కులం
సమాజం = సభ, మనుషుల గుంపు, ఏనుగు
సీమ = దేశం, వరిమడి, గుర్తు
సుధ = అమృతం, పాలు, సున్నం

# NOTES

# NOTES

# NOTES

# NOTES